


'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 324

బుధవారం 14-2-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



శ్రీమతికి ప్రేమలేఖ

ఒకప్పటి ప్రేమలు వేరు.
కమ్యూనికేట్ చేయాలంటే ప్రేమలేఖ తప్ప
మరో మార్గం లేదు.
కాని అందుకు అమ్మాయి నోట్స్
అడగాలి. తీసుకుని అందులో లెటర్ పెట్టాలి.
పెట్టింది ఆమె చదవాలి. చదివి ఓకే చేయాలి.
ఈలోపు ఆ లెటర్ ఎవరి కంటైనా పడిందో...
ఇన్ని తిప్పలు పడి ప్రేమను పొంది భార్యను చేసుకున్నాక
ప్రేమను వ్యక్తం చేయడమే మానేస్తారు కొందరు భర్తలు.
మీ శ్రీమతికి ప్రేమలేఖ రాసి ఎంత కాలం అయ్యింది?
మీ భర్తను అడిగారా ఒక లవ్ లెటర్ రాయమని?

ప్రేమలేఖ! ఈ మాట వినగానే ఎన్ని జ్ఞాపకాలు చుట్టుముడతాయి. టైప్ ఇన్స్టిట్యూట్‌లో పరిచయాలు, కాలేజీ క్లాసుల్లో దొంగ చూపులు, వీధుల్లో అమ్మాయి ఇంటి మీదుగా అబ్బాయి సైకిల్ షికార్లు, సినిమా హాళ్లో కనిపిస్తే వెనుక సీటులో కూచుని సినిమాను వదిలి ఆమెనే చూడటాలు, శుక్రవారం గుడికి వస్తుందని ఎదురు చూపులు, కళ్లు కలుస్తాయి... ఇష్టం తెలుస్తూనే ఉంటుంది... ఖాయపరుచుకోవాలంటే ప్రేమలేఖ రాయాలి... బదులు లేఖ అందుకోవాలి. అందుకు ఏం చేయాలి? దారిన వెళుతున్నప్పుడు ఎవరూ చూడకుండా కాళ్ల దగ్గర పడేయాలి. లేదంటే నోట్స్ అడిగి అందులో పెట్టి అందించాలి. ఇరుగింటి పొరుగింటి పిల్లలతో చేరవేయాలి... తీరా ఆమెకు అందించాక ఏం జవాబు వస్తుందోనని నిద్రపోక, రాత్రి కాచి, తెల్లారి కాలేజీకి పరిగెత్తాలి.

ప్రేమ ఎంత మధురం. ప్రేమలేఖ అంతకన్నా మధురం.

మరి యువతీ యువకులు కాస్తా భార్యాభర్తలుగా మారిపోతే ఆ ప్రేమ పోతుందా? ఎక్కడకు పోతుంది? ఎక్కడికీ పోదు. కాకుంటే మెప్పించే పని లేదని, చెప్పే పని ఇకపై లేదని మరుగున పడిపోతుంది. ప్రేమించి పెళ్లి చేసుకున్నా... పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకున్నా దంపతుల మధ్య ఉండే ప్రేమ కొబ్బరాకుల చాటున దాగిన వెన్నెల వంటిది. ఆగి ఆగి వీచే చల్లని గాలి వంటిది. దగ్గరగా కూచుని ధ్యాస లేనట్టుగా పట్టుకునే చేతి స్పర్శ వంటిది.

ఇవాళ వాలెంటైన్స్ డే.

తమలోని ప్రేమను భర్త భార్యకు, భార్య భర్తకు ఒక లేఖగా రాయగలిగితే? ఫోన్లు పక్కన పెట్టి, వాట్సప్‌లు చెత్తకు నెట్టి, అలా మనవైన అక్షరాలతో జీవిత భాగస్వామిపై ప్రేమ వెల్లడి చేస్తే... ఎంత బాగుంటుంది. ప్రేమిస్తున్నానని రాసి చెప్పండి, ఆ భావన భలే ఉంటుంది. మధురోహల వల కమ్ముకుంటుంది. కొన్ని లేఖలు ఇలా ఉండొచ్చు.

ఏవోయ్...

నీకో సంగతి చెప్పనా? నీకు లవ్ లెటర్ రాయాలని గంట సేపు పెన్ను వెతికాను. నిన్ను అడిగితే ఇప్పుడు పెన్నెందుకు అంటావని... నేనేదో రాయబోతున్నానని నీకు తెలిసిపోతుందని. నిజానికి నా గురించి నీకు తెలియనిది ఏముందని... నిన్ను చూస్తుంటే ప్రేమిస్తున్నానని గ్రహించావు... కానుక ఇవ్వలేకపోతే చిన్న ఉద్యోగినని సర్దుకున్నావు... అమాసకూ పున్నానికీ కూడా మూరెడు మల్లెపూలు తేకపోతే మీ మనసు పరిమళం చాలండీ అన్నావ్... నేను మౌనంగా పేపర్ చదువుకుంటుంటే నీతో మాట్లాడుతున్నట్టేనని పక్కన కూచుంటావు. మరి నాలో నీ కోసం సముద్రమంత ప్రేమ ఉందని ఇలా రాసి చెప్పాలా? సరేలే. రాస్తున్నానుగా. రేపెప్పుడైనా నీ మనవలకూ మనవరాళ్లకు దీనిని చూపించి మీ తాతగారి రైటింగ్ చూడండ్రా ఎలా కోడి గీతల్లా ఉందో... అని నవ్వుకోవడానికైనా ఉండాలిగా. మరోసారి ఏవోయ్... నిజంగా నిన్ను పెళ్లి చేసుకునేంత వరకూ నా రాత గజిబిజే. నిన్ను చేసుకున్నాకే అది అందంగా మారింది. అర్థంతో నిండింది. నేను 'ఏవోయ్' అని పిలిచినప్పుడల్లా నా జీవితాంతం నువ్వు పలుకుతూ ఉంటే చాలు. ఇంతకు మించి ఇంకేమి నాకు అక్కర్లేదు. నీక్కూడా నా 'ఏవోయ్' అని పిలుపే చాలనుకో.

లవ్ యూ.
ఇట్లు
నీ ఏమండీ.



నా ప్రియాతి ప్రియమైన దివాకర్...

అబ్బ.. ఎన్ని రోజులైంది మిమ్మల్ని ఇలా పిలిచి. పెళ్లికి ముందు ఆంధ్రా యూనివర్సిటీలో మనం ప్రేమించుకుంటున్న రోజుల్లో దివాకర్ అని పిలిచేదాన్ని. పెళ్లయ్యాక కూడా అలాగే పిలుస్తుంటే మీ అమ్మగారు 'ఏమిటి... ఇంకా పేరుపెట్టి పిలుస్తున్నావ్.. ఏమండీ అనలేవూ' అని దడిపించింది. మీరేమో అమ్మకూచి ఆయే. సరేనని కంటిన్యూ అయిపోయాను. మీరివ్వాళ అమెరికాలో స్థిరపడ్డ ఇద్దరు పిల్లలకు తండ్రయినా, పెద్ద అధికారిగా రిటైర్ అయినా, నాలో సగభాగమైన నా భర్తయినా, ప్రేమించుకునే రోజుల్లో షోగ్గా బైక్ మీద ఎక్కించుకుని నన్ను తిప్పిన దివాకర్‌గానే నాకు ఎక్కువ ఇష్టం. ఆ రోజుల్లో అనుక్షణం మీ కళ్లు నన్ను వెతికేవి. అనునిత్యం నన్ను కలవాలని పరితపించేవి. పరీక్షల టైమ్‌లో ప్రిపరేషన్ కోసం నేను పదిరోజులు కనిపించకపోతే వొళ్లెరగని జ్వరం తెచ్చుకున్న పిచ్చిప్రేమికుడు మీరు. మీ జీతం, మీ సంపాదన... తెచ్చి నా చేతుల్లో పడేసి ఏం పట్టించుకునేవారు కాదు... మీకున్నది ఒకటే పట్టింపు... నన్ను బాగా చూసుకోవడం. దివాకర్... మనం వైజాగ్ వెళ్లి చాలా రోజులైంది. ఒకసారి వెళదామా... రామకృష్ణబీచ్‌లో మీ పక్కన కూచుని కాల్చిన వేరుశనక్కాయలు మళ్లీ తినాలని ఉంది. వేలెంటైన్స్ డే నాడు నా ఈ కోరికను విని మీరు హడావిడిలో విమానం కొనేయాలని చూడకండి. చక్కగా గోదావరిలో వెళదాం. మన ప్రేమ ప్రయాణం సాగిద్దాం...

ఇట్లు
(మీరు నేనున్నప్పుడు మాత్రమే
నన్ను పిలిచే ముద్దు పేరును భర్తీ చేసుకోగలరు)

లవ్ పల్స్ 2024

ప్రేమంటే అక్షరాలకి అలవోకగా అందేది.
ఎంతకూ అందనిది... సులభంగా అర్థమయ్యేది.
ఎంతకీ అర్థం కానిది. అయినప్పటికీ... కీ పాయింట్
ఏమిటంటే...
ప్రేమకు వైరుధ్యాలతో అట్టే పనిలేదు.
అదే ప్రేమ గొప్పతనం. శక్తి!
రెండు ముక్కల్లో చెప్పాలంటే...
ప్రేమంటే ఒక హృదయంపై మెరిసే
రెండు సంతకాలు. రెండు జీవితాలు.
ప్రేమికుల రోజు సందర్భంగా
ఈ కాలం ప్రేమ గురించి...

యూత్ పల్స్

'2024 లవ్‌ట్రెండ్స్'కు సంబంధించి గ్లోబల్ సర్వే నిర్వహించిన డేటింగ్ యాప్ 'హ్యాపెన్' 'ప్రేమను పునర్నిర్వచించే కాలం ఇది' అంటుంది. ఫ్రాన్స్, బ్రెజిల్, నార్వేలాంటి దేశాలతో పాటు మన దేశంలోనూ సర్వే చేశారు. ప్రేమకు సంబంధించి వయసు, సంస్కృతి సంప్రదాయాలను చాలామంది పరిగణనలోకి తీసుకోవడం లేదు. 86 శాతం మంది ప్రేమలో 'ఎమోషన్ బ్యాలెన్స్'ను ఆశిస్తున్నారు.

పాపులర్ యాప్ 'బంబుల్' మోడ్రన్ లవ్ రిపోర్ట్ ప్రకారం ప్రేమలేఖలు రాయడాన్ని 63 శాతం, క్యాండిల్ లైట్ డిన్నర్స్‌ను 66 శాతం, లవ్ గెశ్చర్స్‌ను 51 శాతం ఇష్టపడుతున్నారు. 54 శాతం కాన్‌స్టంట్ అటెన్షన్‌ను ఇష్టపడుతున్నారు. 'ప్రేమలో అవతలి వ్యక్తి ప్రతిభా సామర్థ్యాలు, ఆకర్షణీయ మాటల కంటే నిజాయితీనే ఎక్కువమంది ఇష్టపడుతున్నారు' అంటుంది బంబుల్ రీసెర్చ్ రిపోర్ట్.

'వాలెంటైన్స్ డే'ను జెన్ జెడ్, మిలీనియల్స్ ఎలా సెలబ్రేట్ చేసుకోవడానికి ఇష్టపడుతున్నారు అనే విషయానికి వస్తే...'క్వాక్ క్వాక్' యాప్ రిపోర్ట్ ప్రకారం 47 శాతం మంది బడ్జెట్-ఫ్రెండ్లీ సెలబ్రేషన్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రాక్టికల్, మీనింగ్‌ఫుల్ గిఫ్ట్‌లను ఇచ్చిపుచ్చుకోవడానికి ఇష్టపడుతున్నారు.

'మేము రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నాము. వాలెంటైన్స్ డే హైప్‌కు ప్రాధాన్యత ఇవ్వను. వాలెంటైన్స్ డే పేరుతో వృథా ఖర్చు చేయవద్దని అతడికి చెప్పాను' అంటుంది దిల్లీకి చెందిన 24 సంవత్సరాల కృతి.

'25 నుంచి 30 ఏళ్ల లోపు వర్కింగ్ ప్రొఫెషనల్స్‌లో 37 శాతం మంది ఒంటరితనానికి దూరం కావడానికి రొమాంటిక్ రిలేషన్‌షిప్‌కు అతీతంగా స్నేహం చేస్తున్నారు' అని చెబుతుంది 'క్వాక్ క్వాక్' రిపోర్ట్.

వాలెంటైన్స్ డే అనగానే ప్రేమికుల సంగతే గుర్తొస్తుంది. మరి ప్రేమలో పడని వారి సంగతి ఏమిటి?

ప్రేమలో పడకపోయినా వాలెంటైన్స్ డేను హ్యాపీగా జరుపుకుంటున్న వారి సంఖ్య తక్కువేమీ కాదు. సెల్ఫ్-కేర్, సెల్ఫ్-లవ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. 'నేను ఇప్పటివరకు ప్రేమలో పడలేదు. అమ్మానాన్నలది ప్రేమ వివాహం. సరిగ్గా ప్రేమికుల రోజే వారి పెళ్లి జరిగింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రేమికుల రోజు, పెళ్లిరోజును కలుపుకొని ఆ రోజు ఇంట్లో వేడుక చేసుకుంటాం. ఇంటిని లవ్ షేప్‌డ్ బెలూన్లతో అలంకరిస్తాం. లవ్-షేప్‌డ్ బెలూన్‌ల బ్యాక్ డ్రాప్‌గా ఫోటోలు దిగడంతో పాటు ఫన్ యాక్టివిటీస్‌ను ప్లాన్ చేస్తాం. లవ్ సింబల్స్‌తో ఉన్న డిఐవై(డూ ఇట్ యువర్ సెల్ఫ్) గిఫ్ట్ బ్యాగ్‌లు పంచుతాం' అంటుంది చెన్నైకి చెందిన 22 సంవత్సరాల లిపిక.

సెలబ్రిటీల స్ఫూర్తితో 'లవ్'ను గోప్యంగా ఉంచే 'లో కీ స్టైయిల్' పెరుగుతోంది. 'ఎలాంటి సమస్యలు లేవు. మాది కమిట్‌మెంట్‌తో కూడిన ప్రేమ' అనే నమ్మకం వచ్చాకే తమ ప్రేమ గురించి నలుగురికి తెలియజేస్తున్నారు. నవతరం ప్రేమధోరణులను చూస్తుంటే 'ప్రేమకు చూపులేదు' అనే మాటకు సవరణ అవసరం అనిపిస్తుంది. పంచేంద్రియాలతో, ప్రాపంచిక స్పృహతో వారి ప్రేమప్రయాణం పచ్చగా కొనసాగుతుంది.

పెద్ద బ్రాండ్ల ప్రేమ చరణాలు



'వాలెంటైన్స్ డే'కు సంబంధించి టాప్ బ్రాండ్స్ సోషల్ మీడియా పోస్ట్‌లు యూత్‌ను తెగ ఆకట్టుకుంటున్నాయి. వాటిని రీ-షేర్ చేస్తున్నారు. వాటిలో కొన్ని...

- ది హార్ట్ వాంట్స్ వాట్ ఇట్ వాంట్స్ - పేటీయం
- బ్లైండ్ టు లవ్, లవ్ టు బ్లైండ్ - స్పాటిఫై
- లవ్ ఈజ్ ది రియల్ మ్యాజిక్ - కోకా-కోలా
- యువర్ లవ్ విల్ టేక్ యూ టూ ప్లేసెస్ యూ లవ్ - టాటా మోటర్స్
- ప్యార్ హ్యాజ్ ఏ లాంగ్వేజ్ ఆఫ్ ఇట్స్ వోన్ - క్లియర్ ట్రిప్
- ఎట్ ది హార్ట్ ఆఫ్ యువర్ జర్నీ ఈజ్ ఏ లవ్ ఫర్ ది అన్‌నోన్ - టయోటా ఇండియా
- లవ్ వాట్ యూ డూ. డూ వాట్ యూ లవ్ - కార్టూన్ నెట్‌వర్క్(సీఎన్)
- లవ్ ఈజ్ ఏ ప్రామిస్ అండ్ ఐ ప్రామిస్ టు ఆల్వేస్ లవ్ యూ - ఇన్‌స్టాగ్రామ్

లవ్ లింగో



లవ్ హేజ్: ప్రేమికుడు/ప్రేమికురాలులో లోపాలను చూడలేని స్థితి
వ్యాల్యూ మ్యాచ్: భవిష్యత్‌లో సమస్యలు తలెత్తకుండా లైఫ్‌స్టైల్ చాయిస్, అభిరుచులు మ్యాచ్ కావడం.
ఐఎన్ఏ: ఐ హేట్ నథింగ్ ఎబౌట్ యూ
ఘోస్టింగ్: టెక్స్ట్‌కు రెస్పాండ్ కాకపోవడం, కమ్యూనికేషన్ బ్రేక్ కావడం
బ్రెడ్ క్రంబింగ్: దృష్టిలో పడడానికి, ఆకట్టుకోవడానికి ఫ్లర్ట్ టెక్స్ట్ పంపడం
పీఏడబ్ల్యూ: పేరెంట్స్ ఆర్ వాచింగ్
లవ్ బాంబింగ్: గిఫ్ట్‌లు, కాంప్లిమెంట్స్, సర్‌ప్రైజ్‌లతో ప్రేమను వ్యక్తం చేయడం
ఆర్బిటింగ్: లవ్ బ్రేక్ అయినప్పటికీ సోషల్ మీడియాలో ఆమె/అతడిని ఫాలో కావడం
రహస్య ఆసక్తి

మొక్కలు నడిచొచ్చిన వేళ...

ప్రేమికుల రోజు పువ్వులతో ముడిపడి ఉన్న రోజు. లవర్‌కు గులాబీ లేదా అందమైన బొకేలను ఇస్తారు. అయితే ఈమధ్య కాలంలో




ఇండోర్ మొక్కలను కానుకగా ఇస్తున్నారు. గులాబీలు, బొకేలు ఇస్తే ఒకేరోజుకు పరిమితం అవుతాయి. ఇండోర్ ప్లాంట్స్ ఇస్తే ఎన్నో నెలలు ఉంటాయి. వాటిని నిద్ర నుంచి లేవగానే చూస్తే గాల్లో ప్రియరాగాలు ప్రతిధ్వనిస్తాయి. రకరకాల భావాలకు ప్రతీకగా నిలిచే ప్రేమ మొక్కలు ఇవి. మచ్చుకు కొన్ని...

- అంత్యూరియం - హాస్పిటాలిటీ, లవ్
- జేడ్-గుడ్‌లక్ అండ్ ఫార్చ్యూన్
- హోయ కెర్రీ- లవ్ అండ్ డివోషన్
- స్ట్రింగ్స్ ఆఫ్ హార్ట్స్- బ్యాలెన్స్ అండ్ కనెక్షన్
- పీస్ లిల్లీ ప్లాంట్-ఇన్నోసెన్స్ అండ్ పీస్
- మనీ ప్లాంట్-అందం, ఐశ్వర్యం

లవ్ యూ గూగుల్ లవ్ డూడుల్

సోషల్ మీడియా సంచారులైన యువతరానికి వాలెంటైన్స్ డే అనగానే గుర్తుకు వచ్చేది గూగుల్ వాలెంటైన్స్ డే డూడుల్స్. క్రియేటివిటీ ఉట్టిపడే ఈ లవ్ డూడుల్స్‌ను ఆల్బమ్‌లాగా తయారు చేసుకుంటున్నారు. వాటిపై తమకు తోచిన వాక్యాలను రాస్తున్నారు. గత సంవత్సరం గూగుల్ వాలెంటైన్స్ డే డూడుల్ 'వావ్' అనిపించింది. ఈ యానిమేటెడ్ డూడుల్‌లో పై నుంచి పడుతున్న నీటి చుక్కలు ఒక్కటై 'హార్ట్' షేప్‌లో ఏర్పడతాయి. మరింత ఆకట్టుకునేలా దీనికి 'రెయిన్ ఆర్ షైన్, విల్ యూ బీ మైన్' అనే కాప్షన్ ఇచ్చారు.





★ సినిమా ప్రేమలు...

ఎవరి స్టయిల్ వారిదే!

ప్రేమించడం నిజజీవితంలో కాస్త అరుదే. అక్కడెవరో వాళ్లెవరో ప్రేమించారట, ఇక్కడెవరో ప్రేమించి పెళ్లి చేసుకున్నారట అంటూ వినడం తప్ప వాస్తవంలో ప్రేమ అందరికీ అంతగా అనుభవంలోకి రాదు. (కాపోతే కాలేజీల్లో విరివిగా కనిపించినా... చదువు ముగిసేనాటికి, ముగిసిపోయే జస్ట్ సీజనల్ ప్రేమలవి).

సినిమాల్లో అలా కాదు. ప్రతి మూవీలోనూ ప్రేమ ఉండనే ఉంటుంది. పట్టుబట్టి విషాదాంతం తీయాలని భీష్మించుకుంటే తప్ప... హీరో, హీరోయిన్ల ప్రేమ ఫలించి తీరుతుంది.

విచిత్రం ఏమిటంటే... హీరోను బట్టి లేదా దర్శకుడిని బట్టి వారి వారి ప్రేమలకూ ఓ శైలి ఉంటుంది. హీరో మ్యానరిజంలాగా అదీ ప్రత్యేకంగా కొట్టొచ్చినట్టు కనిపిస్తుంటుంది.

ఉదాహరణకు ఎన్టీఆర్ సినిమాల్లో అంతా జస్ట్ స్ట్రెయిట్ ఫార్వర్డ్ ప్రేమ. అక్కినేని వారి ప్రేమల్లా ఇక్కడ సంక్లిష్టతలుండవు. కాకపోతే అలనాటి గుండమ్మకథలో 'కోలుకోలోయమ్మ కోలో నాస్వామి' అంటూ పాడుతూ... 'హేయ్ బుల్లెమ్మా...' 'ఓయ్ బుల్లెమ్మా' అంటూ అరుపులు అరిచినా... ఆ తర్వాత 'త్తిఖ రేగి ఢిమ్మిరెత్తీ' అంటూ యమగోల చేసినా... అప్పటి అరుపులతో ఇప్పుడు నడుం మీద చరుపులూ కనిపిస్తాయి. వెరసి అవి... దట్టంగా, దిట్టంగా మిళాయించిన మసాలాలా, గ్యాసెక్కువైన సోడాలా ఘాటుగా నాటుగా ఉంటాయంతే. ఎన్టీఆర్ ప్రేమలన్నీ దాదాపుగా ఒక హీరోయిన్‌తోనే... సిక్స్ లేన్స్ హైవే మీద ఎదురెవ్వరూ రాని ట్రాఫిక్‌లా సాఫీగా, హాయిగా సాగిపోయే ప్రేమలే.

ఇక ఏఎన్నార్ దగ్గరికి వస్తే ఆయన సినిమా ప్రేమలన్నీ సంక్లిష్టంగా ఉంటాయ్. ఆయన ఎవరినో ప్రేమిస్తాడు... హీరోయిన్ కూడా యథాశక్తి ఏఎన్నార్‌ను లవ్ చేస్తుంది. కానీ మరెవరో సెకండ్ హీరోయిన్ కూడా నాగేశ్వ్రావ్‌నే లవ్ చేయడంతో... కుటుంబంకోసమో, చెల్లెలి ప్రేమ కోసమో... తప్పనిసరి పరిస్థితుల్లో అక్కినేని కూడా ఆమెనే ప్రేమించాల్సొస్తుంది. అంతే...! పాపం అక్కడో ఓ త్రికోణ ప్రేమ ఏర్పడటంతో త్రికోణమితి సూత్రాలూ, లెక్కలూ సినిమాలోకి వచ్చేసి ఈక్వేషన్లను చిక్కుముడుల్లా సంక్లిష్టంగా మార్చేస్తుంది. దాంతో ప్రేక్షకులు కూడా ఆ బెర్ముడా ట్రయాంగిల్‌లో చిక్కి... పాపం గిలగిల్లాడతారు. జామెట్రీ భాషలో చెప్పాలంటే ఎన్టీఆర్‌వన్నీ సరళరేఖ ప్రేమలూ... ఏఎన్ఆర్‌వన్నీ ట్రిగనామెట్రీ లెక్కలూ!!

శోభన్‌బాబువి కూడా ఇంచుమించూ త్రికోణమితులేగానీ... ఆయన మనసు మరీ విశాలం కావడంతో ఇద్దరు హీరోయిన్లనీ మితిమీరి సమానంగా ప్రేమిస్తాడు. వారిద్దరి ప్రేమల్నీ తన మనసు సున్నితపు త్రాసులో సమానంగా తూస్తాడు. అద్దిగ్గో... అక్కడొస్తుంది కథలో బలం. నిజానికి ట్రిగనామెట్రీలన్నీ శోభన్‌బాబువే. నిజం చెప్పాలంటే ఏఎన్నార్‌వి 'సుడిగుండాలే'!

ఇక సూపర్‌స్టార్ కృష్ణ ప్రేమలు కూడా దాదాపు ఎన్టీఆర్ ప్రేమల్లా స్ట్రెయిట్‌గా ఉంటాయి. కాకపోతే హీరోయినే ప్రేమించి ప్రేమించి పైపైన పైపైన పడిపోతుంటుంది. ఈమె తప్పనిసరిగా విలన్ కూతురే అయి ఉంటుంది. అంతగా పైపైన పడిపోయినందుకు కృష్ణ కూడా రుణం ఉంచుకోడు. పరిహారంగా డ్యూయెట్లలో ఈయన కూడా ఏదో ఓ టైమ్‌లో ఆమె ఎద మీద తలవాల్చి బదులు తీర్చుకుంటాడు. ఆ దృశ్యమే వాల్‌పోస్టర్‌గా మారి ప్రేక్షకుల్ని సినిమాకు ఆహ్వానిస్తుంది.

చిరంజీవి హీరోయిన్ల తీరు కూడా ఇంచుమించూ సూపర్‌స్టార్ కృష్ణ స్టైల్లోనే ఉంటది. ఈయన కూడా కృష్ణలాగే హీరోయిన్‌ను 'హేయ్ తింగరిబుచ్చి' అంటూ తీసిపారేస్తూనో... 'చెయ్యి చూశావా.. ఎంత రఫ్‌గా ఉందో' అంటూ సరదా బెదిరింపులతో సందడి చేస్తుంటాడు. చిరంజీవి బెదిరిస్తాడు. హీరోయిన్ ప్రేమకోసం దేబిరిస్తుంది.

ఇంకో విశేషం... చిరంజీవి సినిమాల్లోనూ ఇద్దరు హీరోయిన్లు ఉంటారు. అయితే వాళ్లిద్దరూ తమ శక్తికొద్దీ హీరోని ప్రేమించినప్పటికీ... ఏఎన్నార్, శోభన్‌బాబు ప్రేమల్లోలా ఇక్కడ సంక్లిష్టతలుండవ్. ఆ ఇద్దరి ప్రేమలూ గ్లామర్ కోసమే. కాబట్టి ఈ ప్రేమల్లో సంఘర్షణలూ ఉండవు. ఇవన్నీ అందంగా చెదిరిపడ్డ సరళరేఖలే కావడంతో ప్రేక్షకులు అదిరిపడ్డానికి ఆస్కారాలుండవ్.

• • •

హీరోల ప్రేమలకే కాదు... తెర మీద ప్రేమను చూపడంలోనూ దర్శకులకూ ఓ స్టైలుంటుందీ, ఓ మేనరిజముంటుంది. కళాతపస్వి కె.విశ్వనాథ్ సినిమాలో హీరోయిన్ ప్రేమలన్నీ చాలా ఉదాత్తంగా ఉంటాయ్. నిజజీవితంలో ఏ హీరోయిన్‌లు కూడా ప్రవర్తించనంత ఉన్నతంగా ఉంటాయ్. అంతెందుకు... మన జీవితాల్లో మన చెల్లెలికో, మన కూతురికో విశ్వనాథ్ సినిమాలోలాంటి హీరో సంబంధం వస్తే స్ట్రెయిటవే వద్దనేస్తాం. అలాంటి హీరోకి మనింటి ఆడబిడ్డ నివ్వం.

డైరెక్టర్ రాఘవేంద్రరావు సినిమాలకు వద్దాం. ఇక్కడ ప్రేమలన్నీ ఫ్రూట్ జ్యూసులంత మధురంగా, పండ్లు తింటే సమకూరేంత ఆరోగ్యంగా నవనవలాడుతూ ఉంటుంది. ముఖ్యంగా డ్యూయెట్లలో!. అప్పటిదాకా తీసిపారేసే హీరో కూడా... హీరోయిన్ ఎద మీద నడుములిరిగిపోయినట్టు వాలిపోయినట్టే... నడుములిరగకపోయినా ప్రేక్షకులూ ఆమె మీద అంతే మోతాదులో మనసు పారేసుకుంటారు.

• • •

హీరో హీరోయిన్లకు తోడు, సపోర్టింగ్ క్యారెక్టర్లూ మేమూ ఉన్నామంటూ తగుదునమ్మా అంటూ వచ్చేస్తారు. వాళ్లూ హీరోయిన్ని ప్రేమిస్తారు. హీరోయిన్ దక్కాల్సింది హీరోకే కదా. అందుకే ప్రేమించిన పాపానికి... పాపం వాళ్లు తగిన మూల్యం చెల్లించి శంకరగిరి మాన్యాలకు ట్రైన్ టిక్కెట్టు అడ్వాన్సు బుకింగ్ చేయించుకుంటారు. అందరికీ తెలిసినా క్లైమాక్స్ వరకూ వాళ్లకా విషయం తెలియకపోవడమే ఇక్కడ విశేషం.

ఉదాహరణకు... మాయాబజార్‌లో లక్ష్మణ కుమారుడైన రేలంగి కూడా శశిరేఖ సావిత్రి మీద మనసు పడతాడు. కానీ నాగేశ్వ్రావ్‌కే కదా సావిత్రి దక్కాల్సిందీ! కాబట్టి... దర్శకుడు రేలంగిని ముప్పతిప్పలు పెట్టిస్తాడు. చేతులు తక్కువ అంటుకుపోవడంతో... చప్పట్లు కొట్టడానికి కూడా జంకేలా భయపడతాడు. పులిని చూసినట్టు భయపడటమనేది రేలంగికి నిజంగానే అనుభవంలోకొస్తుంది. అప్పుడు రేలంగైనా అంతే... ఇప్పుడు అదుర్స్‌లో బ్రహ్మానందానికైనా ఇంతే.

సినిమాలు మారతాయి. హీరోలూ, హీరోయిన్లలో కొత్త తరాలు వస్తాయి. కానీ ప్రేమ మాత్రం అజరామరంగా ఉండిపోతుంది. కాకపోతే ఒకనాటి పాత సినిమాల్లో ప్రేమ ఉదాత్తంగా ఉంటుంది. ఈ తర్వాత చిరంజీవి నాటి మధ్యయుగాల్లో కాస్త రఫ్‌గా ఉన్నా సరదా సరదాగా ఉంటుంది. ఇక ఈ తరం అర్జున్‌రెడ్డిలకు వచ్చేసరికి అప్పటి మేన్లీ మేన్ కాస్తా... ఇంకాస్త హార్ష్ అండ్ పవర్‌ఫుల్ అవుతాడు. యాంగ్రీ యంగ్ కాస్తా యానిమల్ అయిపోతాడు.

సినీ విమర్శకులంతా డార్విన్‌లాగా వచ్చేసి... పరిణామక్రమంలో ఆల్ఫ్రీబ్రాలూ, ఆల్ కెన్ బి అచీవ్‌డ్ బై హీరోలనే ఆ ధీరోదాత్తులు తమకు ఉన్న టైటిల్లోని ఉదాత్తత కోల్పోయి... ఆల్ఫా మేల్స్‌గా యానిమల్స్‌గా ప్రవర్తిస్తుంటారని సెలవిచ్చేస్తారు. హీరోయిన్లు మాత్రం అప్పుడూ ఇప్పుడూ డిల్లమొహాలేసుకుని, తెల్లబోతూ, జెల్లకొట్టే ఆ హీరోనే అనాదిగా, అనంతంగా, ఆత్రంగా అలా ప్రేమిస్తూనే ఉండిపోతారు.

– యాసీన్


'సంక్షేమ పథకాల అమలే
సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 324

బుధవారం 14-2-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అరబ్బుల రాజధానిలో... అబ్బురాల ఆలయం

- నేడు అబుదాబిలో మోదీ చేతుల మీదుగా ప్రారంభం

భారత్-యూఏఈ 'దోస్తీ జిందాబాద్': మోదీ

- వివరాలు 6లో

దోపిడీకి కాళేశ్వరం బలి

కట్టిన మూడేళ్లలోనే బ్యారేజీ కొట్టుకుపోయే దుస్థితి

మేడిగడ్డ సందర్శన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్య


మేడిగడ్డ బ్యారేజీలో దెబ్బతిన్న ఓ పియర్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి ఉత్తమ్ తదితరులు

కుంగింది బ్యారేజీ కాదు... రాష్ట్ర ప్రజల నమ్మకం

4 పిల్లర్లు కుంగితే ఏమిటంటూ చులకన చేస్తారా?

కాలు విరిగిందని అసెంబ్లీకి రాకుండా.. కేసీఆర్ నల్లగొండకు ఎలా వెళ్లారు?

సానుభూతితో లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు పొందాలనే ఎత్తుగడ.. ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం

ఓడిపోయారు కాబట్టే ఇప్పుడు ప్రజలు గుర్తొచ్చారు

కేసీఆర్ శాసనసభకు రావాలి.. వివరణ ఇవ్వాలి

ప్రాజెక్టుల్లో అక్రమాలకు బాధ్యులపై విచారణ జరుగుతుంది... అవసరమైతే రెవెన్యూ రికవరీ చట్టంతో సొమ్ము రికవరీ చేస్తామని వ్యాఖ్య

బీజేపీ-బీఆర్ఎస్‌లది చీకటి పొత్తు.. అందుకే బీజేపీ ఎమ్మెల్యేలు రాలేదని ఆరోపణ

మేడిగడ్డ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: కాళేశ్వరం ప్రాజెక్టును రూ.94 వేల కోట్లు ఖర్చుపెట్టి నిర్మిస్తే.. 98వేల ఎకరాల కొత్త ఆయకట్టు మాత్రమే వచ్చిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. డిజైన్, నిర్మాణ, నిర్వహణ లోపాలతో నిర్మించిన మూడేళ్లలోనే మేడిగడ్డ బ్యారేజీ కొట్టుకుపోయే స్థితికి చేరిందని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్‌లో దెబ్బతిన్న పియర్లను మంగళవారం సాయంత్రం రేవంత్‌తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేల బృందం పరిశీలించింది. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, బ్యారేజీ కుంగిన తీరు, ఇతర అంశాలపై ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి, విజిలెన్స్ డీజీ రాజీవ్‌రతన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తర్వాత రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''రూ.94వేల కోట్లు ఖర్చు చేసిన కాళేశ్వరం ప్రాజెక్టుతో లక్ష ఎకరాలకు కూడా మిగతా 2వ పేజీలో ▶



దేశంలోనే అతిపెద్ద స్కాం కాళేశ్వరం

- తుగ్లక్ కూడా సిగ్గుపడే విధంగా ప్రాజెక్టు నిర్మాణం
- డ్యామ్‌కు, బ్యారేజీకి తేడా తెలియకుండా కట్టడం వల్లే ఈ పరిస్థితి... మేడిగడ్డ వద్ద మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్

2లో


నల్లగొండ బీఆర్ఎస్ సభలో ప్రసంగిస్తున్న కేసీఆర్

కట్టె కాలేవరకు పులిలా కొట్లాడతా

ప్రజలకు అన్యాయం జరిగితే పిల్లిలా ఉండను

నల్లగొండ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పష్టీకరణ

- ఇది రాజకీయ సభ కాదు.. మన ఉద్యమ పోరాట సభ
- కృష్ణా జలాలపై ఆధారపడిన ఐదు జిల్లాల జీవన్మరణ సమస్య... అందుకే కాలు విరిగినా కుంటి నడకతో వచ్చా
- ఈ ప్రభుత్వం జలాల్లో వాటా తేల్చాలని అడగకుండా ప్రాజెక్టులు కృష్ణా బోర్డుకు అప్పగించింది
- కేసీఆర్ సర్కార్ పోగానే 24 గంటల కరెంటు పోతుందా?
- కేసీఆర్‌నే తిరగనీయరా.. ఏం చేస్తరు చంపుతరా? కేసీఆర్‌ను చంపి మీరుంటరా?.... మేడిగడ్డకు పోయి ఏం పీకుతవు? అంటూ మాజీ సీఎం నిలదీత
- దమ్ముంటే ప్రాణహిత నీటిని ఎత్తిపోయాలని సవాల్
- రావాల్సిన సంపూర్ణమైన నీటి వాటా కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: తనకు చేతనైనా కాకపోయినా.. తన కట్టె కాలే వరకు, చివరి శ్వాస వరకు ప్రజలకు అన్యాయం జరిగితే పులిలా పోరాడతానని.. లేచి కొట్లాడతా తప్ప పిల్లిలా ఉండనని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. ఆరునూరైనా ప్రజలకు కృష్ణా జలాల విషయంలో అన్యాయం జరగనివ్వనన్నారు. కృష్ణా జలాల పరిరక్షణ పేరిట మంగళవారం నల్లగొండలోని మర్రిగూడ బైపాస్‌లో నిర్వహించిన బహిరంగ సభలో కేసీఆర్ ప్రసంగించారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే.

ఇది చిల్లర మల్లర రాజకీయ సభ కాదు


''చలో నల్లగొండ' రాజకీయ సభ కాదు.. కొందరికి రాజకీయం. మనకు మిగతా 3వ పేజీలో ▶

కాళేశ్వరం ప్రాజెక్టుపై లేనిపోని ఆరోపణలు



- కాంగ్రెస్ నేతలపై అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద హరీశ్‌రావు ధ్వజం
- బ్యారేజీలో ఒకటో రెండో పిల్లర్లు కుంగిపోతే కోడిగుడ్డుపై ఈకలు పీకినట్టు పీకుతున్నారు
- కాళేశ్వరం అంటే బ్యారేజీలు, రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌ల సమాహారం
- 3 కోట్ల మెట్రిక్ టన్నుల పంట పండింది ఆ జలాల వల్లేనని వ్యాఖ్య

2లో




పటియాలా సమీపంలో రైతులపై బాష్పవాయువు ప్రయోగిస్తున్న పోలీసులు

సరిహద్దుల్లో రణరంగం

రైతుల 'ఢిల్లీ చలో' ర్యాలీలో తీవ్ర ఉద్రిక్తత

- పంజాబ్-హరియాణా సరిహద్దుల్లో రైతుల ట్రాక్టర్ల ర్యాలీని అడ్డుకున్న పోలీసులు
- పోలీసులపై రాళ్ల వర్షం కురిపించిన నిరసనకారులు
- బాష్పవాయువు, జల ఫిరంగులు ప్రయోగించిన పోలీసులు
- 100 మందికి గాయాలు.. పలువురి అరెస్టు
- ఢిల్లీ సరిహద్దుల్లో కట్టుదిట్టమైన భద్రత

6లో

జేఈఈ మెయిన్స్‌లో తెలుగు తేజాలు

- టాప్-23లో పది మంది తెలుగు వాళ్లే... వీరిలో ఏడుగురు తెలంగాణ విద్యార్థులు
- మెయిన్స్ తొలి విడత ఫలితాలు వెల్లడించిన ఎన్‌టీఏ

- వివరాలు 14లో



మేడిగడ్డపై సీబీఐ విచారణ అంటే ఎందుకు భయం?

- రాజకీయ లబ్ధి కోసమే తెరపైకి కృష్ణా, కాళేశ్వరం వివాదం
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓటేస్తే మూసీలో వేసినట్టే
- ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్న ఆ రెండు పార్టీలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి

- 2లో

'పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన'

- కోటి ఇళ్లకు ప్రతినెలా 300 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్: ప్రధాని మోదీ

- వివరాలు 6లో



క్లుప్తంగా...

కాళేశ్వరానికి బీజేపీ ఎమ్మెల్యేలెందుకు రాలేదు?

మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు బీజేపీ ఎమ్మెల్యేలు ఎందుకు రాలేదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ స్నేహితులని, మాజీ సీఎం కేసీఆర్ సూచనలు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆలోచన మేరకే వారు రాలేదని ఆరోపించారు. కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బీజేపీ కాళేశ్వరం అవినీతిపై ఎందుకు విచారణ చేయడం లేదని నిలదీశారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు కోసమే ఈ రెండు పార్టీల మధ్య పరోక్ష స్నేహబంధం సాగుతోందని విమర్శించారు.

నదీ జలాలపై కేంద్రం పెత్తనాన్ని పదేళ్లుగా అడ్డుకున్నాం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నదీ జలాలపైన కేంద్రం పెత్తనాన్ని గత పదేళ్లుగా అడ్డుకున్నది తమ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మాత్రం కేవలం రెండు నెలల్లోనే కృష్ణా, గోదావరి నదీ జలాల బోర్డులకు నదుల నిర్వహణను అప్పజెప్పిందని విమర్శించారు. తెలంగాణ రైతాంగం భవిష్యత్‌ను అంధకారం చేసే ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా తమ పార్టీ గళం ఎత్తిందని చెప్పారు. భవిష్యత్‌లో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కడియం తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభకు భయపడిన కాంగ్రెస్ ప్రభుత్వం తోకముడిచిందని, నిన్న అసెంబ్లీలో అబద్ధాలను ప్రచారం చేసిందని ఆరోపించారు.

కాళేశ్వరం చూసొచ్చినంత మాత్రాన ఒరిగేదేమీ లేదు

బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టును చూసొచ్చినంత మాత్రాన ఒరిగేదేమీ లేదని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ వ్యాఖ్యానించారు. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు అవినీతిపై ఏం చేస్తారో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పలేక పోతోందని ఎద్దేవాచేశారు. ఎన్నికల కోసమే కాంగ్రెస్, బీఆర్ఎస్ కొత్త నాటకాలకు తెర లేపాయని శంకర్ ఆరోపించారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద పార్టీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌తో కలిసి శంకర్ మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిన విషయం తెలుసుకుని గతేడాది అక్టోబర్ 22న కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పరిశీలించారన్నారు. ఆ తర్వాత నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీకి ఫిర్యాదు చేశామని, వారు అడిగిన ప్రశ్నలకు అప్పటి ప్రభుత్వం కనీసం సమాధానాలు కూడా చెప్పలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు టూర్‌ను బీజేపీ ఎమ్మెల్యేలు బహిష్కరించారని హరీశ్ చెప్పారు. మేడిగడ్డకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పిక్నిక్‌గా వెళ్లారని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ చేస్తోంది వాటాలు, సూట్ కేసుల కోసమే

బీజేపీనేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టలపై ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంది అంతా వాటాలు, సూట్ కేసుల కోసమేనని బీజేపీనేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...ఇరిగేషన్ ప్రాజెక్టల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు కలిసి నాటకం ఆడుతున్నాయన్నారు. రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్‌లు ఏర్పాటు చేయాలని విభజన చట్టంలోనే ఉండగా, దానిని ఎలా తప్పుబడతారని ప్రభాకర్ ప్రశ్నించారు.

ఇదండీ జగత్



తన మీద కేసులతో పాటు రౌడీషీట్ కూడా ఉందటసార్!



మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, తుమ్మల, ఎమ్మెల్యే కూనంనేని తదితరులు

దోపిడీకి కాళేశ్వరం బలి

▶ మొదటి పేజీ తరువాయి

నీరివ్వకపోయినా.. కోటి ఎకరాలకు నీళ్లిచ్చినట్టు కేసీఆర్ గొప్పలు చెప్పుకున్నారు. రూ.36 వేలకోట్లతో 16 లక్షల ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా వైఎస్సార్ ప్రభుత్వం ప్రతిపాదించిన తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును కాదని.. రీడిజైన్ పేరుతో అవినీతి కోసం లక్ష కోట్ల ప్రాజెక్టును నిర్మించారు. 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ పియర్లు కుంగిపోతే.. సరిచేసే ప్రయత్నం చేయకుండా నిర్లక్ష్యం వ్యవహరించారు. పోలీస్ పహారాతో ఎవరినీ ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఆ అంశంపై మేం అసెంబ్లీలో చర్చ పెడితే.. కేసీఆర్ వేల కోట్ల దోపిడీపై చర్చ జరగకుండా ఉండాలనే నల్లగొండలో సభ పెట్టుకున్నారు. ప్రజల ముందు బండారమంతా బయటపడుతోందనే ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగారు.



మేడిగడ్డ బ్యారేజీ పియర్లను పరిశీలిస్తున్న సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల బృందం

నల్లగొండ దూరమా?.. అసెంబ్లీ దూరమా?

చావు నోట్లో తలకాయ పెట్టానంటూ కేసీఆర్ కోటి ఒకటవసారి అబద్ధం చెప్పారు. ఆ మాట నమ్మి ప్రజలు రెండుసార్లు సీఎంగా అవకాశమిస్తే.. భారీగా దోచుకున్నారు. కేసీఆర్ ప్రజల కోసం ఏనాడూ ఏమీ చేయలేదు. ఓడిపోయి సీఎం కుర్చీ పోయింది కాబట్టే మరోసారి ప్రజలు గుర్తుకొచ్చారు. కేసీఆర్ సత్యహరిశ్చంద్రుడే అయితే శాసనసభకు ఎందుకు రాలేదు? మీరు చేసిన నిర్వాకాన్ని సభలో ఆధారాలతో సహా బయటపెట్టాం. మేడిగడ్డ సందర్శనకు రావాలని మా మంత్రి ఉత్తమ్ మీకు లేఖ రాశారు. తేదీపై అభ్యంతరం ఉంటే.. మీరు చెప్పిన తేదీనే వెళదామని చెప్పాం. కాలు విరిగిందని అసెంబ్లీకి రాని కేసీఆర్.. నల్లగొండ సభకు ఎలా వెళ్లారు? నల్లగొండ దూరమా? అసెంబ్లీ దూరమా? మేడిగడ్డ బ్యారేజీని రూ.1,800 కోట్ల అంచనాతో డిజైన్ చేసి.. తర్వాత రూ.4వేల కోట్లకు పెంచారు. కాళేశ్వరం ప్రా జెక్టుకు ఏటా విద్యుత్ బిల్లులే రూ.10,500 కోట్లు వస్తున్నాయి. ప్రాజెక్టు రుణాలు, ఇతర ఖర్చులు కలిపి ఏటా రూ. 25వేల కోట్లు అవసరమవుతాయి.

పిల్లర్లు కుంగితే ఏమిటని చులకన చేస్తారా?

మేడిగడ్డ పిల్లర్లు కుంగడం కాదు.. ప్రాజెక్టు మనుగడే ప్రమాదంలో ఉంది. డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలో మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులకు కూడా ముప్పు ఉందని తేల్చింది. విజిలెన్స్ నివేదిక కూడా అదే చెప్పింది. కానీ కేసీఆర్ రూ.94 వేలకోట్లు ఖర్చు చేసిన ప్రాజెక్టులో నాలుగైదు పిల్లర్లు కుంగితే రాద్ధాంతం చేస్తున్నారంటూ చులకనగా మాట్లాడుతున్నారు. కుంగినది కాళేశ్వరం ప్రాజెక్టు కాదు.. తెలంగాణ ప్రజల నమ్మకం. ప్రజల సొమ్ము అంటే అంత చులకనా? మీ లక్ష కోట్ల దోపిడీకి కాళేశ్వరం బలైపోయింది. మేడిగడ్డ ఇష్యూను చులకన చేసి మాట్లాడటం కేసీఆర్ దిగజారుడుతనానికి నిదర్శనం.

ప్రజల దృష్టి మళ్లించేందుకే నల్లగొండ సభ

కుంగిన మేడిగడ్డ బ్యారేజీని ఎవరూ చూడకుండా కేసీఆర్ చాలా ప్రయత్నాలు చేశారు. పోలీసులతో అడ్డుకున్నారు. ఎన్నికల కమిషన్ అనుమతితో రాహుల్, నేను, శ్రీధర్‌బాబు బ్యారేజీని పరిశీలించాం. అధికారంలోకి వచ్చిన వెంటనే విచారణకు ఆదేశించాం. కాళేశ్వరం నిర్మాణం, నిర్వహణలో భారీగా లోపాలు ఉన్నాయని విజిలెన్స్ తేల్చింది. మేడిగడ్డను సందర్శించి వాస్తవాలు తెలుసుకుందామని స్పీకర్ అనుమతితో వచ్చాం. కానీ కేసీఆర్ తన బండారం బయటపడుతుందని భావించి.. ప్రజల దృష్టిని మళ్లించేందుకు నల్లగొండలో సభ పెట్టారు.

అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇవ్వండి

కృష్ణాబోర్డు (కేఆర్ఎంబీ)కు ప్రాజెక్టుల అప్పగింతపై అడిగితే తాను సలహాలు ఇచ్చేవాడినని కేసీఆర్ అంటున్నారు. అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇవ్వొచ్చని మేం ముందునుంచీ చెప్తున్నాం. స్పీకర్ ద్వారా ప్రతిపక్ష నాయకుడిని పిలిపించాలని కూడా కోరాం. అసెంబ్లీకి రాకుండా.. పైగా సభలో చేసిన తీర్మానాన్ని తప్పుబడుతున్నారు. తీర్మానంలో లోపాలుంటే హరీశ్‌రావు ఎలా మద్దతు ఇచ్చారు. అందుకే హరీశ్‌రావు మాటలకు విలువ లేదని.. కేసీఆర్ సభకు రావాలని మేం కోరాం. నల్లగొండ సభలో దిక్కుమాలిన మాటలు మాట్లాడటం కాదు.. శాసనసభకు రండి. ఏం చేయాలో చెప్పండి. మమ్మల్ని వెంటాడతామంటూ బ్లాక్ మెయిల్ చేయాలని చూస్తున్నారు. కానీ కాళేశ్వరంపై చర్చకు రావడానికి ఎందుకు భయపడుతున్నారు?

ముందే తెలిస్తే.. ప్రతిపక్ష హోదా కూడా వచ్చేది కాదు

మళ్లీ అధికారంలోకి వస్తామని కేసీఆర్ మాట్లాడుతున్నారు. మీ గురించి ప్రజలకు ఎన్నికల ముందే తెలిసి ఉంటే ఆ ప్రతిపక్ష హోదా కూడా వచ్చేది కాదు. మీ అబద్ధాలను నమ్మడానికి తెలంగాణ సమాజం ఇంకా సిద్ధంగా ఉందనుకుంటున్నారా? కేసీఆర్‌ను ఆహ్వానిస్తున్నా.. సభకు రావాలి, బడ్జెట్‌తోపాటు సాగునీటి రంగంపై చర్చలో పాల్గొనాలి. ఆయన స్వార్థం కోసం కాకుండా ఒక్కసారైనా ప్రజలకు మేలు జరిగేలా ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యత నెరవేర్చండి. కాళేశ్వరంలో జరిగిన అవకతవకలపై మీ వైఖరేమిటో సభలో చెప్పండి.

సానుభూతి కోసం ఎత్తుగడ

కుర్చీపోగానే కేసీఆర్‌కు నీళ్లు, నల్లగొండ ఫ్లోరైడ్ గుర్తొస్తాయి. అందుకే కుర్చీని వెతుక్కుంటూ నల్లగొండ వెళ్లారు. పార్లమెంటు ఎన్నికల్లో సానుభూతితో ఓట్లు పొందాలనేది కేసీఆర్ ఎత్తుగడ. భయపడబోనంటూ ప్రగల్భాలు పలకడం కాదు. వచ్చి సభలో మాట్లాడాలి. అవసరమైతే కాళేశ్వరాన్ని సందర్శిస్తానని కేసీఆర్ అంటున్నారు. ఆయన కేసీఆర్ కాళేశ్వరానికి కాదు..ఇక కాశీకి పోవాల్సిందే.

బీజేపీతో చీకటి పొత్తు ఎందుకు?

బీజేపీ, బీఆర్ఎస్ ఇంకా ఎన్నాళ్లు చీకట్లో పొత్తు పెట్టుకుంటాయి? మేడిగడ్డ సందర్శనకు బీజేపీ వాళ్లు వస్తారనుకున్నాం. ఎంఐఎం, సీపీఐ వాళ్లు వచ్చారు. కేసీఆర్ అవినీతిపై విచారణ చేపట్టాలన్న బీజేపీ ఇప్పుడు ఎందుకు రాలేదు. కిషన్‌రెడ్డి బీజేపీ ఎమ్మెల్యేలను రాకుండా అడ్డుకున్నారు. బీజేపీ వైఖరేమిటో, కేసీఆర్ అవినీతికి సహకరిస్తారో, అవినీతిపై విచారణ చేసే మా ప్రభుత్వానికి సహకరిస్తారో ఇప్పటికైనా స్పష్టత ఇవ్వాలి. సీబీఐ విచారణ పేరుతో కేసీఆర్ జుట్టు తమ చేతిలో పెట్టుకొని లబ్ధి పొందాలనుకుంటున్నారు. సీబీఐ కంటే ఉన్నతమైన జ్యుడీషియల్ విచారణ చేయించబోతున్నాం. కేసీఆర్ అవినీతిని బయటపెట్టడానికి ఈ పర్యటన కీలకం. అలాంటి మేడిగడ్డ సందర్శనకు బీజేపీ ఎమ్మెల్యేలు ఎందుకు రాలేదో కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలి.

బాధ్యులపై విచారణ జరుగుతుంది

సాంకేతిక నిపుణులతో చర్చించాక మేడిగడ్డ పునర్నిర్మాణంపై మా నిర్ణయం వెల్లడిస్తాం. మేం ఇంజనీర్లం కాదు. 80వేల పుస్తకాలు చదవలేదు. అక్రమాలకు బాధ్యులైన వారిపై విచారణ కొనసాగుతుంది. అవసరమైతే రెవెన్యూ రికవరీ యాక్టుతో సొమ్ము రికవరీ చేస్తాం''అని రేవంత్ పేర్కొన్నారు.

లక్ష కోట్లు గోదావరిలో పోసినట్టే: కూనంనేని

కాళేశ్వరం ప్రాజెక్టును ఇలా చూడటం బాధగా ఉందని, రూ.లక్ష కోట్లు గోదావరిలో పోసినట్టేనని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. వైఎస్సార్ సర్కారు ప్రతిపాదించినట్టుగా తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టి ఉంటే.. ఇంత ఖర్చు, వృథా అయ్యేది కాదని చెప్పారు.

దేశంలోనే అతిపెద్ద స్కామ్: ఉత్తమ్

స్వతంత్ర భారత చరిత్రలో కాళేశ్వరం కుంభకోణం అతి పెద్దదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన తర్వాత మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.94 వేలకోట్లు ఖర్చు చేసి.. 97 వేల ఎకరాలకు నీరివ్వడమనేది ఎక్కడా ఉండదన్నారు. కట్టిన మూడేళ్లలోనే బ్యారేజీ కొట్టుకుపోయే స్థితికి చేరుకుందని విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణ ఖర్చులో.. రూ.68 వేలకోట్లు అప్పు తెచ్చినవని, ప్రభుత్వం సమకూర్చిన రూ.33 వేల కోట్లు పన్నుల రూపంలో ప్రజల నుంచి వసూలు చేసినవేనని చెప్పారు. వైఎస్సార్ హయాంలో రూ. 38 వేలకోట్లతో 16 లక్షల ఎకరాల ఆయకట్టును ప్రతిపాదిస్తే.. రీడిజైన్ పేరిట ఖర్చును రూ.94వేల కోట్లకు పెంచి 18 లక్షల ఎకరాల ఆయకట్టు ప్రతిపాదించారని పేర్కొన్నారు. తుగ్లక్ కూడా సిగ్గుపడే విధంగా ప్రాజెక్టు నిర్మించారని విమర్శించారు. డ్యామ్‌కు, బ్యారేజీకి తేడా తెలియకుండా నిర్మించడం వల్లే ప్రస్తుతం మేడిగడ్డకు ఈ పరిస్థితి ఎదురైందని పేర్కొన్నారు. కాగా, కేసీఆర్ సూచనల మేరకే బీజేపీ ఎమ్మెల్యేలు మేడిగడ్డ సందర్శనకు రాలేదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు.

మేడిగడ్డపై సీబీఐ విచారణ అంటే ఎందుకు భయం?

రాజకీయ లబ్ధి కోసమే తెరపైకి కృష్ణా, కాళేశ్వరం వివాదం

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓటేస్తే మూసీలో వేసినట్టే
- ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్న ఆ రెండు పార్టీలు
- కేంద్ర పర్యాటకశాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, వరంగల్: 'కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలు, అవినీతిపై గత సీఎం కేసీఆర్ సీబీఐ దర్యాప్తునకు ముందుకు రాలేదు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా సీబీఐ దర్యాప్తు ఎందుకు కోరడం లేదో ముఖ్యమంత్రి చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వం ముందుకొస్తే.. కాళేశ్వరంపై దర్యాప్తు చేయడానికి సీబీఐ సిద్ధంగా ఉందని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినా స్పందించడం లేదు. మేడిగడ్డపై సీబీఐ విచారణకు ఆ రెండు పార్టీలు ఎందుకు ముందుకు రావడం లేదో చెప్పాలి' అని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం వరంగల్‌లో పార్టీపార్లమెంట్ కార్యాలయం ప్రారంభం, వేయిస్తంభాల ఆలయం కల్యాణ మంటపం పనులను పరిశీలించిన అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరంపై డ్యామ్ సేఫ్టీ అథారిటీ రిపోర్ట్ ఇచ్చిన తర్వాత నాటి బీఆర్ఎస్ సర్కారు, ఎన్నికల తర్వాత నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఉత్తరాలు పంపినా స్పందించలేదన్నారు. గత సంవత్సరం అక్టోబర్ 21 మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని వార్తలు రాగానే.. మరుసటి రోజు 22న తాను కేంద్ర జలశక్తి మంత్రికి ఉత్తరం రాశానని, ఆ తర్వాతి రోజే భారత ప్రభుత్వ జలశక్తి శాఖ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసి.. మేడిగడ్డకు పంపిందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. అక్టోబర్ 24, 25న ఆ రెండు రోజులు డ్యామ్ సేఫ్టీ అథారిటీ.. రాష్ట్ర అధికారులను వివరాలు అడిగి నవంబర్ 1న ప్రాథమిక నివేదిక తయారు చేసి రాష్ట్రానికి పంపిందన్నారు. ప్రాజెక్ట్ సర్వే, ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, ఆపరేషన్, నిర్వహణ అన్నీ లోపభూయిష్టంగా ఉన్నాయని వెల్లడించిందన్నారు. ప్రమాదకర పరిస్థితిలో డ్యామ్ ఉన్నదని, నీటిని ఖాళీ చేయాలని డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచించిందని మంత్రి చెప్పారు.

ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టేందుకు కేసీఆర్ సభ

ఏపీ పోలీసులను పెట్టి బలవంతంగా కృష్ణా నీళ్లు తీసుకెళ్తే.. ఏం చేయాలో ఇప్పటివరకు యాక్షన్‌ప్లాన్ ఏంటో, మీ వైఖరి ఏమిటో.. ఈ సమస్యను ఎలా పరిష్కరించుకుంటారో చెప్పాలని నిలదీశారు. మీరు పరిష్కరించుకుంటే.. కేంద్రం జోక్యం చేసుకోదన్నారు. ప్రాజెక్టుల సమస్య వస్తే పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని చెప్పా రు. కేంద్రంపై నిందలు వేస్తూ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టాలని కేసీఆర్ నల్లగొండ సభ పెట్టారని, ఆయన రెచ్చగొట్టే వ్యాఖ్యలను ప్రజలు పట్టించుకోరన్నారు. ఒకరు కృష్ణా జలాలపై, మరొకరు కాళేశ్వరంపై రచ్చ చేస్తూ ఎంపీ ఎన్నికల్లో లబ్ధిపొందాలని ప్రయత్నం చేస్తున్నారని, తెలంగాణలో ఈసారి బీజేపీ డబుల్ డిజిట్ సీట్లు గెలుస్తుందన్నారు.

మేడిగడ్డపై కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు

ప్రతిపక్ష, పాలక పార్టీలు ఆడుతున్నాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు. మేడిగడ్డ డ్యామేజీ వ్యవహారాన్ని పొలిటికల్ మైలేజీకి కాంగ్రెస్ వాడుకుంటున్నదన్నారు. అసెంబ్లీ బంద్ పెట్టి.. మేడిగడ్డకు ఎందుకు వెళుతున్నారో అర్థం కావడం లేదని, ఇంతకు ముందే మంత్రులు చూశారు. రేవంత్, రాహుల్‌గాంధీ చూశారు.. ఇప్పుడు మళ్లీ ఎందుకు వెళుతున్నారో చెప్పాలి? అని నిలదీశారు. బీఆర్ఎస్ పార్టీ తీరు అలాగే ఉన్నదని, ప్రజాసమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి వెళ్లని కేసీఆర్, నల్లగొండ బహిరంగ సభకు వెళ్లారని ఎద్దేవా చేశారు.

తప్పు తేలితే తగిన శిక్ష!

మేడిగడ్డలో అసలేం జరిగిందో ప్రజలకు నిజాలు తెలియాలి
అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

- డ్యామ్ డిజైన్‌లో అనేక తప్పులున్నట్టు విజిలెన్స్ రిపోర్టులో తేలింది
- ప్రాజెక్టుల పేరుతో వేలకోట్ల ప్రజాధనం వృథా అయింది
- ఒకట్రెండు రోజుల్లో శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రం
- గోదావరి జలాలపైనా చర్చిస్తామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల వాస్తవ పరిస్థితులపై అధ్యయనం జరిపి రూపొందించిన శ్వేతపత్రాన్ని ఒకట్రెండు రోజుల్లో శాసనసభలో విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మేడిగడ్డ బ్యారేజీ విషయంలో అసలేం జరిగిందో ప్రజలకు నిజాలు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. మేడిగడ్డ విషయంలో తప్పు జరిగిందా? జరిగినట్టు తేలితే బాధ్యులెవరు? అనేది తేలుస్తామని.. వారికి తగిన శిక్ష ఉంటుందని పేర్కొన్నారు. మంగళవారం మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు బయలుదేరే ముందు శాసనసభలో రేవంత్ ప్రసంగించారు. రాష్ట్ర తాగు, సాగునీటి అవసరాలకు కృష్ణా, గోదావరి జలాలే కీలకమని.. కృష్ణాజలాలపై ఇప్పటికే శాసనసభలో చర్చించామని, గోదావరి జలాలపై త్వరలో చర్చిస్తామని తెలిపారు. సభలో రేవంత్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు వైఎస్సార్ హయాంలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు చేపట్టారు. తెలంగాణ ఏర్పాటయ్యే నాటికే వేల కోట్ల విలువైన పనులు కూడా జరిగాయి. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం రీడిజైనింగ్ పేరిట ప్రాజెక్టుకు మార్పులు చేసి.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల అంటూ బ్యారేజీలను కట్టుకుంటూ పోయింది. రూ.38,500 కోట్ల వ్యయ అంచనాతో ప్రాణహిత-చేవెళ్లను రూపొందిస్తే.. కాళేశ్వరం పేరిట రూ.1.47 లక్షల కోట్లకు పెంచేశారు. ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రూ.2.5 లక్షల కోట్లు అవుతుందా? ఇంకెంత అవుతుందోనన్న దానిపై స్పష్టత లేదు.

ఇసుకలో పేకమేడలు కట్టారా?

పునాదుల కింద ఇసుక కదలడం వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని గత ప్రభుత్వ నేతలు అంటున్నారు. వాళ్లు ఇసుకలో పేకమేడలు కట్టారా? సభలో ప్రాజెక్టులపై శ్వేతపత్రం పెట్టాక.. కాళేశ్వరంపై, కాళేశ్వర్‌రావుగా పిలుచుకున్న హరీశ్‌రావుపై, ప్రాజెక్టు ఎవరెవరికి ఏటీఎంలా మారిందన్న అంశంపై చర్చిద్దాం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొందరు అధికారులు కార్యాలయాల నుంచి ఫైళ్లు మాయం చేశారని వచ్చిన ఆరోపణలపై విచారణకు ఆదేశించాం. ఏమేం ఫైళ్లు మాయమయ్యాయి? ఎవరు మాయం చేశారన్న దానిపై ప్రాథమిక నివేదిక అందింది.

పిట్టగూడులా కట్టారా? బాంబులతో పేల్చారా?

మ్యాన్ మేడ్ వండర్ అంటూ కాళేశ్వరం ప్రాజెక్టుపై పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఈ ప్రాజెక్టు బీఆర్ఎస్ నేతలకు ఏటీఎంలా మారిందని మేం ఇక్కడ అనడం లేదు. కాళేశ్వరం గొప్పతనాన్ని కేసీఆర్ స్వయంగా వివరిస్తే బాగుంటుంది. మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు మాజీ సీఎం కేసీఆర్, కాళేశ్వర్‌రావు (హరీశ్‌రావును ఉద్దేశించి)తోపాటు కడియం శ్రీహరి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ రావాలి. బ్యారేజీకి ఏం జరిగిందో చూసి, తెలంగాణ ప్రజలకు వివరించాలి. బస్సులో ప్రయాణించడానికి కష్టమైతే.. కేసీఆర్ కోసం ప్రత్యేకంగా హెలికాప్టర్‌ను సిద్ధంగా ఉంచాం. మేడిగడ్డ బ్యారేజీ కుంగడంపై ఆందోళన చేసిన ప్రతిపక్షాలను అప్పట్లో అడ్డుకున్నారు. అప్పటి మంత్రి ప్రశాంత్‌రెడ్డి అయితే.. ప్రతిపక్షాలే బ్యారేజీని బాంబులు పెట్టి పేల్చేశాయంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇవన్నీ చూడటానికే ప్రభుత్వం మేడిగడ్డ టూర్ ఏర్పాటు చేసింది'' అని రేవంత్ చెప్పారు. కాగా మేడిగడ్డ బ్యారేజీ డిజైన్‌లో లోపాలున్నట్టుగా విజిలెన్స్ రిపోర్టు ఇచ్చిందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొనగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు.

అసెంబ్లీ నుంచి నేరుగా మేడిగడ్డకు..

నాలుగు బస్సుల్లో వెళ్లిన సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

సాక్షి, హైదరాబాద్/ సాక్షి ప్రతినిధి, వరంగల్: అసెంబ్లీ వాయిదాపడిన అనంతరం మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేల బృందం మేడిగడ్డ సందర్శనకు బయలుదేరింది. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలకు వెళ్లే ప్రత్యేక బస్సులో సీఎం రేవంత్, మంత్రులు, మరో రెండు ఆర్టీసీ గరుడ బస్సుల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని, ముగ్గురు ఎంఐఎం ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ, మరో బస్సులో అధికారులు.. మొత్తంగా నాలుగు బస్సులలో మేడిగడ్డకు వెళ్లారు. మొదట బ్యారేజీలో పియర్లు కుంగిన 7వ బ్లాక్ ప్రాంతాన్ని పరిశీలించారు. తర్వాత ప్రాజెక్టుపై ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షించారు. అధికారులతో సమీక్షించి ప్రాజెక్టు నిర్మాణ వివరాలు, వ్యయం, ఏటా నిర్వహణ ఖర్చులు, విద్యుత్ బిల్లుల వివరాలను పరిశీలించారు. చివరగా సీఎం రేవంత్, మంత్రులు మీడియాతో మాట్లాడారు. అనంతరం హైదరాబాద్‌కు తిరుగుప్రయాణం అయ్యారు.


లోపాలే శాపాలు!

- మేడిగడ్డ బ్యారేజీపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో సర్కారు
- రూ.94 వేలకోట్లు ఖర్చుపెట్టి నీరిచ్చింది 98 వేల ఎకరాలకేనని ఎద్దేవా

సాక్షి ప్రతినిధి, వరంగల్: నిర్మాణం, నిర్వహణ లోపాలే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి శాపంగా మారాయని.. బ్యారేజీ వద్ద ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో సర్కారు పేర్కొంది. బ్యారేజీ వద్ద తలెత్తిన సమస్యలపై గత సర్కారు సకాలంలో స్పందించకపోవడంతో పియర్లు కుంగిపోయాయని వెల్లడించింది. సాగునీటిశాఖ చీఫ్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి, విజిలెన్స్ డైరెక్టర్ రాజీవ్ రతన్‌లు తాము గుర్తించిన అంశాలను ప్రజెంటేషన్‌లో వివరించారు. ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం నాటి నుంచి జరిగిన పరిణామాలు, కుంగిపోవడానికి కారణాలు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలోని అంశాలను ప్రస్తావించారు. ప్రాజెక్టు నిర్మించాక ఒక్కసారైనా పూర్తిస్థాయిలో తనిఖీలు చేయలేదని పేర్కొన్నారు. ఏటా వానాకాలానికి ముందు, తర్వాత బ్యారేజీని తనిఖీ చేసి.. అవసరమైన చర్యలు చేపట్టాలని, కానీ అదేమీ జరగలేదని వివరించారు. మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిస్థితినీ పరిశీలించామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు రూ.98,750 కోట్లు వ్యయం చేశారని.. కొత్తగా 98,750 ఎకరాల ఆయకట్టుకు నీరు అందిందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఏటా 180 టీఎంసీల చొప్పున ఐదేళ్లలో 900 టీఎంసీల నీటిని ఎత్తిపోయాల్సి ఉండగా.. 162.368 టీఎంసీలనే లిఫ్ట్ చేసినట్టు తెలిపారు. కాళేశ్వరం కోసం ఏటా సుమారు రూ.10వేల కోట్లు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నట్టు చెప్పారు. ప్రాజెక్టు మెయింటెనెన్స్, విద్యుత్ బిల్లులు, అప్పుల వాయిదాలు, మిత్తీ వంటివన్నీ కలిపి ఏటా రూ.25 వేల కోట్ల వరకు అవసరమని వివరించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రాజెక్టు మొత్తం పూర్తికావడానికి రూ.2 లక్షల కోట్లు ఖర్చవుతుందని, అయినా 19.63 లక్షల ఎకరాలకే నీరందించగలమని పేర్కొన్నారు. మూడు బ్యారేజీల్లో ఎక్కడా నీళ్ల లేవని.. నీళ్ల నింపితేగానీ ఎలాంటి సమస్యలు వస్తాయో తెలియని పరిస్థితి ఉందన్నారు.

కాళేశ్వరంపై లేనిపోని ఆరోపణలు

కాంగ్రెస్ నేతలపై మాజీమంత్రి హరీశ్‌రావు ధ్వజం



- ఒక బ్యారేజీలో ఒకటో రెండో పిల్లర్లు కుంగిపోతే కోడి గుడ్డు మీద ఈకలు పీకినట్టు పీకుతున్నారు
- కాళేశ్వరం అంటే బ్యారేజీలు, రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌ల సమాహారం
- మేడిగడ్డ వెళ్లిన సీఎం రేవంత్, ఎమ్మెల్యేలు దారిలో పచ్చటి పొలాలు చూడాలి
- అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన హరీశ్

సాక్షి, హైదరాబాద్: ఒక బ్యారేజీలో ఒకటో రెండో పిల్లర్లు కుంగిపోతే దానిపై కాంగ్రెస్ నేతలు కోడిగుడ్డు మీద ఈకలు పీకినట్లు పీకుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కాళేశ్వరం సమగ్ర స్వరూపం చాలా మందికి తెలియదని.. 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్ స్టేషన్లు, 21 పంప్ హౌస్‌లు, 203 కిలోమీటర్ల సొరంగం, 1,531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, 141 టీఎంసీల స్టోరేజ్ కెపాసిటీ, 530 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్, 240 టీఎంసీల ఉపయోగం.. వీటన్నింటి సమాహారం కాళేశ్వరం అని వివరించారు. దీనిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, నిందలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో శాసనసభ్యులు కడియం శ్రీహరి, సబితా ఇంద్రారెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్ ప్రాణహిత-చేవెళ్ల ఎందుకు కట్టలేదు?

ఏదో జరిగిందని మేడిగడ్డ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దారిలో రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కుడెల్లి వాగు, పచ్చటి పొలాలు చూడాలని హరీశ్‌రావు హితవు పలికారు. కాళేశ్వరంతో ఏం చేశారని అడుగుతున్న రాష్ట్ర కాంగ్రెస్ నేతలు.. రైతుల దగ్గరకు వెళ్లి అడగాలని సూచించారు. పక్క రాష్ట్రమైన కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రంగనాయక సాగర్ చూసి అద్భుతం అని మెచ్చుకున్నారని, నేర్చుకున్నారని గుర్తు చేశారు. కేంద్రం, మహారాష్ట్ర, ఏపీలో నాడు కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ప్రాణహిత - చేవెళ్ల ఎందుకు కట్టలేదని నిలదీశారు. మేము నీళ్ళు లేని ప్రాంతం నుంచి నీళ్ళు ఉన్నచోటకు ప్రాజెక్టును మార్చి కట్టి నీళ్ళు అందించామని, మూడు కోట్ల మెట్రిక్ టన్నుల పంట పండింది అంటే ఆ జలాల వల్లే అనే విషయం తెలుసుకోవాలని అన్నారు.

తప్పులు జరిగితే చర్యలు తీసుకోండి

మేము చేసిన పనుల్లో తప్పులు జరిగితే చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు అన్నారు. అదే సమయంలో చేసిన పనులను ఆపకుండా పునరుద్ధరణ పనులు చేపట్టాలని కోరారు. దురుద్దేశంతో ప్రాజెక్టు పునరుద్ధరణ చేయడం లేదని, మీరు చేసే పనుల వల్ల రైతులు నష్టపోయే పరిస్థితి వచ్చిందని, దీన్ని ప్రజలు క్షమించరని అన్నారు. నల్లగొండలో బీఆర్ఎస్ సభ ఉందనే మేడిగడ్డ బ్యారేజీ టూర్ ప్రోగ్రాం పెట్టారని హరీశ్‌రావు విమర్శించారు. మీ నీతిని ప్రజలందరూ గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించొద్దంటూ తాము నిద్ర లేపితే వారు లేచారని విమర్శించారు.

అదే దూకుడు!

- చెణుకులు..చమత్కారాలు..సామెతలు..పదునైన వ్యాఖ్యలు
- చలో నల్లగొండ సభలో కేసీఆర్ ఉద్వేగపూరిత ప్రసంగం
- ఉద్యమకాలం నాటి దూకుడు ప్రదర్శించిన బీఆర్ఎస్ అధినేత
- తెలంగాణ సెంటిమెంట్‌ను తట్టి లేపేందుకు ప్రయత్నం
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజం.. సీఎం, మంత్రుల విమర్శలకు దీటుగా జవాబు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి, తుంటి ఎముకకు శస్త్ర చికిత్స అనంతరం మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు మంగళవారం తొలిసారిగా.. నల్లగొండ బహిరంగ సభ వేదికగా జనం మధ్యకు వచ్చారు. కృష్ణా నదీ జలాల్లో తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం చలో నల్లగొండ పేరిట బీఆర్ఎస్ నిర్వహించిన సభలో ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 95కు పైగా సభల్లో పాల్గొన్న కేసీఆర్.. అధికారం కోల్పోయిన తర్వాత జరిగిన ఈ తొలి సభలో చేసిన ప్రసంగంలో, తెలంగాణ ఉద్యమకాలం నాటి దూకుడును ప్రదర్శించారు. తనదైన శైలిలో చెణుకులు, చమత్కారాలు, సామెతలు, పదునైన వ్యాఖ్యలతో పలు అంశాలను ప్రస్తావిస్తూ తెలంగాణ సెంటిమెంట్‌ను తట్టిలేపే ప్రయత్నం చేశారు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజమెత్తడంతో పాటు ఇటీవలి కాలంలో సీఎం రేవంత్ సహా పలువురు మంత్రులు పరుష పదజాలంతో చేస్తున్న విమర్శలను దీటుగా తిప్పికొట్టే ప్రయత్నం చేశారు.

ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే ప్రయత్నం

రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై మెతక వైఖరితో ఉందనే అంశాన్ని ఎత్తిచూపేందుకే కృష్ణా జలాలపై 'ఢిల్లీకి అఖిలపక్షం' అనే వ్యూహాన్ని నల్లగొండ సభ వేదికగా కేసీఆర్ ఎంచుకున్నట్లు చెబుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డను ఓ చిన్న భాగంగా పేర్కొనడం ద్వారా ప్రాజెక్టుపై రేవంత్ ప్రభుత్వ విమర్శలను దీటుగా తిప్పికొట్టారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అలాగే సాగునీరు, విద్యుత్ రంగాల్లో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపడం ద్వారా కాంగ్రెస్ నేతలను ఇరుకున పెట్టే ప్రయత్నం కేసీఆర్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే ఎత్తుగడలో భాగంగా దామరచర్ల, ఎన్టీపీసీ విద్యుత్ ప్రాజెక్టులు, పాలమూరు ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయాలనే డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చారు. రైతుబంధు పథకం అమలులో ఆలస్యం జరుగుతుండటంపై విమర్శలు ఎక్కుపెట్టారు. వరికి బోనస్ అంశంలో ప్రభుత్వం మాట మార్చిందనే విషయాన్ని తనదైన శైలిలో ఎత్తిచూపారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టాలని ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ..'రైతులకూ చెప్పులు ఉంటాయి' అంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు సభ నుంచి భారీ స్పందన వ్యక్తం కావడం గమనార్హం. కాగా తెలంగాణ ప్రయోజనాల కోసం నిలదీస్తాం, కొట్లాడతాం అంటూ రాబోయే రోజుల్లో నల్లగొండ తరహా సభలు మరిన్ని నిర్వహిస్తామనే సంకేతాలు ఇచ్చారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరైన ఈ సభలో పార్టీ ముఖ్య నేతలు కేటీ రామారావు, హరీశ్‌రావు, కడియం శ్రీహరి, నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి తదితరులతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. మంగళవారం అసెంబ్లీ వాయిదా పడిన తర్వాత వీరంతా తెలంగాణ భవన్ నుంచి ప్రత్యేక బస్సులో నల్లగొండకు చేరుకున్నారు. కేసీఆర్ హెలికాప్టర్లో నల్లగొండకు వచ్చారు.

కేసీఆర్‌పై అసత్య ఆరోపణలు

మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి ధ్వజం




నల్లగొండ టౌన్: కృష్ణా జలాల వాటా విషయంలో కొందరు సన్నాసులు తెలంగాణ అభివృద్ధి ప్రదాత కేసీఆర్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాజలాల పరిరక్షణ సభలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధికి దూరంగా ఉన్న తెలంగాణను.. ప్రత్యేక రాష్ట్ర సాధన ద్వారా కరువు, ఆకలి చావులు లేని రాష్ట్రంగా నిలిపిన ఘనత కేసీఆర్‌దేనని ఆయన అన్నారు. మరో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేసిన కాంగ్రెస్ పార్టీ నేడు ప్రాజెక్టుల గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడానికి అంగీకరించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకులు కె.కేశవరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీలు బడుగుల లింగయ్యయాదవ్, నామా నాగేశ్వర్‌రావు, రవిచంద్ర, సంతోష్‌కుమార్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మహమూద్ అలీ, గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కడియం శ్రీహరి, నేతలు కంచర్ల భూపాల్‌రెడ్డి, రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, భాస్కర్‌రావు, పొన్నాల లక్ష్మయ్య, మధుసూదనాచారి, గ్యాదరి కిషోర్, దేశపతి శ్రీనివాస్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లిలా పారిపోతే పులి అంటారా?

మాజీ సీఎం కేసీఆర్‌పై మంత్రి పొంగులేటి ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: కృష్ణా నదీజలాలపై అసెంబ్లీలో చేపట్టిన చర్చకు రాకుండా పిల్లిలా పారిపోయిన మాజీ సీఎం కేసీఆర్‌ను పులి అంటారా.. పిల్లి అంటారా.. అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. 'పులిలా పోరాడతా.. పిల్లిలా పారిపోను' అంటూ నల్లగొండ బీఆర్ఎస్ సభలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ మంగళవారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. గత పదేళ్లలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసినందుకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అన్యాయం, అరాచకం, అవినీతి, అలసత్వం, దోపిడీ గత పదేళ్లలో జరిగిందని, ఇప్పుడేమో అమాయక చక్రవర్తిలాగా నటిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల ఉద్వేగాలు, మనోభావాలను రెచ్చగొట్టి ప్రయోజనం పొందడానికే కేఆర్ఎంబీ అంశాన్ని తెరపైకి తెచ్చారని ఆరోపించారు.

ప్రజానిర్ణయాన్ని అపహాస్యం చేయడమే


మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై మంత్రి తుమ్మల మండిపాటు



సాక్షి, హైదరాబాద్: పాలిచ్చే బర్రెను వదులుకొని దున్నపోతుని తెచ్చుకున్నారని నల్లగొండ సభలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. కేసీఆర్ వ్యాఖ్యలు ప్రజాస్వామ్యాన్ని, ప్రజానిర్ణయాన్ని అపహాస్యం చేయడమేనని ఆయన మంగళవారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం గురించి హేళనగా మాట్లాడటం సరికాదని తుమ్మల హితవు పలికారు. మాజీ సీఎంగా కేసీఆర్ మాట్లాడే భాష, ప్రజాస్వామ్య విలువలకు లోబడి లేదని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారన్నారు.

బీఆర్ఎస్ సభ విధుల్లో అపశ్రుతి

కారు ఢీకొని హోంగార్డు మృతి



హోంగార్డు నవకిషోర్ (ఫైల్)

నల్లగొండ క్రైం: నల్లగొండలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన సభకు బందోబస్తు విధుల్లో ఉన్న ఓ హోంగార్డును కారు ఢీకొట్టడంతో మృతి చెందాడు. నార్కట్ పల్లి పోలీస్‌స్టేషన్‌కు చెందిన హోంగార్డు నవకిషోర్(36) వాహనాలను నియంత్రించే విధుల్లో ఉన్నాడు. సభ పూర్తయిన తర్వాత నల్లగొండ పట్టణ శివారులోని చర్లపల్లి వద్ద వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో నవకిషోర్ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నాడు. అదే సమయంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత ప్రయాణిస్తున్న కారు ముందున్న కారును ఢీకొట్టింది. ఆ కారు దూసుకొచ్చి హోంగార్డును ఢీకొట్టడంతో కింద పడిపోయాడు. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. నల్లగొండ సమీపంలోని మర్రిగూడ బైపాస్ రోడ్డు వద్ద విధుల్లో ఉన్న మరో హోంగార్డు వెంకటేశ్వర్లును ఓ కారు ఢీకొట్టడంతో అతడికి స్వల్పగాయాలయ్యాయి. ఎమ్మెల్యే కారుతోపాటు మరో కారును స్వాధీనం చేసుకొని విచారిస్తున్నామని నల్లగొండ రూరల్ ఎస్సై శివకుమార్ తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్తల నిరసనలు

నల్లగొండ/నల్లగొండ టౌన్: కేసీఆర్ నల్లగొండ జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే సభకు రావాలంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నల్లగొండ గడియారం సెంటర్‌లో మంగళవారం నిరసన తెలిపారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇంటికి వెళ్లిన నేతలు, మధ్యాహ్నం భోజనానంతరం సభా వేదిక వద్దకు వెళ్తుండగా హైదరాబాద్ రోడ్డులోని సబ్ స్టేషన్ వద్ద ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ కార్యకర్తలు ఒక్కసారిగా బస్సుకు ఎదురుగా వచ్చి కోడిగుడ్లు విసిరారు.



నల్లగొండ సభలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో పార్టీ నేతలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, రంజిత్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, తలసాని, హరీశ్‌రావు, పద్మారావు, పొన్నాల లక్ష్మయ్య, నామా నాగేశ్వర్‌రావు, జగదీశ్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, కె.కేశవరావు, కడియం శ్రీహరి, కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, సంతోశ్‌కుమార్, మహమూద్‌అలీ, గంగుల కమలాకర్, మధుసూదనాచారి

కట్టె కాలేవరకు పులిలా కొట్లాడతా

▶ మొదటి పేజీ తరువాయి

మాత్రం ఉద్యమ, పోరాట సభ. కృష్ణా నీళ్లపై ఆధారపడిన మన బతుకులకు సంబంధించిన సమస్య. ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ప్రజల జీవన్మరణ సమస్య. చావో రేవో తేల్చే సమస్య. అందుకే నా కాలు విరిగిపోయినా కుంటి నడకతో కట్టె పట్టుకొని ఇంత ఆయాసంతో రావాల్సి వచ్చింది. కొంతమంది సన్నాసులు తెలివి లేక, వాళ్లకు వ్యతిరేకంగా ఈ సభ పెట్టామని అనుకుంటున్నారు. వారిలా ఇది చిల్లర మల్లర రాజకీయ సభ కాదు. నీళ్ల పంచడానికి సిద్ధంగా ఉన్న బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు, కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర నీటి పారుదల మంత్రికి, మన నీళ్ల దొబ్బిపోదామనుకునే స్వార్థ శక్తులకు ఈ సభ ఒక హెచ్చరిక..' అని కేసీఆర్ పేర్కొన్నారు.

రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతామంటారా..

'రైతుబంధు అడిగితే ఇవ్వడానికి చేతకావడం లేదా? ఇంత దద్దమ్మలా.. ఇవ్వకపోతే ఇవ్వలేదు.. రైతు బంధు అడిగితే చెప్పుతో కొడతానని రైతులను అంటావా? పంటలు పండించే రైతులకు కూడా చెప్పులు ఉంటయ్. అవి గట్టిగా ఉంటాయ్. ఒక్కసారికి మూడు పళ్లు రాలిపోతాయి. మీకు ఇవ్వడం చేతగాకపోతే తరువాత ఇస్తామని చెప్పు. లేదంటే డబ్బులు లేవని చెప్పాలి. చలో నల్లగొండ పెడితే కేసీఆర్‌ను తిరగనీయం అంటారా? ఇంత మొగోళ్లా? తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌నే తిరగనీయరా? ఏం చేస్తరు చంపుతారా? దా చంపుదువు రా.. కేసీఆర్‌ను చంపి మీరుంటరా? మీకు దమ్ముంటే పాలమూరు రంగారెడ్డి, ఖమ్మంలో సీతారామ ప్రాజెక్టు పూర్తిచెయ్. మేడిగడ్డకు పోతం.. బొందల గడ్డ పోతాం అని వెళ్తున్నావు. బిడ్డా మేము కూడా ఈ స్టేజీ మీద ఉన్నోళ్లమంతా పోతాం. మీ బండారం బయట పెడతం. మేడిగడ్డకు పోయి ఏం పీకుతావు. దమ్ముంటే ప్రాణహిత నీటిని ఎత్తిపోయి. డోర్నకల్‌కు నీరు వస్త లేవు. సూర్యాపేటకు, తుంగతుర్తికి మునుపు వచ్చిన నీరు ఎందుకు తగ్గిపోయాయి..' అని ప్రశ్నించారు.

రాష్ట్ర బిల్లు కోసమే ఒప్పుకున్నాం

'ఆనాడు అధికారంలో ఉన్న, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఏడాది కోసం తాత్కాలికంగా సర్దుబాటు చేసుకోండి.. ఆ తరువాత ఎవరి వాటా వారికి వస్తాయని చెప్పింది. ఆనాడు ప్రత్యేక రాష్ట్ర బిల్లు పాస్ కావాలి.. తెలంగాణ రావాలి.. ఇదొక ఆటంకం కాకూడదు. తర్వాత చూసుకుందాం అనే ఉద్దేశంతో సరే కానివ్వండి అని చెప్పినం. ఆ తరువాత వాళ్లు పోయి మోదీ ప్రభుత్వం వచ్చింది. మేం మునిగిందే నీళ్లల్లో.. నీళ్లు లేక మా బతుకులు ఆగమైపోయాయి.. వెంటనే నీళ్లు పంపిణీ చేయండని వందల ఉత్తరాలు రాశాం. ట్రిబ్యునల్ వేయమన్నా వేయలే. దాంతో సుప్రీంకోర్టుకు వెళ్లి తగాదా పెట్టాం. ఆ తరువాత మీటింగ్‌లో మేము గట్టిగా నిలదీస్తే మీరు కేసు ఉపసంహరించుకోండి.. నీటి పంపకాలకు మేము ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తాం అని చెబితే ఉపసంహరించుకున్నాం. అయినా తొందరగా వేయలేదు. మళ్లీ ఉత్తరాలు రాశా. లోక్‌సభ వారం రోజుల పాటు స్తంభింపజేశాం. ఆ ఒత్తిడికి తలొగ్గి మొన్న ఎన్నికలకు నాలుగైదు నెలల ముందు ట్రిబ్యునల్ ఏర్పాటు చేశారు..' అని తెలిపారు.

పాలిచ్చే బర్రెను అమ్మి దున్నపోతును తెచ్చుకున్నరు

'ఏ ప్రభుత్వం ఉన్నా ట్రిబ్యునల్ ముందుకు పోయి గట్టిగా వాదించాలి. అది మొగోడు చేయాల్సిన పని. జనంపై ప్రేమ ఉన్నోడు చేయాల్సిన పని. మీకేం కోపం వచ్చిందో.. ఏం భ్రమలో పడ్డారో.. పాలిచ్చే బర్రెను అమ్మి దున్నపోతును తెచ్చుకున్నరు. ఈ ప్రభుత్వం మన జీవితాలను దెబ్బకొట్టేలా కృష్ణా జలాలను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు (కేఆర్ఎంబీ) అప్పగించింది. జలాల్లో వాటా తేల్చమని అడుగాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకుండా ప్రాజెక్టులను అప్పగిస్తూ సంతకం పెట్టింది. దాని మెమోరాండం దొరికింది. దానివల్ల జరిగే నష్టం నీళ్ల మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావుకు తెలుసు కాబట్టి గర్జించారు. దాంతో నాలుగైదు రోజులు నాటకాలు ఆడారు. అబద్ధాలు ఆడారు. బిడ్డా మిమ్మల్ని బజారున నిలబెట్టి మీ సంగతి ప్రజల ముందే తేల్చుకుంటాం..అని చలో నల్లగొండకు పిలుపు ఇచ్చా. ఇజ్జత్ మానం పోతోందని అతి ముఖ్యమైన బడ్జెట్ పక్కకు పెట్టారు. ఆగమేఘాలపై అసెంబ్లీలో తీర్మానం పెట్టారు. అది కూడా సరిగ్గా పెట్టకుండా తాగునీటి కోసమని పెట్టారు. కరెంటు ఉత్పత్తి గురించి పెట్టలేదు..' అని కేసీఆర్ ధ్వజమెత్తారు.

4 రోజులు విశ్రాంతి తీసుకుందామనుకున్నా

'ప్రజలు అధికారం ఇచ్చారు. ఐదేళ్లు ఉండండి. మాకు అభ్యంతరం లేదు. నేను నాలుగు రోజులు ఆరాంగా కూర్చుందామనుకున్నా. కానీ ఏం చేశారు. నల్లముఖం పిల్లిపోయి సచ్చిన ఎలుకను పట్టినట్లు.. ప్రభుత్వం వచ్చుడు వచ్చుడే కృష్ణా నీళ్లను తీసుకెళ్లి కేఆర్ఎంబీకి అప్పగించింది. కట్టమీద మొత్తం రిజర్వు పోలీసోళ్లు ఉన్నరు. మంచినీళ్లను చిప్పపట్టి అడుక్కోవాలి. విద్యుత్తు ఉత్పత్తి చేయాలంటే అడుక్కోవాలి. మనకున్న అధికారాలను వారికి అప్పగించారు. నన్ను బెదిరించినా అప్పగించలే. గవర్నమెంట్‌ను పడగొడతామన్నారు. రాష్ట్రపతి పాలన పెడతమన్నారు. అయినా ఒప్పుకోలేదు. నా తల కాయ పోయినా ప్రాజెక్టులను అప్పగించనని చెప్పా. కానీ ఈ ప్రభుత్వం అప్పగించింది. ఇటీవల బీఆర్ఎస్ ఎంపీలు వెళ్లి అడిగితే మీ ప్రభుత్వం ఒప్పుకుందని చెప్పారు. ఇప్పటికైనా పిచ్చి ప్రేలాపనలు, పిచ్చి ఆలోచనలు మాని వెంటనే బడ్జెట్ సమావేశాలు ముగించి కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్రానికి రావాల్సిన సంపూర్ణమైన వాటా కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోవాలి. ప్రధానిని నిలదీయాలి. ఆరు నెలల్లో వాటాలు తేల్చండి అంటూ ప్రధాని ఆదేశించేలా పోరాటాలు నిర్వహించాలి..' అని సూచించారు.

దద్దమ్మల రాజ్యం ఇలాగే ఉంటుంది

'మంత్రి ఉత్తమ్‌కుమార్ ఉమ్మడి రాష్ట్రమే బాగుందని అసెంబ్లీలోనే అన్నారు. అదే మంచిగుంటే మరి అంత పెద్ద ఉద్యమం ఎందుకు జరిగింది.. కోట్ల మంది ఎందుకు పాల్గొన్నారు.. శ్రీకాంతాచారి ఎందుకు చనిపోయారనే సోయి లేకుండా మంత్రులు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ వాళ్లకు పదవులు కావాలి.. పైరవీలు కావాలి.. డబ్బు కావాలి తప్ప ప్రజల హక్కుల గురించి పట్టించుకోరు. 'టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఏడాదిన్నరలోనే 24 గంటల ఇచ్చాం. కేసీఆర్ ప్రభుత్వం పోగానే ఆ కరెంట్ పోతదా? తొమ్మిదిన్నరేళ్లు ఇచ్చిన కరెంటు ఈరోజు ఏమైంది.

ఏమైనా మాయ రోగం వచ్చిందా? దద్దమ్మల రాజ్యం ఉంటే ఇలాగే ఉంటుంది. చేతగాని చవటల రాజ్యం ఉంటే గిట్లనే ఉంటది. కరెంటు ఎందుకు ఇస్తలేరు. ఎందుకు తిప్పలు పెడుతున్నారు? ఏమైందిరా బిడ్డా కరెంట్ అని మీరు అడగాలి. బిడ్డా.. ఈ సభతో ఆపం. ఎక్కడ దొరికితే అక్కడ బజారుకీడుస్తాం. కరెంటు, సాగునీరు, తాగునీటి విషయంలో ప్రజలను ఇబ్బందులు పెడితే ఎక్కడికక్కడ నిలదీస్తాం. అసెంబ్లీలో జనరేటర్ పెట్టిన చరిత్ర వీరిదే. అసెంబ్లీలో మాట్లాడుతుంటే ఏడుసార్లు కరెంట్ పోతదా?' అని కేసీఆర్ నిలదీశారు.

కాళేశ్వరం ఆటబొమ్మ అనుకుంటున్నవా?

'కాళేశ్వరం అంటే ఒక ఆట బొమ్మ కాదు. మూడు బ్యారేజీలు, 20 రిజర్వాయర్లు, 200 కి.మీ సొరంగాలు, 1,500 కి.మీ కాలువ, 19 సబ్ స్టేషన్లు ఉంటాయి. మేడిగడ్డలో 250 పిల్లర్లు ఉంటాయి. రెండు కుంగిపోయాయి. గతంలో ఎన్నిసార్లు కుంగిపోలే. నాగార్జునసాగర్‌లో కుంగిపోలేదా? కడెం ప్రాజెక్టు గేట్లు కొట్టుకు పోలేదా? మూసీ గేట్లు కొట్టుకు పోలేదా? ఏదన్న పోతే బాగుచేయాలి. తొందరగా పనిచేసి రైతులకు నీళ్లియ్యాలి. అది చేయకుండా అంత చిల్లర రాజకీయం ఎందుకు? ఎవరికీ అధికారం శాశ్వతం కాదు. మేం మళ్లీ డబుల్ స్పీడ్‌తో అధికారంలోకి వస్తం. అప్పుడు నేను గిట్టనే మాట్లాడాలా? ఇకనైనా ప్రజల హక్కుల కోసం పనిచేయాలి. ఈరోజు నేను వచ్చింది రాజకీయాల కోసం కాదు. పార్లమెంటు ఎన్నికలకు రెండు మూడు నెలల సమయం ఉంది. నేను మీ బిడ్డను. 15 ఏళ్లు పోరాడి, చావునోట్లో తలపెట్టి ఈ తెలంగాణ తెచ్చింది నేను. అందుకే నాకు ఆరాటం ఉంటది. రాష్ట్రం నాశనం కావద్దనే తపన ఉంటది. దీన్ని అర్థం చేసుకోండి..' అని కేసీఆర్ అన్నారు.

మద్దతు ధర ఇస్తే బోనస్ ఇవ్వరట

'కొత్త ప్రభుత్వం వచ్చినపుడు గతంలో కంటే బాగా పనిచేయాలి. వాళ్లు వచ్చినప్పటి నుంచి ఒక్కటైన మంచి మాట అన్నరా. పొద్దున లేస్తే కేసీఆర్‌ను ఎట్లా తిట్టాలనే ఆలోచనే. కేసీఆర్‌ను తిడితే, బురద జల్లితే పెద్దోల్లవుతారా? అధికారం కోసం నోటికొచ్చిన అబద్ధాలు చెప్పారు. ఇప్పుడు మాట మార్చుతున్నారు. ధాన్యానికి మద్దతు ధర వస్తే రూ.500 బోనస్ ఇవ్వరట. దొంగ మాటలతో, నంగనాచి మాటలతో తప్పించుకుంటామంటే నడవదు బిడ్డా జాగ్రత్త. అధికారం ఉన్నా లేకున్నా తెలంగాణ ప్రజల పక్షాన పోరాడతాం..' అని కేసీఆర్ హెచ్చరించారు.

నల్లగొండను నాశనం చేసిందే నువ్వు

- కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి ధ్వజం
- పదేళ్లు ప్రాజెక్టులను పడావు పెట్టారు
- పార్లమెంటు ఎన్నికల కోసమే ఈ నాటకాలు



సాక్షి, హైదరాబాద్: నల్లగొండ జిల్లాను నాశనం చేసిందే కేసీఆర్ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'పదేళ్ల పాటు జిల్లాలోని ప్రాజెక్టులను పడావు పెట్టారు. కనీసం జిల్లా ప్రజల వైపు కన్నెత్తి చూడలేదు. ఇప్పుడు తన ఏజెంట్లతో కృష్ణా ప్రాజెక్టుల వివాదాన్ని రగిలించి ఆ మంటల్లో చలి కాచుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు..' అని ఆరోపించారు. నల్లగొండ సభలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంగళవారం ఒక ప్రకటనలో వెంకట్‌రెడ్డి మండిపడ్డారు. పార్లమెంటు ఎన్నికల కోసమే కేసీఆర్ నాటకాలని, నాలుగు రోజుల్లో తన ఇంటికి కలవడానికి వచ్చేంత జనమే కేసీఆర్ మీటింగ్‌కు వచ్చి ఉంటారని ఎద్దేవా చేశారు. పబ్లిక్ మీటింగ్‌లో మాట్లాడేటప్పుడు పరిణతితో మాట్లాడాలన్న విజ్ఞతను మరిచి కల్లు కాంపౌండ్ దగ్గర తాగుబోతు కంటే అధ్వానంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పిచ్చికూతలు కూస్తే చూస్తూ ఊరుకునేది లేదని, దెబ్బకు దెబ్బను ప్రజాస్వామ్యయుతంగా కొట్టి తీరతామని హెచ్చరించారు.

నల్లగొండ ప్రజల రక్తంలోనే ఉద్యమం

'నల్లగొండ బిడ్డ శ్రీకాంతాచారి త్యాగంతో తెలంగాణ వచ్చింది. శ్రీకాంతాచారి తల్లికి పదవి ఇస్తానని చెప్పి పదేళ్లు అవమానించాడు. నల్లగొండ సభలో ఏర్పాటు చేసిన బ్యానర్‌పై ఒక్క తెలంగాణ ఉద్యమకారుడి ఫొటో కూడా లేకుండా తన ఫొటో మాత్రమే పెట్టుకుని నియంతలా వ్యవహరించారు. నల్లగొండ ప్రజల రక్తంలోనే ఉద్యమం ఉంది. రాయలసీమను రతనాల సీమ చేస్తానని శపథం చేసిన సీమాంధ్ర సానుభూతి పరుడు కేసీఆర్. ఆయన అక్కడకే వెళ్లి ఆంధ్ర రాష్ట్ర సమితి అని పార్టీ పెట్టుకోవడం మంచిది.

అసెంబ్లీని వదిలి నల్లగొండకు ఎందుకు?

నేను రైతుబంధు రాలేదన్న బీఆర్ఎస్ నేతలను చెప్పుతో కొట్టాలంటే, ప్రజలను అన్నట్టుగా ఆపాదించారు. ఇది కేసీఆర్ బుద్ధికి నిదర్శనం. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే ఐదు నిమిషాల్లో చేరుకునే అసెంబ్లీని వదిలిపెట్టి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న నల్లగొండకు ఎందుకు వచ్చారు? మెదక్‌లో కేసీఆర్‌పై కాంగ్రెస్ పార్టీకి చెందిన సామాన్య కార్యకర్తను నిలబెట్టి గెలిపిస్తాం. దమ్ముంటే కేసీఆర్ గెలవాలి.' అని కోమటిరెడ్డి సవాల్ చేశారు.



ధ్యానాన్ని ప్రారంభించడానికి ముందు కావాల్సినవి:
ఇతరులతో పంచుకోగలిగే పెద్ద మనసును కలిగివుండటం,
గత చర్యల పట్ల నిరాకరణ లేదా పశ్చాత్తాపం లేకపోవడం.
– థానిస్సరో భిక్షు (బౌద్ధ ధర్మం)

సాక్షి
బుధవారం, 14 ఫిబ్రవరి 2024

దౌత్య విజయం

అధికారిక, అనధికారిక మార్గాల ద్వారా సాగించిన వివిధ దౌత్యయత్నాలు ఫలప్రదమయ్యాయి. భారత ప్రధానికీ, ఖతార్ అమీర్‌కూ మధ్య నిరుడు సాగిన సమావేశం ఫలించింది. మరణశిక్ష పడ్డ 8 మంది నౌకాదళ సీనియర్ సిబ్బందిని ఖతార్ ఎట్టకేలకు విడుదల చేసింది. వారిలో ఏడుగురు సోమవారం స్వదేశానికి చేరుకోగా, ఎనిమిదో వ్యక్తిని సైతం సాధ్యమైనంత త్వరగా భారత్ రప్పించే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఏణ్ణర్థం పైగా అక్కడి జైలులో మగ్గుతూ, మరణదండనతో మృత్యుముఖం దాకా వెళ్ళి, చివరకు అన్ని అభియోగాల నుంచి విముక్తమై వారు తిరిగి రావడం అసాధారణం. ఇది భారత దౌత్య విజయం. బుధవారం ఖతార్‌లో భారత ప్రధాని మోదీ పర్యటించనున్న వేళ వెలువడ్డ ఈ ప్రకటన విశేషమైనది. అంతర్జాతీయంగా మన దేశానికి పెరుగుతున్న ప్రాముఖ్యానికీ, అరబ్ దేశాలతో మనం నెరపుతున్న స్నేహసంబంధాల సాఫల్యానికీ ఇది ఓ మచ్చుతునక.

జరిగిన కథలోకి వెళితే, విడుదలైన ఈ 8 మంది భారత నౌకాదళ మాజీ సిబ్బంది ఇజ్రాయెల్ పక్షాన గూఢచర్యం చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు వినవచ్చాయి. అందులో నిజం లేదంటూ, వారిని విడుదల చేయాలని భారత్ ప్రయత్నిస్తూ వచ్చింది. గత ఏడాది కాలంగా భారత విదేశాంగ శాఖ అజెండాలో ఓ ప్రధానాంశం – ఈ నౌకాదళ మాజీ అధికారుల విడుదల. అందుకు తగ్గట్టే మంత్రిత్వ శాఖలో సంబంధిత విభాగం, అలాగే ఖతార్‌లోని భారత దౌత్య కార్యాలయం నిర్విరామంగా శ్రమించాయి. ప్రచారానికి దూరంగా తమ పని తాము చేస్తూ, చివరకు ఆశించిన ఫలితాన్ని సాధించాయి. విదేశాంగ శాఖ గల్ఫ్ డివిజన్‌కు మునుపు సారథ్యం వహించిన విపుల్ గత ఏడాది ఖతార్‌కు వెళ్ళి, ఆ దేశంలో భారత రాయబారిగా బాధ్యతలు చేపట్టడం సైతం కలిసొచ్చింది. ఆయన సంబంధిత వర్గాలన్నిటితో మాట్లాడి, ఒప్పించగలిగారు. అదే సమయంలో, జాతీయ భద్రతా సలహాదారైన అజిత్ దోవల్ సారథ్యంలోని జాతీయ భద్రతా మండలి సచివాలయం సైతం ఖతార్ రాజధాని దోహాలోని తన సన్నిహితులతో మంతనాలు సాగించింది. ఓర్పుగా, నేర్పుగా వ్యవహారం నడిపిస్తూ, మన మాజీ అధికారులు విడుదలై, తిరిగివచ్చేవరకు కథను గుట్టుగా నడిపించడం విశేషం.

అసలు ఈ వివాదం ఏణ్ణర్థం క్రితం మొదలైంది. 2022 ఆగస్ట్ 30న ఈ 8 మందిని అరెస్ట్ చేసి, ఏకాంతవాస శిక్ష విధించారు. ఖైదీలుగా ఉన్న మనవాళ్ళను ఆ ఏడాది అక్టోబర్ మొదట్లోనే భారత దౌత్య సిబ్బంది కలిశారు. నిజానికి, అరెస్టయినవారిలో అధికులు దహ్రా గ్లోబల్ అనే ఓ ప్రైవేట్ సంస్థకు పనిచేస్తూ వచ్చారు. ఖతారీ నౌకాదళంలో ఇటాలియన్ యూ212 రహస్య జలాంతర్గాముల్ని ప్రవేశపెట్టడంలో సాయపడేందుకు వారు ఖతార్‌కు వచ్చారన్నది కథనం. జైల్లో పడ్డ తమ సిబ్బందికి సాయం చేసేందుకు సదరు ప్రైవేట్ సంస్థ సీఈఓ సైతం ప్రయత్నించక పోలేదు. కానీ, ఆయనా జైల్లో పడి, రెండు నెలలు ఒంటరి చెరను అనుభవించి, అనంతరం జామీను మీద బయటపడాల్సి వచ్చింది. గడచిన 2023 మార్చి వచ్చేసరికి మన అధికారులు పెట్టుకున్న పలు జామీను అభ్యర్థనలు సైతం తిరస్కరణకు గురయ్యాయి. ఆ నెలాఖరున వారిపై ఖతార్ చట్టప్రకారం విచారణ మొదలైంది. చిత్రమేమంటే ఈ అధికారుల్లో ఒకరైన కెప్టెన్ నవ్‌తేజ్ గిల్ లాంటి వారు భారత నేవల్ అకాడెమీ నుంచి పట్టభద్రులైనప్పుడు తమ ప్రతిభా ప్రదర్శనకు ఏకంగా రాష్ట్రపతి స్వర్ణపతకం అందుకున్నారు. ప్రతిష్ఠాత్మక డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్‌లో బోధకుడిగా పనిచేశారు.

మొదట్లో గత అక్టోబర్‌లో ఈ నౌకాదళ మాజీ అధికారులందరికీ మరణ దండన విధించారు. ఆపైన మన దౌత్య యత్నాలు, భారత ప్రభుత్వ జోక్యం కారణంగా దాన్ని నిరవధిక జైలు శిక్షగా మార్చారు. బందీలుగా ఉన్న అధికారుల క్షేమం కోసం మన దేశం ఖతార్ అమీర్ కార్యాలయంతో సంప్రతింపులు సాగిస్తూ వచ్చింది. గత ఏడాది దుబాయ్‌లో 'కాప్–28' సదస్సు వేళ భారత ప్రధాని మోదీ, ఖతార్ అమీర్‌ను ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఇరు ప్రభుత్వాధినేతల స్నేహబంధం చివరకు పరిష్కారం చూపింది. మరోపక్క వీరు పనిచేసిన దహ్రా గ్లోబల్ సంస్థ నిరుడు మేలోనే దోహాలో తన కార్యకలాపాలకు స్వస్తి చెప్పింది. ఆ సంస్థలో అత్యధికులు భారతీయులే. వారు అప్పుడే భారత్‌కు తిరిగొచ్చేశారు. లెక్కచూస్తే, ఒక్క ఖతార్‌లోనే 8 లక్షల మంది భారతీయులు, 6 వేల భారతీయ కంపెనీలున్నాయి. రెండేళ్ళ క్రితమే ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 15.03 బిలియన్ డాలర్లుంది. ఇక, భారత్ చేసుకొనే ద్రవీభూత సహజవాయు (ఎల్ఎన్‌జీ) దిగుమతుల్లో 40 శాతం ఖతార్ నుంచే! వచ్చే 2048 దాకా ఆ దిగుమతుల కోసం 78 బిలియన్ డాలర్ల ఒప్పందాన్ని గత వారమే ఖతార్‌తో భారత్ కుదుర్చుకుంది. ఇవన్నీ ఇప్పుడు కలిసొచ్చాయి.

మొత్తం పశ్చిమాసియా సంగతికొస్తే 90 లక్షల మంది భారతీయులున్నారు. కొన్నేళ్ళుగా పశ్చిమాసియాలో, ప్రధానంగా సౌదీ అరేబియా, యూఏఈ, ఒమన్, కువైట్, ఖతార్‌ల వైపు భారత్ నిరంతరం స్నేహహస్తం చాస్తోంది. తాజా దౌత్య పరిష్కారం మన ఆ స్నేహానికి ఫలితం. పెరుగుతున్న భారత ప్రాబల్యానికి నిదర్శనం. ఈ ప్రాంత దేశాలన్నీ ఇంధన సరఫరాలో భారత్‌కు చిరకాలంగా సన్నిహితమైనా, విదేశాంగ విధానంలో పాకిస్తాన్ వైపు మొగ్గేవి. కొన్ని దశాబ్దాలుగా పాక్ అదృష్టం తలకిందులవడంతో, ఆర్థిక, భద్రతా అంశాల రీత్యా ఈ ప్రాంతంలో భారత్‌తో బలమైన సంబంధాలు అవసరమనే ఎరుక వాటికి కలిగింది. వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాంతంలో సమష్టి దౌత్య, భద్రతా లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని, భారత్‌ను అవి ఇప్పుడు విశ్వసనీయ మిత్రదేశంగా భావిస్తున్నాయి. నౌకాదళ అధికారుల విడుదలకు అదీ ఓ కారణమే. ఏమైనా ఇదే అదనుగా పశ్చిమాసియా దేశాలతో భారత్ దోస్తీ బలపడితే, మరిన్ని దౌత్య, వ్యూహాత్మక ప్రయోజనాలు తథ్యం.

స్త్రీ సాధికారతతోనే దేశ పురోగతి

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

ప్రపంచ వ్యాప్తంగా స్త్రీల రాజకీయ ఉన్నతి పెరుగుతున్నది. స్త్రీలలో వస్తున్న నిరంతర చైతన్యం, పెరుగుతున్న సానుకూల దృక్పథం, అంకిత భావం, పోరాట శక్తి వారిని మునుముందుకు నడిపిస్తున్నాయి. పార్లమెంటులో స్త్రీలు అధిక సంఖ్యలో ఉన్నప్పుడే వారి ప్రతిపాదనలు, హక్కులు నెరవేరతాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. స్త్రీ విద్యావంతురాలయితే ఆరోగ్యం, పరిసరాలు, సామాజిక ఘర్షణలన్నింటినీ చక్కగా అవగాహన చేసుకోగలుగుతుంది. స్త్రీలు తమ అస్తిత్వానికి సంబంధించి రాజీపడరు. వారు ఆత్మగౌరవ నిధులు. వారిలో జీవన ప్రతిభ ఎక్కువ. అందుకే వారు నాయకులుగా సులభంగా రాణించగలరు. అందుకే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో స్త్రీలకు గణనీయంగా స్థానాలు కేటాయించాలి.

స్త్రీ అత్యున్నతంగా విద్యావంతురాలైన కేరళ రాష్ట్రంలో సమాజ వికాసం గొప్పగా ఉంది. స్త్రీ విద్య తక్కువ వున్న రాజస్థాన్‌లో ఇంకా స్త్రీ పట్ల దురాచారాలు కొనసాగుతుండగా, కేరళ స్త్రీ ప్రపంచ ఎల్లలను తాకుతున్నది. కేరళలో ఇంగ్లీషు విద్యను కూడా స్త్రీలకు నేర్పగలిగారు. స్త్రీలకు ఏ భాష అయినా త్వరగా వస్తుంది. ఈ రోజున యాంకర్స్‌లో స్త్రీలు ప్రథమ స్థానంలో ఉన్నారు. ఇటీవల రిపబ్లిక్ డే పరేడ్‌లో జరిగిన విన్యాసాలలో అసమానమైన ప్రతిభా పాటవాలు వారు చూపారు. స్త్రీలు ఈ రోజు శాస్త్ర రంగంలో, సాంకేతిక రంగంలో, జ్ఞాన రంగంలో అత్యున్నత దశలో ఉండడానికి కారణం వారికి విద్యార్జన శక్తి అత్యుత్తమంగా ఉండటమే!



'నేను ఆలోచిస్తున్నాను కనుక నేను ఉన్నాను' అని ప్రముఖ తత్వవేత్త డెకార్ట్ అన్నట్లుగా... 'నేను బాధను అనుభవిస్తున్నాను, కాబట్టే నేను ఉన్నాను' అనుకొనే స్వభావం, బాధలో సౌఖ్యాన్ననుభవించే గుణం స్త్రీల స్వభావంలోనే ఉందనే నిందను స్త్రీవాదులు ఎదుర్కొన్నారు. నటాలీ షైన్ అనే న్యూయార్క్ మానసిక వైద్యురాలు చెప్పినట్లు, 'స్త్రీ మానసిక శాస్త్రం ఒక సమగ్ర దర్శనంగా రూపొందినప్పుడే స్త్రీకి ఉన్న అన్ని కోణాలు, అంతరాంతరాల్లో ఆమె ఆలోచన సమగ్రంగా దర్శితమవుతాయి.' స్త్రీలను సాహిత్యం, మనస్తత్వ శాస్త్రంతో పాటు మతం బలంగా పురుష పెత్తనం కిందికి నెట్టింది. అది హిందూమతంలోనే కాదు, అన్ని మతాల్లోను కొనసాగింది. స్త్రీ మానసికంగా బలహీనమైనదని చెబుతున్నవన్నీ అబద్ధాలు. ఆమె ఒక పని తీసుకుంటే ఆ పని పూర్తి అయ్యేవరకు నిదురపోదు. ప్రపంచంలో మానసిక తత్వవేత్తలు అందరూ ఇప్పుడు స్త్రీ ఆత్మ స్థైర్యం మీద సానుకూలంగా స్పందిస్తున్నారు. అందుకే ఆమె ఒక్కొక్క మెట్టు ఎదుగుతూ పోతున్నది. నిజానికి స్త్రీ ఒక తల్లిగా, ఒక చెల్లిగా కుటుంబ నిర్వహణ సామర్థ్యాన్ని కలిగి ఉండడమే కాదు... ఆమె రాజ్య, ప్రభుత్వ నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకుంటూ పోతున్నదని అర్థమవుతుంది.

ఈనాడే కాదు, స్వతంత్ర భావాలు కలిగిన స్త్రీలు ఆయా దేశాల్లో ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని ముందుకు వెళ్ళారు. క్లియో పాత్రా (ఈజిప్ట్), క్వీన్ ఎలిజబెత్ (బ్రిటన్), కేథరిన్ ది గ్రేట్ (రష్యా), మేడమ్ డె పాంపెడర్ (ఫ్రాన్స్), సిరిమావో బండారునాయకే (శ్రీలంక), మార్గరెట్ థాచర్ (బ్రిటన్), ఇవా పెరాన్(అర్జెంటీనా), గోల్డా మెయిర్ (ఇజ్రాయెల్) లాంటి నాయకురాళ్ళు పితృస్వామ్య వ్యవస్థలోనే రాజకీయ ఆధిపత్యాన్ని వహించగలిగారు.

ఇకపోతే 17వ లోక్‌సభలో స్త్రీల సంఖ్య పెరగడం గుణాత్మకమైన మార్పు అనక తప్పదు. యువకులు, విద్యావంతులైన నాయకులతో కూడిన సభగా 17వ లోక్‌సభ నిలిచింది. గతంలో కంటే లింగ నిష్పత్తి మెరుగైంది. లింగ నిష్పత్తిలో చాలా దేశాల కంటే వెనుకంజలో ఉన్నప్పటికీ మెరుగుదల కనిపించింది. మొదటిసారి ఎంపీలు దాదాపు సగం (260 మంది) ఉన్నారు. తిరిగి ఎన్నికైన ఎంపీల సంఖ్య కూడా పెరిగింది. 70 ఏళ్లు పైబడిన ఎంపీలు తగ్గి, 40 ఏళ్ళ కంటే తక్కువ వయస్సుగల ఎంపీలు పెరిగారు. ఎంపీల సగటు వయస్సు 54 ఏళ్లుగా ఉంది. తొలి లోక్‌సభలో 26 శాతం మంది యువ ఎంపీలు ఉంటే, 16వ లోక్‌సభ నాటికి 40 ఏళ్ల లోపు వారు 8 శాతం మందే ఉన్నారు. ఇప్పుడు 12 శాతానికి పెరిగింది. పిన్నవయస్సుగల సభ్యురాలిగా 25 ఏళ్లకు ఎంపీగా ఎన్నికైన బిజూ జనతా దళ్ నేత చంద్రాణి ముర్ము (ఒడిషా) నిలిచారు. వయోవృద్ధుడిగా ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాదీ ఎంపీ షఫీకుర్ రెహమాన్ బర్క్ (90) ఉన్నారు. పురుషుల కంటే తక్కువ వయస్సు గల మహిళా ఎంపీలు ఈ సభలో ఉన్నారు.

2019 ఎన్నికల్లో మహిళా అభ్యర్థులు 716 మంది ఉంటే, 78 మంది ఎన్నికయ్యారు. 2014లో 62 మంది మహిళా ఎంపీలు ఉన్నారు. అయితే చాలా దేశాల్లో మహిళా ఎంపీల శాతం ఎక్కువగా ఉంది. రువాండాలో 61 శాతంగా, దక్షిణాఫ్రికాలో 43 శాతంగా, బ్రిటన్‌లో 32 శాతంగా, అమెరికాలో 24 శాతంగా, బంగ్లాదేశ్‌లో 21 శాతంగా ఉంది. 17వ లోక్‌సభ ఎంపీల్లో 39 శాతం మంది తమ వృత్తిని రాజకీయాలు, సామాజిక సేవగా పేర్కొన్నారు. వ్యవసాయం చేస్తామని 38 శాతం మంది, వ్యాపారవేత్తలమని 23 శాతం మంది వెల్లడించారు.

ఇకపోతే స్త్రీలు తమ విద్యా సంపత్తితో పాటు రాజకీయ అవగాహనను కూడా పెంచుకోవాల్సి ఉంది. నిజానికి రాజ్యాంగంలో ఉన్న ప్రాథమిక హక్కులు, విధులు, ఆదేశిక సూత్రాలు అన్నీ స్త్రీ, పురుషుల సమానత్వాన్ని చాటి చెబుతున్నాయి. 2016లో నిర్వహించిన లింగ సమానత్వ సూచిలో 87వ ర్యాంక్ పొందిన ఇండియా... 2023 నాటికి 146 దేశాల్లో 144వ స్థానానికి పరిమితమయ్యింది. 2021 నాటికి దేశంలో కార్మికుల్లో స్త్రీల శాతం (19.2) మాత్రమే అని ప్రపంచ బ్యాంకు నివేదించింది. 2022–23కు 37 శాతానికి పెరిగినప్పటికీ, బంగ్లాదేశ్, చైనా లాంటి దేశాలతో పోలిస్తే బాగా వెనుకబడి ఉంది. చైనా ఇప్పుడు 61 శాతం స్త్రీ శ్రామిక శక్తిని కలిగింది. ఈ విష యాలన్నీ పార్లమెంటులో ఎత్తిచూపి నిలవేయాలంటే దళితులు ఎక్కువగా పార్లమెంటు, అసెంబ్లీ సభ్యులు కావలసి ఉంది. వ్యాపార రంగంలోనూ, విద్యా రంగంలోనూ, శాస్త్ర రంగంలోనూ, సాంకేతిక రంగంలోనూ స్త్రీలు మరింతగా ఎదగాలంటే రాజకీయరంగంలో స్త్రీల సంఖ్య పెరగాలి.

మరో పక్క మహిళలపై తీవ్రమైన దాడులు జరుగుతున్నాయి. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు పెరుగు తున్నాయి. వాస్తవంలో మహిళలపై దాష్టీకాల ఘటనలు అధిక సంఖ్యలో ఉంటాయనీ, చాలా వరకు అవి బయటకు రావనీ పరిశీలనలు చెబుతున్నాయి. అసంఘటితరంగంలో ఈ వేధింపులు మరింత అధికంగా ఉంటాయని అధ్యయ నాలు వెల్లడిస్తున్నాయి. ఒక్క పని ప్రదేశం అని ఏముంది... ఆర్టీసీ బస్సులు, వ్యాపార సముదాయాలు, రహదారులు, ఇలా అన్ని చోట్లా మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారు. పనిచేసే చోట ఇలాంటి అకృత్యాలకు గురయ్యే మహిళల్లో దాదాపు 69 శాతం మంది బయటకు చెప్పుకోవడానికి సైతం సంకోచిస్తున్నారని 'ఉమెన్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ' సర్వే వెల్లడించింది. న్యాయం జరుగుతుందన్న నమ్మకం కొరవడటం, వృత్తిపర మైన ఎదుగుదలకు అవరోధంగా మారుతుందన్న భయంతో బాధిత మహిళల్లో చాలామంది ఫిర్యాదు చేయడానికి వెనకంజ వేస్తున్నారు. ఉద్యోగం మాన్పించేస్తారన్న భయంతో చాలామంది కుటుంబ సభ్యులకు సైతం చెప్పుకోవడం లేదు.

ఇకపోతే పురుషుల మానసిక వ్యవస్థలలో వస్తున్న వికృతమయిన మార్పులవల్ల బాలికలపై కూడా దాడులు పెరుగుతున్నాయి. 11, 12 సంవత్సరాల బాలికలపై దాడులు జరుగుతున్న ప్రాంతాలలో ముంబయి, అమృత్‌సర్, వడోదరా, అహ్మదాబాద్, మీరట్ ముందు వరుసలో ఉన్నాయి. చివరకు తండ్రే కూతురిని వేధించే అసహ్యకరమైన కేసులు కూడా బయటకు వస్తున్నాయి. ఈ పరిస్థితులలో రాజ్యాధికారంలో స్త్రీల సంఖ్య గణనీయంగా పెరగాల్సిన చారిత్రక అవసరం ముందుకు వచ్చింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించిన కేంద్ర బడ్జెట్‌లో స్త్రీల విద్య, సామాజిక, ఆర్థిక, ఆరోగ్య అభివృద్ధికి తగిన నిధులు కేటాయించలేదని మహిళా ఎంపీలు చైతన్యవంతంగా మాట్లాడుతున్నారు. ఇది శుభ పరిణామం. స్త్రీ సాధికారత జాతీయ పురోగతికి తోడ్పడుతుంది. కరుణ, ప్రేమ, ప్రజ్ఞల విస్తృతికి తోడ్పడుతుంది. ఆ దిశగా మనమందరం నడుద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు । 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

స్ఫూర్తి ప్రదాత



'భారత కోకిల' సరోజినీ నాయుడు జయంతి (13 ఫిబ్రవరి) సందర్భంగా వినమ్ర నివాళులు. కవయిత్రి, మహిళా హక్కుల కార్యకర్త, స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సరోజిని... దేశ నిర్మాణానికి చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిని ఇస్తూనే ఉంటుంది.

– నవీన్ పట్నాయక్, ఒడిశా ముఖ్యమంత్రి

అదే 'జీ'వితమా?



జీ (జె.ఇ.ఇ.) ఫలితాలు వెలువడి, తన ఐఐటీ కలను నిజం చేసుకోలేకపోయిన మరొక కోట(రాజస్థాన్) హాస్టల్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. మంచి భవిష్యత్తు ఉన్న ఎంతోమంది యువకులు ఇలా నిస్పృహ చెందటం హృదయ విదారకం. తమ పిల్లలను ఇక్కడకు పంపే ముందే తల్లితండ్రులు వారికి మంచి మాటలు చెప్పి, మానసిక స్థైర్యం ఇవ్వడం అవసరం.

– గార్గీ రావత్, న్యూస్ యాంకర్

అన్నదాత పైనా?



రైతులు దేశం కోసం పంట నాట్లు వేస్తారు; కానీ దేశ ప్రధాని రైతుల కోసం మేకులు నాటించి, ముళ్ల కంచెలు వేయిస్తున్నారు! తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం వేలాదిగా రైతులు ఢిల్లీ వరకు రాక తప్పని దుస్థితిని కల్పించడమే కాక, వారిని బాష్పవాయు గోళాలతో చెదరగొట్టించారు.

– ఐశ్వర్యా చౌధరి, సామాజిక కార్యకర్త

రుజువైంది కదా!



అమెరికా గూఢచార సంస్థ 'సీఐఏ'కు లడ్డూలా దొరికిన ఖలిస్తాన్ తీవ్రవాది గుర్పత్‌వంత్ సింగ్ పన్నూ ఫిబ్రవరి 13న ఢిల్లీలో రైతు నిరసనలను చూపించే ఒక వీడియోను అమెరికా నుంచి విడుదల చేశారు. రైతుల ప్రదర్శనల వెనుక కాంగ్రెస్, కేజ్రీవాల్ వంటి భారత వ్యతిరేక శక్తులు ఉన్నాయని చెప్పటానికి ఇంతకంటే రుజువు అక్కర్లేదు.

– సంజయ్ రాణా, పొలిటికల్ ఎనలిస్ట్

అట్నుంచి రండి



నిజంగా మీరు స్టార్టప్ ని ప్రారంభించాలను కుంటే, మొదట వాస్తవ ప్రపంచంలోకి వెళ్లి ప్రజల కోసం ఏదో ఒక పని చేయడం మొదలు పెట్టండి. అక్కడ కొంత డబ్బు సంపాదించిన తర్వాత మీ వ్యాపారాన్ని నిర్మించుకోండి.

– నిక్ హ్యూబర్, ఆంట్రప్రెన్యూర్

ఇన్ బాక్స్

యాంగ్రీ సెక్యులరిస్టు కథకుడు

మరాఠీ రచయిత హమీద్ దల్వాయి 1932–77 మధ్య 44 ఏళ్లు మాత్రమే బతికాడు. జ్యోతి బా పూలే స్ఫూర్తితో 'ముస్లిం సత్య శోధక్ మండలి' స్థాపించాడు. ఆయన 1950 ప్రాంతంలో ప్రతిపాదించిన ట్రిపుల్ తలాక్ రద్దు, మత విద్యకు బదులు ప్రగతిశీల విద్య, ఉమ్మడి పౌర స్మృతి వంటివి ఇప్పుడు రాజకీయాల్లో ప్రచార అస్త్రాలుగా మారాయంటే ఆశ్చర్యం కలుగుతుంది.

నిజానికి ముస్లిముల్లో హమీద్‌కు 'హిందూ వాది' అని పేరుంది. రాజా రామ్మోహన్ రాయ్ వంటి వాళ్ల పుణ్యమాని హిందూ మతం అనేక మూఢనమ్మకాలను వదులుకుని ముందుకు వెళ్తోంది. ముస్లిం సమాజం కూడా అలా ముందుకు వెళ్లాలనేది హమీద్ ఆలోచన. 'ముస్లిం పాలిటిక్స్ ఇన్ సెక్యులర్ ఇండియా' (1968) పుస్తకం రాశాడు. ముస్లిములు తమను తాము మరింత ఉదారంగా మార్చుకోవడం ద్వారా మాత్రమే ఈ దేశంలో హిందూ అతివాదాన్ని ఎదుర్కోవచ్చు అని ప్రతిపాదించాడు. అలా అని హిందూమత వాదులను వెనకేసుకుని వచ్చాడా... అంటే లేదు. గోవధ నిషేధ ఆలోచనను వ్యతిరేకించాడు. ఆర్ఎస్ఎస్ నేత గోల్వాల్కర్ గురూజీ చనిపోయినప్పుడు (1973) సంతాప సభకు వెళ్లి, మనుస్మృతికి వ్యతిరేకంగా మాట్లాడి వచ్చాడని 'హమీద్ ది అన్‌సంగ్ హ్యూమనిస్ట్' (2020) డాక్యుమెంటరీ చెబుతోంది.



హమీద్ దల్వాయి

'నిన్ను నీవు ముస్లింగా అంగీకరిస్తావా?' అని విలేఖరి అడిగిన ప్రశ్నకు, 'తప్పకుండా అంగీకరిస్తాను. నెహ్రూ ఏ విధంగా నాస్తికుడైనప్పటికీ హిందువు అవుతాడో, నేను కూడా నమాజు, ఉపవాస దీక్షలు పాటించనప్పటికీ పుట్టుకతో ముస్లిం అవుతాను' అంటాడు. 'కులాంతర, మతాంతర వివాహాలకు సమాజంలో ఆంక్షలు ఉండకూడదు' అంటాడు. 'దేశంలో జరుగుతున్న మత హింసకు ఎవరిది బాధ్యత?' అని అడిగితే 'హిందువులు, ముస్లిములు ఇద్దరిదీ' అంటాడు. వాజ్‌పేయి ఏకంగా 'హమీద్ దల్వాయి వంటి సంఘ సంస్కర్త ఒకరు హిందువులకు కూడా కావాలి' అన్నాడంటే ఆయన ప్రభావం ఎంతగా ఉండిందో అర్థం చేసుకోవచ్చు.

రామచంద్ర గుహ 'మేకర్స్ ఆఫ్ మోడర్న్ ఇండియా' (2010) పుస్తకంలో హమీద్ 'భారతదేశపు చిట్టచివరి సంఘ సంస్కర్త' అన్నాడు. హమీద్‌కు 'ది యాంగ్రీ యంగ్ సెక్యులరిస్టు' అని పేరు. ఉర్దూ భాషను మతపరం చేయడాన్ని ఆయన నిరసించాడు. సమకాలీకులంతా ఉర్దూలో సాహిత్య సృజన చేస్తుంటే మరాఠీలోనే రచనలు చేశాడు. 'హమీద్ దల్వాయి కథలు' పుస్తకాన్ని తెలుగులోకి ఓల్గా అనువదిస్తే, ఎలమీ ప్రచురణల వారు ప్రచురించారు. జర్నలిస్టు, యాక్టివిస్టు, మానవతావాది, సంఘ సంస్కర్తే కాకుండా కథకుడుగా కూడా హమీద్ గట్టివాడు. 1950 నాటి వాతావరణ పరిస్థితులను కళ్లకు కట్టినట్టు రాశాడు. వ్యక్తిగతంగా రచయితలు ఏ సిద్ధాంతాన్ని నమ్మినప్పటికీ సృజన దగ్గరికి వచ్చేసరికి ఎంత నిర్మమకారంగా ఉండాలో ఈ కథలు చెబుతాయి.

– వేంపల్లె షరీఫ్ । జర్నలిస్టు, కథా రచయిత

(నేడు హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో 'హమీద్ దల్వాయి కథలు' ఆవిష్కరణ)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

అదరహో రంగస్థల మహోత్సవ్

కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా' (ఎన్ఎస్‌డీ, న్యూఢిల్లీ) వారు దేశవ్యాప్తంగా 'భారత్ రంగస్థల మహోత్సవ్' జరుపుతున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 1 – 21 తేదీల మధ్య వంద అంతర్జాతీయ బహుభాషా నాటకాలను 15 నగరాల్లో ప్రదర్శిస్తున్నారు. విజయవాడలోనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సహకారంతో ఫిబ్రవరి 6 నుంచి 11 వరకూ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నాటకోత్సవాలను జయప్రదంగా నిర్వహించారు. నాటకాభిమానులు రోజూ పెద్ద సంఖ్యలో విచ్చేసి నాటకాల్ని ఆనందించారు. ఆ యా సమాజాల ప్రెజెంటేషన్, స్టేజీ, లైటింగ్, మ్యూజిక్ తదితరాలు ప్రేక్షకుల్ని మంత్ర ముగ్ధుల్ని చేశాయంటే ఈషణ్మాత్రం అతిశయోక్తి కాదు. కళాకారులు, తెర వెనుక సిబ్బంది అత్యద్భుత సమన్వయంతో ప్రదర్శనలు ఆసాంతం రక్తిగట్టాయి. గంటన్నర పైగా సాగిన ప్రతి ప్రదర్శన అనంతరం ప్రేక్షకుల సందేహ నివృత్తికి దర్శకుడి లేదా ప్రధాన పాత్రధారి ఇంటరాక్షన్ ఆసక్తిగా, ఉపయుక్తంగా సాగింది.

మొదటి రోజు... ఎన్ఎస్‌డీ రిపర్టరీ కంపెనీ వారు 'మాయీ రీ మై కాసే కహూ' హిందీ నాటకాన్ని ప్రదర్శించారు. మహిళ తన భావోద్వేగాలు, కోరికలు, సామాజిక కట్టుబాట్ల మధ్య పడే అంతర్మథనమే ఇతివృత్తం. విజయదాన్ దేథా రచన 'దువిధ' కథ ఆధారంగా రూపొందిన ఈ నాటకాన్ని అజయ్ కుమార్ దర్శక ప్రతిభతో కళాకారులు వీధినాటకం ప్రక్రియలో రక్తిగట్టించారు.

రెండో రోజు... శివానంద రచన, దర్శకత్వంలో శ్రీ ఇడగుంజీ మహాగణపతి యక్షగాన మండలి, కెరెమనె, కర్ణాటక వారు 'గదా యుద్ధ' నాటకాన్ని యక్షగాన రూపంలో అద్భుతంగా పండించారు. కురుక్షేత్ర యుద్ధానంతరం ద్వైపాయన సరస్సులో దాక్కున్న దుర్యోధనుడిని కవ్వించి, వెలికి రప్పించి, గదా యుద్ధంలో భీముడు వధించడం ప్రధాన ఇతివృత్తం.

మూడో రోజు... మోనోలిత్ థియేటర్ గ్రూప్, మహారాష్ట్ర వారు 'ఎండ్ గేమ్' ఆంగ్ల నాటకాన్ని ప్రదర్శించారు. నలుగురే నటులు. ఇద్దరు సమాధుల్లో ఉంటారు; మిగిలినవారిలో ఒకరు కుంటి, మరొకరు గుడ్డి. ప్రపంచ యుద్ధానంతరం సర్వం కోల్పోయిన నేపథ్యంలో మరణం తప్ప మరింక దేనికీ ఎదురుచూడని ఓ కుటుంబ నిస్సహాయ స్థితిని చాటిన ఈ అసంబద్ధ (అబ్సర్డ్) విషాద ఏకాంక నాటకాన్ని నోబెల్ బహుమతి గ్రహీత శామ్యూల్ బెకెట్ రచించారు. డైరెక్టర్ సోనూ పిలానియా.





'గదా యుద్ధ', 'ఎండ్ గేమ్' నాటకాలలోని దృశ్యాలు

నాలుగో రోజు... బోతలా పెర్ఫార్మెన్స్ స్పేస్, బంగ్లాదేశ్ వారు మహమ్మద్ అలీ దర్శకత్వంలో ప్రదర్శించిన 'ఖోనా' ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. కప్పల పెళ్లి, రైతు – నాగలి, కోలాటం ఇత్యాది సన్నివేశాలు మన నాటకాల్లోని సన్నివేశాలతో పోలి రసస్ఫూర్తిని కలిగించాయి. కళాకారులు పాత్రల్లో ఒదిగిపోయి రక్తి కట్టించారు.

ఐదో రోజు... రంగ్ విదూషక్, భోపాల్, మధ్యప్రదేశ్ వారు 'కహాన్ కబీర్' హిందీ నాటకాన్ని ప్రదర్శించారు. కబీర్ శ్లోకాల ఆధారంగా రూపొందిన ఈ నాటకంలో కబీర్‌ను సాధువుగా కాక సాంఘిక దురాచారాలను నిరసించిన అభ్యుదయ, చైతన్యమూర్తిగా చూస్తాం. సువిశాల రంగస్థలాన్ని ఆద్యంతం సమతూకంగా వినియోగించుకోవడంలో బన్సీ కౌల్ దర్శకత్వ ప్రతిభను ప్రశంసించి తీరాల్సిందే.

ఆఖరి రోజు... ఇండియన్ థియేటర్ ఫౌండేషన్, మైసూర్, కర్ణాటక వారి 'అయోధ్య కాండ' కన్నడ నాటకం రచయిత ప్రసన్న స్వీయ దర్శకత్వంలో హృద్యంగా ప్రదర్శితమైంది. రంగస్థలంపై ఏ విధమైన సెట్స్, పరికరాలు లేవు. మధ్యలో చిన్న స్టూల్ మాత్రం ఉంచారు. నటనలో పర్ఫెక్షన్ కనబడింది. ముఖ్యంగా మంథర, దశరథ మహారాజు, కైకేయి పాత్రధారుల్ని ప్రత్యేకంగా ప్రస్తావించాలి. రామాయణం ద్వారా నాగరికతను పునఃప్రతిష్ఠిద్దామని ప్రతిపాదించడాన్ని ఇందులో చూస్తాం. ముగింపు ఉత్సవంలో ప్రదర్శనలిచ్చిన వారితో పాటు స్థానిక సీనియర్ కళాకారుల్ని సైతం ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ వారు సన్మానించారు. మొత్తమ్మీద ఆరు రోజులూ విభిన్నంగా ప్రదర్శించిన నాటకాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

– జీ.వి. రంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్

తపః కాలం

క్రీస్తు పుట్టిందానికీ, బోధలకూ, అద్భుతాలకూ ఎంతటి ప్రత్యేకత ఉందో, మరణించి తిరిగి లేచిందానికీ మరంతటి ప్రాధాన్యం ఉంది. ఈ రెండు సంఘటనలూ, ఆయన ఔన్నత్యాన్ని చాటేవి. కానీ ఆయన లోంచి మానవునికి అందే సందేశ సందర్భం మరొకటి విశేషంగా కనిపిస్తోంది. అది ఆయన మరణ ఘడియలకు సంబంధించింది. క్రైస్తవులు క్రీస్తు మరణానికి దారితీసిన పరిస్థితుల్ని స్మరించుకొంటారు. అలా చేయడం వల్ల మానవ ప్రవర్తన మారడానికి కారణమవుతుంది. 'ప్రభువు నా కోసం మరణించాడా? ఎందుకు?' అనే చింతన మొదలై, సాటి మానవుల్ని హింసించకుండా ప్రేమతో ప్రవర్తించాలన్న సామాజిక నైతిక ప్రవర్తన అలవడుతుంది. ఈ శ్రమ లను 'భస్మ బుధవారం' నుంచి ప్రారంభిస్తారు. చేసిన పాపాలకు పశ్చాత్తాపపడటం, గత దోషాలు సరిదిద్దుకోవటం, ఇకపై చేయనని దేవుని దగ్గర మాట తీసుకోవటం ... ఇందులోని ప్రధానాంశాలు.



భస్మ బుధవారం నుంచే ఉపవాస ఘడియలూ ప్రారంభమవుతాయి. వీటిని 'శ్రమ దినాల'ని అంటారు. వీటిని 44 రోజుల పాటు పాటిస్తారు. మానవ దేహంలో వెలిగే జ్యోతి ఆరిపోతే ఆ దేహం శూన్యమై పోతుందనీ, భస్మమై మిగిలిపోతుందనీ, ఇంత ప్రక్రియ జరిగే ఈ 'భస్మం' ఓసారి స్మరించబడాలనీ 'భస్మ బుధవారా'న్ని పాటిస్తారు. పుట్టిన ప్రతీ వ్యక్తీ భౌతికంగా మృత్యు ముఖం చూడాల్సిందే. అందుకే తాను బ్రతికున్న సమయంలోనే నిత్యజీవనానికి సోపానాలు నిర్మించుకోవాలి. ఈ నేపథ్యంలో క్రైస్తవ సంస్కృతి ప్రభు శ్రమల్ని స్మరించుకుంటోంది. 'మన కోసం మరణించిన క్రీస్తుకు మనం ఏం చేస్తున్నాం?' అని ప్రశ్నించుకొంటోంది. ఆయన మరణం ముందు మన సమస్యలు గానీ, తగిలిన ఎదురుదెబ్బలు గానీ పెద్ద లెక్క కాదనే అంశాన్ని గుర్తెరిగి, 'శ్రమదినా'ల్ని పాటిస్తారు. ఇవి 'గుడ్ ఫ్రైడే'(క్రీస్తు మరణం) వరకూ కొనసాగుతాయి. క్రీస్తు కోసం పంచేంద్రియ సుఖ సౌఖ్యాలకు ఈ కాలంలో దూరంగా ఉండాలి. అందుకే ఈ శ్రమ దినాల్నే రోమన్ కతోలికులు తపఃకాలం అంటారు.

– డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు

(నేడు భస్మ బుధవారం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.పంచమి సా.6.17 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: రేవతి సా.4.38 వరకు, తదుపరి అశ్వని, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ప.2.21 నుండి 3.50 వరకు, అమృత ఘడియలు: ఉ.11.10 నుండి 12.41 వరకు, మదనపంచమి, శ్రీపంచమి; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 6.32, సూర్యాస్తమయం: 5.57.

16న 'ధరణి'పై ప్రాథమిక నివేదిక?

- రెవెన్యూ మంత్రి పొంగులేటికి ఇవ్వనున్న కమిటీ సభ్యులు
- 23 లక్షల ఎకరాల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి పలు సిఫారసులు



సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీ ప్రాథమిక నివేదిక సిద్ధమైనట్లు తెలిసింది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం ఈ నెల 16న కమిటీ సభ్యులు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి నివేదికను ఇవ్వనున్నట్టు సమాచారం. ముఖ్యంగా ధరణి పోర్టల్‌లో 23 లక్షల ఎకరాలకు సంబంధించి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం కోసం తక్షణమే తీసుకోవాల్సిన చర్యల గురించి నివేదికలో పొందుపర్చనున్నారు. నివేదిక అనంతరం క్షేత్రస్థాయి అవగాహన కోసం జిల్లాలకు వెళ్లి రైతులు, ఇతర భాగస్వామ్యపక్షాలను కలిసి ధరణి పోర్టల్ ద్వారా ఎదురవుతున్న సమస్యలపై కమిటీ అధ్యయనం చేయనుంది. అవసరమైతే పొరుగు రాష్ట్రాలకు వెళ్లి అధ్యయనం చేయాలని కూడా కమిటీ భావిస్తోంది. ఈ అధ్యయనం తర్వాతే పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి సమర్పించే యోచనలో కమిటీ ఉన్నట్టు తెలుస్తోంది. ధరణి చట్టసవరణ లాంటి కీలక అంశాలను పూర్తిస్థాయి నివేదికలో ప్రతిపాదించాలని కమిటీసభ్యులు భావిస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతోనే పల్లెల ప్రగతి

కేంద్ర టెలికాం శాఖ సహాయ మంత్రి దేవ్‌సిన్హా చౌహాన్



మోమిన్‌పేట మండలం చీమల్‌దరిలో మాట్లాడుతున్న కేంద్ర టెలికాం సహాయ మంత్రి దేవ్‌సిన్హా చౌహాన్

మోమిన్‌పేట: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోనే పల్లెల ప్రగతి సాధ్యమని కేంద్ర టెలికాం శాఖ సహాయ మంత్రి దేవ్‌సిన్హా చౌహాన్ అన్నారు. బీఎస్ఎన్ఎల్ తెలంగాణ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ చాగంటి శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం ఆయన చీమల్‌దరిని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుపరిపాలన (గుడ్ గవర్నెన్స్) విభాగంలో జాతీయ ఉత్తమ పంచాయతీగా అవార్డు పొందిన ఈగ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. బీఎస్ఎన్ఎల్ ద్వారా గ్రామంలో ఉచిత వైఫై (4జీ సేవలు) అందిస్తున్న తీరును అభినందించారు. పన్నుల వసూలు, రికార్డుల నిర్వహణతో పాటు జీపీలో నిర్వహించే ప్రతీ పనిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ.. చీమల్‌దరిని డిజిటల్ మయం చేసిన మాజీ సర్పంచ్ నాసన్‌పల్లి నర్సింహారెడ్డి కృషి అభినందనీయమని కొనియాడారు. రూ.30 లక్షలతో టవర్ ఏర్పాటు చేసుకొని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌తో వ్యాపార లావాదేవీలు సాగించడం గొప్ప విషయమన్నారు. వ్యవసాయ రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు బీఎస్ఎన్ఎల్ తోడ్పాటునందిస్తుందని దేవ్‌సిన్హా తెలిపారు. గ్రామ పరిధిలో ఇస్తున్న నెట్ కనెక్షన్ల ద్వారా వచ్చే ఆదాయంలో 50 శాతం పంచాయతీకి అందుతోందన్నారు. నూతనంగా చీమల్‌దరికి ప్రభుత్వం ఆధార్ కేంద్రం మంజూరు చేసిందని, ఇకనుంచి అన్ని రకాల ప్రభుత్వ సేవలు స్థానికంగా అందుబాటులోకి వస్తాయని ఆయన వెల్లడించారు. చీమల్‌దరిలో వంద శాతం భూగర్భ మురుగు కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణంతో సంపూర్ణ స్వచ్ఛత సంతరించుకుందని కితాబిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్డీఓ విజయకుమారి, వైస్ ఎంపీపీ మానస, బీఎస్ఎన్ఎల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ధరణి'లో నమోదుకు రూ.40 లక్షలు

ఇదీ శామీర్‌పేట తహసీల్దార్ నిర్వాకం

- ఏడాది క్రితమే రూ.10 లక్షల నగదు, రూ.20 లక్షలకు చెక్కు
- తాజాగా రూ.10 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి దొరికిన తహసీల్దార్ డ్రైవర్



ఏసీబీకి పట్టుబడ్డ తహసీల్దార్ సత్యనారాయణ, ఆయన డ్రైవర్ బద్రి

శామీర్‌పేట్: ధరణి పోర్టల్‌లో భూ వివరాల నమోదుకు రూ. 40 లక్షలు డిమాండ్ చేసిన ఓ తహసీల్దార్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీఖాన్ తెలిపిన వివరాల ప్రకారం ..సిటీకి చెందిన రామశేషగిరిరావు శామీర్‌పేట మండల పరిధిలోని లాల్‌గడీ మలక్‌పేట్‌లో 2006లో భూమి కొనుగోలు చేశాడు. ఆ భూమిని ధరణిలో నమోదు చేయడానికి సంవత్సరం క్రితం తహసీల్దార్ సత్యనారాయణను సంప్రదించగా, రూ.40 లక్షలు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే గతంలో రామశేషగిరిరావు రూ.10లక్షలు ఇచ్చి, మరో 20లక్షల చెక్కు ఇచ్చాడు. తాజాగా మిగతా సొమ్ము రూ.10లక్షలు మంగళవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సత్యనారాయణ డ్రైవర్ బద్రికి ఇస్తుండగా, అధికారులు వల పన్ని పట్టుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తాము దాడులు చేశామని ఏసీబీ అధికారులు తెలిపారు. తహసీల్దార్ సత్యనారాయణ నివాసముంటున్న తూంకుంటలోనూ ఏసీబీ అధికారులు మరిన్ని సోదాలు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు మల్లికార్జున్, పురంధర్‌భట్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లోనూ సోదాలు

కరీంనగర్‌క్రైం: ఏసీబీ డీఎస్పీ భద్రయ్య ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కరీంనగర్ విద్యానగర్‌లోని తోడేటి సత్యనారాయణ నివాసంలో సోదాలు నిర్వహించారు. జిల్లాలోని పూడూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో సత్యనారాయణ భార్య రేణుక టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆమెను కూడా ఏసీబీ పోలీసులు విచారించి పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

ఏడాది నుంచి తిరుగుతున్నా...



బాధితుడు రామశేషగిరిరావు

ధరణి పోర్టల్‌లో భూవివరాల నమోదుకు ఏడాది నుంచి తహసీల్దార్ చుట్టూ తిరుగుతున్నా ఆయన పని చేయలేదని బాధితుడు రామశేషగిరిరావు తెలిపారు. లాల్‌గడీ మలక్‌పేట్‌లో 2006 సంవత్సరంలో తాను 29 ఎకరాల భూమి కొనుగోలు చేశానని, ఆ భూమిని ధరణిలో నమోదు చేయడానికి రూ.40 లక్షలు డిమాండ్ చేశాడని తెలిపారు. తాను ఇంతకుముందు రూ.10 లక్షలు నగదు రూపంలో, 20 లక్షలు చెక్కురూపంలో చెల్లించానని చెప్పారు. 30 లక్షలు ఇచ్చినా తన పని కాకపోవడంతో విసిగిపోయి ఏసీబీని ఆశ్రయించానని చెప్పారు.

చేతబడి నెపంతో తల్లీకొడుకుల హత్య

- పట్టపగలే నడిరోడ్డుపై ఇనుపరాడ్డుతో కొట్టిచంపిన బంధువు
- మహబూబాబాద్ జిల్లాలో దారుణం



సమ్మక్క, సమ్మయ్య (ఫైల్) నిందితుడు కుమారస్వామి

గూడూరు: మంత్రాలతో చేతబడులు చేస్తున్నారనే నెపంతో పట్టపగలే తల్లీకొడుకులను స్వయానా వారి బంధువే దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. వివరాలిలా.. గూడూరు మండలం బొల్లెపల్లికి చెందిన ఆలకుంట సమ్మక్క (55), కొమురయ్య దంపతులకు కుమారుడు సమ్మయ్య (32) ఉన్నాడు. సమ్మయ్య దివ్యాంగుడు. వరంగల్‌లో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా అదే గ్రామానికి చెందిన వారికి బంధువైన శివరాత్రి కుమారస్వామి తన కుటుంబానికి హాని కలిగించేలా సమ్మయ్య, సమ్మక్క మంత్రాలు, పూజలు చేస్తున్నారని, వారితో తనకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై రాణాప్రతాప్ ఇరువురినీ పిలిపించి మాట్లాడారు. మంగళవారం పెద్దల సమక్షంలో మరోసారి మాట్లాడుకుంటామని చెప్పి వెళ్లారు. అనుకున్న ప్రకారం.. మంగళవారం సమ్మక్క కుటుంబసభ్యులు స్టేషన్‌కు వచ్చారు. ఫిర్యాదుదారుడు కుమారస్వామి రాకపోవడంతో పోలీసులు అతనికి ఫోన్ చేయగా తనకు వేరే పని ఉందని, మరోరోజు మాట్లాడుకుంటామని చెప్పాడు. దీంతో పోలీసులు సమ్మక్క కుటుంబ సభ్యులను ఇంటికి వెళ్లమని చెప్పారు.

పోలీసులు పిలిచినా రాకుండా.. మాటు వేసి

పోలీస్‌స్టేషన్ నుంచి సమ్మక్క కుటుంబసభ్యులు ఆటోలో ఇంటికి వెళ్తుండగా.. అప్పటికే కాపుకాసిన కుమారస్వామి మరోవైపు నుంచి ఆటోలో వచ్చి అడ్డుగా పెట్టాడు. తన ఆటోలోని ఇనుపరాడ్డును తీసుకొని అందరూ చూస్తుండగానే ముందుగా సమ్మక్క తలపై బలంగా కొట్టాడు. ఆమె తల పగిలి కిందపడగా, భర్త కొమురయ్య ఆడ్డుకోబోగా అతన్ని కూడా రాడ్‌తో కొట్టడంతో అతని చేయి విరిగి పడిపోయాడు. వికలాంగుడైన సమ్మయ్య అడ్డురాగా అతని తలపై రాడ్‌తో బాదాడు. అందరూ చూస్తుండగా అక్కడికక్కడే తల్లీకొడుకులు రక్తపు మడుగులో చనిపోయారు. స్థానికులు, సమీప వ్యాపారస్తులు ఘటనాస్థలంలోనే కుమారస్వామిని బంధించి పోలీసులకు అప్పగించారు. మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తరలించే ప్రయత్నం చేయగా, అక్కడికి చేరుకున్న వారి కుటుంబ సభ్యులు, బంధువులు అడ్డుకున్నారు. హత్యలకు కారణం పోలీసులేనంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పడంతో ఎట్టకేలకు ఆందోళనకారులు శాంతించారు. మృతుడు సమ్మయ్య భార్య రజిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, నిందితుడి భార్యకు ఆరోగ్యం బాగాలేకపోవడానికి సమ్మక్క కుటుంబం చేస్తున్న పూజలే కారణమని కొంతకాలంగా ఆ కుటుంబంపై వైరం పెంచుకున్నట్లు స్థానికులు తెలిపారు.

డిప్యూటీ సీఎం భట్టి సోదరుడు వెంకటేశ్వర్లు మృతి

అనారోగ్యంతో కన్నుమూత



వెంకటేశ్వర్లు (ఫైల్)

వైరా: రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇంట విషాదం నెలకొంది. ఆయన సోదరుడు మల్లు వెంకటేశ్వర్లు (70) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. హోమియో ఎండీ చదివిన వెంకటేశ్వర్లు ఆయుష్ శాఖలో ప్రొఫెసర్‌గా, అడిషనల్ డైరెక్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ తర్వాత వైరాలోని స్వగృహంలో హోమియో వైద్యశాల నిర్వహిస్తున్నారు. మూడు నెలలుగా కాలేయ సంబంధ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, ఆరోగ్యం క్షీణించి మంగళవారం ఉదయం 6గంటలకు తుదిశ్వాస విడిచారు. వెంకటేశ్వర్లు అంత్యక్రియలు బుధవారం సాయంత్రం స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో నిర్వహించనుండగా, డిప్యూటీ సీఎం భట్టి, ఢిల్లీలో ప్రభుత్వ అధికారి ప్రతినిధి మల్లు రవి కుటుంబీకులు హాజరు కానున్నారు. వెంకటేశ్వర్లుకు భార్య, ఓ కుమార్తె, ఓ కుమారుడు ఉన్నారు.

గురుకుల విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలి

ముఖ్యమంత్రికి లేఖ రాసిన ఆర్.కృష్ణయ్య



కాచిగూడ(హైదరాబాద్): గురుకుల విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలని జాతీయ బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో రోజుకో విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు విద్యార్థుల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ మంగళవారం ముఖ్యమంత్రికి లేఖ రాశారు. సూర్యాపేట, భువనగిరితోపాటు ఇతర ప్రాంతాల్లో ఇటీవల 65 మంది బాల, బాలికలు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆత్మహత్యలపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భువనగిరిలో ఓ విద్యార్థినిని కొందరు చంపి, దానిని కప్పిపుచ్చడానికి తల్లిదండ్రుల మీద, బీసీ సంఘ నేతల మీద తప్పుడు కేసులు పెట్టారన్నారు. ఆసిఫాబాద్ జిల్లా గురుకుల పాఠశాలలో 15రోజుల్లో అధికారుల నిర్లక్ష్యం, అనారోగ్యం కారణంగా ఐదుగురు విద్యార్థులు చనిపోయారని చెప్పారు.

మంత్రి ఉత్తమ్ వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోవాలి

రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం డిమాండ్

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో గ్రామపంచాయతీలను కించపరిచేలా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం అసెంబ్లీ చర్చలో భాగంగా మాజీమంత్రి హరీశ్ రావును ఉద్దేశించి 'గ్రామపంచాయతీలలో మాట్లాడినట్లు చిల్లరగా మాట్లాడుతున్నావ్' అని ఉత్తమ్ ఎద్దేవా చేయడం తగదని పేర్కొంది. ఇది రాష్ట్రంలోని 12,769 గ్రామపంచాయతీలను అవమానపరిచినట్లేనని సంఘ మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ఒక ప్రకటనలో అభ్యంతరం తెలిపారు. ప్రతి అభివృద్ధి విషయంపై పంచాయతీలలో అర్థవంతమైన చర్చలే తప్ప అనవసర ప్రస్తావనలు ఉండవని స్పష్టం చేశారు.

నాగార్జునసాగర్‌కు ఎన్డీఎస్ఏ బృందం

- ప్రధాన డ్యామ్, స్పిల్‌వేలను పరిశీలించిన అధికారులు
- గేట్లు, సీపేజీ, మరమ్మతుల వివరాలపై, పరిస్థితులపై ఆరా
- నేడు, రేపు కూడా కొనసాగనున్న పరిశీలన



ఇంజనీర్లతో కలిసి సాగర్‌డ్యాం వాక్‌వే బ్రిడ్జి మీదుగా వెళుతున్న ఎన్డీఎస్ఏ బృందం

నాగార్జునసాగర్: 'నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ)' బృందం మంగళవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టును సందర్శించింది. తొలుత విజయవిహార్ అతిథిగృహంలో తెలంగాణ, ఆంధ్ర ఇంజనీర్లతోపాటు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), కృష్ణాబోర్డు (కేఆర్ఎంబీ) సభ్యులతో ఎన్డీఎస్ఏ అధికారులు సమావేశమయ్యారు. 2009లో వచ్చిన భారీ వరదల నుంచి డ్యామ్‌ను ఏవిధంగా కాపాడారు? వచ్చిన వరదను ఎలా విడుదల చేశారన్న అంశాలపై చర్చించారు. తర్వాత ప్రధాన డ్యామ్‌ను, ప్రాజెక్టు లోపలి గ్యాలరీలను, అక్కడి సీపేజీ (జాలు నీరు)లను పరిశీలించారు. సీపేజీ నీటి మళ్లింపు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు స్పిల్‌వేపై ఉన్న వాక్‌వే బ్రిడ్జి మీదుగా వెళ్లి స్పిల్‌వేను పరిశీలించారు. ప్రాజెక్టు గేట్ల పరిస్థితి, స్పిల్‌వేకు అవసరమైన మరమ్మతులు, నిర్వహణ వివరాలను ఆరా తీశారు. స్పిల్‌వే దిగువన బకెట్ పోర్షన్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఎన్డీఎస్ఏ బృందంలో సీడబ్ల్యూసీ డైరెక్టర్ రమేశ్‌కుమార్, రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్(ఎస్డీఎస్ఓ) సీఈ ప్రమీల, ఇతర ఇంజనీర్లు ఉన్నారు. ఈ పరిశీలనలో తెలంగాణ నుంచి చీఫ్ ఇంజనీర్ వి.అజయ్‌కుమార్, డ్యామ్ ఎస్ఈ పీవీఎస్ నాగేశ్వర్‌రావు, ఇతర ఇంజనీర్లు పాల్గొనగా.. ఏపీ నుంచి చీఫ్ ఇంజనీర్ మురళీధర్ రెడ్డి, ఎస్ఈ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కేంద్రం పరిశీలన

ఎన్డీఎస్ఏ బృందం బుధవారం సాగర్ డ్యాం దిగువన ఉన్న విద్యుత్ కేంద్రాన్ని సందర్శించనుంది. ఈ విద్యుత్ కేంద్రం ద్వారా విడుదలవుతున్న నీటిని.. తిరిగి జలాశయంలోకి ఎత్తిపోసే సమయంలో నీరేమైనా వృథా అవుతుందా? సీజన్‌లో బయటికి ఎంతనీరు వెళుతుందనే అంశాలను పరిశీలించనున్నట్టు తెలిసింది. గురువారం కూడా సాగర్ ప్రాజెక్టు పరిధిలో పరిశీలన కొనసాగనుంది.

ఉద్యోగులపై రాజకీయ రంగును రుద్దడం సరికాదు

- ఉద్యోగుల ఉద్యమ ప్రస్థానం చరిత్రాత్మకం: ప్రొఫెసర్ హరగోపాల్
- ప్రజల ప్రభుత్వానికి టీఎన్జీఓ అండగా నిలుస్తుంది : మారం జగదీశ్వర్
- టీఎన్జీఓ భవన్‌లో కేలండర్, డైరీ ఆవిష్కరణ సభ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్, చిత్రంలో మారం జగదీశ్వర్, కస్తూరి వెంకటేశ్వర్లు, రామినేని శ్రీనివాసరావు

నాంపల్లి (హైదరాబాద్): తెలంగాణ ఉద్యమంలో టీఎన్జీఓ ఉద్యోగుల ప్రస్థానం చరిత్రాత్మకమని ప్రొఫెసర్ జి.హరగోపాల్ పేర్కొన్నారు. ఉద్యోగులు నిజాయితీగా పనిచేస్తే వారి హక్కుల సాధన ఉద్యమంలో ప్రజలెప్పుడూ వారి వెంటే ఉంటారని స్పష్టం చేశారు. నాంపల్లి టీఎన్జీఓ భవన్‌లో మంగళవారం జరిగిన టీఎన్జీఓ కేంద్ర సంఘం-2024 డైరీ, కేలండర్ ఆవిష్కరణ సభకు హరగోపాల్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు. అలాగే ప్రభుత్వాలు మారితే ఉద్యోగులకు రాజకీయ పార్టీల రంగును అంటకట్టడం సరికాదన్నారు. టీఎన్జీఓ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ మాట్లాడుతూ...75 ఏళ్ల చరిత్ర కలిగిన టీఎన్జీఓ సంఘం ఏనాడూ ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా పనిచేయలేదన్నారు. కానీ కొందరు టీఎన్జీఓ సంఘం చరిత్రకు మసకబారేలా ప్రభుత్వానికి ఉద్యోగులకు మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నాలుగుసార్లు టీఎన్జీఓ సంఘం కలిసిందని, త్వరలోనే ఉద్యోగ సంఘం నేతలను పిలిచి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ప్రజా ప్రభుత్వానికి టీఎన్జీఓ సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీఎన్జీఓ కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, కోశాధికారి శ్రీనివాసరావు, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు.

సామాజిక భద్రత కల్పించండి

- ప్రధాని మోదీకి గల్ఫ్ కార్మికుల బహిరంగ లేఖ
- నేడు అబుదాబిలో హిందూ దేవాలయం ప్రారంభించనున్న ప్రధాని

మోర్తాడ్ (బాల్కొండ): భారత ప్రధాని నరేంద్ర మోదీ గల్ఫ్ దేశమైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాజధాని అబుదాబిలో బుధవారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా గల్ఫ్ దేశాలలో 88 లక్షల మంది వలస కార్మికులు నివసిస్తున్నారని, వారికి కేంద్ర ప్రభుత్వం సామాజిక భద్రత కల్పించాలని కోరుతూ గల్ఫ్ కార్మికుల పక్షాన టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకులు మంద భీంరెడ్డి బహిరంగ లేఖ రాశారు. స్వదేశానికి అత్యధిక విదేశీ మారక ద్రవ్యం పంపిస్తున్న ప్రవాస భారతీయ కార్మికుల సేవలను గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వానికి కొన్ని సూచనలు, కోరికలతో కూడిన నివేదిక తయారు చేశారు. భారతీయ వలస కార్మికులకు పది లక్షల ప్రమాద బీమా, ఒకేరకం పాస్‌పోర్ట్, బీమా, పెన్షన్‌తో కూడిన సమగ్ర సామాజిక భద్రతా పథకం, వలసపోయి వాపస్‌వచ్చే కార్మికులకు పునరావాస పథకం, ఎమిగ్రేషన్ యాక్ట్ 1983 ఆధునీకరణ, ద్వైపాక్షిక కార్మిక ఒప్పందాల సమీక్షకోసం కమిటీలు, ఉపాధికోసం వెళ్లే వారికి ప్రీ-డిపార్చర్ ఓరియంటేషన్, గల్ఫ్ కార్మికుల పిల్లలకు విద్యా సంస్థలలో రిజర్వేషన్ తదితర సౌకర్యాలు కోరుతూ భీంరెడ్డి ప్రధాని మోదీకి లేఖ రాశారు.

అరబ్బుల రాజధానిలో... అబ్బురాల ఆలయం

అబుదాబిలో తొలి హిందూ ఆలయం ● నేడు మోదీ చేతులమీదుగా ప్రారంభం

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో హిందూ ఆలయం. కొన్నాళ్ల క్రితం దాకా అసాధ్యమైన ఊహగా తోచిన ఆ ఆలోచన ఇప్పుడు సాకారమైంది. యూఏఈ రాజధాని అబుదాబిలో ఏకంగా 27 ఎకరాల్లో సువిశాలమైన ఆలయం సర్వాంగ సుందరంగా రూపొందింది. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆరంభానికి సిద్ధమైంది. అదే బోచసన్వాసి శ్రీ అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ సంస్థ (బీఏపీఎస్) మందిరం. యూఏఈలోనే గాక మొత్తం మధ్యప్రాచ్యంలోనే పూర్తి హిందూ సంప్రదాయ రీతుల్లో నిర్మితమైన తొలి రాతి ఆలయమిది. భారత్‌తో యూఏఈ పటిష్ట బంధానికే గాక ఆ దేశ మత సామరస్యానికి కూడా ప్రతీకగా ఈ మందిరం అలరారనుంది...

విశేషాలెన్నో...

బాప్స్ ఆలయం ప్రత్యేకతలు అన్నీ ఇన్నీ కావు. దాదాపు 30 లక్షల దాకా భారతీయులున్న యూఏఈలో ఆలయాలు లేకపోలేదు. దుబాయ్‌లో ఇప్పటికే రెండు హిందూ దేవాలయాలు, ఒక సిక్కు గురుద్వారా ఉన్నాయి. అయితే అవి చూసేందుకు విల్లాల మాదిరిగా ఉంటాయి. యూఏఈ మొత్తంలో పూర్తి హిందూ శైలిలో రూపొందిన తొలి ఆలయం బాప్స్ మందిరమే...

- ఇది దుబాయ్–అబుదాబి హైవే సమీపంలో వద్ద 27 ఎకరాల్లో నిర్మితమైంది.
- దీని నిర్మాణానికి రూ.700 కోట్లు ఖర్చయింది. మొత్తం నిర్మాణం బాప్స్ సంస్థ కనుసన్నల్లో జరిగింది.
- 108 అడుగల ఎత్తు, 262 అడుగుల పొడవు, 180 అడుగుల వెడల్పుతో మొత్తం 55 వేల చదరపు మీటర్ల వైశాల్యంలో ఆలయం రూపుదిద్దుకుంది.
- దీని నిర్మాణానికి దాదాపు మూడున్నరేళ్లు పట్టింది. రాజస్తాన్, గుజరాత్‌కు చెందిన 2 వేల మందికి పైగా కార్మికులు, నిపుణులు మూడేళ్ల పాటు శ్రమించి 402 తెల్లని పాలరాతి స్తంభాలను చెక్కారు.
- ఆలయ నిర్మాణంలో స్టీల్, కాంక్రీట్, సిమెంట్ ఏ మాత్రమూ వాడలేదు. అయోధ్య రామాలయం మాదిరిగానే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో రాళ్ల వరుసలను నేర్పుగా పరస్పరం కలుపుతూ పోయారు.
- ఆలయం నిర్మాణంలో ఉపయోగించిన పాలరాతి తదితరాలను పూర్తిగా రాజస్తాన్‌లోని భరత్‌పూర్ నుంచి, శిల్పాలను భిల్వారా నుంచి తెప్పించారు. లోపలి నిర్మాణాల్లో ఇటాలియన్ మార్బుల్ వాడారు.
- మందిర పునాదుల్లో 100కు పైగా సెన్సర్లను కూడా ఏర్పాటు చేయడం విశేషం. భూకంపాలతో పాటు ఉష్ణోగ్రత, ఒత్తిళ్ల తదితరాల్లో మార్పులను ఇవి ఎప్పటికప్పుడు పట్టిస్తాయి.
- వీటిని మొత్తం 25 వేల పై చిలుకు విడి భాగాలుగా భారత్‌లో నిపుణులైన పనివాళ్లతో తయారు చేయించి యూఏఈలో జోడించడం విశేషం!
- ఆలయ కాంప్లెక్సులో ప్రార్థన మందిరం, సందర్శకుల కేంద్రం, థీమాటిక్ గార్డెన్లు, గ్రంథాలయం, గ్యాలరీ, ఎగ్జిబిషన్ సెంటర్లు, ఏకంగా 5,000 మంది పట్టే రెండు కమ్యూనిటీ హాళ్లతో పాటు ప్రత్యేకించి పిల్లల కోసం ఆటస్థలం కూడా ఉన్నాయి.
- మందిర ప్రారంభోత్సవంలో పాల్గొనాలనుకునే వారికోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ప్రారంభించారు. సోమవారం ఆలయంలో యజ్ఞం నిర్వహించారు.

ఏడు ఎమిరేట్లకు ప్రతీకగా...

- ఆలయంలోని ఏడు గోపురాలను యూఏఈలోని ఏడు ఎమిరేట్లకు ప్రతీకగా తీర్చిదిద్దడం మరో విశేషం.
- రామాయణ ఇతివృత్తాలను ఆలయ గోడలపై అందంగా చెక్కారు.
- ఆలయం బయటి గోడలపై ప్రపంచ ప్రసిద్ధ నాగరికతలన్నింటినీ చక్కగా చెక్కారు. తద్వారా ఈ ఆలయాన్ని మత సామరస్యానికి ప్రతీకగా తీర్చిదిద్దారు.
- భక్తుల బస తదితరాలకు ఆలయ సమీపంలో భవనం కూడా ఏర్పాటైంది. దీన్ని అరేబియన్, ఇస్లామిక్ వాస్తు రీతుల్లో నిర్మించడం విశేషం.



ఇలా పురుడు పోసుకుంది...

2014లో మోదీ తొలిసారి ప్రధాని పదవి చేపట్టిన కొద్దికాలానికే ఈ హిందూ ఆలయ నిర్మాణానికి బీజం పడింది. 2015లో మోదీ యూఏఈ పర్యటన అనంతరం వేగం పుంజుకుంది. 1981 తర్వాత అక్కడ పర్యటించిన తొలి భారత ప్రధాని మోదీయే. ఇప్పటిదాకా యూఏఈలో ఆరుసార్లు పర్యటించారాయన. తాజాగా ఏడో పర్యటనలో ఉన్నారు.

- 2015 పర్యటన సందర్భంగా యూఏఈ యువరాజుగా ఉన్న షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో పలు అంశాలపై మోదీ లోతుగా చర్చలు జరిపారు.
- ఆ వెంటనే ఆలయ నిర్మాణానికి యూఏఈ సర్కారు నిర్ణయం తీసుకోవడమే గాక 13.5 ఎకరాల భూమి కూడా కేటాయించింది. అనంతరం 2019లో మత సహన ఏడాది ఉత్సవాల సందర్భంగా ఈ ఆలయానికి మరో 13.5 ఎకరాలు ప్రకటించింది. అలా ఆలయానికి 27 ఎకరాల భూమి సమకూరింది.
- 2018లో మోదీ తన రెండో యూఏఈ పర్యటన సందర్భంగా బాప్స్ హిందూ ఆలయ నిర్మాణానికి దుబాయ్ ఒపెరా హౌజ్ నుంచి వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

భారత్ యూఏఈ దోస్తీ జిందాబాద్



మంగళవారం రాత్రి అబుదాబిలో అహ్లన్ మోదీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రధాని

అబుదాబిలో ప్రవాసులతో మోదీ

అబుదాబి: యూఏఈ, భారత్ మైత్రి ప్రపంచానికే ఆదర్శనీయమని ప్రధాని నరేంద్ర మోదీ శ్లాఘించారు. మంగళవారం అబుదాబిలోని జాయెద్ స్పోర్ట్స్ స్టేడియంలో ప్రవాస భారతీయులు నిర్వహించిన 'అహ్లన్ (హలో) మోదీ' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దాదాపు 50,000 మంది పాల్గొన్న కార్యక్రమం 'హర్ హర్ మోదీ, ఘర్ ఘర్ మోదీ', 'వుయ్ లవ్ మోదీ', ' భారత్ మాతా కీ జై', 'జై శ్రీరామ్' నినాదాలతో హోరెత్తిపోయింది. స్టేడియం బయట మోదీకి యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జయేద్ సాదర స్వాగతం పలికారు. ప్రేక్షకులనుద్దేశించి మోదీ ఏమన్నారంటే...

''యూఏఈ నలుమూలల నుంచి భారీ సంఖ్యలో వచ్చి మీరంతా చరిత్ర సృష్టించారు. భారత్‌లోని విభిన్న రాష్ట్రాల నుంచి వచ్చిన వారూ ఉన్నారు. అందరి హృదయాలను యూఏఈ కలిపింది. ఇక్కడి ప్రతి ఒక్కరి శ్వాస, గుండె చప్పుడు, స్వరం, ప్రతి గళం 'భారత్, యూఏఈ దోస్తీ జిందాబాద్' అని నినదిస్తోంది. ఇరు దేశాల మైత్రి ప్రపంచానికే ఒక మోడల్‌గా మారింది. 21వ శతాబ్ది మూడో దశకంలో కొత్త చరిత్రను లిఖిస్తున్నాయి. రెండు దేశాల భాగస్వామ్యం అన్ని రంగాల్లోనూ సమున్నత శిఖరాలకు చేరుతోంది. రోజు రోజుకూ ఈ బంధం మరింత బలపడాలని భారత్ మనసారా కోరుకుంటోంది. ప్రతిభ, సృజన, సంస్కృతిలో మన అనుబంధం దాగి ఉంది'' అని మోదీ అన్నారు. భారతీయ భాషల్లో అంతర్భాగంగా కలిసిపోయిన అరబిక్ పదాలను ప్రస్తావించారు. ఆ పదాలను మోదీ ఉచ్చరించినప్పుడల్లా ప్రేక్షకుల నుంచి విపరీతమైన స్పందన వచ్చింది.

మిమ్మల్ని చూసి భారత్ గర్విస్తోంది

'140 మంది భారతీయుల సందేశాన్నిమోసుకొచ్చా. అదేంటంటే.. మిమ్మల్ని చూసి భారత్ గర్విస్తోంది. ఈ పదేళ్లలో ఏడు సార్లు ఇక్కడికొచ్చా. ఈరోజు కార్యక్రమం నా స్మృతిపథంలో శాశ్వతంగా నిలిచి ఉంటుంది. యూఏఈ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ జయేద్' నాకు రావడం నిజంగా నా అదృష్టం. ఇది నాకు మాత్రమే కాదు 140 కోట్ల భారతీయులకు గర్వకారణం. సుఖమయ జీవనం, సులభతర వాణిజ్యానికి ఇరు దేశాలు కృషిచేస్తున్నాయి. 2047 కల్లా 'అభివృద్ధి చెందిన భారత్' ప్రతి ఒక్క భారతీయుడి లక్ష్యం. మోదీ గ్యారెంటీ అంటే ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చడమే. ప్రధానిగా మూడో దఫా పాలనలో భారత్‌ను ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా మారుస్తానని గ్యారెంటీ ఇస్తున్నా'' అని మోదీ వ్యాఖ్యానించారు. తర్వాత స్టేడియంలో ఓపెన్‌టాప్ బ్యాటరీ వాహనంలో స్టేడియంలో అంతా కలియతిరిగారు. ప్రేక్షకులకు అభివాదం చేశారు. జాతీయ జెండాలతో, సంప్రదాయ భారతీయ వస్త్రధారణలో విచ్చేసిన జనంతో స్టేడియం భారతీయతను సంతరించుకుంది. మోదీ తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం భాషల్లో కొన్ని వాక్యాలు మాట్లాడారు.

యూఏఈతో భాగస్వామ్యం బలపడుతోంది: మోదీ

అబూదాబి: ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం యూఏఈ చేరుకున్నారు. అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్–నహ్యాన్‌తో సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంపై సమీక్షించారు. వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఫిన్‌టెక్, ఇంధనం తదితర రంగాల్లో భారత్, యూఏఈ మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం బలపడుతుండడాన్ని వారు స్వాగతించారు. ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం (బీఐటీ)తో పాటు ఎనిమిది కీలక ఒప్పందాలపై సంతకాలు చేశారు. నహ్యాన్‌తో అద్భుతమైన సమావేశం జరిగిందంటూ 'ఎక్స్'లో మోదీ పోస్టు చేశారు.

రూపే కార్డు సేవలు ప్రారంభం

యూపీఐ రూపే కార్డు, యూఏఈకి చెందిన జేవాన్ కార్డు సేవలను మోదీ, అల్–నహ్యాన్ ప్రారంభించారు. ఈ కార్డులతో నూతన ఫిన్‌టెక్ ఏరియాలోకి ప్రవేశించామని మోదీ అన్నారు. రూపే, జేవాన్ కార్డు ఇంటర్‌లింక్ ఒప్పందంపై సంతకం చేశారు. తర్వాత అబూదాబిలో ఐఐటీ ఢిల్లీ–అబూదాబీ క్యాంపస్ తొలి బ్యాచ్ విద్యార్థులతో మోదీ సమావేశమయ్యారు. బుధవారం బాప్స్ మందిరాన్ని ప్రారంభించాక దోహాలో పర్యటిస్తారు.

ప్రభుత్వంలో చేరబోం

బయటి నుంచి మద్దతిస్తాం: బిలావల్

ఇస్లామాబాద్: మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాకిస్తాన్ ముస్లిం లీగ్–నవాజ్(పీఎంఎల్–ఎన్), బిలావల్ భుట్టో నేతృత్వంలోని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ)ల సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుఖాయమైన వేళ బిలావల్ భిన్నమైన ప్రకటన చేశారు. తాము ప్రభుత్వంలో చేరట్లేదని, బయటి నుంచి మద్దతు ఇస్తామని ఆయన స్పష్టంచేశారు. ''ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులు పొందటంలో మేం విఫలమయ్యాం. గెలిచిన సీట్ల సంఖ్యలో మేం మూడోస్థానానికే పరిమితమయ్యాం. అందుకే ప్రభుత్వంలో చేరొద్దని, ఏ మంత్రి పదవులూ స్వీకరించవద్దని మా పార్టీ నిర్ణయించింది. దేశంలో రాజకీయ సంక్షోభాన్ని మేం కోరుకోవట్లేదు. దేశంలో రాజకీయ సుస్థిరతే మాకు ముఖ్యం'' అని పార్టీ అత్యున్నత కేంద్ర కార్యనిర్వాహక కమిటీ సమావేశం తర్వాత బిలావల్ మీడియాతో చెప్పారు. దీంతో నవాజ్ షరీఫ్ రికార్డుస్థాయిలో నాలుగోసారి ప్రధా ట కావడం ఖాయమైంది. మరోవైపు కేంద్రంలో, రెండు ప్రావిన్సుల్లో ప్రభుత్వాల ఏర్పాటుకు ఇమ్రాన్ నేతృత్వం పీటీఐ ప్రయత్నిస్తోంది. ఎండబ్ల్యూఎం పార్టీతో కలసి కేంద్రంలో, పంజాబ్ ప్రావిన్స్‌లో.. జమాతే ఇస్లామీ పార్టీతో కలిసి ఖైబర్–పఖ్తూంఖ్వా ప్రావిన్స్‌లో ప్రభుత్వం ఏర్పాటుకు ప్రయత్నిస్తామని పీటీఐ పేర్కొంది.



మంగళవారం పంజాబ్–హరియాణా సరిహద్దుల్లో రైతులపైకి టియర్ గ్యాస్ ప్రయోగం



ఢిల్లీ సరిహద్దుల్లోని సింఘు వద్ద బారికేడ్లు, భారీగా మోహరించిన భద్రతా బలగాలు

సరిహద్దులో రణరంగం

రైతుల 'ఢిల్లీ చలో' ర్యాలీలో తీవ్ర ఉద్రిక్తత

- ట్రాక్టర్ల ర్యాలీని అడ్డుకున్న పోలీసులు
- రాళ్ల వర్షం కురిపించిన నిరసనకారులు
- వారిపైకి బాష్పవాయువు, జల ఫిరంగులు
- 100 మందికి గాయాలు.. పలువురి అరెస్టు
- ఢిల్లీ సరిహద్దుల్లో కట్టుదిట్టమైన భద్రత
- దేశ రాజధానికి చేరుకోలేకపోయిన రైతులు
- ర్యాలీకి 'నైట్ హాల్ట్', నేడు కొనసాగింపు



న్యూఢిల్లీ/చండీగఢ్: పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కు చట్టబద్ధత కల్పించడంతో పాటు ఇతర డిమాండ్ల సాధనకు దాదాపు 200 రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాతలు చేపట్టిన 'చలో ఢిల్లీ' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పంజాబ్, హరియాణా రాష్ట్రాల నుంచి ట్రాక్టర్లపై ర్యాలీగా బయలుదేరిన వేలాది మంది రైతులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. పంజాబ్, హరియాణా శంభు సరిహద్దులో పోలీసులపై నిరసనకారుల రాళ్ల దాడులు, బారికేడ్ల విధ్వంసం, రైతన్నలపై బాష్పవాయువు ప్రయోగం వంటి ఘటనలు చోటుచేసుకున్నారు. నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులు బాష్పవాయువుతో పాటు జల ఫిరంగులు ప్రయోగించారు. దాదాపు 100 మంది రైతులు గాయపడ్డారని రైతు సంఘాల నాయకులు చెప్పారు. శంభు బోర్డర్ వద్ద రోజంతా ఉద్రిక్తత కొనసాగింది. మరోవైపు ఢిల్లీ శివార్లలోని సింఘు, చిల్లా, తిక్రీ, ఘాజీపూర్ బోర్డర్ పాయింట్ల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో పార్లమెంట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టాలన్న రైతు సంఘాల ప్రణాళిక అమలు కాలేదు. 'చలో ఢిల్లీ'ని మంగళవారం రాత్రికి నిలిపివేస్తున్నామని, బుధవారం ఉదయం కొనసాగిస్తామని రైతు సంఘాల నేతలు ప్రకటించారు. ఎలాగైనా ఢిల్లీకి చేరుకొని, తమ గళం వినిపించడం ఖాయమన్నారు.

శంభు సరిహద్దులో యుద్ధ వాతావరణం

శంభు సరిహద్దు వద్ద ట్రాక్టర్ల ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. రైతులను ముందుకు వెళ్లనివ్వలేదు. చలో ఢిల్లీకి అనుమతి లేదని, వెనక్కి వెళ్లిపోవాలని సూచించారు. ఆగ్రహానికి గురైన రైతులు పోలీసులపై రాళ్లు రువ్వారు. వంతెనపై బారికేడ్లను నదిలోకి తోసేశారు. సిమెంట్ బారికేడ్లను ట్రాక్టర్లతో తొలగించేందుకు ప్రయత్నించారు. పరిస్థితి చెయ్యి దాటుతుండటంతో పోలీసులు జల ఫిరంగులు, డ్రోన్లతో బాష్పవాయు గోళాలు ప్రయోగించి రైతులను చెదరగొట్టారు. నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు.

చర్చలు అసంపూర్ణం

రైతు సంఘాలతో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అర్జున్ ముండా సోమవారం రాత్రి జరిపిన చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. ర్యాలీని విరమించాలని మంత్రులు కోరగా నేతలు అంగీకరించలేదు. డిమాండ్లు నెరవేరే దాకా ఉద్యమం కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. చాలా అంశాలపై ఏకాభిప్రాయానికి వచ్చామని మంత్రులు చెప్పారు. మిగతా డిమాండ్ల పరిష్కారానికి కమిటీ వేస్తామని ప్రతిపాదించగా నేతలు ఒప్పుకోలేదు. 2020–21 ఉద్యమంలో పాల్గొన్న రైతులపై కేసుల ఉపసంహరణకు, మరణించిన వారి కటుంబాలకు పరిహారం ఇచ్చేందుకు అప్పట్లోనే కేంద్రం ముందుకొచ్చింది. అవిప్పటికీ నెరవేరలేదని నేతలు ఆక్షేపించారు. పంటలు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాల్సిందేనని వారు మరోసారి తేల్చిచెప్పారు.

తక్షణం చర్చలు ప్రారంభించాలి

రైతులతో ప్రభుత్వం వెంటనే చర్చలు ప్రారంభించాలని, డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) అధ్యక్షుడు నరేశ్ తికాయత్ చెప్పారు. ఉద్యమంపై కఠినంగా వ్యవహరిస్తే ప్రమాదకరంగా మారవచ్చన్నారు. ఈ నెల 16న బంద్ పిలుపు ఇవ్వాలన్న ప్రతిపాదన ఉందన్నారు. తామెప్పుడూ రైతుల పక్షానే ఉంటామని స్పష్టం చేశారు. ''డిమాండ్లు నెరవేరాలంటే రైతన్నలు ప్రతిసారీ ఉద్యమబాట పట్టాల్సిందేనా? ఢిల్లీకి వెళ్లాల్సిందేనా? ప్రభుత్వానికి బాధ్యత లేదా?'' అని ప్రశ్నించారు.

ఇప్పటికిప్పుడు చట్టం తేలేం: కేంద్రం

న్యూఢిల్లీ: పంటలకు కనీస మద్దతు ధర కల్పించే విషయంలో ఇప్పటికిప్పుడు చట్టం తీసుకురాలేమని కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా అభిప్రాయపడ్డారు. భాగస్వామ్యపక్షాలతో చర్చించకుండా వేగంగా నిర్ణయం తీసుకోలేమన్నారు. రైతు సంఘాలు సంయమనం పాటించాలని, ప్రభుత్వంతో నిర్మాణాత్మక చర్చలకు ముందుకు రావాలని మంగళవారం కోరారు. రైతు ఉద్యమం ముసుగులో సంఘ విద్రోహ శక్తులు స్వార్థ ప్రయోజనాల కోసం అరాచకాలకు పాల్పడే ప్రమాదముందన్నారు. కొందరు వ్యక్తులు రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి రైతుల ఉద్యమాన్ని అప్రతిష్టపాలు చేసే అవకాశం ఉందని చెప్పారు. ''రైతు సంఘాలతో రెండు సార్లు చర్చించాం. చాలా డిమాండ్లకు అంగీకరించాం. కొన్నింటి పై చర్చలు జరుగుతున్నాయి'' అని వివరించారు. రైతుల డిమాండ్ల పట్ల కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని స్పష్టం చేశారు.

మేమొస్తే ఎంఎస్‌పీకి చట్టబద్ధత: రాహుల్

న్యూఢిల్లీ: శాంతియుతంగా నిరసన చేసేందుకు వస్తున్న రైతులపై కేంద్రం అణచివేత చర్యలకు పాల్పడుతోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లో భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీన్ని 'కిసాన్ న్యాయ్ గ్యారంటీ'గా అభివర్ణించారు. ఇదొక చరిత్రాత్మక దినమన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేసే అంశాన్ని తమ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేరుస్తామని సంకేతాలిచ్చారు. డిమాండ్లు నెరవేర్చాలని అడిగినందుకు రైతులపై మోదీ ప్రభుత్వం బాష్పవాయువు ప్రయోగించిందని, జైల్లో పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అనాగరిక ప్రభుత్వమంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

'పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన'

కోటి ఇళ్లకు ప్రతినెలా 300 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్	ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటన

న్యూఢిల్లీ: దేశంలో సుస్థిరాభివృద్ధి, ప్రజా సంక్షేమంలో భాగంగా సౌర విద్యుత్ వినియోగానికి మరింత ప్రోత్సాహం ఇచ్చే దిశగా 'పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ప్రకటించారు. దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు ప్రతినెలా 300 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయడం ఈ పథకం లక్ష్యం. రూ.75,000 కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఈ పథకం కింద ప్రభుత్వం ఇచ్చే రాయితీని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకే బదిలీ చేస్తామన్నారు. తక్కువ వడ్డీకే బ్యాంకుల నుంచి రుణం పొందవచ్చని సూచించారు. లబ్ధిదారులపై ఎలాంటి భారం పడకుండా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. తమ పరిధిలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటుకు కృషి చేసే పంచాయతీలకు, పట్టణ స్థానిక సంస్థలకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. 'పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన'తో ప్రజలకు మరింత ఆదాయం వస్తుందని, కరెంటు బిల్లుల భారం తగ్గుతుందని, కొత్తగా చాలామందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు. https://pmsuryaghar.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రధానమంత్రి సూచించారు.

ఈసీల నియామక చట్టంపై స్టే ఇవ్వలేం

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేరు చేర్చకుండా కొలువుతీరిన ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎలక్షన్ కమిషనర్ల నియామక సంబంధ చట్టంపై స్టే ఇవ్వడం కుదరదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. మోదీ సర్కార్ కొత్తగా తెచ్చిన సీఈసీ, ఈసీల(నియామకం, సేవలు, షరతులు) చట్టం–2023 చట్టబద్ధతను సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం విచారించింది. ఈ పిటిషన్‌ను అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) అనే స్వచ్ఛంద సంస్థ దాఖలుచేసింది. సీఈసీ, ఈసీల ఎంపికకు సంబంధించిన నియామక ప్యానెల్‌లో సీజేఐను తప్పకచేర్చాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉల్లంఘిస్తూ ఈ చట్టం తెచ్చారని, అందుకే ఈ చట్టం అమలుకాకుండా స్టే విధించాలని ఏడీఆర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. 'పార్లమెంట్ చేసిన చట్టాన్ని ఈ తరహాలో నిలుపుదల చేయలేం. న్యాయసమీక్ష పరిధిలోకి ఈ అంశం వస్తుందో లేదో మేం మొదట పరిశీలించాలి. ఇదే అంశంపై ఇప్పటికే దాఖలైన మరో రెండు పిటిషన్లతో కలిపి దీనినీ ఏప్రిల్‌లో విచారిస్తాం'' అని జస్టిస్ ఖన్నా చెప్పారు.

కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక్క సీటే: ఆప్

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో ఢిల్లీ పరిధిలోని ఏడు లోక్‌సభ స్థానాలకు గాను కాంగ్రెస్‌కు ఒక్క స్థానమే ఇస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ తేల్చిచెప్పింది. కాంగ్రెస్‌తో సీట్ల పంపకాలపై నెలరోజులకుపైగా వేచిచూసి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని పార్టీ నేత సందీప్ పాఠక్ చెప్పారు. ఢిల్లీలో కాంగ్రెస్ బలాన్ని బట్టి ఒక్క సీటు కూడా ఎక్కువేనన్నారు.

బీజేపీలోకి అశోక్ చవాన్

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మరుసటి రోజు మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం ముంబైలోని బీజేపీ కార్యాలయంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రకాంత్ బవాంకులే సమక్షంలో చవాన్ కమలదళంలో చేరారు. ఈ సందర్భంగా చవాన్ మాట్లాడారు. ''ప్రధాని మోదీ పాలనాదక్షత చూసి, సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ నినాదం స్ఫూర్తితో బీజేపీలో చేరా. మహారాష్ట్రలో బీజేపీ మరిన్ని ఎక్కువ సీట్లు గెలుపొందేందుకు కృషిచేస్తా. ఈ రోజు నుంచి నా కొత్త రాజకీయ జీవితం మొదలవుతుంది' అని ప్రకటించారు.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

కోటా(రాజస్తాన్): శిక్షణ కేంద్రాలకు చిరునామాగా నిలిచిన రాజస్తాన్‌లోని కోటా పట్టణం.. విద్యార్థులకు బలవన్మరణాలకూ చిరునామా అవుతోంది. ఏటా లక్షలాది మంది పరీక్షార్థులు ఇంజనీరింగ్, మెడికల్ ప్రవేశ పరీక్షల కోసం కోచింగ్ తీసుకునేందుకు కోటాకు వస్తుంటారు. వీరిలో మరో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జేఈఈ–మెయిన్–2024 తొలి ఎడిషన్ జవాబుల కీ విడుదలైన కొద్ది గంటలకే ఈ ఆత్మహత్య ఘటన చోటుచేసుకోవడం స్థానికంగా విషాదం నింపింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 16 ఏళ్ల శుభ్ చౌదరి గత రెండేళ్లుగా ఇక్కడి జవహర్‌నగర్‌లో ఉంటూ జేఈఈ–మెయిన్‌కు కోచింగ్ తీసుకుంటున్నాడు. ఆ పరీక్ష ఆన్సర్ కీ వెల్లడైన కొద్దిసేపటికే సోమవారం రాత్రి తన హాస్టల్ గదిలోకి వెళ్లి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు డీఎస్పీ భవానీ చెప్పారు. పోస్ట్‌మార్టమ్ తర్వాతే పూర్తి వివరాలు చెప్పగలమని పోలీసులు అన్నారు. కోటా పట్టణంలో ఈ ఏడాది విద్యార్థుల ఆత్మహత్యలకు సంబంధించి ఇది మూడో దుర్ఘటన.

ఎట్టకేలకు ఉక్రెయిన్‌కు అమెరికా సాయం

వాషింగ్టన్: రష్యాతో రెండేళ్లుగా సాగుతున్న యుద్ధంలో ఆయుధాలు, ఇతర కీలక సైనిక సామగ్రి కొరతతో సతమతమవుతున్న ఉక్రెయిన్‌కు శుభవార్త. ఆ దేశం సహా ఇజ్రాయెల్, తైవాన్‌లకు కలిపి మొత్తం 95.3 బిలియన్ డాలర్ల (సుమారు 7.90 లక్షల కోట్లు) సాయం అందించేందుకు ఉద్దేశించిన ప్యాకేజీకి అమెరికా సెనేట్ ఆమోదం తెలిపింది. ఇందులో ఉక్రెయిన్‌కు 60 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4.98 లక్షల కోట్లు)ను ప్రత్యేకించారు. సొంత సమస్యలను పరిష్కరించడానికి బదులుగా ఇతర దేశాల సమస్యల కోసం నిధులను వెచ్చించడాన్ని రిపబ్లికన్ సభ్యులు కొందరు వ్యతిరేకించారు. దీనిపై చర్చించిన సెనేట్ చివరికి ఈ బిల్లుకు 70–29 ఓట్ల తేడాతో ఆమోదం తెలిపింది.

కాల్పుల విరమణపై కీలక చర్చలు

కైరో: భూతల, గగనతల దాడులతో మరుభూమిగా మారుతున్న గాజా స్ట్రిప్‌లో కాల్పుల విరమణే లక్ష్యంగా హమాస్, ఇజ్రాయెల్ ప్రతినిధుల మధ్య ఈజిప్ట్ రాజధాని నగరంలో విస్తృతస్థాయి చర్చలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ సైన్యం రఫా పట్టణంలో సోమవారం దాడిచేసి 74 మంది పాలస్తీనియన్లను పొట్టనబెట్టుకున్న నేపథ్యంలో ఈ చర్చల ఫలితంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. యుద్ధం ఐదోనెలలోకి అడుగిడిన ఈ తరుణంలో కాల్పుల విరమణ అమల్లోకి వస్తే నిత్యావసరాలకు సైతం కటకటలాడుతున్న గాజా వాసులకు కాస్తయినా అంతర్జాతీయ మానవతా సాయం అందుతుంది.

తమిళ మంత్రి సెంథిల్ బాలాజీ రాజీనామా

చెన్నై: ఉద్యోగాల కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్ట్ చేసిన తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఈ నెల 12న సీఎం ఎంకే స్టాలిన్ నుంచి అందిన సిఫారసు లేఖ మేరకు గవర్నర్ ఆర్ఎన్ రవి మంత్రి బాలాజీ రాజీనామాను ఆమోదించినట్లు మంగళవారం రాజ్‌భవన్ తెలిపింది. కరూర్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బాలాజీ గత ఏఐఏడీఎంకే ప్రభుత్వంలో రవాణా మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో ఆయన అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపిస్తూ ఈడీ గత ఏడాది జూన్‌లో అరెస్ట్ చేసింది.

న్యూయార్క్‌లో కాల్పులు.. ఒకరు మృతి

న్యూయార్క్: అమెరికాలోని న్యూయార్క్ సిటీ సబ్‌వే స్టేషన్‌లో సోమవారం జరిగిన కాల్పుల్లో ఒకరు చనిపోగా మరో అయిదుగురు గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. బ్రాంక్స్‌లోని ఎలివేటెడ్ ట్రైన్ ప్లాట్‌ఫాంపై రద్దీ ఎక్కువగా ఉండే సాయంత్రం 4.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైలులో ప్రయాణిస్తున్న రెండు టీనేజర్ల గ్రూపుల మధ్య వివాదం చెలరేగింది. స్టేషన్ సమీపిస్తున్న సమయంలో అందులో కొందరు తుపాకీలతో కాల్పులకు దిగారు. స్టేషన్‌లో రైలు ఆగిన తర్వాత కూడా ప్లాట్‌ఫాంపై జనంపైకి కాల్పులు కొనసాగాయి. మృతుడికి 34 ఏళ్లుంటాయని, క్షతగాత్రుల్లో ఒక బాలుడు, బాలిక ఉన్నారు.

సాక్షి
హైదరాబాద్
బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024



ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

సేల్‌డీడ్ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసేందుకు ఓ వ్యక్తి నుంచి రూ.2 లక్షలు లంచం తీసుకుంటున్న దూద్‌బౌలి రిజిస్ట్రార్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. -8లో



16న తాగునీటి సరఫరాలో అంతరాయం

ఈ నెల 16న నగరంలోని కొన్ని ప్రాంతాల్లో పాక్షికంగా, మరికొన్ని ప్రాంతాల్లో పూర్తిగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. -8లో

లాంగ్ డ్రైవ్ కార్ల యాజమాన్యం దాష్టీకం



లాంగ్‌డ్రైవ్ కార్ల కంపెనీ యాజమాన్యం ఉద్యోగులపై అమానుషంగా ప్రవర్తించిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. -8లో

న్యూస్‌రీల్

ఎల్బీ స్టేడియం కేంద్రంగా నేడు ట్రాఫిక్ మళ్లింపులు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ స్టేట్ లెవల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డ్ (టీఎస్‌ఎల్‌పీఆర్బీ) ద్వారా వివిధ పోస్టులకు ఎంపికైన వారికి బుధవారం ఎల్బీ స్టేడియంలో అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందించనున్న నేపథ్యంలో స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ ట్రాఫిక్ చీఫ్ విశ్వప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఉదయం 10.30 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇవి అమలులో ఉండనున్నాయి. నిర్దిష్ట సమయాల్లో సాధారణ వాహనచోదకులను ఏఆర్ పెట్రోల్ పంప్‌-బీజేఆర్ విగ్రహం-బషీర్‌బాగ్ మార్గాల్లోకి అనుమతించరు. చాపెల్ రోడ్, నాంపల్లి వైపు నుంచి బీజేఆర్ స్టాచ్యూ వైపు వచ్చే వాహనాలను ఏఆర్ పెట్రోల్ పంప్ నుంచి మళ్లిస్తారు. వీటిని కంట్రోల్ రూమ్ వైపు అనుమతించరు. గన్‌ఫౌండ్రీ ఎస్బీఐ నుంచి బషీర్‌బాగ్ ఫ్లైఓవర్ వైపు వచ్చే వాహనాలను చాపెల్ రోడ్ మీదుగా, రవీంద్రభారతి, హిల్‌ఫోర్ట్ రోడ్ వైపు నుంచి బీజేఆర్ స్టాచ్యూ వైపు వచ్చే వాహనాలను సుజాత హైస్కూల్ మీదుగా, బషీర్‌బాగ్ ఫ్లైఓవర్ వైపు నుంచి వచ్చే వాహనాలను చాపెల్ రోడ్ మీదుగా మళ్లిస్తారు. నారాయణగూడ సిమెట్రీ వైపు నుంచి బషీర్‌బాగ్ వైపు వచ్చే వాహనాలను ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద, కింగ్ కోఠి, బొగ్గులకుంట వైపు నుంచి భారతీయ విద్యా భవన్స్ మీదుగా వచ్చే వాహనాలను కింగ్ కోఠి చౌరస్తా నుంచి తాజ్ మహల్ హోటల్ మీదుగా మళ్లిస్తారు. బషీర్‌బాగ్ నుంచి కంట్రోల్ రూమ్ వైపు వచ్చే వాటిని లిబర్టీ మీదుగా పంపిస్తారు. ఎలాంటి సహాయ సహకారాలు కావాల్సి వచ్చినా ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నెంబర్ 9010203626లో సంప్రదించాలని ట్రాఫిక్ చీఫ్ సూచించారు.

పోలీసుల కస్టడీకి డ్రగ్ పెడ్లర్ స్టాన్లీ

పంజగుట్ట: అంతర్జాతీయ డ్రగ్స్ పెడ్లర్, నైజీరియాకు చెందిన స్టాన్లీని పంజగుట్ట పోలీసులు మంగళవారం అయిదు రోజుల కస్టడీకి తీసుకున్నారు. నాంపల్లి 14వ అదనపు మెట్రోపాలిటన్ కోర్టు ఆదేశాలతో అతన్ని విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకున్నారు. ఈ నెల 5వ తేదీన స్టాన్లీని ఎర్రమంజిల్ వద్ద అదుపులోకి తీసుకుని రూ.8 కోట్ల విలువైన అరకిలో కొకైన్, హెరాయిన్, ఓజీ గంజాయి ఇతర మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. స్టాన్లీ ఫోన్‌కాల్ లిస్టు చెక్‌చేసిన పోలీసులు.. నగరంలో తన డ్రగ్స్ వ్యాపారం విస్తరించేందుకు యత్నించినట్లు తెలుసుకున్నారు. దేశవ్యాప్తంగా 500 మందిపైగా వినియోగదారులున్న స్టాన్లీకి నగరంలో ఏడుగురికి మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు ఆ ఏడుగురు ఎవరు అనే దానిపై ఆరా తీస్తున్నారు. అందులో రాజకీయ, సినీ రంగాలకు చెందిన ప్రముఖులు ఉండవచ్చనే విషయంపై విచారణ జరపనున్నారు. ఇదే కేసులో యాంటీ నార్కొటిక్ బ్యూరో పోలీసులు మరొకరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

పెట్రోల్ దాడి బాధితుడి మృతి

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో మూడు రోజుల క్రితం స్థల వివాదం విషయంలో పెట్రోల్ దాడికి గురైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. గత ఆదివారం బోయిన్‌పల్లి కంసారీ బజార్‌లో నివసించే వినోద్.. వరుసకు సోదరుడడైన శ్రీనివాస్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో 70 శాతం శరీరం కాలిన శ్రీనివాస్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో మంగళవారం శ్రీనివాస్ చికిత్స పొందుతూ మృతి చెందాడు.



డ్రైవర్‌కు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మీ సేవకు సెల్యూట్

ఆటో, ట్రక్కు, ట్యాక్సీ డ్రైవర్ల సేవలు నగర పౌరులకు ఎంతో అవసరమని సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ట్రాఫిక్ పోలీసులు, సికింద్రాబాద్ రోటరీ క్లబ్ సంయుక్తాధ్వర్యంలో ట్రాఫిక్ అవేర్‌నెస్‌పై నిర్వహించిన కార్యక్రమంలో సీపీ శ్రీనివాస్‌రెడ్డి, సినీ నటుడు జొన్నలగడ్డ సిద్ధు (డీజే టిల్లు ఫేం) తదితరులు ట్రాఫిక్ అవేర్‌నెస్ ఆడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఆటో, ట్రక్కు, క్యాబ్ డ్రైవర్ల సేవలు నిలిచిపోతే నగర జనజీవనం స్తంభించిపోతుందన్నారు. డ్రైవర్ల సేవలకు వెలకట్టలేమన్నారు. వారికి ఎంతో అవసరమైన వైద్య సేవలు అందించడానికి రోటరీ క్లబ్, సరోజిని, మెడ్‌విజన్ ఆస్పత్రుల యాజమాన్యాలు డ్రైవర్లకు ఉచితంగా కంటి, ఆరోగ్య పరీక్షల చేసి కళ్లద్దాలు అందించేందుకు ముందుకు రావడం ముదావహమన్నారు. డ్రైవర్లతో పాటు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు కమిషనర్ ఆర్.విశ్వప్రసాద్, రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ బుసిరెడ్డి శంకర్‌రెడ్డి, రోటరీ క్లబ్ సికింద్రాబాద్ అధ్యక్షుడు ముక్కులక్ష్మి కల్యాణ్, కార్యదర్శి కె.భరత్‌రెడ్డి పాల్గొన్నారు. – గోల్కొండ



ట్రాఫిక్ అవేర్‌నెస్ లోగోను ఆవిష్కరిస్తున్న సీపీ శ్రీనివాస్‌రెడ్డి, సినీనటుడు జొన్నలగడ్డ సిద్ధు తదితరులు

కాంగ్రెస్‌లోకి వరుస కడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

'కారు'కు టాటా!

- కౌన్సిల్ సమావేశం నాటికి ఇంకెంతమంది వెళ్తారో?
- హాట్ టాపిక్‌గా మారిన కార్పొరేటర్ల వలసలు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో అధికార పార్టీ మారడంతో జీహెచ్‌ఎంసీలో ఆ ప్రభావం కనిపిస్తోంది. ఇప్పటి వరకు నగరంలో బీఆర్‌ఎస్‌కు తిరుగేలేదని భావించినప్పటికీ.. ఆ పార్టీ జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ వైపు మళ్లుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. నిన్నామొన్నటి దాకా కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కాంగ్రెస్‌లో చేరనుండటం తెలిసిందే. డిప్యూటీ మేయర్ శ్రీలత, ఆమె భర్త శోభన్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరనున్నారు. వీరిలో మేయర్ ఇదివరకే సీఎం రేవంత్‌రెడ్డిని కలవగా.. తాజాగా మంగళవారం సీఎంను శ్రీలత, శోభన్‌రెడ్డి కలిశారు. మరో మూడ్రోజుల్లో వీరు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ ఇప్పటికే హస్తం గూటికి చేరిన విషయం విదితమే.

చట్టసభల్లో అడుగు పెట్టాలని..

మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ప్రస్తుత డిప్యూటీ మేయర్ భర్త, బీఆర్‌ఎస్ ట్రేడ్ యూనియన్ నాయకుడు శోభన్‌రెడ్డి చాలాకాలంగా చట్టసభల్లో అడుగుపెట్టాలని ఉవ్విళ్లూరుతున్నారు. అందుకు బీఆర్‌ఎస్ అవకాశం కల్పించలేదు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనైనా తమకు టికెట్ దక్కుతుందేమో అనుకుంటే అందుకు కూడా తగిన హామీ లభించలేదు. దీంతో పాటు ఉద్యమనేతలను చిన్నచూపు చేస్తున్నారనే ఆరోపణలతో వారు బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెబుతున్నారు. తనకు ప్రాణహాని ఉందని తెలిపినా అధిష్టానం పట్టించుకోనందున, బీఆర్‌ఎస్ తీరే గతి తప్పినందున పార్టీ మారినట్లు మాజీ డిప్యూటీ మేయర్‌బాబా ఫసియుద్దీన్ ఇప్పటికే స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో మరికొందరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది.



సీఎంను కలిసిన శ్రీలతా శోభన్‌రెడ్డి దంపతులు

బొంతు శ్రీదేవితో పాటు..

ఈ నెల 19వ తేదీన జరగనున్న జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశం నాటికి ఇంకెంతమంది కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరతారోనని బీఆర్‌ఎస్‌లో ఉత్కంఠ నెలకొంది. బొంతు రామ్మోహన్ భార్య శ్రీదేవి కార్పొరేటర్‌గా ఉండటం తెలిసిందే. ఆమెతో పాటు మరికొందరు పార్టీ వీడనున్నట్లు చెబుతున్నారు. ఎక్కువమంది బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను కాంగ్రెస్‌లో చేర్పించేందుకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో పాటు బొంతు రామ్మోహన్, బాబా ఫసియుద్దీన్‌లు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఏదీ ఆనాటి బలం?

బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎక్కడైనా పార్టీ సభలు జరిగితే కార్పొరేటర్లు పోటీలుపడి భారీ సంఖ్యలో తరలి వెళ్లేవారు. అధినేతల ఎదుట కనబడేలా తిప్పలు పడేవారు. మంగళవారం నల్లగొండలో కేసీఆర్ పాల్గొన్న సభకు గతంలో మాదిరి పోటీ కనిపించలేదు.

19న కౌన్సిల్ సమావేశాలు..

ఇటీవల తీసుకున్న నిర్ణయానికనుగుణంగానే ఈ నెల 19వ తేదీన జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌కు సంబంధించి రెండు సమావేశాలు నిర్వహించనున్నారు. తొలుత ఉదయం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించి ఆయా అంశాలకు ఆమోదం తెలుపుతారు. అజెండాలో 15 తీర్మానాలు ఉన్నాయి. ఇప్పటికే స్టాండింగ్ కమిటీలో ఆమోదం పొందిన తీర్మానాల్ని కౌన్సిల్ ఆమోదం కోసం అజెండాలో పొందుపరిచారు. సాధారణ సర్వసభ్య సమావేశం ముగిశాక రాబోయే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు జీహెచ్‌ఎంసీ ప్రకటించింది. ప్రస్తుతం స్టాండింగ్ కమిటీ మనుగడలో లేకపోవడంతో.. నేరుగా కౌన్సిల్ సమావేశం ముందుంచనున్నారు. ఈ మేరకు సీఎం అనుమతించడం తెలిసిందే.

అవిశ్వాస తీర్మాన గడువును తగ్గిస్తారా ?

మరోవైపు జీహెచ్‌ఎంసీలో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి ప్రస్తుతమున్న నాలుగేళ్ల గడువును తగ్గిస్తారనే ప్రచారం మొదలైంది. రాష్ట్రంలోని మిగతా స్థానిక సంస్థల్లో మూడేళ్లకు అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉండగా, జీహెచ్‌ఎంసీలో అది నాలుగేళ్లుగా ఉంది. రాజధాని అయిన హైదరాబాద్‌లో జరిగే అభివృద్ధి రాష్ట్రమంతటా తెలుస్తుంది. అలాంటప్పుడు తమ పార్టీ వారు కాక ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు చెందిన మేయర్, డిప్యూటీ మేయర్‌లుగా ఉంటే తమకు ఇబ్బంది అనే ఆలోచనలో కాంగ్రెస్ ముఖ్య నేతలున్నట్లు తెలుస్తోంది. ఈ ఇరకాటం లేకుండా ఉండేందుకు సంబంధిత చట్ట సవరణ చేసి మూడేళ్లకు తగ్గించవచ్చనే వాదన వినిపిస్తోంది. ప్రభుత్వం నిజంగానే ఆ పని చేయనుందా? అందుకు ఎంత సమయం పట్టనుంది? వంటి అంశాల్లో స్పష్టత రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే మేయర్, డిప్యూటీ మేయర్‌లు సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారని చెబుతున్న వారు కూడా ఉన్నారు. కేవలం జీహెచ్‌ఎంసీకి సంబంధించిన అంశాలపై మాట్లాడేందుకే తాను సీఎంను కలిసినట్లు మేయర్ విజయలక్ష్మి వివరణ ఇవ్వగా.. డిప్యూటీ మేయర్ శ్రీలత పార్టీ మారడం ఖాయమైంది.

నీటి చౌర్యంపై కన్నెర్ర!

నల్లా అక్రమ కనెక్షన్‌దారులపై కొరడా

- కమర్షియల్ కనెక్షన్లుగా క్రమబద్ధీకరణ
- మరికొందరిపై క్రిమినల్ కేసులు
- రంగంలోకి జలమండలి విజిలెన్స్



సాక్షి, సిటీబ్యూరో: నల్లా అక్రమ కనెక్షన్లపై జలమండలి కొరడా ఝుళిపిస్తోంది. డొమెస్టిక్ కనెక్షన్ల పేరుతో బహుళ అంతస్తుల సముదాయాలు, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న కనెక్షన్లపై జలమండలి దృష్టి సారించింది. విజిలెన్స్ విభాగాన్ని రంగంలోకి దింపి ముమ్మర తనిఖీలకు శ్రీకారం చుట్టింది. బహుళ అంతస్తు భవనాల్లో వినియోగిస్తున్న వాటిని వాణిజ్య కనెక్షన్లుగా క్రమబద్ధీకరించుకునేందుకు వెసులుబాటు కల్పిస్తోంది. నిర్దేశించిన పరిమాణం కంటే పెద్ద పైపులను అక్రమంగా ఏర్పాటు చేసుకున్న కనెక్షన్‌దారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తోంది. తాజాగా పక్షం రోజుల్లోనే 57 డొమెస్టిక్ కనెక్షన్లు కమర్షియల్ కేటగిరీ కిందకు మారగా, మరో ఏడుగురు కనెక్షన్‌దారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు జలమండలి నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. బహుళ అంతస్తుల భవన సముదాయాలవారు సైతం ఉచిత తాగునీటి పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం విస్మయానికి గురి చేస్తోంది.

వెయ్యి లీటర్ల ఖర్చు రూ.45..

గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ప్రాంతాలకు జలమండలి నీటి సరఫరా చేస్తోంది. కృష్ణా, గోదావరి నదులతో పాటు సింగూరు, మంజీర జలాశయాల నుంచి నగరానికి నీటిని తరలించి శుద్ధి చేసి సరఫరా చేసేందుకు వెయ్యి లీటర్లకు వాటర్ బోర్డు రూ.45 వరకు ఖర్చు చేస్తోంది. నగరవాసులకు మాత్రం ఉచిత తాగునీటి పథకం కింద నెలకు 20 వేల లీటర్లను అందిస్తోంది. అదనపు నీటితో పాటు మిగతా అవసరాల కోసం ప్రతి వెయ్యి లీటర్లను కేవలం రూ.10 మాత్రమే వర్తింపజేస్తోంది. ఉచిత పథకం కింద ప్రతినెలా 20వేల లీటర్ల లోపు నీటిని వినియోగిస్తే ఎలాంటి బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదు. ఆయా వినియోగదారులకు జీరో బిల్లులే వస్తాయి. అదనంగా వినియోగిస్తేనే బిల్లు ఉంటుంది.

క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటం..

నగరంలో మాత్రం నీటి చౌర్యం ఆగడం లేదు. శివారు ప్రాంతాల్లో సైతం నల్లా అక్రమ కనెక్షన్లు బయటపడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది లేకుండానే కనెక్షన్లలో పైపుల పరిమాణం పెరిగిపోతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా పట్టున్న ప్లంబర్లతో రాత్రిపూట నల్లా కనెక్షన్లను అక్రమంగా ఏర్పాటు చేసుకుని నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. మరి కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది నల్లా అక్రమ కనెక్షన్లకు సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. క్షేత్రస్థాయిలో వాటర్ లైన్‌మన్, నీటి మీటర్ రీడర్లు రెగ్యులర్‌గా ఆయా కాలనీల్లో తిరుగుతూ నల్లా అక్రమ కనెక్షన్లను ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యకు గాయాలు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ లాస్య నందితకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆమె ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురి కావడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మంగళవారం నల్లగొండలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభకు హాజరై సాయంత్రం నగరానికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో నల్లగొండ పట్టణానికి సమీపంలోని చర్లపల్లి వద్ద ఎమ్మెల్యే లాస్య ప్రయాణిస్తున్న కారును ఆటో ఢీకొట్టింది. దీంతో కారు ముందు సీటులో ఉన్న ఆమె ఒక్కసారిగా ముందుకు పడిపోవడంతో తలకు స్వల్ప గాయాలయ్యాయి. సమీపంలోని ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం నగరానికి బయలుదేరారు. ప్రమాద సమయంలో కారులో ఎమ్మెల్యే లాస్యతో పాటు ఆమె సోదరి నివేదిత, డ్రైవరు, ఇద్దరు గన్‌మెన్‌లు ఉన్నారు.



ప్రమాదానికి గురైన ఎమ్మెల్యే లాస్య నందిత కారు

డిజిటల్ వేదికగా 'కుతుబ్ షాహీ టూంబ్స్' పరిరక్షణ

సాక్షి, సిటీబ్యూరో: నగరానికే తలమానికమైన వారసత్వ సంపద 'కుతుబ్ షాహీ సమాధుల'ను డిజిటల్ వేదికపై పరిరక్షించడంలో ముందుకు సాగుతున్నామని హెగ్జాగోనల్ రియాలిటీ టెక్నాలజీ సీఈఓ పాలో గుగ్లియెల్మిని తెలిపారు. కుతుబ్ షాహీ టూంబ్స్ డేటా-రిచ్ డిజిటల్ ట్విన్ కోసం హెగ్జాగోనల్ ఆధ్వర్యంలో రియాలిటీ టెక్నాలజీ నేపథ్యంలో మంగళవారం కుతుబ్ షాహీ సమాధుల వేదికగా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలో గుగ్లియెల్మిని మాట్లాడుతూ.. స్మార్ట్ సిటీ టెక్నాలజీలను అభివృద్ధి చేయడానికి, అధునాతన డిజిటల్ ఆవిష్కరణలతో చారిత్రాత్మక ల్యాండ్‌మార్క్‌ల సంరక్షణకు మద్దతు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామన్నారు. నగరంలోని గత చరిత్రకు చెందిన అద్భుత ఆనవాళ్లను రక్షించడానికి రియాలిటీ టెక్నాలజీ వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. డిజిటల్-రియాలిటీ వేదిక డేటా- రిచ్ యాక్షన్ డిజిటల్ ట్విన్‌ను అనుసంధానం చేయడానికి అధునాతన ఏఐ పరిష్కారాలను వర్తింపజేశామని హెగ్జాగోనల్ ఆర్అండ్‌డీ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నవనీత్ మిశ్రా పేర్కొన్నారు.



టూంబ్స్ ఎదుట జయేశ్ రంజన్ తదితరులు



టీఎస్ నాబ్ ఆవిష్కరణ (ఫైల్)

నార్కోటిక్స్ వింగ్.. నామ్‌కే వాస్తే

కేటాయించిన పోస్టులు సగం కూడా భర్తీ కాలేదు

- కార్యాలయాలు, వాహనాలకూ దిక్కేలేదు
- ప్రోత్సాహకం మాటే పట్టని ప్రభుత్వ పెద్దలు
- గగ్గోలు పెడుతున్న అధికారులు, ఇతర సిబ్బంది

సాక్షి, సిటీబ్యూరో: 'రాష్ట్రంలో డ్రగ్స్ అనే మాటే వినిపించకూడదు. మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతాం. గంజాయి సహా అన్ని నిషేధిత ఉత్పత్తుల రవాణా, విక్రయం, వినియోగం ఉపేక్షించేదిలేదు'. గత, ప్రస్తుత ప్రభుత్వ పెద్దల మాటలివి. వాస్తవ పరిస్థితులు మాత్రం భిన్నంగా ఉన్నాయి. రాష్ట్ర స్థాయిలో ప్రతిష్టాత్మంగా ఏర్పాటైన తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీఎస్ నాబ్) పరిస్థితే దీనికి ఉదాహరణ. ఇది ఆవిర్భవించి తొమ్మిది నెలలు కావస్తున్నా.. ఇప్పటికీ తీవ్రమైన వనరుల కొరతతో కొట్టుమిట్టాడుతోంది.

సిబ్బంది కంటే అధికారులే అధికం..

పోలీసు శాఖలో ఏ విభాగాన్ని తీసుకున్నా ఉన్నతాధికారులు, అధికారుల సంఖ్య తక్కువగా, క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే కింది స్థాయి సిబ్బంది సంఖ్య ఎక్కువగా ఉంటుంది. బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌నే ఉదాహరణగా తీసుకుంటే.. అక్కడ ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, 11 మంది ఎస్సైలు, 15 మంది హెడ్-కానిస్టేబుళ్లు, 67 మంది కానిస్టేబుళ్లు పని చేస్తున్నారు. టీఎస్ నాబ్ వ్యవహారం రొటీన్‌కు భిన్నంగా ఉంది. ఇక్కడ ఒక డైరెక్టర్, ఇద్దరు ఎస్పీలతో పాటు 15 మంది ఏసీపీ, 19 మంది ఇన్‌స్పెక్టర్లు ఉండటం వరకు బాగానే ఉంది. క్షేత్రస్థాయిలో కీలకమైన ఎస్సైలు 8, కానిస్టేబుళ్లు 23 మంది మాత్రమే ఉన్నారు. ప్రతిష్టాత్మకమైన ఈ విభాగంలో క్షేత్రస్థాయి సిబ్బంది కంటే అధికారుల సంఖ్య ఎక్కువగా ఉండటం గమనార్హం.

కానరాని మౌలిక వసతులు..

టీఎస్ నాబ్‌ను ఏర్పాటు చేస్తూ గత ప్రభుత్వం పోయినేడాది ఏప్రిల్ 30న ఉత్తర్వులు జారీ చేయగా.. అదే ఏడాది మే 31న ఆవిష్కారమైంది. ప్రాథమికంగా ఈ విభాగానికి 300 పోస్టులు కేటాయించింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండలతో పాటు వరంగల్‌లో నార్కోటిక్స్ ఠాణాలు, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, సంగారెడ్డి, ఖమ్మం, మహబూబ్‌నగర్‌లతో పాటు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోనూ రీజినల్ నార్కోటిక్స్ సెల్స్ ఏర్పాటు చేయాలి. పోలీసు స్టేషన్లకు డీఎస్పీ స్థాయి అధికారి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా (ఎస్‌హెచ్‌ఓ) ఉంటారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్‌లో ఇచ్చిన కార్యాలయం తప్ప... రాష్ట్రంలో మరెక్కడా చిన్న గది కూడా ఈ విభాగానికి కేటాయించలేదు. డైరెక్టర్ సహా ఇప్పటి వరకు ఈ వింగ్‌కు రిపోర్టు చేసిన వారి సంఖ్య కేవలం 68 మాత్రమే. ఉన్నతాధికారులు మినహా మరెవరూ సంచరించడానికి వాహనాలు సహా ఏ ఇతర సదుపాయం లేదు.

ప్రోత్సాహకం మాటే మరిచారు..

ఏసీబీ, సీఐడీ, ఇంటెలిజెన్స్ విభాగాల మాదిరిగా టీఎస్ నాబ్‌కూ డైరెక్టు రిక్రూట్‌మెంట్ లేదు. ఇందులోని పోస్టుల్ని అపోర్షన్‌మెంట్‌గా పిలిచే డిప్యుటేషన్ విధానంలో భర్తీ చేస్తారు. ఆసక్తి ఉన్న వాళ్లు దరఖాస్తు చేసుకోవాలంటూ గతంలోనే పోలీసు విభాగం అంతర్గతంగా ప్రకటన ఇచ్చింది. దీంతో అనేక మంది ఆసక్తి చూపుతూ ముందుకు కూడా వచ్చారు. ఎస్సైలను రేంజ్ డీఐజీలు, ఇన్‌స్పెక్టర్లను జోన్ ఐజీలు, కానిస్టేబుళ్లను యూనిట్ ఆఫీసర్లు రిలీవ్ చేసి పంపాల్సి ఉంది. వీళ్లల్లో ఎవరూ స్పందించకపోవడంతో అనేక ఖాళీలతో టీఎస్ నాబ్ ఆపసోపాలు పడుతోంది. ఈ విభాగంలో పని చేసే వారికి ప్రత్యేక ప్రోత్సాహకం ఇవ్వనున్నట్లు గతంలో ఉన్నతాధికారులు చెప్పారు. సాధారణంగా రిస్క్‌తో కూడిన ఉద్యోగాలు చేసే వింగ్స్‌కు వేతనంపై 60 శాతం అదనంగా ఇస్తారు. ఇప్పటి వరకు చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో టీఎస్ నాబ్‌లో పని కూడా రిస్క్‌తో కూడిన వ్యవహారంగా తేలింది. అయినప్పటికీ ఈ ప్రోత్సాహకం విషయం ఇప్పుడు ఎవరూ పట్టించుకోవట్లేదు.

వీటి ఊసెత్తేవారే లేరు..

టీఎస్ నాబ్ రాష్ట్ర స్థాయిలో, ఇతర విభాగాలు, రాష్ట్రాలతో సమన్వయంతో పని చేయాల్సి ఉంది. మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగం సహా అన్ని అంశాల పైనా ఈ బ్యూరో కన్నేసి ఉంచి సూత్రధారులకు చెక్ చెప్పాలి. దీని డైరెక్టర్ ఆధీనంలో ఠాణాలు, రీజినల్ నార్కోటిక్ కంట్రోల్ సెల్స్‌తో పాటు 26 నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్స్ పని చేయాలి. ఇన్వెస్టిగేషన్ మానిటరింగ్ అండ్ లీగల్ వింగ్‌లో ఠాణాలు, డాక్యుమెంటేషన్ ట్రైనింగ్ అండ్ అవేర్‌నెస్ వింగ్‌లో డ్రగ్ డిస్పోజల్ అండ్ అవేర్‌నెస్ కమిటీలతో పాటు వివిధ రాష్ట్ర, కేంద్ర విభాగాలు, అడ్మిన్ అండ్ లాజిస్టిక్ వింగ్‌లో ట్రాన్స్‌పోర్టు, కంట్రోల్ రూమ్ తదితరాలు, టెక్నికల్ వింగ్‌లో డేటా ఎనాలసిస్, డార్క్ వెబ్, సోషల్ మీడియా మానిటరింగ్, ఫైనాన్షియల్ ఎనాలసిస్, డిజిటల్ ఫోరెన్సిక్, అఫెండర్స్ మానిటరింగ్ విభాగాలు, స్టేట్ టాస్క్‌ఫోర్స్‌లో నార్కోటిక్స్ డిటెక్షన్ డాగ్స్ విభాగం ఏర్పాటు కావాల్సి ఉంది. ఇవి ఎప్పటికి సాకారమవుతాయన్నది ఎవరూ స్పష్టంగా చెప్పలేకపోతున్నారు.

ఆకాశ్ బైజూస్ విద్యార్థుల హవా



టాప్ స్కోర్ సాధించిన విద్యార్థులతో ఆకాష్ బైజూస్ రీజనల్ డైరెక్టర్ ధీరజ్ మిశ్రా

హిమాయత్‌నగర్: జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్ మొదటి సెషన్‌లో ఆకాశ్ బైజూస్‌కు చెందిన విద్యార్థి రిషి శేఖర్ శుక్లా 100 పర్సంటైల్ సాధించాడు. మంగళవారం విడుదలైన జేఈఈ ఫలితాల్లో టాప్ స్కోర్ సాధించిన విద్యార్థులతో కలిసి హిమాయత్‌నగర్‌లోని ఆకాశ్ ఇనిస్టిట్యూట్‌లో ఫ్యాకల్టీ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రిషి శేఖర్ శుక్లాను ఆకాష్ బైజూస్ రీజనల్ డైరెక్టర్ ధీరజ్ మిశ్రా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిషి శేఖర్ శుక్లా విజయం, విద్యార్థులకు సమగ్ర కోచింగ్, వినూత్న అభ్యాస పరిష్కారాలతో, పోటీ పరీక్షల్లో రాణించేలా చేయడంలో ఆకాశ్ బైజూస్ నిబద్ధతకు కారణమన్నారు. తదుపరి ప్రయత్నంతో పాటు అతని భవిష్యత్ ప్రయత్నాల్లో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఆకాశ్ బైజూస్ క్లాస్ రూమ్ ప్రోగ్రామ్‌లో రిషి శేఖర్ శుక్లా ఫండమెంటల్ కాన్సెప్ట్‌లను అర్థం చేసుకోవడంలో, క్రమశిక్షణతో కూడిన అధ్యయన నియమావళిని కొనసాగించినందునే టాప్ పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు.



విద్యార్థులను సత్కరించిన రెసొనెన్స్ హైదరాబాద్ సెంటర్స్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు

చరిత్ర సృష్టించిన రెసొనెన్స్

మాదాపూర్: దేశవ్యాప్తంగా ఇటీవల జరిగిన జేఈఈ పరీక్షల్లో రెసొనెన్స్ అద్భుత ఫలితాలను సాధించిందని రెసొనెన్స్ హైదరాబాద్ సెంటర్స్ డైరెక్టర్ పూర్ణచంద్ర రావు అన్నారు. మంగళవారం మాదాపూర్‌లోని రెసొనెన్స్ జూనియర్ కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశానికి సంబందించి జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్ తొలి విడత పరీక్ష ఫలితాల్లో రెసొనెన్స్ జూనియర్ కళాశాలల హైదరాబాద్ విద్యార్థులు చరిత్ర సృష్టించారన్నారు. ఐఐటీ, ఎన్ఐటీ, ఎన్ఈఈటీ, మెడికల్ ప్రవేశ పరీక్షల్లో అగ్రశ్రేణి ర్యాంకర్లను తయారు చేయడంలో రెసొనెన్స్ జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిందన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో రెసొనెన్స్ జూనియర్ కాలేజీలకు చెందిన విద్యార్థులు , తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయన టార్గెట్.. ఎవరెస్ట్!

సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ పోలీసు కమిషనరేట్ కొత్త కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి ఓ పర్వతారోహకుడు. ఆదిలాబాద్ ఎస్పీగా పని చేస్తున్న సమయంలోనే పర్వతారోహణపై ఆసక్తి పెంచుకున్న ఆయన ఇప్పటి వరకు 6 పర్వతాలను అధిరోహించారు. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడమే లక్ష్యంగా అనునిత్యం సాధన చేస్తున్నారు డాక్టర్. తరుణ్ జోషి బుధవారం రాచకొండ సీపీగా ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

- రాచకొండ కొత్త సీపీకి పర్వతారోహణ హాబీ
- ఇప్పటికి 6 పర్వతాలను అధిరోహించిన తరుణ్ జోషి
- ఎవరెస్ట్ ఎక్కడమే లక్ష్యంగా అనునిత్యం సాధన
- 'కొత్త బాధ్యతలు' నేడు స్వీకరించే అవకాశం



- పంజాబ్‌కు చెందిన తరుణ్ జోషి పాటియాలాలోని గవర్నమెంట్ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ నుంచి బీడీఎస్ పూర్తి చేసి దంత వైద్యుడిగా మారారు. 2004లో సివిల్ సర్వీసెస్ ఉత్తీర్ణులైన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌లో ఐపీఎస్ అధికారిగా నియమితులయ్యారు.
- ఓ పక్క విధులు నిర్వర్తిస్తూనే కొత్త అంశాలను నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఉద్యోగంలో తర్వాతే పదేళ్ల క్రితం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పోలీస్ మేనేజ్‌మెంట్ విభాగంలో మాస్టర్స్ పూర్తి చేశారు. ఆపై ఎల్ఎల్‌బీలో చేరి 2019 జూలైలో ఉత్తీర్ణులు కావడమే కాదు... వర్సిటీ టాపర్‌గా నిలిచారు.
- తరుణ్ జోషి 2014 నుంచి 2016 వరక ఆదిలాబాద్ జిల్లా ఎస్పీగా పని చేశారు. ప్రస్తుతం ఏపీ పోలీసు విభాగంలో ఉన్న ఎస్పీ జి.రాధిక అప్పట్లో అదే జిల్లాలో అదనపు ఎస్పీగా పని చేశారు. పర్వతారోహణపై పట్టున్న ఆమె పలు పర్వతాలను అధిరోహించారు. విధి నిర్వహణలో భాగంగా అనునిత్యం తరుణ్ జోషిని కలిసే ఆమె తన పర్వతారోహణ అనుభవాలను పంచుకునే వారు.
- ఇలా అనుకోకుండా ఆ రంగంపై ఆసక్తి పెంచుకున్న ఆయన తాను పర్వతారోహకుడు కావాలని భావించారు. సంతృప్తితో పాటు మానసిక, శారీరక దారుఢ్యానికి ఇది ఉపకరిస్తుందనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇదే విషయాన్ని రాధికతో చెప్పగా... తొలుత డార్జిలింగ్‌లోని హిమాలయన్ మౌంటెనీరింగ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ తీసుకోవాలని, ఆపై తుది నిర్ణయానికి రావాలని ఆమె సూచించారు.
- ఆదిలాబాద్ ఎస్పీగా పని చేసినన్నాళ్లు పని ఒత్తిడి నేపథ్యంలో డార్జిలింగ్ వెళ్లడం ఆయనకు సాధ్యం కాలేదు. అక్కడ నుంచి రాచకొండ పోలీసు కమిషనరేట్‌కు తొలి సంయుక్త పోలీసు కమిషనర్‌గా వచ్చిన తరుణ్ తనలో ఉన్న పర్వతారోహణ ఆసక్తికి పదును పెట్టారు.
- 2017లో హిమాలయన్ మౌంటెనీరింగ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్న ఆయన అదే ఏడాది అక్టోబర్‌లో తొలిసారిగా హిమాలయాల్లోనే ఉన్న మౌంట్ రీనాక్‌కు ఎక్కారు. అప్పటి నుంచి అవకాశం దొరికినప్పుడల్లా పర్వతారోహణ చేస్తున్న ఆయన ఇప్పటి వరకు ఆరింటిపై తన కాలు మోపారు. ఎవరెస్ట్‌పై కాలు పెట్టడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు.

తరుణ్ జోషి అధిరోహించిన పర్వతాలు...

- 2018 మేలో సదరన్ రష్యాలోని భారీ అగ్నిపర్వతమైన మౌంట్ ఎల్బ్రస్‌ను ఎక్కారు. సముద్ర మట్టానికి 5,642 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ శిఖరం యూరప్‌లోనే పెద్దది.
- 2019 జనవరిలో అర్జెంటీనాలో ఉన్న మౌంట్ ఎకనగ్వాపై అడుగుపెట్టారు. మెండొజా ప్రావెన్స్‌లో ఉన్న దీని ఎత్తు 6962 మీటర్లు. దక్షిణ అమెరికాలోనే ఎత్తైనది.
- అదే ఏడాది ఆగస్టులో ఇండోనేషియాలో ఉన్న మౌంట్ కార్‌స్టెంజ్స్ అధిరోహించారు. ఇది ప్రపంచంలోని మైదాన ప్రాంతంలో ఉన్న శిఖరాల్లో అతి పెద్దది. దీని ఎత్తు 4,884 మీటర్లు.
- 2020 జనవరి 21న అంటార్కిటికాలోనే అత్యంత ఎత్తైన మౌంట్ విన్సన్‌ను అధిరోహించారు. దీని ఎత్తు 4,897 మీటర్లే అయినప్పటికీ.. మైనస్ 30 డిగ్రీల ఉష్ణోగ్రతతో తీవ్ర ప్రతికూల వాతావరణం ఉంటుంది.
- విన్సన్ అధిరోహించిన మూడు రోజుల్లోనే ఆస్ట్రేలియాలోని అత్యంత ఎత్తయిన మౌండ్ కోస్యూస్కోపై కాలు పెట్టారు. ఇది సముద్ర మట్టానికి 2,280 మీటర్ల ఎత్తులో ఉంటుంది.
- 2021 జనవరి 21న టాంజానియాలో ఉన్న కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించారు. ఇది సముద్ర మట్టానికి 5,895 మీటర్ల ఎత్తులో ఉంది.





లాంగ్ డ్రైవ్ కార్ల యాజమాన్యం దాష్టీకం

సిబ్బందిపై దాడి

మేడిపల్లి: లాంగ్ డ్రైవ్ కార్ల కంపెనీ యాజమాన్యం ఉద్యోగులపై అమానుషంగా ప్రవర్తించిన సంఘటన మంగళవారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొప్పుల హరిదీప్ రెడ్డి అనే వ్యక్తి మేడిపల్లిలో లాంగ్ డ్రైవ్ కార్ల (రెంటల్)పేరులో కంపెనీ నిర్వహిస్తున్నాడు. సదరు కంపెనీలో సాయితరుణ్, ఒబేద్, నితిన్, యోగి, రిషిత, మధుమిత పని చేస్తున్నారు. వీరికి నెలకు రూ.15వేలు వేతనంగా ఇచ్చేవారు. అయితే విధులకు గంట ఆలస్యమైతే రూ.500 కోత విధిస్తుండటంతో వారిలో ఓ యువతి పని మానేసింది. ఇటీవల కంపెనీ వద్దకు వచ్చిన ఆమె స్నేహితులతో మాట్లాడుతుండటాన్ని కంపెనీ నిర్వాహకులు గుర్తించారు. మిగతా ఉద్యోగులు సైతం ఉద్యోగాలు మానివేయనున్నట్లు తెలియడంతో యాజమాని సోమవారం ఆఫీసుకు పిలిపించాడు. సిబ్బందితో కలిసి వారిపై విచక్షణారహితంగా దాడి చేసి చితకబాదాడు. మధ్యాహ్నం ఇద్దరు మహిళలను, రాత్రి మిగతా వారిని వదిలేశారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో మంగళవారం సాయంత్రం కుల సంఘాల నాయకులు, బాధిత కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల్లో ఒకరైన గిరిజన మహిళను కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై సీఐ గోవింద రెడ్డి వివరణ కోరగా యాజమాన్యంపై ముందుగానే కేసు నమోదు చేశామని, గిరిజన మహిళ ఫిర్యాదు మేరకు ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు



బాధితుల ఒంటిపై గాయాలు

ఫలక్‌నుమాలో ఐటీ దాడులు



చాంద్రాయణగుట్ట: పాతబస్తీ ఫలక్‌నుమాలోని వ్యాపారి ఇంట్లో మంగళవారం ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఇంజన్‌బౌలిలోని కింగ్స్ గ్రూప్ అధినేత షానవాజ్ ఇంట్లో ఉదయం నుంచి సోదాలు కొనసాగాయి. ఒక రాజకీయ పార్టీతో సంబంధాలు కలిగి ఉన్న ఇతని ఇల్లు, కార్యాలయాలపై అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా సోదాలు చేశారు. తాజాగా పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ దాడులు కొనసాగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన గిరిజన విద్యార్థులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని గిరిజన బాలుర ఐఐటీ స్టడీ సర్కిల్ విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి అద్భుత ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ గట్ల సురేందర్ తెలిపారు. కే వినోద్ 96.86 పర్సంటైల్‌తో మొదటి స్థానంలో నిలవగా మరో ఐదుగురు విద్యార్థులు 90 పర్సంటైల్,8 మంది విద్యార్థులు 80 శాతం,11 మంది విద్యార్థులు 70 పర్సంటైల్ సాధించారన్నారు. 50 మంది విద్యార్థులకు గాను 40 మంది అర్హత సాధించినట్లు తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన ఉపాధాయులను గురుకుల రీజనల్ కోఆర్డినేటర్ కళ్యాణి , గురుకుల ఉన్నతాధికారులు అభినందించారు.

16న తాగునీటి సరఫరాలో అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న సింగూరు ప్రాజెక్టులో భాగంగా పెద్దాపూర్ పంప్ హౌజ్ దగ్గరున్న 132 కేవీ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల నేపథ్యంలో ఈ నెల 16న కొన్ని ప్రాంతాల్లో పాక్షిక, మరికొన్ని ప్రాంతాల్లో పూర్తిగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మంగళవారం జలమండలి అధికారులు తెలిపారు. షేక్‌పేట్ రిజర్వాయర్ పరిధిలో పూర్తిగా, భోజగుట్టలో పాక్షికంగా, బంజారా, ఎర్రగడ్డ రిజర్వాయర్ల ప్రాంతాల్లో పాక్షికంగా, బోరబండ రిజర్వాయర్ ప్రాంతాల్లో పూర్తిగా, లింగంపల్లి రిజర్వాయర్ ప్రాంతాల్లో, ఆన్‌లైన్ సప్లయ్ పూర్తిగా, ఖానాపూర్ గ్రావిటీ 1200 ఎంఎం మెయిన్ ఆన్‌లైన్ సప్లయ్ ప్రాంతాల్లో పూర్తిగా నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

'వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం'

రసూల్‌పురా: ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ మిలీనియం గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కిషన్ రెడ్డి మాట్లాడుతూ నగరంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. అందుకు అనుగుణంగా కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, త్వరలో వర్గీకరణ జరిగి తీరుతుందని భరోసా ఇచ్చారు. కోర్టునుంచి ఎస్సీ వర్గీకరణపై ఎలాంటి తీర్పు వచ్చినా మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు తప్పనిసరిగా అమలు చేసి తీరతామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు బొర్ర భిక్షపతి మాదిగ, మున్నంగి నాగరాజు, నరేష్, డప్పు మల్లికార్జున్, ఇటుక శ్రీకిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

బహదూర్‌పురా: సేల్ డీడ్ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసేందుకు ఓ వ్యక్తి నుంచి రూ.2 లక్షలు లంచం తీసుకుంటున్న రిజిస్ట్రార్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే..దూద్‌బౌలి సబ్ రిజిస్ట్రార్ ఆరు నెలల క్రితం బదిలీ కావడంతో ఆయన స్థానంలో అదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అమీర్ ఫరాజ్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. షాలిబండకు చెందిన సయ్యద్ షహబాజ్, అతని స్నేహితుడు పర్వేజ్ చెందిన రెండు సేల్ డీడ్ పత్రాలను ఒకటి తన పేరున, మరొకటి స్నేహితునితో కలిసి జాయింట్ రిజిస్ట్రేషన్ చేయాలని కోరాడు. అందుకు అమీర్ ఫరాజ్ రూ.2 లక్షలు డిమాండ్ చేశాడు. ఇందుకు అంగీకరించిన సయ్యద్ షహబాజ్ సబ్ రిజిస్ట్రార్ సూచన మేరకు కార్యాలయంలో హెల్పర్‌గా పనిచేస్తున్న గోపీసింగ్ అనే వ్యక్తికి నగదు అందజేస్తుండగా అప్పటికే అక్కడ మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు గోపీ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడిచ్చిన సమాచారం అధారంగా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అమేర్ ఫరాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు.



సబ్ రిజిస్ట్రార్ అమీర్ ఫరాజ్

ఆలయంలో చోరీకి యత్నం

ఇద్దరు నిందితుల అరెస్ట్

బంజారాహిల్స్: ఆలయంలోకి చొరబడి హుండీని పగులగొట్టి చోరీకి యత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులను స్థానికులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-11లోని ఉదయ్‌నగర్‌లోని శివ వీరాంజనేయస్వామి ఆలయంలోకి సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇద్దరు వ్యక్తులు చొరబడ్డారు. ఆలయంలోని హుండీని పగులగొట్టే ప్రయత్నం చేస్తుండగా అలికిడికి ఆలయం పక్కనే నివాసం ఉంటున్న పూజారి స్థానికులతో కలిసి అక్కడికి చేరుకున్నాడు. దొంగలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఆలయ అధ్యక్షుడు తలారి రవికుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంబీబీఎస్ అర్హత లేకున్నా వైద్యం

కేసు నమోదు

బంజారాహిల్స్: ఎంబీబీఎస్ డిగ్రీ అర్హత లేకుండా క్లినిక్ నడిపిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) విజిలెన్స్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-5 ఇంద్రానగర్ జవహర్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ సమీపంలో జీ రామకృష్ణ అనే వ్యక్తి ఎస్‌వీ క్లినిక్/ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరిట వైద్యశాలను నిర్వహిస్తున్నాడు. అయితే రామకృష్ణ ఎంబీబీఎస్ డిగ్రీ లేదని, అర్హత లేకుండా వైద్యం చేస్తున్నారంటూ టీఎస్ఎంసీకి ఫిర్యాదు అందింది. ఆ మేరకు విజిలెన్స్ అధికారులు సదరు వైద్యశాలను సందర్శించి విచారణ చేపట్టారు. క్లినిక్‌లో ఇన్‌పేషెంట్స్ కోసం మూడు బెడ్‌లను ఏర్పాటుచేయడంతో పాటు అక్కడికి వచ్చే రోగులకు అల్లోపతి మందులు రాస్తూ ఇంజక్షన్లు ఇస్తున్నట్లు గుర్తించారు. విజిలెన్స్ అధికారి రాము ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

'బీజేపీ విధానాలపై పోరాడాలి'

హిమాయత్‌నగర్: 'మత సామరస్యాన్ని నెలకొల్పిన ఛత్రపతి శివాజీ మహరాజ్ ఆశయాలు, లక్ష్యాల కోసమే పోరాడుదాం' అనే అంశంపై హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో మంగళవారం సెమినార్ జరిగింది. సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఛాయాదేవి అధ్యక్షత వహించారు. పూలే–అంబేడ్కర్ సెంటర్ ఫర్ ఫిలాసాఫికల్, ఇంగ్లిష్ ట్రెనింగ్ డైరెక్టర్ డాక్టర్ బాలబోయిన సుదర్శన్ మాట్లాడారు. జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గోవిందా పన్సర్ లాంటి మహనీయులు శివాజీ వాస్తవ చరిత్రను తీసుకొచ్చే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు నళిని, ఎస్.శ్రీకాంత్, కె.శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు సి.శ్రీనివాస్, మహమూద్, రాష్ట్ర నాయకులు రాజమౌళి, రాజ్‌కుమార్, సీపీఐ నాయకులు నర్సింగ్, సురేందర్, కల్యాణ్, అనిల్, అరుణ్, నిజాం కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం


విద్యుత్తు సిబ్బందిని సన్మానిస్తున్న ఫసీయుద్దీన్

రహమత్‌నగర్: పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ గుర్తు చేశారు. బోరబండ డివిజన్‌లో మంగళవారం పలు బస్తీల్లో ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫసీయుద్దీన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలతో పేదలకు మేలు చేకూరుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి కాలం చెల్లిందని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని సీట్లు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బస్తీల్లో సేవలందిస్తున్న విద్యుత్తు సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు వినోద్‌కుమార్, నర్సింహ, ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

కల్లు దుకాణానికి వెళ్లి..

వెంగళరావునగర్: కల్లు దుకాణానికి వెళ్లిన మహిళపై వాచ్‌మన్ అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. రహమత్‌నగర్ డివిజన్ ఎస్‌పిఆర్ హిల్స్‌లో ఉంటున్న నాగమణి ఈనెల 11వ తేదీ సాయంత్రం యూసుఫ్‌గూడలోని కల్లు దుకాణానికి వెళ్లింది. తన తండ్రికి కల్లు అలవాటు ఉందని, మంచం నుంచి లేవలేని కారణంగా తాను ఇక్కడికి వచ్చానని అక్కడున్న వాచ్‌మన్‌కు చెప్పింది. ఈక్రమంలో వాచ్‌మెన్ రాజేందర్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడంతో బాధితురాలు కౌంటర్‌లో ఉన్న వ్యక్తి విషయం చెప్పింది. దీంతో ఆగ్రహించిన వాచ్‌మన్ నాగమణిని తీవ్రమైన దూషిస్తూ చెంప మీద కొట్టడంతో ఆమె కింద పడిపోయింది. చుట్టుపక్కల వారు ఆమెకు సహాయం చేసి.. అక్కడి నుంచి పంపించి వేశారు. బాధితురాలు మంగళవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బస్సు ఎక్కించేందుకు వచ్చి..


వెంగళరావునగర్: స్నేహితుడిని బస్సు ఎక్కించడానికి వచ్చిన యువకుడిపై మరో వ్యక్తి అకారణంగా దాడి చేసిన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. మణికొండ ప్రాంతానికి చెందిన శ్రీహర్ష చక్రవర్తి ఈ నెల 11వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో తన స్నేహితులను తీసుకుని అమీర్‌పేట బస్టాప్‌కు వచ్చాడు. ఒక స్నేహితుడు బస్సు ఎక్కిన తర్వాత శ్రీహర్ష సమీపంలోని ఆకాంక్ష టూరిజం ట్రావెల్స్ వద్దకు వెళ్లాడు. అదే సమయంలో అక్కడున్న ఒక బస్సులోని గుర్తు తెలియని వ్యక్తి వచ్చి అకస్మాత్తుగా శ్రీహర్షపై దాడి చేయడంతో పాటు దుర్భాషలాడాడు. ఈక్రమంలో బాధితుడి కారు సైతం పాక్షికంగా ధ్వంసమైంది. ఘటనను చుట్టుపక్కల వారు సైతం అడ్డుకోలేదు. క్షతగాత్రుడు చికిత్స అనంతరం మంగళవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా, తనపై దాడి చేసిన వ్యక్తి పేరు మహ్మద్ వాసీంగా గుర్తించినట్టు శ్రీహర్ష తెలిపాడు.

ప్రత్యేక అలంకరణలో..



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని భవానీనగర్‌లో శ్రీ విశ్వసాయి మందిరంలో మాఘమాస మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మార్చి 10వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ సాయిబాబా వారికి ప్రదోష కాలంలో సాయంత్రం 4.15 గంటల నుంచి 6 వరకు విశేష అభిషేకాలు, సహస్రనామ పుష్పార్చనలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం బాబా వారికి తేనెతో అభిషేకం చేశారు.

7 ఖరా



త్వరలో జరగనున్న పది వార్షిక పరీక్షల్లో నూతన విధానం అందుబాటులోకి వచ్చింది. గతంలో ఆరు సబ్జెక్టులకు ఆరు పేపర్లు ఉండగా.. ఈ ఏడాది నుంచి ఏడు పేపర్లు ఉంటాయి. సామాన్య శాస్త్రం పరీక్షను రెండు రోజుల పాటు నిర్వహించడమే ఇందుకు కారణం.

ఈ వార్షిక పరీక్షల్లో సైన్స్ సబ్జెక్టు పరీక్షను రెండు రోజుల పాటు ఉండటంతో విద్యార్థుల కోసం టీచర్లు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సైన్స్ పరీక్షల్లో భాగంగా ఫిజికల్, బయోలాజికల్ సైన్స్ పేపర్లు వేర్వేరుగా ఉంటాయి. ప్రతి పేపర్‌కు 50 మార్కులు కేటాయించారు. ఇప్పటి వరకు సైన్స్ పరీక్షను ఒక్క రోజే జరిగేది. విద్యార్థులు, ఉపాధ్యాయుల డిమాండ్ మేరకు ప్రభుత్వం ఎట్టకేలకు కొత్త పరీక్ష విధానానికి ఆమోదం తెలిపింది.





బంజారాహిల్స్: వచ్చే నెల 18వ తేదీ నుంచి 30 వరకు నిర్వహించనున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో సామాన్య శాస్త్రం (సైన్స్) పరీక్షను రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఖైరతాబాద్ విద్యాశాఖ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్లలోని 17 ప్రభుత్వ ఉన్నత, 2 ఎయిడెడ్, 2 రెసిడెన్షియల్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులను ఉపాధ్యాయులు సన్నద్ధం చేస్తున్నారు. ఈ పరీక్షల్లో జోన్ పరిధి నుంచి సుమారు 1,800 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

గతంలో ఇబ్బందులివీ..

గతంలో రెండు పేపర్లు ఒకే రోజు నిర్వహించడంతో చదవడం, రాయడంలో విద్యార్థులు ఇబ్బందిపడేవారని రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు సురేందర్ తెలిపారు. అయితే, ఈసారి ఆ సమస్య ఉండదని స్పష్టం చేశారు. భౌతిక, రసాయన, జీవ శాస్త్రాలకు వేర్వేరుగా పాఠ్య పుస్తకాలు, వాటిని బోధనకు ఇద్దరు ఉపాధ్యాయులను ఉండేవారని ఆయన గుర్తుచేశారు. అయితే, ఒకే రోజు పరీక్ష నిర్వహిస్తుండటంతో ఇద్దరు ఉపాధ్యాయులు చెప్పిన వేర్వేరు పాఠ్యాంశాలను కలిపి రాయాల్సి వచ్చేదన్నారు. దీంతో అనేక మంది విద్యార్థులు గందరగోళానికి గురయ్యేవారని చెప్పారు. ఈక్రమంలో ఉత్తీర్ణత శాతం తగ్గడంతో పాటు చాలా మంది ఫెయిలైన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. దీంతో ఈ పరీక్షను వేర్వేరుగా నిర్వహించాలనే డిమాండ్ గత ఐదేళ్లుగా ఉందని.. అప్పుడు విద్యార్థుల కల నెరవేరిందని సురేందర్ చెప్పారు.

విద్యార్థుల సామర్థ్యం తెలుసుకునేలా..

సైన్స్ పరీక్ష వేర్వేరుగా నిర్వహించడం వల్ల విద్యార్థులు తమ సామర్థ్యం తెలుసుకునేందుకు వీలుంటుంది. అదేవిధంగా సబ్జెక్టులపై దృష్టి పెట్టేందుకు టీచర్లకు సైతం అవకాశం ఉంటుందని బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జనార్దన్ తెలిపారు. గణితం, ఫిజికల్ సైన్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు కెమెస్ట్రీ, ఇంజినీరింగ్ తదితర రంగాలను కెరీర్‌ను ఎంచుకునే అవకాశం ఉంటుందన్నారు. బయోలాజికల్ సైన్స్‌లో ప్రతిభ చూపితే బోటనీ, జువాలజీ, మెడికల్, డెంటల్, వెటర్నరీ, ఫార్మసీ, అగ్రికల్చర్, నర్సింగ్ తదితర రంగాల్లో మంచి ప్రతిభ చూపేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా, సైన్స్‌లో రెండు పేపర్లు వేర్వేరుగా నిర్వహించడం వల్ల విద్యార్థులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి ఫలితాలు కూడా మెరుగ్గా వస్తాయని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

సమస్యలపై 'పశు సంవర్ధక శాఖ' వినతి


డైరెక్టర్‌ని కలిసిన నూతన కార్యవర్గం

హిమాయత్‌నగర్: రాష్ట్ర పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం(టీఈఏ) వెటర్నరీ, యానిమల్ హస్బెండరీ నూతన కార్యవర్గం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ శాఖ కార్యాయంలో ప్రతినిధులు డైరెక్టర్ డాక్టర్ ఎస్.రాంచందర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం టీఈఏ కేంద్ర సంఘం అధ్యక్షురాలు డాక్టర్ నిర్మల మాట్లాడుతూ.. పశు సంవర్ధక శాఖలోని ఉద్యోగుల సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. జీఓ 317 ప్రకారం బాధిత ఉద్యోగులకు డిప్యూటేషన్‌కు అవకాశం ఇవ్వాలని కోరామని తెలిపారు. వీఏ నుంచి ఎల్ఎస్ఏ ప్రమోషన్లు త్వరగా ఇవ్వాలని కోరామన్నారు. నిబంధనలకు అనుకూలంగా ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని డైరెక్టర్ హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో టీఈఏ రాష్ట్ర కార్యదర్శి యాకుబ్ పాషా, నూతన ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కె.రాజు, మహిళ అధ్యక్షురాలు డాక్టర్ పి.వసంతకుమారి, చీఫ్ అడ్వైజర్ ఎ.కురుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి పి.కనకరాజు, కోశాధికారి ఎం.రామచంద్రం, కార్యవర్గ సభ్యులు ఎం.ప్రతాప్, ఎ.తిరుపతాచారి, ఎ.సైదులు, ఎం.బాబయ్య, కె.అశ్విని, బి.వనజ వల్లి, ఎల్.జానకి బాయి, ఎం.ఎ.ఖయ్యూం పాల్గొన్నారు.

అద్దె హాస్టల్ ఖాళీ చేయమంటే బెదిరింపులు

వెంగళరావునగర్: హాస్టల్ కోసం ఓ ఇంటిని అద్దెకు తీసుకుని.. తీరా ఖాళీ చేయమంటే యజమానినే బెదిరింపులకు గురి చేస్తున్న సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. మణికొండ ప్రాంతానికి చెందిన ఎస్.రమణమ్మకు వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌కాలనీలో జీ ప్లస్ 5 బిల్డింగ్ ఉంది. కొన్నేళ్ల క్రితం రామతులసి అనే మహిళ ఆ ఇంటిని లేడీస్ హాస్టల్ నిర్వహణ కోసం అద్దెకు తీసుకుంది. అయితే, ఇటీవల ఆమె గతంలో చేసుకున్న అగ్రిమెంట్ పూర్తయింది. దాంతో రమణమ్మ తన ఇంటిని ఖాళీ చేయమని రామతులసికి చెప్పగా ఆమె ఖాళీ చేయలేదు. అంతేగాకుండా మారుతీ అనే వ్యక్తి సాయంతో కోర్టులో కేసు వేసి స్టే ఆర్డర్ తెచ్చుకుంది. ఈక్రమంలో ఈనెల 7వ తేదీన కోర్టు స్టేటస్ కో ఆర్డర్‌ను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. అయినప్పటికీ రామతులిసి ఇల్లు ఖాళీ చేయకపోగా కొన్ని పేపర్లపై సంతకం చేయాలంటూ రమణమ్మని బెదిరించింది. ఈనెల 11న వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌కాలనీలో రామతులసితో మాట్లాడేందుకు రమణమ్మ బయలుదేరగా.. కాలనీ సమీపంలోనే ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమెపై దాడి చేసి పారిపోయాడు. చుట్టుపక్కల వారు బాధితురాలిని వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌కాలనీకి తీసుకువచ్చారు. రామతులసితో పాటు ఆమె లాయర్ అక్కడికొచ్చి కొన్ని కాగితాలపై సంతకం చేయాలని, లేనిపక్షంలో తన పిల్లలను అమెరికా వెళ్లనివ్వమని హెచ్చరించారు. అంతేకాదు తులసితో పాటు వచ్చిన శిరీష అనే యువతి తాను వరంగల్ డీఐజీ ఉదయభాను కోడలినని బెదిరించింది. వీరువురి మధ్యా మాటలు ముగిసిన తర్వాత రమణమ్మ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని మంగళవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బాలమల్లేశ్

హిమాయత్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామీణ బంద్, సమ్మెను జయప్రదం చేయాలని బీకేఎంయూ, ఏఐఏడబ్ల్యూయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎ.బాలమల్లేశ్, ఆర్.వెంకట్రాములు పిలుపునిచ్చారు. సోమవారం హిమాయత్‌నగర్ మఖ్దూంభవ రాజ్‌బహదూర్‌గౌర్ హాల్‌లో బీకేఎంయూసీ, ఏఐఏడబ్ల్యూయూ, డీబీఎస్, ఏఐఏడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాలమల్లేశ్, వెంకట్రాములు మాట్లాడుతూ.. మూడు వ్యవసాయ చట్టాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరిస్తామని చెప్పి మాట తప్పడం అన్యాయమన్నారు. ఉద్యోగ భద్ర కల్పించడంతో పాటు ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచాలని, రోజుకు రూ.800 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీబీఎఫ్ నవీన్, ఏఐఏడబ్ల్యూఎఫ్ రాష్ట్ర నాయకుడు కె.బాబురావు, బీకేఎంయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాములు గౌడ్, కార్యదర్శి టి.శంకర్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అంజయ్య, కార్యదర్శి బుద్దుల జంగయ్య, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

నల్లగొండ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు


బీఆర్ఎస్ సభకు తరలివెళ్తున్న ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: నల్లగొండలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభకు ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పార్టీ నేతలు తరలి వెళ్లారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో అక్కడికి చేరుకున్నారు. సభకు వెళ్లిన వారిలో నాయకులు మామిడి నర్సింగరావు, ఆకుల రాజు, నగేశ్ సాగర్, గోపాల్ నాయక్, సాయిలు, ఘని, రాము, బస్వరాజ్, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

కేసీఆర్ వెంటే మేమంతా..

వెంగళరావునగర్: ప్రత్యేక తెలంగాణ సాధనలో ముందుండి పోరాడి.. పదేళ్లు సీఎంగా సేవలందించిన కేసీఆర్ వెంటే తామంతా ఉంటామని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ స్పష్టం చేశారు. నల్లగొండలో జరిగిన కేసీఆర్ బహిరంగ సభకు మంగళవారం కార్పొరేటర్ దేదీప్య ఆధ్వర్యంలో డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నేతలు బస్సుల్లో తరలి వెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, శ్యాంరావు ముదిరాజ్, వేణు, కిట్టు, జహంగీర్, యాదగిరి, సురేశ్ ముదిరాజ్, శ్రీనివాస్ ఉన్నారు.

'సమస్యలపై పోరాడని మేధావులు వృథా'


నాగేశ్వర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

బంజారాహిల్స్: ప్రజా సమస్యలపై స్పందించని, వ్యవస్థలను ప్రశ్నించని మేధావులు సమాజంలో ఉన్నా లేకున్నా ఒక్కటేనని ప్రముఖ పాత్రికేయుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అభిప్రాయపడ్డారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.బషీరుద్దీన్ 88వ జయంతిని పురస్కరించుకుని యూనివర్సిటీలో స్మారక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నాగేశ్వర్ హాజరై బషీరుద్దీన్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం 'ప్రజా మేధావిగా పాత్రికేయుడు' అనే అంశంపై మాట్లాడారు. విశ్వవిద్యాలయాల్లో ఉండే అధ్యాపకులు, మేధావి వర్గం ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నించాలన్నారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో అటు మీడియా గానీ, ఇటు విశ్వవిద్యాలయాల్లో పనిచేసే మేధావి వర్గం గానీ ప్రశ్నించే అవకాశం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.సీతారామారావు మాట్లాడుతూ.. తెలంగాణ మేధావి వర్గంలో ప్రొఫెసర్ బషీరుద్దీన్ ఒకరన్నారు. అంబేడ్కర్ వర్శిటీలోని మౌలిక వసతుల ఏర్పాటులో ఆయన పాత్ర ఎంతో ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏవీఎన్ఆర్ రెడ్డి, మాజీ అధ్యాపకులు ఘంటా చక్రపాణి, వెంకటయ్య, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

సుందరీకరణ పనులను పరిశీలించిన జోనల్ కమిషనర్

బంజారాహిల్స్: రాజభవన్ రోడ్డులోని సెంట్రల్ మీడియన్ల(డివైడర్లు)ను మరింత సుందరంగా తీర్చిదిద్దాలని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. మంగళవారం ఆయన జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 ఉప కమిషనర్ జగన్, ఈఈ ఇందిరాబాయి, ఇతర ఇంజినీర్లతో కలిసి రాజ్‌భవన్ రోడ్డులోని సెంట్రల్ మీడియన్లను పరిశీలించారు. అలాగే కుందన్‌బాగ్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు కూడా పర్యవేక్షించారు. పనుల్లో నాణ్యత ఉండటంతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం స్థానిక సమస్యలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పూర్తి కావాల్సిన పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.



కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షురాలిగా ఫరియానా



శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ ఎర్రగడ్డ డివిజన్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా సీనియర్ నాయకురాలు ఫరియానా బేగం నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెకు మంగళవారం సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు కవిత, నియోజకవర్గ అధ్యక్షురాలు ప్రీతి ధ్రువీకరణపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫరియానా బేగం మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. పార్టీ డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజారుద్దీన్, ప్రధాన కార్యదర్శి ఫాహీం, ఇబ్రహీం, సలాం తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

గుండెపోటుతో మృతి

రహమత్‌నగర్: రహమత్‌నగర్ హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్.గోపాల్ రెడ్డి(50) సోమవారం తెల్లవారు జామున గుండె పోటుతో మృతి చెందారు. సమాచారం అందుకున్న మాజీ వార్డు కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ చైర్మన్ కాసాల అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జగన్, కమిటీ సభ్యులు సంజీవ్‌గౌడ్, అనిల్‌కుమార్, శ్రావణ్‌లు గోపాల్ రెడ్డి నివాసానికి చేరుకొని సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం ఈఎస్ఐ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దీపాలంకరణ



బంజారాహిల్స్: వార్షిక రథ మహోత్సవాలకు జూబ్లీ హిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. నేటి నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాల కోసం ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ నెల 17వ తేదీ వరకు ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు కొనసాగనున్నాయి. 14వ తేదీ ఉదయం ఆలయ ట్రస్టీలు పి.ఇందిరాజనార్దన్‌రెడ్డి, పి.విష్ణువర్ధన్‌రెడ్డిచే విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనము, పంచగవ్య ప్రాశన, ఆచార్య బ్రహ్మాది ఋత్విగ్వరణము, దీక్షాధారణము, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణము, అఖండ దీపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ తెలిపారు. రాత్రి 8 గంటలకు ఉత్సవమూర్తి పల్లకి సేవ, 15వ తేదీ ఉదయం 9 గంటలకు దేవీ భాగవత పారాయణం, రుద్రహోమములు, మూలమంత్ర అనుష్టాన హోమములు, రాత్రి 8 గంటలకు పల్లకి సేవ, 16వ తేదీ ఉదయ 8 గంటలకు చండీ హోమాలు, 11.10 గంటలకు దిక్పాలిక భైరవ బలిహరణం, రథపూజ, పూర్ణాహుతి, కలశోద్వాసన, సాయంత్రం 6 గంటలకు ఉత్సవమూర్తి ఊరేగింపు, అనంతరం విశేష బాణాసంచా విన్యాసములు, 17వ తేదీ ఉదయం 9 గంటలకు ఉత్సవమూర్తికి పుష్కరి స్నానం జరుగుతాయి.



● సత్కారం



లిబర్టీ: తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన గాయని సుశీలకు ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ మంగళవారం సత్కరించారు. దాదాపు ఐదు దశాబ్దాల పాటు తెలుగు సినీ రంగానికి సేవలంచిన సుశీల చిత్రసీమలో తనదైన ముద్ర వేశారని ఈ సందర్భంగా ఆదినారాయణ గుర్తుచేశారు. కార్యక్రమంలో రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● సన్మానం



లిబర్టీ: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను తెలంగాణ రాష్ట్ర దళిత బహుజన విద్యార్థి సమైక్య శాఖ అధ్యక్షుడు వలిగొండ శ్రీనివాస్ మంగళవారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యల మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని, దళిత బహుజనుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని శ్రీనివాస్ కోరారు.

● సేవాగుణం



లిబర్టీ: పేదల ఆకలి తీర్చాల్సిన బాధ్యత సమాజంపై ఉందని భారతీయ ధార్మిక సేవా సమితి జాతీయ అధ్యక్షుడు కేవీఎన్ శర్మ అన్నారు. సమితి ఆధ్వర్యంలో మంగళవారం పలు ఆలయాలతో పాటు వివిధ ప్రాంతాల్లో పర్యటించి పేదలకు బియ్యం, దుస్తులు అందజేశారు.

శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించాలి

రహమత్‌నగర్: ఈ నెల 19న జరగనున్న ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు లంకల దీపక్‌రెడ్డి, బోరబండ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్ పిలుపునిచ్చారు. బోరబండ బస్‌స్టాప్ వద్ద ఉన్న సాయిబాబా ఆలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 19వ తేదీ సాయంత్ర 4 గంటలకు మోతినగర్ నుంచి శోభయాత్ర ప్రారంభమై బోరబండ బస్‌స్టాప్ వరకు కొనసాగుతుందన్నారు. సమావేశంలో శరణ్‌రెడ్డి, కృష్ణమోహన్, దర్శనం నాగేశ్, జనార్దన్, శ్రీనివాస్, మధు, అనిల్, అన్నపూర్ణ, రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రేమోన్మాదిపై కేసు నమోదు

వెంగళరావునగర్: ప్రేమించానని నమ్మించి యువతిని లోబరచుకోవడమే కాకుండా ఆమెను వేధిస్తున్న వ్యక్తిపై మధురానగర్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. నగరానికి చెందిన ఓ యువతి గతంలో దిల్‌సుఖ్‌నగర్‌లో ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తూ దీపక్ మోహన్ అనే యువకుడిని ప్రేమించింది. అయితే, కొంతకాలానికి ఎస్ఆర్‌నగర్‌లో మరో ఉద్యోగంలో చేరింది. ఈక్రమంలో తాను ప్రేమించిన వ్యక్తి తరచూ ఎస్ఆర్‌నగర్ కార్యాలయానికి వచ్చి ఆమెను వేధించేవాడు. ఆమె ప్రవర్తన మంచిది కాదంటూ ప్రచారం చేశాడు. గత ఏడాది నవంబరు 24వ తేదీన యూసుఫ్‌గూడలో ఓ హోటల్‌కు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఆపై ఫొటోలు, వీడియోలు తీసి ఆమెను బెదిరించాడు. వాటిని తొలగించాలని ఆమె వేడుకోవడంతో సోమశిల రావాలని చెప్పాడు. అక్కడకు వెళ్లగా ఫోన్‌లో ఉన్న ఫొటోలు, వీడియోలను తొలగించినట్టు నమ్మించాడు. ఈక్రమంలో కొద్ది రోజుల తర్వాత తాను పిలిచినప్పుడు రాకపోతే ఫొటోలు, వీడియోలు వైరల్ చేస్తానని మళ్లీ బెదిరించడం మొదలుపెట్టాడు. దీంతో బాధితురాలు మంగళవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

'ఎమ్మార్పీఎస్' నూతన నాయకులు

రహమత్‌నగర్: తెలంగాణ ఎమ్మార్పీఎస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమావేశం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బంగారు శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ అధ్యక్షుడిగా విశాల్ మాదిగ, యువసేన అధ్యక్షుడిగా నాందెడ్ తరుణ్ మాదిగ, రహమత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా విజయ్‌కిరణ్ మాదిగ, శ్రీనగర్ కాలనీ డివిజన్ అధ్యక్షుడిగా ఎర్రోళ్ల విమల్ మాదిగను ఎన్నుకున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి బోటిక మహేశ్ మాదిగ, నాయకులు చంద్రశేఖర్ మాదిగ, తమప్ప మాదిగ, అనిల్ రంజిత్ మాదిగ, ఐలపాక శివ మాదిగ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎల్లో మీడియా చానల్స్‌ను ప్రతివాదులుగా చేర్చిన హైకోర్టు

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో టీడీపీ అధినేత చంద్రబాబుకు రిమాండ్ విధించడంతోపాటు కేసు కొట్టేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చుతూ తీర్పునిచ్చినందుకు ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులతోపాటు ఏసీబీ కోర్టు జడ్జిని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో అసభ్య పోస్టింగ్‌లు, కామెంట్లు పెట్టడంపై దాఖలైన క్రిమినల్ కోర్టు ధిక్కార వ్యాజ్యంలో ఎల్లో మీడియా చానల్స్ టీవీ 5, మహాన్యూస్, మైరా మీడియా సంస్థలను హైకోర్టు ప్రతివాదులుగా చేర్చింది. హైకోర్టు న్యాయమూర్తులు, ఏసీబీ కోర్టు న్యాయాధికారిపై యూట్యూబ్‌లో ఉంచిన అసభ్యకర, అభ్యంతరకర పోస్టులను తొలగించాలని గూగుల్ ఎల్‌ఎల్‌సీని ఆదేశించింది. కాగా.. తమ మాధ్యమాల్లో ఉంచిన అసభ్యకర, అభ్యంతరకర పోస్టులను ఇప్పటికే తొలగించామని ప్రముఖ ఆన్‌లైన్ సామాజిక మాధ్యమ సంస్థలైన ఎక్స్, ఫేస్‌బుక్ హైకోర్టుకు నివేదించాయి. ఈ వివరాలను హైకోర్టు రికార్డ్ చేసింది. ఈ కోర్టు ధిక్కార వ్యాజ్యంలో పలువురికి ఇంకా నోటీసులు అందచేయాల్సి ఉందని, అందువల్ల నోటీసులు అందజేసేందుకు మరికొంత గడువు ఇవ్వాలని అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ హైకోర్టును అభ్యర్థించారు. ఇందుకు అంగీకరించిన హైకోర్టు తదుపరి విచారణను మార్చి 26కి వాయిదా వేసింది.

అటు ఆటలు ఇటు ఆరోగ్యం

- మట్టిలో మాణిక్యాల్ని వెలికితీద్దాం
- జాతీయ, అంతర్జాతీయ వేదికలకు పరిచయం చేద్దాం

''మన ఊరిలో.. మన వార్డులో మట్టిలో మాణిక్యాలు ఎందరో ఉన్నారు. వారందరినీ గుర్తించి సాన పట్టగలిగితే జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేయవచ్చు. అలాంటి వారిని గుర్తించేందుకే 'ఆడుదాం ఆంధ్రా..' అనే బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది'' – సీఎం జగన్

ఇకపై ఏటా 'ఆడుదాం ఆంధ్ర': సీఎం జగన్



మహిళా క్రికెట్ విభాగంలో విజేతగా నిలిచిన ఎన్టీఆర్ జిల్లా సిద్దార్థ నగర్ సచివాలయ జట్టుకు రూ.5 లక్షల చెక్కు, కప్‌ను అందించిన సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: సచివాలయ స్థాయి నుంచి ఆరోగ్యంపై శ్రద్ధ, ఆటలపై మక్కువ పెంచేందుకు 'ఆడుదాం ఆంధ్రా..' కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 25.45 లక్షల మంది క్రీడాకారులు ఇందులో పాలుపంచుకున్నారని, ఈ కార్యక్రమాన్ని ఏటా ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. 47 రోజుల పాటు ఉత్సాహభరితంగా నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా' ముగింపు ఉత్సవాలు మంగళవారం విశాఖలోని డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రి జగన్ ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఆరోగ్యం, వ్యాయామంపై అవగాహన పెంచేలా..

మన ఆరోగ్యానికి వ్యాయామం, క్రీడలు ఎంత అవసరం అనే అంశంపై రాష్ట్రంలోని ప్రతి ఇంటిలో, ప్రతి గ్రామంలో అవగాహన పెరగాలి. ఆడుదాం ఆంధ్రా ద్వారా ఆరోగ్యం, వ్యాయామం పట్ల అవగాహన పెరగాలన్నది ఒక ఉద్దేశమైతే గ్రామ స్థాయి నుంచి మట్టిలోని మాణిక్యాల్ని గుర్తించి వారి ప్రతిభకు సాన పెట్టి శిక్షణ ఇవ్వడం మరో లక్ష్యం. తద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన యువత రాణించేలా ప్రోత్సహించవచ్చు.

తమ్ముళ్లు, చెల్లెమ్మలకు ఆల్ ది బెస్ట్..

క్రికెట్‌లో ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెమ్మలను టాలెంటెడ్ ప్లేయర్స్‌గా గుర్తించాం. కబడ్డీలో ముగ్గురు తమ్ముళ్లు, ఒక చెల్లెమ్మను గుర్తించాం. వాలీబాల్‌లో ఒక తమ్ముడు, ఒక చెల్లెమ్మ ప్రతిభను చాటుకున్నారు. ఖోఖోలో ఒక తమ్ముడు, చెల్లెమ్మ ప్రతిభను గుర్తించాం. బ్యాడ్మింటన్‌లో ఒక తమ్ముడు, చెల్లెమ్మ ప్రతిభ నిరూపించుకున్నారు. వారికి సరైన శిక్షణ ఇవ్వగలిగితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో ప్రోత్సహిస్తూ అడుగులు వేస్తున్నాం. ఎంపికైన తమ్ముళ్లు, చెల్లెమ్మలకు ఆల్ ద బెస్ట్.

రిలయన్స్, బిర్లా భారీ పెట్టుబడులు

- నేడు వర్చువల్‌గా సీఎం జగన్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రూ.1,700 కోట్లతో ఆదిత్య బిర్లా కార్బన్ బ్లాక్ మాన్యుఫ్యాక్చర్ ఫెసిలిటీ
- రూ.1,024 కోట్లతో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్లు
- పలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభం
- మొత్తం 10 కంపెనీలు.. రూ.4,883 కోట్ల పెట్టుబడులు
- 4,046 మందికి ఉద్యోగాలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగ అభివృద్ధిలో మరో కీలక ఘట్టానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు శ్రీకారం చుడుతున్నారు. రిలయన్స్ బయో ఎనర్జీ, ఆదిత్య బిర్లా గ్రూప్‌తోపాటు పలు సంస్థలు రాష్ట్రంలో నెలకొల్పుతున్న పరిశ్రమలకు ముఖ్యమంత్రి జగన్ బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ.4,178 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటవుతున్న పలు పరిశ్రమలకు భూమి పూజ నిర్వహించనున్నారు. ఇవి కాకుండా రూ.655 కోట్లతో నెలకొల్పిన ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్లను ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించనున్నారు. మొత్తంగా సుమారు రూ.4,833 కోట్ల పెట్టుబడులు రానుండగా కొత్తగా 4,046 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.

తొలుత 8 చోట్ల రిలయన్స్ ప్లాంట్లు

రిలయన్స్ బయో ఎనర్జీ రాష్ట్రంలో 8 ప్రాంతాల్లో వ్యవసాయ వ్యర్థాల నుంచి బయో గ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. మొత్తం రూ.1,024 కోట్ల పెట్టుబడితో తొలి దశలో కాకినాడ, రాజమండ్రి, విజయవాడ, కర్నూలు, నెల్లూరులో బయో గ్యాస్ ప్లాంట్లను నెలకొల్పనుంది. తద్వారా 576 మందికి ఉద్యోగావ అవకాశాలు లభించనున్నాయి. ఆదిత్య బిర్లా గ్రూప్ రూ.1,700 కోట్ల పెట్టుబడితో తిరుపతి జిల్లా నాయుడుపేటలో మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ కార్బన్ బ్లాక్‌ను ఏర్పాటు చేయనుంది. దీనిద్వారా 250 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. వీటితో పాటు హెల్లా ఇన్‌ఫ్రా, వెసువియస్ ఇండియా లిమిటెడ్, ఏపీఐఐసీ, ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్, అన ఒలియో ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన పలు ప్రాజెక్టులకు సీఎం జగన్ వర్చువల్‌గా శంకుస్థాపనలతో పాటు పలు యూనిట్లను ప్రారంభిస్తారు.

ఓటర్ల జాబితాలపై 'సుప్రీం' సంతృప్తి

- ఎన్నికల సంఘం చర్యలు భేష్ అన్న సీజే నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం
- తాజా ఆదేశాలతో ఎల్లో మీడియా తుప్పు వదిల్చిన సుప్రీం కోర్టు

సాక్షి, అమరావతి: ఓటర్ల జాబితాల తయారీ విషయంలో ఎన్నికల అధికారులపై నిత్యం అడ్డగోలు ఆరోపణలు చేస్తూ నానా యాగీ చేస్తున్న ఎల్లో మీడియా నోళ్లు మూయిస్తూ సుప్రీం కోర్టు కీలక ఉత్తర్వులు వెలువరించింది. ఓటర్ల జాబితాల విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) తీసుకుంటున్న చర్యలపై సుప్రీంకోర్టు పూర్తి సంతృప్తి వ్యక్తం చేసింది. ఎన్నికల సంఘం చర్యలు సంతృప్తికరంగా ఉన్నందున ఈ వ్యవహారంలో తదుపరి తమ నుంచి ఎలాంటి ఆదేశాలు అవసరం లేదని తేల్చి చెప్పింది. ఒక చిరునామా నుంచి మరో చిరునామాకు మారిన ఓటర్లు లేదా మరణించిన ఓటర్లు లేదా డూప్లికేట్‌గా నమోదైన ఓటర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే విషయంలో చట్ట నిబంధనల మేరకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర ఎన్నికల సంఘం లిఖితపూర్వకంగా సమర్పించిన వివరాలు సంతృప్తికరంగా ఉన్నాయని స్పష్టం చేసింది. ఓటర్ల నమోదు ప్రక్రియ మొదలు, ఓటర్ల జాబితా సవరణ, తుది ఓటర్ల జాబితా తయారీ వరకు మొత్తం ప్రక్రియను అత్యంత పారదర్శకతతో చేపడుతున్నామన్న సీఈసీ వాదనతో సుప్రీం కోర్టు ఏకీభవించింది. ఓటర్ల జాబితా నుంచి తొలగించే ముందు చట్ట ప్రకారం వారికి నోటీసు ఇచ్చి వారి వివరణ తీసుకున్న తరువాతే తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కూడా ఎన్నికల సంఘం చెప్పిన అంశాన్ని సుప్రీం కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఎన్నికల సంఘం పారదర్శకంగా అన్ని చర్యలు తీసుకుంటున్నప్పుడు ఇక తదుపరి ఆదేశాలతో పనేముందని విచారణ సందర్భంగా పిటిషనర్‌ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. పిటిషనర్ సందేహాలను ఎన్నికల కమిషన్ నివృత్తి చేసిందని సుప్రీం కోర్టు గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో తమ ముందున్న వ్యాజ్యంతో తదుపరి విచారణ అవసరం లేదంది. ఓటర్ల జాబితా విషయంలో అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులను ప్రతివాదులుగా చేర్చడంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యలను ప్రశ్నిస్తూ 'సన్విద్ బాచావో ట్రస్ట్' దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సుప్రీం కోర్టు పరిష్కరించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధనుంజయ్ చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జంషేడ్ బుర్జోర్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన విస్తృత ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎల్లో మీడియా నిత్య రాద్ధాంతం

రాష్ట్రంలో ఓటర్ల జాబితాల విషయంలో పెద్దఎత్తున అక్రమాలు జరిగిపోతున్నాయని, టీడీపీ అధినేత చంద్రబాబు సహా ఇతర నేతలు చేసిన ఫిర్యాదులను కేంద్ర ఎన్నికల సంఘం పట్టించుకోవడం లేదంటూ ప్రతిరోజూ ఎల్లో మీడియా పుంఖానుపుంఖాలుగా కథనాలు వండివారుస్తోంది. రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందన్న ఆందోళనను ప్రజల్లో కలిగించేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది. కొంతకాలంగా ఎన్నికల అధికారులను లక్ష్యంగా చేసుకుని అసత్యాలను ప్రచారం చేస్తోంది. ఎన్నికల అధికారులపై నిరాధార ఆరోపణలు చేయడానికి కూడా ఏ మాత్రం వెనుకాడటం లేదు. ఓటర్ల జాబితాల తయారీ విషయంలో ఎన్నికల అధికారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారంటూ నిరాధార ఆరోపణలు చేస్తోంది. రాష్ట్రంలో ఓటర్ల జాబితా తయారీలో స్వచ్ఛత లేదని నమ్మించే ప్రయత్నం చేస్తోంది. అడ్డగోలుగా ఓటర్ల జాబితా నుంచి తొలగింపులు చేస్తున్నారంటూ ఆరోపణలు గుప్పిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో సుప్రీం కోర్టు ఇచ్చిన తాజా ఉత్తర్వులు ఎల్లో మీడియాకు గట్టిగానే షాకిచ్చేవిగా ఉన్నాయి.

సన్విద్ బచావో ట్రస్ట్ పిటిషన్‌పై విచారణ

రాజ్యాంగంలోని అధికరణ 324 ప్రకారం సవరణ ఓటర్ల జాబితాలను తయారు చేసేలా ప్రధాన ఎన్నికల అధికారులను ఆదేశించాలని, అలాగే చిరునామా మారిన, మరణించిన, డూప్లికేట్‌గా నమోదైన ఓటర్ల విషయంలో ప్రజాప్రాతినిధ్య చట్ట నిబంధనల ప్రకారం వ్యవహరించేలా కూడా ఆదేశాలు ఇవ్వాలంటూ సన్విద్ బాచావో ట్రస్ట్ 2023లో సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై సీజే నేతృత్వంలోని విస్తృత ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ఆరోరా వాదనలు వినిపిస్తూ.. డూప్లికేట్ ఓటర్ల విషయంలో ఎన్నికల అధికారులు సరిగ్గా స్పందించడం లేదన్నారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది అమిత్ శర్మ స్పందిస్తూ.. డూప్లికేట్ ఓటర్లతో సహా ఓటర్ల జాబితా విషయంలో తాము తీసుకుంటున్న అన్ని చర్యలనూ వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేస్తామని చెప్పారు. ఇందుకు ధర్మాసనం అనుమతి ఇచ్చింది.

'చట్టానికి లోబడే చేస్తున్నాం'

ఈ నేపథ్యంలో అమిత్ శర్మ కేంద్ర ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ సమగ్ర కౌంటర్ దాఖలు చేశారు. అలాగే ఓ నోట్ కూడా ధర్మాసనం ముందుంచారు. సోమవారం ఈ వ్యాజ్యం విచారణకు వచ్చినప్పుడు సుప్రీం కోర్టు ధర్మాసనం ఆ నోట్‌ను క్షుణ్ణంగా పరిశీలించింది. చిరునామాలు మారడం, మరణించడం, భౌగోళికంగా ఓకే ప్రాంతంలో ఓటర్లుగా నమోదు కావడం వంటి విషయాల్లో తీసుకుంటున్న చర్యలను ఎన్నికల సంఘం తన కౌంటర్‌లో వివరించింది. చట్టానికి లోబడి తాము చేస్తున్న పనులన్నింటినీ కోర్టుకు తెలియచేసింది. ఓటర్ల జాబితా నుంచి ఎవరి పేరైనా తొలగించదలచుకుంటే వారికి నోటీసులు ఇచ్చి, అభ్యంతరాలు స్వీకరించి ఆ తరువాత మాత్రమే తదుపరి చర్యలు తీసుకుంటున్న విషయాన్ని సవివరంగా అత్యున్నత న్యాయస్థానానికి నివేదించింది. ప్రతి దశలో ఏం చేస్తున్నాయో తెలియజేసింది. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తున్న విషయాన్ని కూడా చెప్పింది. లోపాలన్నింటినీ సవరించిన తరువాతే తుది జాబితాను ప్రకటిస్తున్నామని స్పష్టం చేసింది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఉన్నత విద్యలో మరో చరిత్ర

ఎడెక్స్ ద్వారా అంతర్జాతీయ వర్సిటీల సర్టిఫికేషన్ కోర్సులు

సాక్షి, అమరావతి: విద్యా రంగ సంస్కరణలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా మరో కీలక అడుగు వేసింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, హార్వర్డ్, ఎంఐటీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి లాంటి అత్యుత్తమ వర్సిటీలు అందించే కోర్సులను విదేశాలకు వెళ్లి చదువుకోలేని పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచితంగా వీటిని అందుబాటులోకి తెస్తోంది. ఈమేరకు ఇప్పటికే ప్రఖ్యాత మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సుల సంస్థ 'ఎడెక్స్'తో ఒప్పందం చేసుకుంది. పాఠ్యప్రణాళిక కోర్సుల్లో విద్యార్థి తనకు నచ్చిన వర్టికల్‌ను చదువుకునే అవకాశం కల్పిస్తోంది. ఈ నెల 16వ తేదీ నుంచి వర్సిటీల్లో ఎడెక్స్ కోర్సులను సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభించేలా కసరత్తు జరుగుతోంది.ఎడెక్స్ ప్రపంచంలోనే ప్రముఖ ఈ–లెర్నింగ్ ప్లాట్ ఫారమ్‌గా పేరొందింది. ఒక్కో కోర్సు చేయాలంటే సుమారు రూ.30 వేలు ఖర్చు అవుతుంది. ఇంత ఖరీదైన కోర్సులను రాష్ట్ర ప్రభుత్వం 12 లక్షల మందికిపైగా విద్యార్థులు, టీచర్లకు ఉచితంగా అందిస్తోంది.

నగర వార్తలు

లవ్ డే వద్దు.. కౌ హగ్ ముద్దు...

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర వ్యాప్తంగా గో భక్తులకు ఫిబ్రవరి 14న 'గో ప్రేమికుల దినోత్సవమ'ని అఖిల భారత గో సేవా ఫౌండేషన్ తెలిపింది. ఫిబ్రవరి 14ను నేషనల్ కౌ హగ్ డేగా జరుపుకోవాలని గత ఏడాది నేషనల్ యానిమల్ హస్బెండరీ బోర్డ్ ప్రకటించిందని ఫౌండేషన్ సభ్యులు బాలకృష్ణ గురుస్వామి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం లోయర్ ట్యాంక్ బండ్ వేదికగా భాగ్యనగర్ గోశాలలో గో భక్తుల సమక్షంలో పెద్ద ఎత్తున గో ప్రేమికుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు 'హృదయరాగం' ఆవిష్కరణ

లక్డీకాపూల్ : విభిన్న సంస్కృతులు పూచిన పాదు హైదరాబాద్ 'హృదయరాగం' పుస్తకావిష్కరణ బుధవారం సాయంత్రం ఎన్టీఆర్ గ్రౌండ్స్‌లోని హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలంగాణ పబ్లిషర్స్ వ్యవస్థాపకులు కోయ చంద్రమోహన్ తెలిపారు. 'సాక్షి' దినపత్రికలో వారం వారం వెలువడిన ప్రముఖుల హైదరాబాద్ జ్ఞాపకాల సమాహారాన్ని రచయిత పగిడిపాల ఆంజనేయులు 'హృదయరాగం'గా కూర్చారన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ దర్శకులు బి. నర్సింగరావు, అతిథులుగా మానవహక్కుల కార్యకర్త ఎస్. జీవన్‌కుమార్, సీనియర్ జర్నలిస్ట్ ఎస్. గుర్నాథ్, సాక్షి నెట్‌వర్క్ ఇన్‌చార్జి శ్రీగిరి విజయ్‌కుమార్ రెడ్డి, సామాజిక ఉద్యమకారులు డాక్టర్ రియాజ్ హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా సాహిత్య, పుస్తక ప్రియులను కోరారు.

హైదరాబాద్ పుస్తక ప్రదర్శనకు అనూహ్య స్పందన

- ఐదో రోజు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన సందర్శకులు
- సభలు,సమావేశాలు, పుస్తకావిష్కరణలతో సందడి
- ఈ నెల 19న ముగియనున్న ప్రదర్శన



5 రోజులు.. 3 లక్షలు



సాక్షి, సిటీబ్యూరో: పుస్తకానికి పాఠకకోటి బ్రహ్మరథం పడుతోంది. ఎన్ని రకాల మాధ్యమాలు వెల్లువెత్తినా చెక్కుచెదరని ఆదరణతో అక్కున చేర్చుకుంటోంది. ప్రతి సంవత్సరం ఎన్టీఆర్ స్టేడియంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే హైదరాబాద్ పుస్తక ప్రదర్శన ఈ ఏడాది కొద్దిగా ఆలస్యంగా ఏర్పాటైనా పుస్తకప్రియుల ప్రేమాభిమానాలు ఏ మాత్రం తగ్గలేదు, ఈ నెల 9న ప్రారంభమైన ప్రదర్శన మంగళవారానికి ఐదో రోజుకు చేరుకుంది.ఈ ఐదు రోజుల్లో సుమారు 3 లక్షల మంది సందర్శకులు పుస్తక ప్రదర్శనకు తరలివచ్చారు. వారిలో లక్ష మందికి పైగా చిన్నారులు, ఉపాధ్యాయులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఉన్నారు. ప్రవేశ రుసుము చెల్లించి పుస్తక ప్రదర్శనకు హాజరైన పాఠకులే 1.85 లక్షల మందికి పైగా ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ లెక్కన పుస్తక ప్రదర్శన గడువు ముగిసే సమయానికి మరో 3 లక్షల వరకు సందర్శకులు తరలి వచ్చే అవకాశం ఉంది. మరోవైపు గతంలో లేని విధంగా ఈ సంవత్సరం స్టాళ్ల సంఖ్యను కూడా పెంచారు. విశాలమైన ఎన్టీఆర్ స్టేడియంలో 369 స్టాళ్లను ఏర్పాటు చేశారు. విభిన్న రంగాలకు చెందిన వివిధ భాషల పుస్తకాలకు పాఠకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రతి రోజు వేల సంఖ్యలో పుస్తకాలు అమ్ముడవుతున్నట్లు వివిధ స్టాళ్లకు చెందిన నిర్వాహకులు తెలిపారు. అభ్యుదయ సాహిత్యం నుంచి ఆధ్యాత్మిక సాహిత్యం వరకు ఎవరికి నచ్చిన పుస్తకాన్ని వారు కొనుగోలు చేస్తున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి వివిధ రకాల మాధ్యమాల ద్వారా అనేక రకాల అంశాలపైన చర్చోపచర్చలు, అనేక రకాల సమాచారం, వివరాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ జ్ఞానసముపార్జనలో ప్రతి ఒక్కరూ పుస్తకాన్నే ప్రామాణికంగా భావించడం విశేషం.

వెల్లివిరిసే అనుబంధాలు...

కేవలం పుస్తకాల అమ్మకాలు, కొనుగోళ్లే కాకుండా సభలు, సమావేశాలు, చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మరోవైపు రచయితలు, పాఠకులను ఒక వేదికకు తీసుకురావడంలో పుస్తక ప్రదర్శన విజయవంతంగా కొనసాగుతుంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉండే స్నేహితులకు గత ఐదు రోజులుగా పుస్తక ప్రదర్శన కేరాఫ్‌గా మారింది. ప్రతి రోజు సాయంత్రం వేళల్లో వందలాది మంది బంధుమిత్రులు పుస్తకప్రదర్శనలో కలుసుకోవడం విశేషం. మరోవైపు నచ్చిన పుస్తకాలను బహుమతులుగా అందజేస్తున్నారు. పుస్తకాల అమ్మకాల్లో పిల్లల సాహిత్యం ఎక్కువగా అమ్ముడవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కథల పుస్తకాలు, వ్యక్తిత్వవికాస గ్రంథాలు, కామిక్స్, ఫిక్షన్ వంటి పుస్తకాలు విరివిగా అమ్ముడవుతున్నాయి. మరోవైపు తెలుగు సాహిత్యం పట్ల పాఠకులు తమ అభిరుచిని సమున్నతంగా చాటుకుంటూనే ఉన్నారు. గురజాడ, చలం వంటి వారి నుంచి నేటి తరం రచయితల వరకు ఎంతోమంది రాసిన నవలలు, కథల పుస్తకాలు, ఇతర సాహిత్య గ్రంథాలను జనం కొనుగోలు చేస్తున్నారు. మంచిపుస్తకం, నవతెలంగాణ, నవచేతన, తెలంగాణ పబ్లిషర్స్, ఎమెస్కో, విశాలాంధ్ర వంటి అనేక పుస్తక ప్రచురణ సంస్థలు విభిన్న అంశాలపైన వెలువరించిన పుస్తకాలు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి.

గద్దర్ పేరుతో అవార్డులను స్వాగతించాలి

'గద్దర్ అవార్డు- సినీ ఇండస్ట్రీ అవుట్‌లుక్'

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు
- హాజరైన కంచ ఐలయ్య, బి.నర్సింగ్‌రావు, సుద్దాల అశోక్ తేజ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కంచ ఐలయ్య ..

పంజగుట్ట: ప్రజా యుద్ధనౌక గద్దర్ పేరుతో అవార్డును గర్వంగా స్వీకరించాలని పలువురు సినీ ప్రముఖులు, కళాకారులు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. గద్దర్ గళం ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'గద్దర్ అవార్డు– సినీ ఇండస్ట్రీ అవుట్‌లుక్' అనే అంశంపై రౌండొటేబుల్ సమావేశం నిర్వహించారు. పసునూరి రవీందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీ దర్శకులు బి.నర్సింగ్ రావు మాట్లాడుతూ .. గద్దర్ తన గుండె అన్నారు. సినిమా ఇండస్ట్రీకి తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో ఐదు శాతం నిధులు కేటాయించాలన్నారు. ప్రముఖ దర్శకులు శంకర్ మాట్లాడుతూ .. గద్దర్ అవార్డును ప్రకటించడం హర్షనీయమన్నారు. గద్దర్‌కు సినిమాకు ఉన్న సంబంధం తరగని గని అని, ఆయన పాట థియేటర్లలో తుఫాను సృష్టించిన విషయాన్ని గుర్తుచేసుకోవాలన్నారు. అభ్యుదయ సినిమా అయినా, విప్లవాత్మక సినిమా అయినా నవరసాలు పండించదగ్గ ఏకైక నటుడు గద్దర్ అన్నారు. నంది మన ఊహ, గద్దర్ నిజం అన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ .. గద్దర్ అవార్డు ప్రకటించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అభినందించాలన్నారు. గద్దర్ అవార్డుపై అదే వేదికపై చిరంజీవి స్వాగతించారని, మోహన్‌బాబు కూడా స్వాగతించారని గుర్తుచేశారు. ప్రొఫెసర్ కంచ ఐలయ్య మాట్లాడుతూ .. దేశంలో ఏ గాయకుడి విగ్రహం చనిపోయిన ఆరు నెలల్లో పెట్టలేదని, గద్దర్ 15 అడుగుల విగ్రహం తెల్లాపూర్‌లో ఏర్పాటు చేశారని, ప్రభుత్వం ఆయన జయంతి, వర్థంతి వేడుకలు అధికారికంగా నిర్వహిస్తానని ప్రకటించిందన్నారు. సమావేశంలో సీనియర్ దళిత నాయకులు జే.బి.రాజు, గద్దర్ కుమారుడు సూర్యం , సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, ప్రొఫెసర్ రియాజ్, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, కోటి లింగం, ప్రవీణ్ చంద్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక విధాన సౌధలో 'సిగ్నల్ బూస్టింగ్'..

- అధునాతన సాంకేతికతను అందించిన నగర సంస్థ వాల్గో ఇన్‌ఫ్రా
- విధాన్ సౌధలో యాంటెనాలను ప్రారంభించిన కర్ణాటక ముఖ్యమంత్రి



సిగ్నల్ బూస్టింగ్ యాంటెనాలను ప్రారంభిస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: కర్ణాటక అసెంబ్లీ విధాన సౌధలో మొబైల్ ఫోన్ సిగ్నల్ కనెక్షన్లలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు గాను నగరానికి చెందిన 'వాల్గో ఇన్‌ఫ్రా' ఆధ్వర్యంలో 5జీ నెట్‌వర్క్, మొబైల్ ఫోన్ సిగ్నల్ బూస్టింగ్ యాంటినాలను ఏర్పాటు చేసింది. ఈ సాంకేతికతను మంగళవారం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్ యూ.టీ.ఖాదర్‌తో కలిసి ప్రారంభించారు. వాల్గో ఇన్‌ఫ్రా శ్రీధర్ రావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ యాంటెనాలు విధాన్ సౌధతో పాటు పరిసర ప్రాంతాల్లో 5జీ మొబైల్ నెట్‌వర్క్ టెలిఫోన్ కనెక్షన్‌ను మెరుగుపరుస్తుంది. అధికారులు, మంత్రులు ఇతర సిబ్బంది అవసరాలకు సమర్ధవంతమైన ఆధునిక మౌలిక సదుపాయాలను అందించనుంది. కార్యక్రమంలో విధాన సౌధ చైర్‌పర్సన్ బసవరాజ్ హొరట్టి, ప్రభుత్వ అధికారులు, మంత్రులు, ప్రముఖులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి పీపీ చౌదరి

పరిపూర్ణమైన ఆరోగ్యానికి 'తిరుక్కురల్'

- తిరుక్కురల్ ఆన్ ది ఆర్ట్ ఆఫ్ హెల్త్‌మేనేజ్‌మెంట్ ఆవిష్కరణ



'తిరుక్కురల్- ఆన్ ది ఆర్ట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

సాక్షి, సిటీబ్యూరో: పరిపూర్ణమైన ఆరోగ్యం కోసం అనుసరించాల్సిన జీవనవిధానాలను 'తిరుక్కురల్' గ్రంథం వేల ఏళ్ల క్రితమే ప్రతిపాదించిందని, అన్ని వర్గాల, అన్ని సంస్కృతుల, అన్ని వయస్సుల వారు ఆచరించాల్సిన జీవవిధానాలను సూచించిన గొప్ప గ్రంథమని వక్తలు కొనియాడారు. డాక్టర్ సీపీ రామస్వామి తిరుక్కురల్‌లో నిక్షిప్తమైన ఆరోగ్య అంశాలపైన వల్లువదాసన్ అనే కలం పేరుతో రాసిన 'తిరుక్కురల్– ఆన్ ది ఆర్ట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్' పుస్తకావిష్కరణ సభ మంగళవారం హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో జరిగింది. కార్యక్రమానికి రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి పీపీ చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారతీయ విద్యాభవన్ వైస్ చైర్మన్ గోపాలకృష్ణన్, సోమశేఖర్ రెడ్డి, వేదవతి, హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీపీ చౌదరి మాట్లాడుతూ, బహుముఖ ప్రజ్ఞావంతుడు, తిరుక్కురల్‌పైన సమగ్రమైన అవగాహన కలిగిన రామస్వామి ఆ గ్రంథంలోని ఆరోగ్య నిర్వహణకు సంబంధించిన అంశాలపైన ఆంగ్లంలో పుస్తకాన్ని రాయడం అభినందనీయమన్నారు. తిరుక్కురల్‌లోని అనేక అంశాలు దైనందిన జీవితంలో అనుసరించాల్సిన నైతిక విలువలు, ఉన్నతమైన ఆదర్శప్రాయమైన జీవన విధానాన్ని బోధిస్తాయన్నారు. వేదవతి మాట్లాడుతూ, తిరుక్కురల్ ఆన్ ద ఆర్ట్ ఆఫ్ హెల్త్‌మేనేజ్‌మెంట్ పుస్తకం వయోధికుల్లో వచ్చే జీవన శైలి వ్యాధుల నుంచి రక్షణ పొందే అంశాలనే కాకుండా అన్ని వయస్సుల వారు ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించేందుకు ఎలా ఉండాలో దిశానిర్దేశం చేస్తుందన్నారు. గోపాలకృష్ణన్ మాట్లాడుతూ, తిరుక్కురల్‌లోని ప్రాచీన జ్ఞానాన్ని భావి తరాలకు అందజేసిన రామస్వామి అభినందనీయుడని ప్రశంసించారు.

సంక్షేమ భవన్ ఎదుట గురుకుల అభ్యర్థుల ధర్నా

నాంపల్లి: డీఎల్, జేఎల్, పీజీటీ పోస్టులను అవరోహణ క్రమంలోనే భర్తీ చేయాలని గురుకుల పోస్టులకు 1:2 నిష్పత్తిలో అర్హత సాధించిన అభ్యర్థులు డిమాండ్ చేశారు.

ఈ మేరకు మంగళవారం దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్ ఎదుట అభ్యర్థులు ధర్నా చేపట్టారు. ఎంపికైన అభ్యర్థుల మార్కులు, ర్యాంకులు ఆయా జోన్లకు సూచించాలని కోరారు. బ్యాక్‌లాగ్ లేకుండా అన్ని పోస్టులను సెకండ్ లిస్ట్ ద్వారా నింపాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ జేఎల్ పోస్టులను దృష్టిలో ఉంచుకుని ఫలితాలను ప్రకటించాలన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ వెరిఫికేషన్ త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. 1:1 లిస్టును తాత్కాలికంగా నిలిపివేసి అవరోహణ క్రమంలో పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా...

కొమురవెల్లి హాల్ట్‌స్టేషన్‌కు మార్గం సుగమం



సాక్షి, హైదరాబాద్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి వద్ద హాల్ట్ స్టేషన్ నిర్మించేందుకు రైల్వే బోర్డు పచ్చజెండా ఊపింది. ఈనెల 15న అక్కడ స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. కొమురవెల్లికి ఆరు కిలోమీటర్ల దూరంలోని లక్డారం గ్రామం వద్ద అప్పట్లో స్టేషన్ నిర్మించారు. కానీ, కొమురవెల్లికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. అక్కడ స్టేషన్ అవసరమైనా, సర్వే సమయంలో జరిగిన పొరపాటు వల్ల అక్కడ స్టేషన్ నిర్మించలేదు. తర్వాత నేతల నుంచి తీవ్ర ఒత్తిడి రావటంతో అధికారులు రైల్వే బోర్డుకు ప్రతిపాదించారు. దాన్ని పరిశీలించిన బోర్డు, అక్కడ రెగ్యులర్ స్టేషన్ కాకుండా హాల్ట్ స్టేషన్ నిర్మించేందుకు అనుమతించింది. హాల్ట్ స్టేషన్‌లో అదనపు లైన్లు ఉండనందున, రైళ్ల క్రాస్ అయ్యే వీలుండదు. త్వరలో టెండర్లు పిలిచి అక్కడ పనులు ప్రారంభిస్తారు.

నేడు కొత్త కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు

- ఎల్బీ స్టేడియంలో కార్యక్రమానికి హాజరు కానున్న సీఎం రేవంత్
- 19 నుంచి ప్రారంభం కానున్న సివిల్ కానిస్టేబుల్ శిక్షణ!



సాక్షి, హైదరాబాద్: పోలీస్‌శాఖలోని వివిధ విభాగాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు బుధవారం నియామక పత్రాలు అందజేయనున్నారు. ఎల్బీ స్టేడియంలో మధ్యాహ్నం 4 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశా రు. నియామక పత్రాలు పొందిన కానిస్టేబుళ్లు తమకు కేటాయించిన యూనిట్లలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. కాగా, షెడ్యూల్ ప్రకా రం.. ఈ నెల 19 నుంచి సివిల్ కానిస్టేబుళ్ల శిక్షణ ప్రారంభం కానున్నట్టు తెలిసింది. ఇటీ వలే తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్పీఆర్బీ) పోలీస్‌శాఖలోని సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్), టీఎస్ఎస్పీ, ఎస్పీఎఫ్, అగ్నిమాపకశాఖలోని ఫైర్‌మెన్, జైళ్లశాఖలోని వార్డర్‌లు కలిపి మొత్తం 15,644 పోస్టులను భర్తీ చేసిన సంగతి తెలిసిందే.

ఒక్క జిల్లాకేనా సెక్రటరీల బదిలీలు?

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శుల బదిలీలు చర్చనీయాంశమవుతోంది. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఒక్క నారాయణపేటలో ఆ జిల్లా కలెక్టర్ 23 మంది గ్రామ కార్యదర్శులను బదిలీ చేశారు. ఎన్నికల బదిలీలు అయితే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ చేయాలని ఒక్క జిల్లాకే పరిమితం చేస్తే ఎలా అని కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు. దాదాపు గత పదేళ్లుగా కార్యదర్శుల బదిలీలు జరగనందున... ప్రస్తుతం ఎంపీ ఎన్నికల కోసం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలోని అన్ని విభాగాల్లో ట్రాన్స్‌ఫర్లు అవుతున్నందున తమను కూడా చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం ద్వారా కాకుండా ఒకే జిల్లాలో కలెక్టర్ ఈ బదిలీలు ఎలా చేస్తారనే వాదనను ఈ సంఘం తీసుకొస్తోంది. నారాయణపేట జిల్లాలో గ్రేడ్ 3,4 పంచాయతీ సెక్రటరీలతో పాటు ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల (ఓపీఎస్)ను సైతం బదిలీ చేశారు. అందువల్ల కేవలం ఒక్క జిల్లాకే సెక్రటరీల బదిలీలు పరిమితం చేయకుండా అన్ని జిల్లాల్లోనూ ఈ ప్రక్రియను చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

సిమ్స్ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్?

- జూనియర్ మెడికోలపై సీనియర్స్ వేధింపులు..
- నలుగురు సీనియర్లను ఇంటికి పంపించిన అధికారులు

కోల్‌సిటీ (రామగుండం): పెద్దపల్లి జిల్లా గోదావ రిఖనిలోని ప్రభుత్వ సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్) మెడికల్ కాలేజీ ఆవరణలోని హాస్టల్‌లో, జూనియర్ మెడికోలపై కొందరు సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నా యి. మంగళవారం జూనియర్ మెడికోలు, వారి తల్లిదండ్రులు కాలేజీ యాజమాన్యానికి ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సోమవారం రాత్రి ఓ జూనియర్ మెడికో తల వెంట్రుకలను సీనియర్లు కత్తిరించడానికి ప్రయత్నించారని ప్రచారం జరుగుతోంది. దీనిపై ఆందోళన వ్యక్తం చేసిన జూనియర్ మెడికోలు, వారి పేరెంట్స్ కాలేజీ యాజమాన్యాన్ని నిలదీశారని తెలిసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్లను హాస్టల్ నుంచి ఇంటికి పంపించిన కాలేజీ అధికారులు, రెండు రోజుల తర్వాత తల్లిదండ్రులతో కలిసి కాలేజీకి రావాలని సూచించారు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కూడా విచారణ జరుపుతున్నారని సమాచారం. కాగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు వెల్లడిస్తున్నారు. ఘటనపై వాస్తవాలను తెలుసుకోవడానికి యాంటీ ర్యాగింగ్ కమిటీతో విచారణ జరుపుతామని సిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్ వెల్లడించారు.

సిటీ చుట్టూ 11 మినీ టౌన్‌షిప్‌లు



గ్రేటర్ హైదరాబాద్‌పై వలసల ఒత్తిడిని, ట్రాఫిక్ రద్దీ, కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఈ క్రమంలో ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) మధ్య శాటిలైట్ టౌన్‌షిప్‌లను నిర్మించాలని నిర్ణయించింది. ఆయా ప్రాంతాల్లో ఉపాధి కల్పనతో ఔటర్, ట్రిపుల్ ఆర్ మధ్య లే-అవుట్లు, గేటెడ్ కమ్యూనిటీలు వస్తాయని.. వాటికి రహదారులను అనుసంధానం చేస్తే అభివృద్ధి చెందుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

\- సాక్షి, హైదరాబాద్

హైదరాబాద్ చుట్టూ ఓఆర్ఆర్, రీజనల్ రింగ్‌రోడ్డు మధ్యలో టౌన్‌షిప్‌లు

- 11 ప్రాంతాల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు..
- తుర్కపల్లి, ఇబ్రహీంపట్నంలలో పైలట్ ప్రాజెక్టులు
- 150 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఒక్కో శాటిలైట్ సిటీ
- 10 లక్షల జనాభా నివాసం ఉండేందుకు వీలుగా అభివృద్ధి
- పీపీపీ విధానంలో సామాజిక, మౌలిక వసతుల కల్పన
- గ్రేటర్ హైదరాబాద్‌పై వలసల ఒత్తిడి, ట్రాఫిక్, కాలుష్యం తగ్గించే దిశగా చర్యలు

11 ప్రాంతాల్లో ఏర్పాటు చేసేలా..

గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ మేడ్చల్, సంగారెడ్డి, షాద్‌నగర్, ఘట్‌కేసర్ తదితర మార్గాల్లోని 11 ప్రాంతాల్లో మినీ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి 'హైదరాబాద్ నగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ)' ప్రతిపాదించింది. పైలట్ ప్రాజెక్ట్ కింద తుర్కపల్లి, ఇబ్రహీంపట్నం ప్రాంతాలను మినీ నగరాలుగా నిర్మిస్తే బాగుంటుందని సూచించింది. ఈ ప్రాంతాల్లో మినీ నగరాలను నిర్మించేందుకు విధివిధానాలను కూడా రూపొందించినట్టు సమాచారం. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో వీటిని చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. భూసేకరణ పనులను హెచ్ఎండీఏ చేయాలని.. మౌలిక సదుపాయాల కల్పన వంటివాటిని ప్రైవేట్‌కు అప్పగించాలని నిర్ణయించినట్టు సమాచారం.

గ్రోత్ ఇంజిన్‌లా మార్చాలి



ట్రిపుల్ ఆర్‌ను రవాణా పరమైన రోడ్డుగానే కాకుండా ఒక గ్రోత్ ఇంజిన్‌లా మార్చాలి. ఇరువైపులా పరిశ్రమల ఏర్పాటుతో ఉత్పత్తి కేంద్రంగా అభివృద్ధి చేయాలి. ట్రిపుల్ ఆర్ ప్రవేశించే జిల్లాల్లో మూడు నుంచి పదెకరాల విస్తీర్ణాలలో నైపుణ్య కేంద్రాలు, వసతి గృహాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలి. దీంతో కార్మికులకు ఉపాధి దొరుకుతుంది.

\- జీవీ రావు, తెలంగాణ డెవలపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

మినీ నగరాలలో ఏమేం ఉంటాయంటే..!

ఒక్కో శాటిలైట్ టౌన్‌షిప్‌ను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా.. 150 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో, సుమారు 10 లక్షల జనాభా నివాసం ఉండేందుకు వీలుగా నిర్మించనున్నారు. 100 అడుగుల అప్రోచ్ రహదారి, 30 నుంచి 60 అడుగుల అంతర్గత రహదారులు ఉంటాయి. ఈ టౌన్‌షిప్‌లలో బహుళ అవసరాల కోసం భూమిని అందుబాటులో ఉంచుతారు. సామాన్య, మధ్యతరగతి వర్గాలకు గృహాలు, బ్యాంకులు, మార్కెట్లు, హోటళ్ల, ఇతర వాణిజ్య సదుపాయాలతోపాటు విద్యా, వైద్య అవసరాలు, పౌర సేవలు, ప్రజారవాణా, క్రీడా సదుపాయాలు, పార్కులు, ఆట స్థలాలు ఉంటాయి. కాలుష్యాన్ని విడుదల చేయని, అంతగా ప్రమాదకరంకాని పరిశ్రమలను ఏర్పాటు చేస్తారు.

బాధ్యతలు పెంచినా.. జీతాలు పెంచలే!

ఏళ్లుగా వేతనంలో మార్పులేదని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ల ఆవేదన

- తమ సమస్యలను పరిష్కరించాలంటూ ప్రభుత్వానికి వినతిపత్రం
- వాస్తవ పరిస్థితిని సమీక్షించి బాలికల విద్యకు భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: బాలికల విద్యను ప్రోత్సహించేందుకు ఏర్పాటైన కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో (కేజీబీవీల్లో) పనిచేస్తున్న ప్రత్యేకాధికారులు.. తమ సమస్యలను పట్టించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. తమకు అనేక బాధ్యతలు అప్పగించి, వేతనం మాత్రం పెంచలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగలేదని అంటున్నారు. ఇటీవల కేజీబీవీ సంఘ నేతలు, ప్రభుత్వ హెచ్ఎంల సంఘం నేతలు దీనిపై సర్కారుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ బడుల ఉపాధ్యాయుల కన్నా ఎక్కువ విధులు నిర్వర్తిస్తున్నా.. వారితో సమాన గౌరవం లభించడం లేదని అందులో వాపోయారు. కేజీబీవీలను అప్‌గ్రేడ్ చేస్తున్నప్పటికీ అందుకు తగినట్టుగా మౌలిక వసతులు కల్పించడం లేదని.. పట్టించుకోకుంటే చదువుల నాణ్యత పడిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గెజిటెడ్ అధికారులు చేయాల్సిన పనులన్నీ ఏళ్ల తరబడి కాంట్రాక్టు కొలువుల్లో ఉన్న తమపై వేయడం న్యాయమేనా అని ప్రశ్నించారు.

పెరిగిన విధులు.. పెరగని వేతనం..

బాలికలు మధ్యలోనే చదువు మానేసే పరిస్థితిని మార్చే ఉద్దేశంతో ఉమ్మడి రాష్ట్రంలో 2010–11లో కేజీబీవీలను ఏర్పాటు చేశారు. హాస్టల్‌తోపాటు నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో 450 కేజీబీవీలున్నాయి. తొలుత ఆరు, ఏడు తరగతులే ప్రారంభించి.. తర్వాత టెన్త్ వరకూ, 2018–19లో ఇంటర్మీడియట్ వరకూ అప్‌గ్రేడ్ చేశారు. ప్రతీ కేజీబీవీకి ఒక స్పెషల్ ఆఫీసర్ సహా ముగ్గురిని కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. వారికి చాలా ఏళ్లుగా నెలకు రూ.32,500 వేతనమే అందుతోంది. ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేయడంతో విధులు పెరిగాయి. నెలకు కేవలం రెండే క్యాజువల్ లీవ్స్ ఉంటాయి. అత్యవసరమై అదనంగా సెలవు పెడితే వేతనంలో కోతపడుతుంది.



అనుక్షణం విధుల్లోనే..

స్కూల్, హాస్టల్, ఇంటర్ కాలేజీల నిర్వహణ మొత్తం ప్రత్యేక అధికారి చూసుకోవాలి. కొన్ని జిల్లాల్లో మోడల్ స్కూళ్ల బాధ్యతలను కూడా వీరికే అప్పగించారు. కొత్తగా నిర్మిస్తున్న కేజీబీవీల్లో స్కూల్ ఒకచోట హాస్టల్ మరోచోట ఉంటున్నాయి. దీంతో అన్ని విధులు నిర్వర్తించడం కష్టంగానే ఉందని వారు చెబుతున్నారు. రాత్రి విధులప్పుడు చాలా ఇబ్బందిపడుతున్నామంటున్నారు. ఆ రోజు మధ్యాహ్నం నుంచి మర్నాడు మధ్యాహ్నం వరకూ నిరంతరం డ్యూటీ ఉంటుందని, దీనివల్ల అనారోగ్యం పాలవుతున్నామని వాపోతున్నారు. 2017లో జాబ్ చార్ట్ ఇచ్చినా అందులో మార్గదర్శకాలు ఇవ్వలేదని.. దీనితో అధికారులు ఇష్టానుసారం బాధ్యతలు అప్పగిస్తున్నారని చెప్తున్నారు. హాస్టల్‌లో విద్యార్థులను గమనించడం, భోజనం నాణ్యత పరిశీలించడం, కాలేజీలో విద్య నాణ్యత వంటి విధుల్లో ఎక్కడ తేడా వచ్చిన అధికారులు తమనే బలిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం తమ పరిస్థితిని సానుభూతితో పరిశీలించాలని కోరుతున్నారు.

మానసికంగా కుంగిపోతున్నాం



కేవలం చిన్న స్కూళ్ల విధుల కోసమంటూ మమ్మల్ని తీసుకుని తర్వాత రెట్టింపు బాధ్యతలు పెట్టారు. ఏళ్ల గడుస్తున్నా వేతనం పెంచలేదు. టీచర్ల కన్నా ఎక్కువ విధులు నిర్వర్తిస్తున్నాం. ఎంతోమంది విద్యార్థినుల ఉన్నతికి తోడ్పడుతున్నాం. మాకు పని ఒత్తిడి తగ్గించి, వేతనం పెంచితే తప్ప మేం సంతృప్తిగా పనిచేయలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం మా గోడు ఆలకిస్తుందని ఆశిస్తున్నాం.

\- దోపతి శ్రీలత, రాష్ట్ర కేజీబీవీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు

వారి పరిస్థితి మెరుగుపర్చాలి..



కేజీబీవీ ప్రత్యేక అధికారుల పరిస్థితి దారుణంగా ఉంది. ఈ విషయాన్ని వివరిస్తూ ప్రభుత్వానికి ఇటీవల వినతిపత్రం ఇచ్చాం. బాలికలకు నాణ్యమైన విద్య అందించాలంటే ముందుగా కేజీబీవీ ఉద్యోగుల పరిస్థితిని మెరుగుపర్చాలి.

\-పి.రాజాభాను చంద్రప్రకాశ్, ప్రభుత్వ హెచ్ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

హైదరాబాద్‌లో స్టూడియోల మాటేమిటి?

తన సినీ దోస్తులకు చంద్రబాబు వందల ఎకరాలు ధారాదత్తం

- సీమ అభివృద్ధికి మహి రాఘవ రెండెకరాలు అడిగితే రాద్ధాంతం
- పచ్చమీడియాలో తప్పుడు కథనాలపై సినీ ప్రముఖుల ఆగ్రహం
- హైదరాబాద్‌లో బాబు భూముల సంతర్పణపై స్పందించాలి
- ఆంధ్రజ్యోతి, ఎల్లోమీడియాను నిలదీసిన నటుడు, నిర్మాత కల్యాణ్



సాక్షి, హైదరాబాద్: సినీ దర్శకుడు మహి వి.రాఘవకు ఏపీ ప్రభుత్వం రెండు ఎకరాల స్థలాన్ని సంతర్పణ చేయనుందంటూ ఎల్లోమీడియాలో వచ్చిన కథనంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెనుకబడిన తన ప్రాంత అభివృద్ధి కోసమే మదనపల్లి సమీపంలోని హార్సిలీ హిల్స్‌లో మినీ స్టూడియో నిర్మాణానికి స్థలం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి దరఖాస్తు చేశానని.. తన ప్రాంతానికి మంచి చేయాలనే సంకల్పం లేకపోతే హార్సిలీ హిల్స్‌లో ఎందుకు స్టూడియో నిర్మించాలనుకుంటాను? అని రాఘవ ఇప్పటికే స్పష్టం చేయగా.. ఆంధ్రజ్యోతి మాత్రం యాత్ర-2 సినిమా చేసినందుకు రెండెకరాలు కట్టబెడుతున్నారంటూ తన అక్కసునంతా వెళ్లగక్కింది. ఈ కథనాన్ని పలువురు సినీ ప్రముఖులు తప్పుపడుతున్నారు. చంద్రబాబు హయాంలో ఆయన సినీ దోస్తులకు హైదరాబాద్‌లో వందల ఎకరాలకు ఎకరాలు కట్టబెట్టారని.. ఇప్పుడు రాయలసీమ ప్రాంత వాసులకు ఉపయోగపడేలా మినీ స్టూడియో కోసం రెండెకరాలు అడిగితే బాబుకు బాకా ఊదే ఆంధ్రజ్యోతి, ఎల్లోమీడియా రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడుతున్నారు. చంద్రబాబు ధారాదత్తం చేసిన భూముల గురించి ఆంధ్రజ్యోతి, ఎల్లోమీడియాకు ప్రశ్నించే దమ్ముందా? అని ప్రశ్నిస్తున్నారు.

హైదరాబాద్‌లో చంద్రబాబు ఇచ్చినవన్నీ ఒప్పేనా?: కల్యాణ్

ఈ మేరకు నటుడు, నిర్మాత, ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు ఓ.కల్యాణ్ నిలదీశారు. ఈ మేరకు మంగళవారం ఒక వీడియో విడుదల చేస్తూ.. రాయలసీమలోని హార్సిలీ హిల్స్‌లో మినీ స్టూడియో కోసం డైరెక్టర్ మహి వి.రాఘవ్ రెండు ఎకరాల స్థలాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరడం తప్పయితే.. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు సినిమా రంగానికి చెందిన పలువురికి హైదరాబాద్‌లో స్థలాలు ఇవ్వడం తప్పు అనిపించలేదా? అని ప్రశ్నించారు. హార్సిలీ హిల్స్‌లో రెండు ఎకరాలు సంతర్పణ అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని.. అసలు ఇంతవరకూ దానిపై ఎలాంటి జీవో రాలేదని.. ఎంత ధరకు ఇస్తున్నారు? దేనికోసం ఇస్తున్నారు? ఇల్లు కట్టుకోవడానికి ఇస్తున్నారా? లేదా స్టూడియో నిర్మాణానికా అన్నది ఆలోచించకుండా ఇష్టానుసారం రాయడం సరికాదన్నారు. హైదరాబాద్‌లో సినిమా వాళ్లకు చంద్రబాబు ఇచ్చినవన్నీ ఒప్పు అనుకున్నప్పుడు రాఘవకు ఇస్తే కూడా ఒప్పు అనుకోవాలి కదా? ఇక్కడ తప్పు అనుకున్నప్పుడు హైదరాబాద్‌లో స్థలాలు కట్టబెట్టడం కూడా తప్పే కదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఇచ్చిన స్థలాలన్నీ తప్పు అంటారా? ఒప్పు అంటారా? అన్న విషయం తెలుగు ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణను ప్రశ్నించారు.

గతంలో ఎందరికో సబ్సిడీపై భూములు

సినీ రంగం అభివృద్ధికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అక్కినేని నాగేశ్వరరావుకు ప్రభుత్వం 14 ఎకరాల స్థలాన్ని తక్కువ ధరకు స్టూడియో నిర్మాణానికి ఇచ్చిందని, ఎన్టీఆర్ కూడా ప్రభుత్వం ఇచ్చిన భూమిలో స్టూడియోలు కట్టుకున్నారని కల్యాణ్ చెప్పారు. పద్మాలయ స్టూడియో, రామానాయుడు స్టూడియో, ఆనంద్ సినీ సర్వీసెస్(5 ఎకరాలు), ప్రసాద్ ల్యాబ్‌కు కూడా అప్పట్లో సబ్సిడీ ధరకు ప్రభుత్వం స్థలం ఇచ్చిందన్నారు. ప్రసాద్ ల్యాబ్‌కు ఎదురుగా కె.రాఘవేంద్రరావు, ఆయన సోదరుడు కృష్ణమోహన్‌కు కూడా స్థలం ఇచ్చారని, రాఘవేంద్రరావు స్థలం వెనుక సంగీత దర్శకుడు చక్రవర్తికి కూడా స్థలం ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం ప్రసాద్ ఐమ్యాక్స్‌కు నెక్లెస్ రోడ్డులో స్థలం ఇచ్చిన విషయం గుర్తులేదా? అని ప్రశ్నించారు. సినీ కార్మికుల కోసం ఫిల్మ్‌నగర్ సమీపంలోని చిత్రపురి కాలనీకి 67 ఎకరాల స్థలం ఇచ్చారని, తెలంగాణ ఏర్పడ్డాక డైరెక్టర్ ఎన్. శంకర్‌కు స్టూడియో నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలాన్ని ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. నిర్మాత రామానాయుడుకు వైజాగ్ రుషికొండలో దాదాపు 20 ఎకరాల స్థలం ఇచ్చిన విషయం తెలియదా? అని ప్రశ్నించారు.

ఎందుకీ డ్రామాలు..?

- అసెంబ్లీకి రాకుండా కేసీఆర్ సభ పెట్టడమా?
- సీఎం, మంత్రులు కాళేశ్వరం ఎందుకు వెళ్లారు?
- ప్రజాహిత యాత్రలో బండి సంజయ్



ఎల్లారెడ్డిపేటలో ప్రజాహితయాత్రలో బండి సంజయ్‌కుమార్

ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట/వీర్నపల్లి/గంభీరావుపేట: కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలు జరిగాయని విజిలెన్స్ నివేదిక స్పష్టం చేస్తున్నా.. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. అసెంబ్లీకి రాకుండా కేసీఆర్ నల్లగొండలో సభ నిర్వహించడమేంటని ప్రశ్నించారు. సంజయ్ చేపట్టిన ప్రజాహితయాత్ర మంగళవారం నాలుగో రోజు రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిన కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ వారు గుడిని మింగితే, కాంగ్రెస్ వారు గుడిలో లింగాన్ని కూడా మింగేస్తారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ హామీలు అమలు చేయక నాటకాలాడుతుంటే.. బీఆర్ఎస్ కృష్ణా జలాల పేరిట డ్రామాలు వేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాలవారీగా చేసిన అభివృద్ధిని చెబుతుంటే, ట్విట్టర్ టిల్లు ఓర్వలేకపోతుండని, వారి హయాంలో ఏం చేశారో చెప్పాలన్నారు.

మాపై ప్రభుత్వం కనికరం చూపాలి

- కారుణ్య నియామకాల కోసం జిల్లా పరిషత్ అభ్యర్థుల వేడుకోలు
- సీఎం ఇంటి వద్ద నిరీక్షణ.. అనంతరం ప్రజాదర్బార్ వద్ద నిరసనలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తమపై కనికరం చూపాలని, ఎనిమిదేళ్ల తమ నిరీక్షణకు ముగింపు పలకాలని కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న జిల్లా పరిషత్ అభ్యర్థుల వేడుకుంటున్నారు. కారుణ్య నియామకాలకు సంబంధించి తెలంగాణలో జిల్లాకో న్యాయం ఉంటుందా? అని ప్రశ్నిస్తున్నారు. ఎనిమిదేళ్లుగా అర్హతకు తగ్గ ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్నా.. ప్రభుత్వాలు తమ గోడు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. 650 మంది అభ్యర్థులు కారుణ నియామకాల కోసం నిరీక్షిస్తున్నామన్నారు. మంగళవారం ఉదయం 25 జిల్లాల నుంచి 60 మంది అభ్యర్థులు సీఎం రేవంత్ ఇంటివద్ద ఆయన్ను కలిసేందుకు ప్రయత్నించారు. వీలుకాకపోవడంతో సీఎం సిబ్బందికి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ప్రజా దర్బార్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అభ్యర్థులు మాట్లాడుతూ 'జిల్లా పరిషత్‌ల కారుణ్య నియామక అభ్యర్థులకు ఎనిమిదేళ్లుగా రాష్ట్రంలో అర్హతకు తగ్గ ఉద్యోగాలు లభించలేదు. ఖాళీలు లేవనే సాకుతో డిగ్రీ ఆపై విద్యార్హత ఉన్నప్పటికీ ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు తీసుకోవాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. గత ప్రభుత్వం 79 జీవో ద్వారా 1,266 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేసి రాష్ట్రంలోని అన్ని శాఖలకు చెందిన కారుణ్య నియామక అభ్యర్థులకు ఉద్యోగాలిచ్చింది. కానీ స్థానిక సంస్థలకు చెందిన అభ్యర్థులనే నెపంతో మమ్మల్ని పక్కన పెట్టింది. అధికారుల చుట్టూ తిరగడంతో మాకు సంబంధించి ప్రత్యేక జీవో తెచ్చేందుకు గత ప్రభుత్వం కసరత్తు ప్రారంభించగా.. ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. కొత్త ప్రభుత్వం వచ్చాక పీఆర్ మంత్రి సీతక్క సహా రాష్ట్రంలోని పలువురు మంత్రులకు వినతి పత్రాలిచ్చాం. ప్రజావాణిలో మా బాధలపై వివరించాం. తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నాం. భర్తలను కోల్పోయిన భార్యలు, కుటుంబ పెద్దలను కోల్పోయి ఆర్థికంగా చితికిపోయిన వారసులు, పెన్షన్ రాని వారు చాలా మంది ఉన్నారు. సీఎం రేవంత్ మా బాధలు విని మాకు ఉద్యోగాలివ్వాలి' అని విజ్ఞప్తి చేశారు.

మేనల్లుడి విచారణ మొదలు!

- శివబాలకృష్ణ కేసులో మేనల్లుడు భరత్‌కుమార్‌ను ప్రశ్నిస్తున్న ఏసీబీ
- 'మధ్యవర్తిత్వం'లో కీలకమైన సత్యనారాయణమూర్తిపైనా విచారణ?
- నేడు మరోమారు ప్రశ్నించే అవకాశం?

సాక్షి, హైదరాబాద్: రూ.వందల కోట్ల అవినీతి సొమ్ము కూడబెట్టిన హెచ్ఎండీఏ టౌన్ ప్లానింగ్ విభాగం మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ కేసులో ఏసీబీ అధికారులు మరింత లోతుగా ఆరా తీస్తున్నారు. శివబాలకృష్ణకు బినామీగా వ్యవహరించిన ఆయన సోదరుడు శివనవీన్‌ను ఏసీబీ అధికారులు ఇప్పటికే అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తాజాగా శివబాలకృష్ణ మేనల్లుడు భరత్‌కుమార్‌ను బుధవారం విచారించినట్టు తెలిసింది. అదేవిధంగా శివబాలకృష్ణకు సంబంధించిన 'వ్యవహారాలు' చక్కదిద్దడంలో తోడుగా ఉన్న బాచుపల్లికి చెందిన జి సత్యనారాయణ మూర్తి అనే వ్యక్తిని సైతం ఏసీబీ అధికారులు బుధవారం బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయంలో విచారించినట్టు తెలిసింది. ఈ ఇద్దరి ద్వారా కొన్ని ఆస్తుల కొనుగోళ్లు శివబాలకృష్ణ చేసినట్టు ఏసీబీ అధికారులు కీలక ఆధారాలు సేకరించారు. వాటిపై మరింత లోతుగా తెలుసుకునేందుకు భరత్‌కుమార్, సత్యనారాయణ మూర్తిలను ఏసీబీ ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది.

మేనల్లుడి పేరిట నాగర్‌కర్నూల్‌లో వ్యవసాయభూమి కొనుగోలు?

మేనల్లుడు భరత్‌కుమార్ పేరిట శివబాలకృష్ణ నాగర్‌కర్నూల్‌లో వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడని, ఇందుకు శివబాలకృష్ణ ఇచ్చిన లిక్విడ్ క్యాష్‌ను భరత్‌కుమార్ పలు మార్గాల్లో తన బ్యాంక్ ఖాతాలోకి వేయించుకున్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ సొమ్ముతోనే భూములు కొనుగోలు చేసినట్టు ఆధారాలు లభించడంతో ఏసీబీ అధికారులు ఈ అంశాలపైనే భరత్‌కుమార్‌ను ప్రశ్నించినట్టు తెలిసింది. భరత్‌కుమార్‌తో పాటు సత్యనారాయణ మూర్తిని పలు అంశాలపై ప్రశ్నించినట్టు తెలిసింది. మరికొన్ని వివరాలు తెలుసుకోవాల్సి ఉన్నందున బుధవారం మరోసారి విచారణకు హాజరుకావాలని వారిద్దరికీ ఏసీబీ అధికారులు సూచించినట్టు తెలిసింది.

కార్వీ ఆస్తుల జప్తు సబబే

సింగిల్ జడ్జి ఆదేశాలను కొట్టివేసిన సీజే ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: కార్వీ కేసులో సంస్థ ఆస్తుల జప్తు సబబేనని హైకోర్టు అభిప్రాయపడింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తును ధ్రువీకరించే అడ్జుడికేటింగ్ అథారిటీలో జ్యుడీషియల్ సభ్యుడు లేనంత మాత్రాన జప్తు ఆదేశాలు చెల్లవు అనడం సరికాదని స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని గతంలో సుప్రీం కోర్టు, పలు హైకోర్టులు తమ తీర్పుల్లో పేర్కొన్నాయని గుర్తు చేసింది. అథారిటీలో జ్యుడీషియల్ సభ్యుడు లేనందున ఆ ఆదేశాలు చెల్లవు అంటూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను కొట్టివేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద సీసీఎస్ నమోదు చేసిన కేసు ఆధారంగా కార్వీ గ్రూప్ ఎండీ పార్థసారథిని రెండేళ్ల క్రితం ఈడీ అదుపులోకి తీసుకుంది. రెండు దశలుగా దాదాపు రూ.2,094 కోట్ల ఆస్తులను జప్తు చేసింది. తొలి దశ జప్తును అథారిటీ సమర్థించింది. మరో దశకు సంబంధించి కార్వీ గ్రూప్‌నకు నోటీసులు ఇచ్చింది. అయితే అథారిటీ జప్తుల ధ్రువీకరణను సవాల్ చేస్తూ కార్వీ గ్రూప్ హైకోర్టును ఆశ్రయించింది. విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. ధ్రువీకరణను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అథారిటీలో నిపుణులైన జ్యుడీషియల్ సభ్యుడిని నియమించే వరకు నోటీసుల అమలు, ఆస్తుల జప్తు ఉత్తర్వుల ప్రక్రియను కొనసాగించవద్దని చెప్పారు. దీనిపై ఈడీ అప్పీల్‌కు వెళ్లగా.. విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. అథారిటీ ఉత్తర్వులను సమర్థిస్తూ ఆదేశాలిచ్చింది.

ఈనెల 16న గ్రామీణ భారత్ బంద్

- అదేరోజు ఇందిరాపార్కు వద్ద దీక్ష
- గాంధీభవన్‌లో భేటీ అయిన కాంగ్రెస్, వామపక్షాల నేతలు

సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్‌మోర్చా పిలుపు మేరకు ఈనెల 16న తెలంగాణలో 'గ్రామీణ భారత్ బంద్' నిర్వహించనున్నారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇందిరాపార్కు వద్ద రాష్ట్రస్థాయిలో ఆందోళన నిర్వహించడంతోపాటు జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో కూడా ఆందోళనలు చేపట్టనున్నారు. మంగళవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం అనుబంధ రైతు, కార్మిక సంఘాల నేతలు సమావేశమై నిరసన కార్యాచరణపై చర్చించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పక్షాన కోదండరెడ్డి, జగ్గారెడ్డి, అన్వేశ్‌రెడ్డి, నాగన్న, సీపీఐ నుంచి పశ్య పద్మ, సీపీఎం నుంచి వంగూరు రాములు తదితరులు పాల్గొన్నారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టాలను నిరసిస్తూ జాతీయస్థాయిలో నిర్వహించనున్న ఆందోళనలో రైతులు, కార్మికులు, ఇండియా కూటమిలోని రాజకీయపక్షాల నేతలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం అనుబంధ కార్మిక సంఘాలు, రైతు సంఘాల నేతలతో కలిసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్‌చైర్మన్ ఎం.కోదండరెడ్డిలు మాట్లాడుతూ ప్రధాని మోదీ విధానాలతో దేశంలోని ప్రభుత్వ ఆస్తులన్నీ ప్రైవేటుకు ధారాధత్తమయ్యాయని ఆరోపించారు. మోదీ ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న ఇందిరాపార్కు వద్ద దీక్ష చేస్తామని, ఈ దీక్షలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం తదితర ఇండియా కూటమి రాజకీయ పార్టీల అనుబంధ సంఘాల నేతలు, పార్టీల కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ఆందోళన సందర్భంగా డీసీసీ అధ్యక్షులు, కిసాన్‌సెల్ అధ్యక్షుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని చౌరస్తాలో కార్యక్రమాలు చేపట్టాలని, రైతులు, కార్మికులు అండగా నిలవాలని కోరారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు తమతమ జిల్లాల్లో వీలున్నచోట్ల ఈ కార్యక్రమంలో పాల్గొని దేశంలోని రైతులు, కార్మికులకు చేదోడు ఇవ్వాలని కోరారు.



ప్రిక్వార్టర్స్‌లో సుమిత్ నగాల్

భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ బెంగళూరు ఓపెన్ ఏటీపీ-100 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 98వ ర్యాంకర్ సుమిత్ 6-2, 6-2తో జెఫ్రీ బ్లాంకానెక్స్ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. 88 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో గంటా సాయికార్తీక్ రెడ్డి-మనీశ్ సురేశ్‌కుమార్ (భారత్) జోడీ 2-6, 6-7 (8/10)తో కుజ్మయిన్-జాన్వీర్ (ఫ్రాన్స్) జంట చేతిలో ఓడిపోయింది.

భారత మాజీ కెప్టెన్ దత్తాజీ రావు కన్నుమూత



వృద్ధాప్య సంబంధిత సమస్యలతో భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ దత్తాజీ రావు గైక్వాడ్ మంగళవారం బరోడాలో కన్నుమూశారు. ఆయన వయసు 95 ఏళ్లు. 1952 నుంచి 1961 వరకు భారత జట్టు తరఫున ఆయన 11 టెస్టులు ఆడి ఒక అర్ధ సెంచరీతో 350 పరుగులు చేశారు. దేశవాళీ క్రికెట్‌లో బరోడా తరఫున దత్తాజీ 14 సెంచరీలతో కలిపి 3,139 పరుగులు చేశారు. ఆయన సారథ్యంలోనే బరోడా 1958లో తొలిసారి రంజీ ట్రోఫీ గెలిచింది.

ఉమామహేశ్‌కు రెండో స్వర్ణ పతకం



పసిడి పతకాలతో ఉమామహేశ్, ఇషా

గ్రనాడా (స్పెయిన్): ప్రపంచకప్ జూనియర్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ షూటర్ మద్దినేని ఉమామహేశ్ ఖాతాలో రెండో స్వర్ణ పతకం చేరింది. సోమవారం జూనియర్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం నెగ్గిన ఉమామహేశ్... మంగళవారం 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో పసిడి పతకం సొంతం చేసుకున్నాడు. ఫైనల్లో ఉమామహేశ్-ఇషా తక్సాలె (భారత్) జోడీ 16-8 పాయింట్ల తేడాతో అన్వీ రాథోడ్-అభినవ్ షా (భారత్) జంటను ఓడించి విజేతగా నిలిచింది. ఈ టోర్నీలో ప్రస్తుతం భారత్ 3 స్వర్ణాలు, 2 రజతాలు, 2 కాంస్యాలతో కలిపి మొత్తం ఏడు పతకాలతో టాప్ ర్యాంక్‌లో ఉంది.

అనిరుధ్ జోడీ ఓటమి



ఫ్లోరిడా: డెల్‌రే బీచ్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీ నుంచి హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో అనిరుధ్-విజయ్ జంట 3-6, 6-7 (5/7)తో గిడో ఆండ్రెజి (అర్జెంటీనా)-మిగెల్ రేయస్ వరేలా (మెక్సికో) ద్వయం చేతిలో ఓడిపోయింది. అనిరుధ్ జోడీకి 3,610 డాలర్ల (రూ. 3 లక్షలు) ప్రైజ్‌మనీ లభించింది.

దక్షిణాఫ్రికా 220/6

హామిల్టన్: న్యూజిలాండ్‌తో మంగళవారం మొదలైన రెండో టెస్టులో తొలి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు కోల్పోయి 220 పరుగులు చేసింది. రువాన్ డి స్వార్ట్ (55 బ్యాటింగ్; 9 ఫోర్లు), షాన్ బెర్గ్ (34 బ్యాటింగ్; 6 ఫోర్లు) ఏడో వికెట్‌కు అభేద్యంగా 70 పరుగులు జోడించారు. న్యూజిలాండ్ బౌలర్లలో రచిన్ రవీంద్ర 3 వికెట్లు పడగొట్టాడు.



రజత్ పటిదార్, యశస్వి, ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్

సర్ఫరాజ్, జురెల్ అరంగేట్రం!

నెట్స్‌లో ముమ్మర ప్రాక్టీస్

రాజ్‌కోట్: కీలక ఆటగాళ్లు గాయాల పాలవడం... కోహ్లి విశ్రాంతి కొనసాగిస్తుండటం... యువ బ్యాటర్లు సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్‌లకు వరంగా మారనుంది. మూడో టెస్టులో వీరిద్దరు బరిలోకి దిగడం దాదాపు ఖాయమైంది. మంగళవారం ప్రాక్టీస్ సెషన్‌లో వీరిద్దరు మాత్రం గంటల తరబడి చెమటోడ్చడం చూస్తుంటే వారి అరంగేట్రానికి సూచనగా కనిపిస్తోంది. కెప్టెన్ రోహిత్ శర్మ వారి ప్రాక్టీస్‌ను దగ్గరుండి పరిశీలించాడు. శ్రేయస్ అయ్యర్‌ను మిగతా మూడు టెస్టుల నుంచి తప్పించగా, ఎంపిక చేసిన కేఎల్ రాహుల్ పూర్తి ఫిట్‌గా లేకపోవడంతో అతనూ రాజ్‌కోట్ మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఇవన్నీ కూడా సర్ఫరాజ్, జురెల్‌లకు రాచబాటను పరిచింది. ఆంధ్ర వికెట్ కీపర్ శ్రీకర్ భరత్ వరుసగా విఫలమవడం కీపర్ జురెల్‌కు కలిసి రానుంది. గత మ్యాచ్ ఆడిన రజత్ పటిదార్‌తోపాటు సర్ఫరాజ్, జురెల్ మిడిలార్డర్‌లో బరిలోకి దిగుతారు. ఫామ్‌లో ఉన్న శుబ్‌మన్ గిల్ ప్రాక్టీస్ చేయలేదు. అతని కుడిచేతి చూపుడు వేలు నొప్పి కారణంగా ట్రెయినింగ్‌కు దూరంగా ఉన్నాడు. అయితే అతని గాయం ఏమాత్రం తీవ్రమైంది కాదని జట్టు వర్గాలు వెల్లడించాయి. ఆల్‌రౌండర్ జడేజా స్పిన్ బౌలింగ్ కంటే బ్యాటింగ్ ప్రాక్టీసే ఎక్కువ చేశాడు. పేసర్లు బుమ్రా, ఆకాశ్‌దీప్‌లు బౌలింగ్‌లో శ్రమించారు. భారత్, ఇంగ్లండ్‌ల మధ్య గురువారం నుంచి మూడో టెస్టు జరుగుతుంది.

కొత్త కెరటం...

బ్యాడ్మింటన్‌లో సత్తా చాటుతున్న తీగల సాయిప్రసాద్

- ఇరాన్ జూనియర్ ఇంటర్నేషనల్ సింగిల్స్ టైటిల్‌తో గుర్తింపు



సాక్షి, హైదరాబాద్: అసోంలోని గువహటిలో గత ఏడాది ఆగస్టులో బ్యాడ్మింటన్ నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎన్‌సీఈ) ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిభావంతులైన కుర్రాళ్లను గుర్తించి వారిని భవిష్యత్తు కోసం తీర్చిదిద్దడం కోసం భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేసిన శిక్షణా కేంద్రం ఇది. ముందుగా అండర్-17 స్థాయిలో సెలక్షన్స్ ప్రక్రియ జరిగింది. ఇందులో ఏకంగా 858 మంది యువ షట్లర్లు పాల్గొన్నారు. వీరిలో టాప్-4కి మాత్రమే అక్కడ చోటు లభించింది. ఈ సెంటర్‌లో మొదటి విద్యార్థిగా అడుగు పెట్టిన కుర్రాడే హైదరాబాద్‌కు చెందిన తీగల సాయిప్రసాద్. అప్పటికే తన ప్రతిభతో ఆకట్టుకున్న సాయిప్రసాద్ ఎన్‌సీఈలో శిక్షణతో మరింత పదునెక్కాడు. తన ఆటలోని సత్తాను చూపిస్తూ ఇటీవల కీలక విజయంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. గత నెలలో ఇరాన్‌లో జరిగిన ఫజర్ జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్‌లో సాయి టైటిల్ సాధించి షటిల్ వేదికపై కొత్త కెరటంలా వెలుగులోకి వచ్చాడు.

తండ్రి ప్రోత్సాహంతో...

సాయి తండ్రి సూర్యారావు జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ ప్లేయర్. ఆటగాడిగా కెరీర్‌ను ముగించిన తర్వాత ఆయన కోచ్‌గా మారారు. సుదీర్ఘ కాలం పాటు న్యూజిలాండ్‌లో వేర్వేరు క్లబ్‌లలో కోచింగ్ ఇచ్చిన సూర్య ఆ తర్వాత భారత్‌కు తిరిగొచ్చారు. చిన్నప్పటినుంచి తండ్రి ఆటను చూస్తూ వచ్చిన సాయి సహజంగానే షటిల్‌పై ఆసక్తి పెంచుకున్నాడు. దాంతో సాయిని పూర్తిస్థాయిలో ఆటగాడిగా తీర్చిదిద్దాలని భావించిన సూర్య స్వయంగా తానే ఓనమాలు నేర్పించారు. ఆ తర్వాత మరింత మెరుగైన శిక్షణ కోసం ప్రతిష్టాత్మక పుల్లెల గోపీచంద్ అకాడమీలో సాయి చేరాడు. అదే అకాడమీలో తండ్రి సూర్య కూడా ఒక కోచ్‌గా ఉండటం సాయికి మరింత సానుకూలాంశంగా మారింది. అటు గోపీచంద్ మార్గనిర్దేశనం, ఇటు తండ్రి శిక్షణ వెరసి సాయి మంచి ఫలితాలు సాధించాడు. అండర్-13 స్థాయిలో జాతీయస్థాయి నంబర్‌వన్ కావడంతోపాటు అండర్-15, అండర్-17లలో సాయిప్రసాద్ టాప్-5లో కొనసాగాడు. జాతీయ జూనియర్ ర్యాంకింగ్ టోర్నీలతో పాటు అండర్-13 స్థాయిలో సింగపూర్, థాయ్‌లాండ్‌లలో జరిగిన టోర్నీల్లో టైటిల్స్ సాధించాడు. అనంతరం కెరీర్‌లో ఎదుగుతున్న కీలక దశలో అతను గువహటి ఎన్‌సీఈలో ప్రవేశంతో తన ఆటకు మెరుగులు దిద్దుకున్నాడు.

కెరీర్‌లో కీలక విజయం...

అగ్రశ్రేణి కోచ్‌లు, అత్యుత్తమ సౌకర్యాలతో ఉన్న ఎన్‌సీఈలో సాయిప్రసాద్ సాధనకు మరింత మంచి అవకాశం దక్కింది. ఈ క్రమంలో అతని పురోగతి వేగంగా సాగింది. గత ఏడాది ఆగస్టులో సాయి జూనియర్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో 1043వ స్థానంలో ఉన్నాడు. అక్కడి నుంచి మెరుగైన ప్రదర్శనతో ఈ ఏడాది జనవరి తొలి వారంలో మొదటి సారి టాప్-100లోకి అడుగు పెట్టాడు. మంగళవారం ప్రకటించిన తాజా బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ ర్యాంకింగ్స్‌లో అతను 37వ స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో జనవరిలో అతని కెరీర్‌లో చెప్పుకోదగ్గ విజయం దక్కింది. ఇరాన్‌లో జరిగిన జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్‌లో సాయిప్రసాద్ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్నాడు. ఫైనల్ చేరడానికి ముందు చక్కటి ప్రదర్శనతో అతను వరుసగా మూడు మ్యాచ్‌లలో స్థానిక ఇరాన్ ఆటగాళ్లను ఓడించడం విశేషం. గత వారమే 17 ఏళ్లు పూర్తి చేసుకున్న సాయి ఇకపై అండర్-19 స్థాయి టోర్నీల్లోనే పాల్గొనబోతున్నాడు. జూనియర్ విభాగంలో టాప్-10 ర్యాంకింగ్స్‌లోకి చేరడంపై సాయి దృష్టి పెట్టాడు. ఆపై జూనియర్ వరల్డ్‌లాంటి పెద్ద టోర్నీని గెలవడం అతని ముందున్న ప్రస్తుత లక్ష్యం. సాయి ప్రతిభకు తోడు ఎన్‌సీఈ శిక్షణ అతని ప్రదర్శన స్థాయిని పెంచింది. ఇదే ఆటను కొనసాగిస్తే ముమ్ముందు ఈ అబ్బాయి అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో అద్భుత ఫలితాలు సాధించడం ఖాయం.

ప్లే ఆఫ్స్‌కు పట్నా పైరేట్స్ అర్హత



కోల్‌కతా: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు అర్హత పొందిన ఐదో జట్టుగా పట్నా పైరేట్స్ నిలిచింది. తెలుగు టైటాన్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 38-36తో గెలిచింది. పట్నా తరఫున మంజీత్ 8 పాయింట్లు, సందీప్ 7 పాయింట్లు స్కోరు చేశారు. టైటాన్స్ తరఫున కెప్టెన్ పవన్ సెహ్రావత్ 16 పాయింట్లతో ఆకట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఈ టోర్నీలో 21 మ్యాచ్‌లు ఆడి 11 విజయాలు అందుకున్న పట్నా 68 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి ప్లే ఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. 20 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న తెలుగు టైటాన్స్ 18వ పరాజయంతో 17 పాయింట్లతో చివరిదైన 12వ స్థానాన్ని ఖరారు చేసుకుంది. మిగిలి ఉన్న తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో టైటాన్స్ గెలిచినా 29 పాయింట్లతో 11వ స్థానంలో ఉన్న యూపీ యోధాస్‌ను దాటే అవకాశం లేదు. ఇప్పటికే జైపూర్ పింక్ పాంథర్స్, పుణేరి పల్టన్, గుజరాత్ జెయింట్స్, దబంగ్ ఢిల్లీ, పట్నా పైరేట్స్ ప్లే ఆఫ్స్‌కు చేరుకోగా... చివరిదైన ఆరో బెర్త్ కోసం హరియాణా స్టీలర్స్, బెంగాల్ వారియర్స్ జట్లు రేసులో ఉన్నాయి. అయితే స్టీలర్స్ ఒక మ్యాచ్‌లో గెలిస్తే ప్లే ఆఫ్స్ బెర్త్‌ను దక్కించుకుంటుంది.

భారత రెజ్లింగ్ సమాఖ్యపై నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)పై విధించిన సస్పెన్షన్‌ను యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) మంగళవారం ఎత్తివేసింది. మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై న్యాయపోరాటం చేసిన రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్‌లపై ఎలాంటి వివక్ష చూపరాదని, కక్ష్యసాధింపు చర్యలు చేపట్టకుండా అందరు రెజ్లర్లకు సమాన అవకాశాలు కల్పించాలని డబ్ల్యూఎఫ్ఐకి యూడబ్ల్యూడబ్ల్యూ సూచించింది. సస్పెన్షన్ తొలగిపోవడంతో పారిస్ ఒలింపిక్స్‌లో భారత రెజ్లర్లంతా మన జెండా కిందే పోటీపడొచ్చు. పతకం గెలిస్తే పోడియంలో మన పతాకమే రెపరెపలాడతుంది. గడువులోగా డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికల్ని నిర్వహించలేకపోవడంతో గత ఆగస్టులో సస్పెన్షన్ వేటు వేసింది.

రసెల్, రూథర్‌ఫర్డ్ మెరుపులు

చివరి టి20లో ఆస్ట్రేలియాపై వెస్టిండీస్ విజయం



పెర్త్: ఆస్ట్రేలియా పర్యటనను వెస్టిండీస్ జట్టు విజయంతో ముగించింది. మంగళవారం జరిగిన చివరిదైన మూడో టి20లో విండీస్ 37 పరుగుల తేడాతో గెలిచింది. సిరీస్‌ను ఆస్ట్రేలియా 2-1తో సొంతం చేసుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆండ్రీ రసెల్ (29 బంతుల్లో 71; 4 ఫోర్లు, 7 సిక్స్‌లు), షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ (40 బంతుల్లో 67 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు అర్ధ సెంచరీలు చేయడంతో... మొదట బ్యాటింగ్‌కు దిగిన విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 220 పరుగులు చేసింది. 79 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడిన విండీస్‌ను రసెల్, రూథర్‌ఫర్డ్ ఆదుకున్నారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 139 పరుగులు జోడించి అంతర్జాతీయ టి20ల్లో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించారు. 221 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 183 పరుగులు చేసి ఓడిపోయింది. డేవిడ్ వార్నర్ (49 బంతుల్లో 81; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (19 బంతుల్లో 41 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరిపించినా ఫలితం లేకపోయింది.

పడ్డారండి ప్రేమలో మరి...



ప్రభాస్

'తండేల్'లో నాగచైతన్య, సాయి పల్లవి

'టిల్లు స్క్వేర్'లో అనుపమ, సిద్ధు



విశ్వక్ సేన్



కిరణ్ అబ్బవరం

ప్రతి మనిషికి ప్రాణం ఉన్నట్లే.... ప్రతి మనసుకు ఓ ప్రేమకథ ఉంటుంది. ఒకరి ప్రేమ సఫలం... మరొకరిది విఫలం... ఇంకొకరిది త్యాగం... ఇలా ఒక్కో ప్రేమ కథది ఒక్కో ముగింపు. మరి.. రానున్న ప్రేమ కథా చిత్రాల్లో ఏ కథ ముగింపు ఎలా ఉంటుందో వెండితెర పైనే చూడాలి. 'పడ్డారండి ప్రేమలో మరి..' అంటూ సిల్వర్ స్క్రీన్ కోసం కొందరు హీరోలు-హీరోయిన్లు ప్రేమలో పడ్డారు. ఈ ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఆ ప్రేమకథా చిత్రాల గురించి తెలుసుకుందాం.

సైనికుడి ప్రేమకథ... 'ఛత్రపతి', 'మిర్చి', 'బాహుబలి', 'సలార్'... ఇలా యాక్షన్ చిత్రాలే కాదు.. ప్రభాస్ కెరీర్‌లో 'వర్షం', 'మిస్టర్ పర్ఫెక్ట్', 'రాధేశ్యామ్' వంటి ప్రేమకథా చిత్రాలు కూడా ఉన్నాయి. తాజాగా ప్రభాస్ మరో ప్రేమకథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. 2022లో 'సీతారామం' వంటి బ్లాక్‌బస్టర్ ప్రేమకథను ఇచ్చిన హను రాఘవపూడి మరో ప్రేమకథను రెడీ చేశారు. పీరియాడికల్ లవ్‌స్టోరీగా తెరకెక్కనున్న ఈ సినిమాలో ప్రభాస్ హీరోగా నటిస్తారని టాక్. రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని, ఇందులో ప్రభాస్ ఆర్మీ ఆఫీసర్‌గా నటిస్తారనీ టాక్. అలాగే ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రాల్లో 'రాజా సాబ్' ఒకటి. ఫ్యాంటసీ హారర్ ఎలిమెంట్స్‌తో పాటు ఓ మంచి లవ్‌ట్రాక్ కూడా ఈ చిత్రంలో ఉందట. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మాళవికా మోహనన్, నిధీ అగర్వాల్, రిద్ధీ కుమార్ హీరోయిన్లు.



'డెకాయిట్'లో శ్రుతీహాసన్, అడివి శేష్



ఆనంద్, వైష్ణవి

మరో లవ్‌స్టోరీ... 'లవ్‌స్టోరీ' (2021) చిత్రం తర్వాత నాగచైతన్య, సాయిపల్లవి కలిసి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న మరో ప్రేమకథా చిత్రం 'తండేల్'. నాగచైతన్యతో 'ప్రేమమ్' వంటి లవబుల్ సినిమా తీసిన చందు మొండేటి ఈ సినిమాకు దర్శకుడు. ఈ చిత్రంలో జాలరి రాజు పాత్రలో నాగచైతన్య, సత్య పాత్రలో సాయి పల్లవి నటిస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరంలకు చెందిన మత్స్యకారులు 2018లో గుజరాత్‌కు వలస వెళ్లి, సముద్రంలో చేపల వేటను కొనసాగిస్తుంటారు. ఓ 24 మంది మత్స్యకారులు పాకిస్తాన్ కోస్ట్ గార్డులకు బందీలుగా చిక్కుతారు. వీరిలో ఓ మత్స్యకారుడి వివాహం జరిగి ఏడాది మాత్రమే అవుతుంది. భార్య గర్భవతిగా ఉన్న సమయంలో ఆ మత్స్యకారుడు పాకిస్తాన్‌లో బందీ కాబడతాడు. ఈ వ్యక్తి జీవితం ఆధారంగా 'తండేల్'ను ప్రేమకథ ప్రాధాన్యంగా తీస్తున్నారు మేకర్స్.

ప్రేమికులే శత్రువులయితే... విడిపోయిన ప్రేమికులు శత్రువులుగా ఎదురుపడితే అనే కాన్సెప్ట్‌తో రూపొందుతున్న లవ్‌స్టోరీ మూవీ 'డెకాయిట్'. 'ఒక ప్రేమకథ' అనేది ఉపశీర్షిక. అడివి శేష్, శ్రుతీహాసన్ జంటగా నటిస్తున్న చిత్రమిది. ఈ సినిమాతో కెమెరామేన్ షానీ డియోల్ దర్శకుడిగా మారారు.

రెండు ప్రేమకథల్లో... గత ఏడాది 'బేబీ' అనే లవ్‌స్టోరీ మూవీతో హిట్ అందుకున్నారు హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవీ చైతన్య (విరాజ్ మరో లీడ్ రోల్ చేశారు). ఈ 'బేబీ' జోడీ రిపీట్ అవుతోంది. 'బేబీ' దర్శకుడు సాయి రాజేశ్ ఈ సినిమాకు కథ అందించగా, రవి నంబూరి దర్శకుడిగా పరిచయం కానున్నారు. అలాగే మరో లవ్‌స్టోరీ 'డ్యూయెట్' కూడా చేస్తున్నారు ఆనంద్ దేవరకొండ. ఈ ఎమోషనల్ లవ్‌స్టోరీ ఫిల్మ్‌లో రితికా సింగ్ కథానాయిక. మిథున్ వరదరాజ కృష్ణన్ దర్శకత్వం వహిసున్నారు. ఇలా ఒకేసారి రెండు ప్రేమకథా చిత్రాల్లో నటిస్తున్నారు ఆనంద్ దేవరకొండ.


డబుల్ లవ్... డీజే టిల్లు ఓ డిఫరెంట్ లవర్. పిచ్చిగా ప్రేమిస్తాడు. ఆ ప్రేమలో తేడా వస్తే ప్రేయసినైనా జైలుకు పంపిస్తాడు. అలాంటి డీజే టిల్లు మళ్లీ లవ్‌లో మునిగాడు. మరి.. ఈసారి అతని లవ్‌స్టోరీ ఏ టర్న్ తీసుకుంటుందో చూడాలంటే మార్చి 29వరకు ఆగాల్సిందే. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న చిత్రం 'టిల్లు స్క్వేర్'. అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్. ఈ చిత్రానికి మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. 'డీజే టిల్లు'కి సీక్వెల్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. మరో వైపు 'తెలుసు కదా' అనే లవ్‌స్టోరీ కూడా చేస్తున్నారు సిద్ధు జొన్నలగడ్డ. కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లు.

లైలా లవ్వు... 'అశోకవనంలో అర్జున కల్యాణం', 'ఓరి.. దేవుడా!', 'పాగల్' వంటి లవ్‌స్టోరీ చిత్రాల్లో నటించారు విశ్వక్ సేన్. ఈ యంగ్ హీరో రీసెంట్‌గా మరో లవ్‌స్టోరీకి పచ్చజెండా ఊపారు. ఆ సినిమా పేరు 'లైల'. ఈ సినిమాలో తానే టైటిల్ రోల్ చేస్తూ, స్వీయ దర్శకత్వం వహిస్తానని ఇటీవల ఓ సందర్భంలో చెప్పారు విశ్వక్.


దిల్ రుబా... కెరీర్‌లో తొలి సినిమానే 'రాజావారు రాణిగారు' వంటి లవ్‌స్టోరీ చేశారు కిరణ్ అబ్బవరం. ఆ తర్వాత కిరణ్ అబ్బవరం హీరోగా చేసిన 'ఎస్ఆర్ కళ్యాణ మండపం', 'సమ్మతమే', 'వినరో భాగ్యము విష్ణుకథ' చిత్రాల్లో మంచి లవ్‌ట్రాక్ ఉంది. ఇప్పుడు ఈ యంగ్ హీరో ఓ కంప్లీట్ లవ్‌స్టోరీ సినిమా చేస్తున్నారు. విశ్వ కరుణ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారని, రుక్సార్ థిల్లాన్ హీరోయిన్ అని తెలిసింది. ఈ సినిమాకు 'దిల్ రుబా' టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

- అభిషేక్ పచ్చిపాల, నజియా ఖాన్, జబర్దస్త్ ఫణి, సతీష్ సారిపల్లి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జస్ట్ ఏ మినిట్'. పూర్వస్ యశ్వంత్ దర్శకత్వంలో అర్షద్ తస్వీర్, ప్రకాశ్ ధర్మపురి నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమా నుంచి తాజాగా 'నువ్వంటే ఇష్టం' అనే పాటను ప్రేమికుల దినోత్సవం సందర్భంగా మంగళవారం విడుదల చేశారు. యస్. కె భాజీ ఈ సినిమాకు స్వరకర్త.

- ఇంద్ర, కోమల్ నాయర్, దీపు, స్వాతి శర్మ, ఇమ్రాన్, పీతల్ భట్ లీడ్ రోల్స్ చేసిన చిత్రం 'ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు'. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ సినిమాలోని 'నా కల..' పాటను ప్రముఖ సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ విడుదల చేశారు. లక్ష్మణ్ జెల్ల దర్శకత్వంలో చంద్ర ఎస్. చంద్ర. డా. విజయ రమేష్ రెడ్డి నిర్మించిన చిత్రం ఇది. శ్రవణ్ భరద్వాజ్ ఈ సినిమాకు సంగీత దర్శకుడు.



'సీతారామం'లో మృణాల్, దుల్కర్



'ఓయ్'లో సిద్ధార్థ్, షామిలీ

ఈ ప్రేమికుల దినోత్సవం (ఫిబ్రవరి 14) సందర్భంగా ఇప్పటికే విడుదలైన కొన్ని ప్రేమకథా చిత్రాలు మళ్లీ రిలీజ్ కానున్నాయి. ఆ వివరాలు...

- సిద్ధార్థ్, షామిలీ హీరోహీరోయిన్లుగా ఆనంద్ రంగ దర్శకత్వం వహించిన 'ఓయ్!' (2009), దుల్కర్ సల్మాన్- మృణాల్ ఠాకూర్ జోడీగా హను రాఘవపూడి దర్శకత్వం వహించిన 'సీతారామం' (2022), గత ఏడాది విడుదలైన 'బేబీ' చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. సూర్య ద్విపాత్రాభినయం చేసిన తమిళ చిత్రం 'సూర్య సన్నాఫ్ కృష్ణన్' (2008) తెలుగు అనువాదం సైతం రీ రిలీజ్ అవుతోంది. ఇలా మరికొన్ని చిత్రాలు ఉన్నాయి.



రష్మిక

సాధారణంగా లవ్‌స్టోరీస్ ఎక్కువగా అబ్బాయిల దృష్టి కోణంలో నుంచి వస్తుంటాయి. ఓ అమ్మాయి తన ప్రేమకథను చెబితే ఎలా ఉంటుంది? అనే అంశం ఆధారంగా వస్తున్న చిత్రం 'ది గాళ్ ఫ్రెండ్'. 'చి.ల.సౌ' వంటి సినిమా తీసిన నటుడు- దర్శకుడు రాహుల్ రవీంద్రన్ ఈ కొత్త లవ్‌స్టోరీకి దర్శకుడు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది.

ఆ ఇద్దరి కోసమే వ్యూహం.. శపథం తీశా!

- రామ్‌గోపాల్ వర్మ



దాసరి కిరణ్ కుమార్, రామ్ గోపాల్ వర్మ

''దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డిగారి మరణం నుంచి ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేవరకు 'వ్యూహం' చిత్రకథ ఉంటుంది. అలాగే జగన్‌గారు సీఎంగా ప్రమాణ స్వీకారం నుంచి చంద్రబాబు నాయుడు జైలుకు వెళ్లేవరకు 'శపథం' చిత్రకథ ఉంటుంది. నేను ఈ సినిమాలను జగన్‌గారి కోసం కాదు.. పవన్, చంద్రబాబు కోసం తీశాను'' అని రామ్‌గోపాల్ వర్మ అన్నారు. అజ్మల్, మానస ప్రధాన పాత్రల్లో రామ్‌గోపాల్ వర్మ 'వ్యూహం', 'శపథం' చిత్రాలు తెరకెక్కించారు. రామధూత క్రియేషన్స్‌పై దాసరి కిరణ్ కుమార్ నిర్మించిన 'వ్యూహం' ఈ నెల 23న, 'శపథం' మార్చి 1న రిలీజ్ అవుతున్నాయి. ఈ సినిమాల ట్రైలర్ రిలీజ్ వేడుకని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ– ''ప్రజా జీవితంలో ఉన్న కొందరిపై మనకు కొన్ని అభిప్రాయాలుంటాయి. అలా నాకు ఉన్న అభిప్రాయాలతో వాస్తవ ఘటనల నేపథ్యంగా నేను వ్యక్తీకరించిన సినిమాలే 'వ్యూహం, శపథం'. ఈ సినిమాలు ఎవరి మీద ఎలాంటి ప్రభావం చూపిస్తాయనేది చెప్పలేను. ఈ చిత్రాలను గత డిసెంబరులో విడుదల చేయాలనుకున్నాం. నారా లోకేశ్ కోర్టుకు వెళ్లి మా సినిమా రిలీజ్‌ను అడ్డుకున్నారు. ఇప్పుడు సరిగ్గా ఎన్నికల ముందు మా రెండు సినిమాలు విడుదలయ్యేలా పరోక్షంగా సహాయం చేసిన ఆయనకు థ్యాంక్స్. ఎవరైనా ఏ సినిమా రిలీజ్‌ని అయినా కొన్నాళ్లు ఆపించగలరు గానీ శాశ్వతంగా ఆపలేరు. వారం రోజుల తేడాలో రెండు సినిమాలు రిలీజ్ కావడం వల్ల ఇబ్బందేం ఉండదు. నచ్చితే రెండు సినిమాలూ చూస్తారు.. నచ్చకుంటే రెండూ చూడరు. సెన్సార్ అనేది ఔట్ డేటెడ్ వ్యవస్థ. ఏ కథ తీసినా వాళ్లకు అభ్యంతరాలు ఉంటాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ప్రకారం ప్రతి ఫిలిం మేకర్‌కు వాస్తవ ఘటనలను తన కోణంలో తెరకెక్కించే స్వేచ్ఛ ఉందని హైకోర్టు మాకు ఇచ్చిన ఆర్డర్స్‌లో పేర్కొంది'' అన్నారు. దాసరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ– ''వ్యూహం, శపథం' సినిమాలు మొదలుపెట్టినప్పుడే విడుదలకు అడ్డంకులు వస్తాయని తెలుసు.. అయినా చేశాం. ఎన్నికలు సమీపిస్తున్నప్పటికీ నారా లోకేశ్ తన పార్టీ కార్యక్రమాలన్నీ వదిలి మా సినిమాలు రిలీజ్ కాకుండా కోర్టులకు, సెన్సార్ ఆఫీస్‌లకు ఫిర్యాదులు చేశాడు. రోడ్లపై ధర్నాలు చేయించాడు. ఆయన అంత పోరాటం చేశాడంటేనే మా సినిమాల్లో ఎంత బలమైన కథ ఉందో అర్థం చేసుకోవచ్చు. మా సినిమాల రిలీజ్ విషయంలో దేవుడు మాకు అన్నీ కలిసొచ్చేలా చేశాడనుకుంటున్నాం. ఈ సినిమాలను తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 500 థియేటర్స్‌లో రిలీజ్ చేయబోతున్నాం.. రెండూ విజయం సాధిస్తాయనే నమ్మకం ఉంది'' అన్నారు.

అందుకే ఈ కథ ఎంచుకున్నాను



రాజేష్ దండా

సందీప్ కిషన్ హీరోగా నటించిన చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో రాజేష్ దండా మాట్లాడుతూ– ''ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం', 'సామజ వరగమన' చిత్రాల తర్వాత మా బ్యానర్ నుంచి వస్తున్న మూడో చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. సందీప్ కిషన్, వీఐ ఆనంద్ నాకు మంచి మిత్రులు. 'టైగర్', 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'డిస్కో రాజా', 'ఒక్క క్షణం'.. ఇలా ఆనంద్ డైరెక్షన్‌లో వచ్చిన సినిమాలను నేను డిస్ట్రిబ్యూట్ చేశాను. నేను డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్న సమయంలో నా నిర్మాణంలో ఓ సినిమా చేస్తానన్నారు సందీప్‌గారు. వీఐ ఆనంద్‌గారు చెప్పిన రెండు కథల్లో కొత్త కంటెంట్‌తో తీసే సినిమా సక్సెస్ అవుతుందని భావించి 'ఊరి పేరు భైరవకోన' కథను ఎంచుకున్నాను. సందీప్‌గారి కెరీర్‌లో ఈ సినిమా నంబర్ వన్‌గా నిలుస్తుందని అనుకుంటున్నాను. 'భైరవకోన' అనే గ్రామంలో జరిగే విభిన్న ఘటనల సమాహారమే ఈ చిత్రం. ప్రస్తుతం అల్లరి నరేశ్‌తో 'బచ్చల మల్లి', కిరణ్ అబ్బవరంతో ఓ సినిమా చేస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	483	71,555
నిఫ్టీ ▲	127	21,743

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,716 ▽	227
డోజోన్స్	38,322 ▽	475
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,512 ▽	61
డాక్స్	16,881 ▽	157
షాంఘై (శుక్రవారం ముగింపు)	2,866 ▲	36
నికాయ్	37,964 ▲	1,067

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,394 ▲	93
బంగారం (99.5 స్వచ్ఛత)	62,144 ▲	94
వెండి (కిలో)	71,042 ▽	98

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.59	83.61
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.55	106.09
€	యూరో	ఎస్‌బీఐ	88.25	90.60
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.39	56.64
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.21	55.12
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.09	63.08
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.26	22.77
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.73	23.47
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.42	12.39

హిండాల్కో లాభం జూమ్

క్యూ3లో రూ. 2,331 కోట్లు

న్యూఢిల్లీ: ఆదిత్య బిర్లా గ్రూప్ మెటల్ రంగ దిగ్గజం హిండాల్కో ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 71 శాతం జంప్‌చేసి రూ. 2,331 కోట్లను తాకింది. అల్యూమినియం, కాపర్ విభాగాలు పటిష్ట పనితీరు చూపడం లాభాలకు దోహదం చేసింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 1,362 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 53,151 కోట్ల నుంచి 52,808 కోట్లకు బలహీనపడింది. కఠిన మార్కెట్ పరిస్థితుల్లోనూ వృద్ధి బాటలో సాగినట్లు కంపెనీ ఎండీ సతీష్ పాయ్ తెలియజేశారు. అల్యూమినియం, కాపర్ బిజినెస్‌లు ఆకర్షణీయ ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు.



ఇందుకు మెరుగైన ప్రొడక్ట్ మిక్స్, తగ్గిన ముడివ్యయాలు సహకరించినట్లు వెల్లడించారు. ఈ రెండు విభాగాల విస్తరణపై పెట్టుబడులను కొనసాగిస్తున్నట్లు తెలియజేశారు. వెరసి ఈ ఏడాది రూ. 4,500 కోట్లు వెచ్చిస్తున్నట్లు ప్రస్తావించారు. వచ్చే ఏడాది(2024–25) పెట్టుబడులను రూ. 5,500 కోట్లకు పెంచనున్నట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో హిండాల్కో షేరు బీఎస్‌ఈలో 12.5 శాతం పతనమై రూ. 510 వద్ద ముగిసింది.

టాటా ఈవీలపై భారీ డిస్కౌంట్

రూ.1.2 లక్షల వరకు తగ్గింపు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్ వెహికల్స్ అయిన నెక్సన్.ఈవీ, టియాగో.ఈవీ మోడళ్లపై రూ.1.2 లక్షల వరకు తగ్గింపు ప్రకటించింది. బ్యాటరీ వ్యయాలు తగ్గుముఖం పట్టడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు కంపెనీ మంగళవారం తెలిపింది. నెక్సన్.ఈవీ ధర రూ.1.2 లక్షల వరకు తగ్గింది. దీంతో ఈ మోడల్ ప్రారంభ ధర రూ.14.49 లక్షలు ఉంది. టియాగో.ఈవీ ధర రూ.70,000 వరకు తగ్గడంతో ఈ మోడల్ రూ.7.99 లక్షల నుంచి లభిస్తోంది. బ్యాటరీ వ్యయాలను దృష్టిలో పెట్టుకుని పంచ్.ఈవీ ధర నిర్ణయించడంతో తాజాగా ఎటువంటి సవరణ చేయలేదని టాటా



మోటార్స్ వెల్లడించింది. దేశవ్యాప్తంగా 2023లో ప్యాసింజర్ వాహన పరిశ్రమ 8 శాతం వృద్ధి చెందింది. అయితే ఈవీ విభాగం 90 శాతం దూసుకెళ్లడం గమనార్హం. గతేడాదితో పోలిస్తే 2024 జనవరిలో ఈవీ విభాగం ఏకంగా 100%పెరగడం విశేషం. ఎలక్ట్రిక్ ప్యాసింజర్ కార్ల పరిశ్రమలో భారత్‌లో 70%పైగా వాటాతో టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ అగ్రస్థానంలో నిలిచింది.

గో ఫస్ట్‌కు ఎన్‌సీఎల్‌టీలో ఊరట

దివాలా పరిష్కార ప్రక్రియ గడువు మరో 60 రోజులకు పెంపు

న్యూఢిల్లీ: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న విమానయాన సంస్థ గో ఫస్ట్‌కి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో (ఎన్‌సీఎల్‌టీ) కొంత ఊరట లభించింది. కంపెనీ దివాలా పరిష్కార ప్రక్రియను (సీఐఆర్‌పీ) ముగించేందుకు గడువును ఎన్‌సీఎల్‌టీ మరో 60 రోజుల పాటు పెంచింది. పరిష్కార నిపుణుడు (ఆర్‌పీ) దివాకర్ మహేశ్వరి విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. గో ఫస్ట్‌పై మూడు సంస్థలు ఆసక్తి వ్యక్తం చేసినట్లు, ధరావత్తును కూడా డిపాజిట్ చేసినట్లు మహేశ్వరి తెలిపారు. దేశీ విమానయాన సంస్థ స్పైస్‌జెట్, షార్జాకి చెందిన స్కై వన్, ఆఫ్రికన్ సంస్థ సాఫ్రిక్ ఇన్వెస్ట్‌మెంట్స్ వీటిలో ఉన్నాయి. ఇవి త్వరలోనే తమ ప్రణాళికలను సమర్పించే అవకాశం ఉందని మహేశ్వరి



పేర్కొన్నారు. గో ఫస్ట్ గతేడాది మే 3 నుంచి కార్యకలాపాలు నిలిపివేసింది. స్వచ్ఛందంగా దివాలా పరిష్కార ప్రక్రియ చేపట్టాలని కోరుతూ మే 10న ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది. గో ఫస్ట్ దివాలా పరిష్కార ప్రక్రియ డెడ్‌లైన్‌ను ఎన్‌సీఎల్‌టీ పొడిగించడం ఇది రెండోసారి. గతేడాది నవంబర్ 23న 90 రోజుల పాటు పొడిగించగా.. ఆ డెడ్‌లైన్ ఫిబ్రవరి 4తో ముగిసింది. దివాలా కోడ్ కింద సీఐఆర్‌పీని గరిష్టంగా 330 రోజుల్లోగా పూర్తి చేయాలి.

నాల్కో రూ. 2 డివిడెండు



న్యూఢిల్లీ: నవరత్న హోదా కలిగిన ప్రభుత్వ రంగ దిగ్గజం నేషనల్ అల్యూమినియం కంపెనీ (నాల్కో) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ. 471 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతక్రితం క్యూ3లో నమోదైన రూ. 256 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు. సమీక్షాకాలంలో మొత్తం ఆదాయం రూ. 3,358 కోట్ల నుంచి రూ. 3,398 కోట్లకు పెరిగింది. షేరుకి రూ. 2 చొప్పున కంపెనీ రెండో మధ్యంతర డివిడెండును ప్రకటించింది.

ర్యాపిడో ఆటో.. జీరో కమీషన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రైడ్ హెయిలింగ్ యాప్ ర్యాపిడో సరికొత్త పోటీకి తెరలేపింది. ర్యాపిడో ఆటో డ్రైవర్ల నుంచి జీవిత కాలంపాటు ఎటువంటి కమీషన్ తీసుకోకుండా సేవలు అందిస్తామని మంగళవారం ప్రకటించింది. అయితే డ్రైవర్లు లాగిన్ ఫీజు చెల్లిస్తే సరిపోతుందని వెల్లడించింది. నగరాన్నిబట్టి ఈ రుసుము రోజుకు రూ.9 నుంచి రూ.29 మధ్య ఉంటుంది.

ఫైనాన్స్, ఐటీ షేర్లలో కొనుగోళ్లు

- అరశాతానికి పైగా పెరిగిన సూచీలు
- సెన్సెక్స్ లాభం 483 పాయింట్లు
- కలిసొచ్చిన ద్రవ్యోల్బణ తగ్గుముఖం
- ఎఫ్ఐఐల పెట్టుబడులపై ఆశలు

ముంబై: ఫైనాన్స్, బ్యాంకింగ్ షేర్లలో రికవరీ ర్యాలీతో పాటు ఐటీ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు మంగళవారం అరశాతానికి పైగా లాభపడ్డాయి. రిటైల్ ద్రవ్యోల్బణం 3 నెలల కనిష్టానికి దిగిరావడం, దేశీయ మార్కెట్లోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం పుంజుకోవచ్చనే ఆశలు సెంటిమెంట్‌ను మెరుగుపరిచాయి. ఫలితంగా సెన్సెక్స్ 483 పాయింట్లు పెరిగి 71,555 వద్ద నిలిచింది. నిఫ్టీ 127 పాయింట్లు బలపడి 21,743 వద్ద నిలిచింది. స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ప్రారంభంలోనే కాస్త అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే వెంటనే తేరుకొని తిరిగి లాభాల బాట పట్టాయి. మెటల్ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు స్థిరమైన లాభాలతో కదిలాయి. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ అవుట్‌లుక్, రేట్ల తగ్గింపు సమయాన్ని నిర్ధారించే అమెరికా ద్రవ్యోల్బణ డేటా వెల్లడి నేపథ్యంలో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభ, నష్టాల మధ్య ట్రేడవుతున్నాయి.

- పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్)పై ప్రకటించిన చర్యలను పునఃసమీక్షించే ప్రసక్తే లేదని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేయడంతో పేటీఎం షేరు 10% లోయర్ సర్క్యూట్‌ను తాకి రూ.380 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ మెక్వారీ పేటీఎం షేరుకు డౌన్‌గ్రేడ్ రేటింగ్‌ను తగ్గించడం కూడా ప్రతికూల ప్రభావం చూపింది.



రిలయన్స్ @ రూ.20 లక్షల కోట్లు

రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ తొలిసారి రూ.20 లక్షల కోట్లను అందుకుంది. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారతీయ కంపెనీగా రికార్డు సృష్టించింది. ఈ షేరు ఇంట్రాడేలో 2% పెరిగి రూ.2,957 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.20,01,279 కోట్లుగా నమోదైంది. చివరికి షేరు 1% లాభంతో రూ.2,929 వద్ద ముగియడంతో కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.19.81 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది. దేశంలో టాప్–10 మార్కెట్ క్యాప్ కలిగిన సంస్థల్లో రిలయన్స్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎల్ఐసీ, ఎస్‌బీఐ, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌యూఎల్, ఐటీసీలు తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి.

ఐషర్ మోటార్స్ లాభం అప్

క్యూ3లో రూ. 996 కోట్లు

న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం ఐషర్ మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 34 శాతం జంప్‌చేసి రూ. 996 కోట్లను తాకింది. దేశ, విదేశాలలో అమ్మకాలు ఊపందుకోవడం లాభాల్లో వృద్ధికి సహకరించింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 741 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 12 శాతం పుంజుకుని రూ. 4,179 కోట్లకు చేరింది. ఈ కాలంలో అనుబంధ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ 4 శాతం అధికంగా 2,29,214 మోటార్‌సైకిళ్లను విక్రయించింది.



కొత్త 450 షెర్పా ప్లాట్‌ఫామ్‌పై అభివృద్ధి చేసిన హిమాలయన్ బైకులు సాహసిక ప్రపంచ పర్యాటక పరిస్థితుల్ని మార్చగలవని భావిస్తున్నట్లు కంపెనీ ఎండీ సిద్ధార్థ లాల్ పేర్కొన్నారు. వెరసి మిడిల్‌వెయిట్ మోటార్‌సైక్లింగ్ విభాగంలో భారీ పురోగతిని సాధించగలదని అంచనా వేశారు.

ఫలితాల నేపథ్యంలో ఐషర్ షేరు బీఎస్‌ఈలో 0.4 శాతం నీరసించి రూ. 3,857 వద్ద ముగిసింది.

నష్టాల్లోకి బీహెచ్‌ఈఎల్

క్యూ3లో రూ. 149 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇంజినీరింగ్ దిగ్గజం భారత్ హెవీ ఎలక్ట్రికల్స్(బీహెచ్‌ఈఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో లాభాలను వీడి రూ. 149 కోట్ల నికర నష్టం ప్రకటించింది. అధిక వ్యయాలు ప్రభావం చూపాయి. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 42 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం



ఆదాయం మాత్రం రూ. 5,354 కోట్ల నుంచి 5,600 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 5,321 కోట్ల నుంచి రూ. 5,817 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో బీహెచ్‌ఈఎల్ షేరు 1.4% నష్టంతో రూ. 213 వద్ద ముగిసింది.

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఏపీలో 18 అనలిస్ట్ గ్రేడ్-2 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో అనలిస్ట్ గ్రేడ్–2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 18
» అర్హత: బ్యాచిలర్ డిగ్రీ(కెమిస్ట్రీ/బయో కెమిస్ట్రీ/బయాలజీ/ఇన్విరాన్‌మెంటల్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 01.07.2024 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» పే స్కేల్: నెలకు రూ.48,440 నుంచి 1,37,220
» ఎంపిక విధానం: కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 19.03.2024
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 08.04.2024
» వెబ్‌సైట్: psc.ap.gov.in

ఏపీలో అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. ఏపీ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ సర్వీస్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 07
» అర్హత:బీఆర్క్ లేదా బీఈ,బీటెక్(సివిల్) లేదా బీప్లానింగ్/బీటెక్(ప్లానింగ్) లేదా ఎంఏ(జాగ్రఫీ), పీజీ లేదా టౌన్ ప్లానింగ్‌లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 01.07.2024 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» పే స్కేల్: నెలకు రూ.61,960 నుంచి 1,51,370
» ఎంపిక విధానం: కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 21.03.2024
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:10.04.2024
» వెబ్‌సైట్: https://psc.ap.gov.in

ఇస్రో-యూఆర్ఎస్‌సీ, బెంగళూరులో 224 పోస్టులు

బెంగళూరులోని ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, యూఆర్ శాటిలైట్ సెంటర్(యూఆర్ఎస్‌సీ), ఇస్రో టెలిమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 224.
» పోస్టుల వివరాలు: సైంటిస్ట్/ఇంజనీర్–ఎస్సీ–05, టెక్నికల్ అసిస్టెంట్–55, సైంటిఫిక్ అసిస్టెంట్–06, లైబ్రరీ అసిస్టెంట్–01, టెక్నీషియన్ బి/డ్రాఫ్ట్స్‌మ్యాన్ బి–142, ఫైర్‌మ్యాన్ ఎ–03, కుక్–04, లైట్ వెహికల్ డ్రైవర్ ఎ అండ్ వెహికల్ డ్రైవర్ ఎ–08.
» విభాగాలు: మెకట్రానిక్, మెటీరియల్ సైన్స్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ప్లంబర్, టర్నర్, కార్పెంటర్, వెల్డర్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, 12వ తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి. డ్రైవింగ్ లైసెన్స్, పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష/కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 01.03.2024
» వెబ్‌సైట్: www.isro.gov.in

బెల్ పుణెలో డిప్యూటీ ఇంజనీర్ పోస్టులు

పుణెలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన డిప్యూటీ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 09.
» పోస్టుల వివరాలు: డిప్యూటీ ఇంజనీర్(ఈ–2)–09.
» అర్హత: బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్, మెకానికల్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 27 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 28.02.2024
» వెబ్‌సైట్: www.bel-india.in

యూనివర్శిటీ ఆఫ్ ముంబైలో జూనియర్ రీసెర్చ్ ఫెలోలు

యూనివర్శిటీ ఆఫ్ ముంబై, అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ డిపార్ట్‌మెంట్ జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్)ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 01
» అర్హత: ఎంఎస్సీ(ఫిజిక్స్) ఉత్తీర్ణతతో పాటు యూజీసీ–సీఎస్ఐఆర్ నెట్/స్లెట్/గేట్/పెట్ స్కోరు కలిగి ఉండాలి.
» దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్: registrar@cbs.ac.in.
» దరఖాస్తులకు చివరితేది: 14.02.2024.
» వెబ్‌సైట్: www.mu.ac.in

ఎన్ఐఏలో అసిస్టెంట్ కొలువులు

దేశంలో వేగంగా విస్తరిస్తున్న రంగాల్లో.. బీమా రంగం ముందుంటుంది. ప్రముఖ ప్రభుత్వ రంగ బీమా సంస్థ.. న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ఐఏ).. తాజాగా 300 అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏదైనా డిగ్రీ అర్హతతో ఈ ఉద్యోగాలకు పోటీపడొచ్చు. రెండు దశల రాత పరీక్షల్లో ప్రతిభ చూపితే బీమా రంగంలో ఉజ్వల కెరీర్ ఖాయమవుతుంది. ఈ నేపథ్యంలో..ఎన్ఐఏ పోస్టులు, ఎంపిక విధానం, రాత పరీక్షలో రాణించేందుకు ప్రిపరేషన్ తదితర వివరాలు..

» న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీలో 300 ఉద్యోగాలు
» రెండు దశల రాత పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా ఎంపిక
» ఎంపికైతే నెలకు రూ.37 వేల ప్రారంభ వేతనం

దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ బీమా కంపెనీలు తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలు సైతం ప్రైవేట్ రంగంతో పోటీ పడుతూ సేవలందిస్తున్నాయి. ఇందులో భాగంగానే సిబ్బందిని నియమించుకునేందుకు ఎన్ఐఏ క్రమం తప్పకుండా నియామకాలు చేపడుతోంది.

మొత్తం 300 పోస్టులు

ఎన్ఐఏ.. వివిధ రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలలోని తన శాఖల్లో 300 అసిస్టెంట్ పోస్టులను భర్తీకి ప్రకటన విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో ఆరు, తెలంగాణలో ఆరు పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. అభ్యర్థులు పదో తరగతి నుంచి డిగ్రీ వరకు ఏదో ఒక స్థాయిలో ఇంగ్లిష్‌ను ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.

వయసు: 2024, జనవరి 1 నాటికి 21–30 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

అసిస్టెంట్ పోస్టుల నియామకానికి సంబంధించి రెండు దశల ఎంపిక ప్రక్రియను నిర్వహించనున్నారు. తొలిదశలో ప్రిలిమినరీ పరీక్ష, రెండో దశలో మెయిన్ ఎగ్జామినేషన్ ఉంటాయి.

ప్రిలిమినరీ పరీక్ష

అసిస్టెంట్ పోస్టుల ఎంపిక ప్రక్రియలో తొలిదశ టైర్–1 ప్రిలిమినరీ రాత పరీక్ష మూడు విభాగాల్లో 100 మార్కులకు ఉంటుంది. టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు–30 మార్కులు, టెస్ట్ ఆఫ్ రీజనింగ్ 35 ప్రశ్నలు–35 మార్కులు, టెస్ట్ ఆఫ్ న్యూమరికల్ ఎబిలిటీ 35 ప్రశ్నలు–35 మార్కులకు జరుగుతుంది. ప్రతి విభాగానికి 20 నిమిషాలు చొప్పున మొత్తం గంట వ్యవధిలో పరీక్ష ఉంటుంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే అడుగుతారు. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు లభిస్తుంది. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కును తగ్గిస్తారు.



జాబ్ గైడెన్స్

250 మార్కులకు మెయిన్స్

ప్రిలిమినరీ పరీక్షలో ప్రతిభ ఆధారంగా.. కటాఫ్‌లను అనుసరించి మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి రెండో దశలో మెయిన్ ఎగ్జామినేషన్ ఉంటుంది. మెయిన్ పరీక్షను మొత్తం 5 విభాగాల్లో 250 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు–50 మార్కులు, టెస్ట్ ఆఫ్ రీజనింగ్ 40 ప్రశ్నలు–50 మార్కులు, టెస్ట్ ఆఫ్ న్యూమరికల్ ఎబిలిటీ 40 ప్రశ్నలు–50 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–50 మార్కులు, టెస్ట్ ఆఫ్ జనరల్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–50 మార్కులకు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. పరీక్షకు లభించే సమయం రెండు గంటలు. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కును తగ్గిస్తారు.

రీజనల్ లాంగ్వేజ్ టెస్ట్

మెయిన్స్‌లోనూ అర్హత సాధించిన వారికి తదుపరి దశలో రీజనల్ లాంగ్వేజ్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. తమ సొంత రాష్ట్రం కాకుండా..ఇతర రాష్ట్రాలలోని పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు..అక్కడి అధికార భాషలో ఈ టెస్ట్ ఉంటుంది. 50 మార్కులకు రీజనల్ లాంగ్వేజ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా అభ్యర్థులు ఒక ఎస్సే రైటింగ్, ఒక లెటర్ రైటింగ్ ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.

ఆకర్షణీయ వేతనం

మూడు దశల ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన వారికి.. మెరిట్ ఆధారంగా నియామకం ఖరారు చేస్తారు. ప్రారంభంలో క్లాస్–3 కేడర్‌లో నియమిస్తారు. వేతన శ్రేణి రూ.22,405–రూ.62,265 లభిస్తుంది. ప్రారంభంలోనే నెలకు రూ.37 వేల వేతనం అందుకునే వీలుంది.

ఆరు నెలల ప్రొబేషన్

ఎంపికైన అభ్యర్థులకు ముందుగా ఆరు నెలల ప్రొబేషన్ పీరియడ్ ఉంటుంది. ప్రొబేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి శాశ్వత నియామకం ఖరారవుతుంది. అసిస్టెంట్ కొలువులు సొంతం చేసుకున్న వారు భవిష్యత్తులో పదోన్నతుల ద్వారా సీనియర్ మేనేజర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. తొలుత ఏఏఓగా పదోన్నతి పొందొచ్చు. ఆ తర్వాత సర్వీసు నిబంధనలు అనుసరించి ఏఓ, ఎస్ఏఓ, అసిస్టెంట్ మేనేజర్, మేనేజర్, సీనియర్ మేనేజర్ స్థాయికి చేరుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: ఫిబ్రవరి15, 2024
- టైర్–1 ప్రిలిమినరీ పరీక్ష తేదీ: మార్చి 2, 2024
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: పరీక్ష తేదీకి వారం రోజుల ముందు నుంచి;
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: http://www.newindia.co.in

రాత పరీక్షలో రాణించేలా

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌తో మొదలుపెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు చదవడం, ఎడిటోరియల్ లెటర్స్ చదవడం మేలు చేస్తుంది.

రీజనింగ్

ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలో కీలకమైన రీజనింగ్‌కు అభ్యర్థులు పటిష్ట ప్రిపరేషన్ సాగించాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్–డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై అవగాహన పెంచుకోవాలి.

న్యూమరికల్ ఎబిలిటీ

ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్‌పైనా పట్టు సాధిస్తే.. ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుంది.

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగం కోసం అభ్యర్థులు ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. బీమా, ఆర్థిక రంగంలో మార్పులు, ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి.ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, మ్యూచువల్ ఫండ్స్, ఆర్థిక రంగంలో వినియోగించే పదజాలంపై పట్టు సాధించాలి.

కంప్యూటర్ నాలెడ్జ్

ఈ విభాగానికి సంబంధించి బేసిక్ కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ఎంఎస్ ఆఫీస్ టూల్స్‌పై పట్టు సాధించాలి. ముఖ్యంగా న్యూ ఫైల్ క్రియేషన్, ఎక్సెల్ షీట్, పీపీటీ వంటి వాటి గురించి తెలుసుకోవాలి. అదే విధంగా కీ బోర్డ్ షార్ట్ కట్స్, బేసిక్ హార్డ్‌వేర్ టూల్స్‌పైనా అవగాహన ఉండాలి.

జనరల్ నాలెడ్జ్

ఈ విభాగానికి సంబంధించి స్టాక్ జీకేతోపాటు ముఖ్యమైన వ్యక్తులు, సదస్సులు, క్రీడలు–విజేతలు, అవార్డులు–గ్రహీతలు తదితర అంశాలపై దృష్టి సారించాలి. హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ తదితరాలపై అవగాహన పెంచుకోవాలి.

క్లుప్తంగా...

జేఈఈ మెయిన్స్‌లో శ్రీచైతన్య ప్రతిభ

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్–2024 జనవరి ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ చూపారు. 300కి 300 మార్కులతో 100 పర్సంటైల్‌తో పాటు రెండు సబ్జెక్టుల్లోనూ 13 మంది శ్రీచైతన్య విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించారని ఆ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాథ్స్‌లో 34 మంది 100 పర్సంటైల్, ఫిజిక్స్‌లో 68 మంది 100 పర్సంటైల్, కెమిస్ట్రీలో 58 మంది 100 పర్సంటైల్ సాధించి రికార్డు సృష్టించారని ప్రశంసించారు. అనితర సాధ్యమైన ప్రోగ్రామ్‌లు, మైక్రోషెడ్యూల్స్, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ర్యాంకింగ్ సిస్టమ్‌తో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఆమె చెప్పారు. అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని అభినందించారు.

సత్తాచాటిన నారాయణ

సాక్షి, హైదరాబాద్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వెల్లడించిన జేఈఈ మెయిన్–2024 తొలి విడత ఫలితాల్లో నారాయణ సత్తాచాటింది. ఎం.సాయితేజ, షేక్ సూరజ్, ఆర్యన్ ప్రకాశ్, పి.రోహన్‌సాయి, హెచ్.విదిత్, ఎం.అనూప్ 300 మార్కులకు గాను 300 మార్కులు సాధించినట్లు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా 23 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించగా.. వారిలో 8 మంది నారాయణ విద్యార్థులేనని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ఎగ్జామ్స్ కోసం ప్రత్యేకంగా రూపుదిద్దిన ఎన్–లెర్న్ యాప్ ద్వారానే ఈ విజయం సాధ్యమైందని చెప్పారు. ఘనవిజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు.

'జయ' కేతనం

సూర్యాపేటటౌన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ జూనియర్ కాలేజ్ విద్యార్థులు మొదటి బ్యాచ్‌లోనే 21 మంది జాతీయస్థాయిలో 90కిపైన పర్సంటైల్ సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలకు చెందిన కె.వెంకటేష్ 99.75, జి.చందన 99.56, ఎం.హర్షిణి 98.97, కె.సిద్దార్థన్ 98.57, ఒ.విష్ణుతేజ 97.90, కె.సాయిశివరం జన్‌రెడ్డి 97.64, జె.గౌతమ్ 97.36, ఎస్.దీక్షిత 97.21, టి.శ్రీలక్ష్మి 96.71, కె.అభిజిత్ 96.65, ఎం.లాస్యశ్రీ 95.89, కె.వివేక్‌రెడ్డి 95.41, వై.రామ్‌చరణ్ 95.24 పర్సంటైల్‌తో సహా 21 మంది విద్యార్థులు 90కి పైన పర్సంటైల్ సాధించినట్లు వివరించారు. పర్సంటైల్ సాధించిన విద్యార్థులను మంగళవారం జయ కళాశాలలో కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ అభినందించారు.

ముందుగా బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలి

సాక్షి, హైదరాబాద్: గురుకులాల్లో రిక్రూట్‌మెంట్ కంటే ముందుగానే బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆల్ తెలంగాణ గవర్నమెంట్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కూకుట్ల యాదయ్య, వై.పాపిరెడ్డి కోరారు. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.



సాయితేజ | షేక్ సూరజ్ | ఎం. అనూప్ | రోహన్ సాయి | హండేకర్ విదిత్ | టి.దినేశ్‌రెడ్డి | తనిష్ రెడ్డి

జేఈఈ మెయిన్స్‌లో తెలుగు తేజాలు

టాప్–23లో పది మంది తెలుగు వాళ్లే... వీరిలో ఏడుగురు తెలంగాణ విద్యార్థులు

మెయిన్స్ తొలి విడత ఫలితాలు వెల్లడించిన ఎన్‌టీఏ

సాక్షి, హైదరాబాద్/జహీరాబాద్ టౌన్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన తొలి విడత ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్స్–1)లో తెలుగు విద్యార్థులు ఈ ఏడాది కూడా సత్తా చాటారు. ఫలితాలను ఎన్టీఏ మంగళవారం వెల్లడించింది. తెలంగాణకు చెందిన రిషి శేఖర్ శుక్లా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షేక్ సూరజ్ సహా పదిమంది వంద శాతం స్కోర్‌ను సాధించారు. వీరిలో తెలంగాణ విద్యార్థులు ఏడుగురు, ఏపీకి చెందిన ముగ్గురున్నారు. మొత్తమ్మీద టాప్–23లో పది మంది తెలుగు విద్యార్థులు చోటు దక్కించుకోవడం విశేషం. హరియాణాకు చెందిన ఆరవ్ భట్ దేశంలో టాపర్‌గా నిలిచారు. దేశవ్యాప్తంగా 291 నగరాల్లో 544 కేంద్రాల్లో జేఈఈ మెయిన్స్ పరీక్ష జనవరి 27, 29, 30, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో జరిగిన విషయం తెలిసిందే. తొలి విడత మెయిన్స్‌కు 12,21,624 మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 11,70,048 మంది పరీక్షకు హాజరయ్యారు. తొలిదశలో కేవలం స్కోరు మాత్రమే ప్రకటించారు. రెండో దశ జేఈఈ మెయిన్స్ పరీక్షను ఏప్రిల్‌లో నిర్వహించనున్నారు. ఆ తరువాత ఫలితాలతో కలిపి రెండింటికి ర్యాంకులను ప్రకటిస్తారు.

300కు 300 మార్కులు

జేఈఈ మెయిన్స్ 300 మార్కులకు 300 మార్కులు సాధించిన మొదటి 23 మంది వివరాలను ఎన్టీఏ వెల్లడించింది. 100 శాతం సాధించిన వారిలో తెలంగాణ విద్యార్థులు రిషి శేఖర్ శుక్లా, రోహన్ సాయి పబ్బా, ముత్తవరపు అనూప్, హండేకర్ విదిత్, వెంకట సాయితేజ మాదినేని, శ్రీయషాస్ మోహన్ కల్లూరి, తవ్వా దినేష్ రెడ్డి ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి షేక్ సూరజ్, తోట సాయి కార్తీక్, అన్నారెడ్డి వెంకట తనిష్ రెడ్డి ఉన్నారు. ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో తెలంగాణకు చెందిన శ్రీ సూర్యవర్మ దాట్ల, దొరిసాల శ్రీనివాసరెడ్డి 99.99 స్కోర్‌తో టాపర్లుగా నిలిచారు. పీడబ్ల్యూడీ కోటాలో తెలంగాణకు చెందిన చుంచుకల్ల శ్రీచరణ్ 99.98 స్కోర్‌తో టాపర్‌గా నిలిచారు. పురుషుల కేటగిరీలోనూ పదిమంది తెలుగు విద్యార్థులే టాపర్లుగా నిలిచారు.

కష్టపడితే అసాధ్యమనేది ఉండదు: హండేకర్

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని మల్‌చెల్మ గ్రామానికి చెందిన హండేకర్ అనిల్‌కుమార్ కుమారుడు హండేకర్ విదిత్ 300 మార్కులకు 300 మార్కులు సాధించాడు. జేఈఈ పరీక్ష కోసం రోజూ 15 గంటలపాటు ప్రణాళికాబద్ధంగా చదివినట్లు విదిత్ చెప్పాడు. నమ్మకం, కష్టపడేతత్వం ఉంటే అసాధ్యమనేది ఉండదన్నాడు.

ఆర్టీసీ రికార్డు స్థాయి కిటకిట..

డ్రైవర్లకు దడదడ

సోమవారం ఒక్క రోజే బస్సుల్లో 65 లక్షల మంది ప్రయాణం

- ఆక్యుపెన్సీ రేషియో 106 శాతంగా నమోదు
- అదనపు బస్సుల్లేక రోజువారీ బస్సులతోనే తరలింపు
- 400 మంది డ్రైవర్ల కొరతతో డబుల్ డ్యూటీలు
- విశ్రాంతి లేని డ్రైవర్లు, డొక్కు బస్సులతో ప్రమాద ఘంటికలు



సాక్షి, హైదరాబాద్: ఒకే రోజు బస్సుల్లో 65 లక్షల మంది ప్రయాణికులను గమ్యం చేర్చి ఆర్టీసీ సరికొత్త రికార్డు సృష్టించింది. సంస్థ చరిత్రలోనే అత్యధికంగా 106.02 శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదైంది. సోమవారం ఈ రికార్డు నమోదైంది. ఈ అంశం గొప్పగా చెప్పుకోవడం కంటే, ప్రమాద ఘంటికలను మోగించడానికి సంకేతంగా భావించాల్సి రావటమే ఇప్పుడు ఆందోళనకు గురిచేస్తోంది.

ఆందోళన ఎందుకంటే..?

ప్రస్తుతం ఆర్టీసీ వద్ద అద్దె వాటితోపాటు మొత్తం 9,100 బస్సులున్నాయి. రెండు నెలల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి ప్రారంభించింది. ఆ పథకం మొదలైన తర్వాత ఆర్టీసీకి అదనంగా సమకూరిన బస్సులు 150 మాత్రమే. ఉచిత ప్రయాణం వల్ల రోజువారీ అదనపు ప్రయాణికుల సంఖ్య 12 లక్షల నుంచి 15 లక్షల వరకు చేరింది. ఇందుకు 4 వేల అదనపు బస్సులు కావాల్సి ఉంది. కానీ, అన్ని బస్సులు ఇప్పట్లో సమకూరే పరిస్థితి లేదు. దీంతో బస్సులపై విపరీతమైన భారం పడుతోంది. రెండు బస్సుల్లో ఎక్కాల్సిన ప్రయాణికులు ఒక్క బస్సులో కిక్కిరిసిపోయి బస్సులను నడపటం డ్రైవర్లకు కష్టంగా మారింది. అసలే 30 శాతం బస్సులు బాగా పాతబడి ఉన్నందున, ఈ ఓవర్ లోడ్‌తో ఎక్కడ అదుపు తప్పుతాయోనన్న భయం ఆర్టీసీని వెంటాడుతోంది. ఇంతగా కిక్కిరిసిన బస్సులను సోమవారం అతి జాగ్రత్తగా నడపాల్సి వచ్చింది. అధికారులు అనుక్షణం సిబ్బందిని అప్రమత్తం చేసి బస్సులు నడపడం గమనార్హం.

డ్రైవర్ల కొరత

ప్రస్తుతం ఉన్న బస్సులను పరిగణనలోకి తీసుకుంటే 400 మంది డ్రైవర్ల కొరత ఉంది. సోమవారం లాంటి రద్దీ ఉన్న సమయంలో అదనపు బస్సులు నడపాల్సి ఉంటుంది. అయితే, బస్సుల్లేక ఆ పని చేయలేకపోతున్నారు. బస్సుల సంఖ్య పెరిగినా డ్రైవర్లు లేనందున వాటిని డిపోలకే పరిమితం చేయాల్సి ఉంటుంది. కొత్త బస్సులు కావాలని ఆర్టీసీ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించారు. 2,000 మంది డ్రైవర్లను ఉన్నఫళంగా రిక్రూట్ చేసుకోవాలనీ ప్రతిపాదించారు. కానీ, ఇటీవలి బడ్జెట్‌లో ఆర్టీసీకి ఎన్ని నిధులు కేటాయించారో వెల్లడించలేదు. కేవలం మహాలక్ష్మి పథకానికి సంబంధించి ప్రతినెలా రూ.300 చొప్పున రీయింబర్స్ చేసే అంశాన్ని మాత్రమే ప్రస్తావించారు. ఇదిలాఉంటే, దూరప్రాంతాలకు తిరిగే బస్సుల్లో విధులు నిర్వహించే డ్రైవర్లకు కచ్చితంగా చాలినంత విశ్రాంతి అవసరం. కానీ, డ్రైవర్ల కొరత ఫలితంగా కొందరికి సరిపడా విశ్రాంతి తీసుకునే సమయం లేకుండా డబుల్ డ్యూటీలు చేయించాల్సి వస్తోంది. ఇలా విశ్రాంతి లేని డ్రైవర్లు, డొక్కు బస్సులను కొనసాగిస్తున్న నేపథ్యంలో ఒకే రోజు 65 లక్షల మంది బస్సుల్లో ప్రయాణించటం కలవరానికి గురిచేస్తోంది.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో

ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

విద్యారణ్యపురి: జేఈఈ మెయిన్స్–2024 సెషన్–1 ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారని ఆ సంస్థల చైర్మన్ ఎ.వరదా రెడ్డి తెలిపారు. దొంతుల మనీశ్ 295/300 మార్కులు(ఫిజిక్స్‌లో వంద పర్సంటైల్, కెమిస్ట్రీలో వంద పర్సంటైల్) 99.99 శాతం సాధించి జాతీయస్థాయిలో తమ విద్యాసంస్థల ప్రతిష్టను నిలిపారని పేర్కొన్నారు. తుమ్మ తేజస్విని 99.95 శాతం, ఆర్.దీపాంశరెడ్డి 99.91 శాతం, పి.నిహాల్ శ్రీవాత్సవ 99.91 శాతం పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. కె.శ్రీరామ్ రెడ్డి 99.88 శాతం, కె.సిద్ధార్థరెడ్డి 99.77 శాతం సాధించారని తెలిపారు. ఈ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన 18 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. ప్రతిభ చాటిన విద్యార్థులను చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి అభినందించారు.

మెరిసిన బీసీ గురుకుల విద్యార్థులు

అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన 98 మంది

సాక్షి, హైదరాబాద్: ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్ పరీక్షల్లో మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. గత నెలాఖరులో దేశవ్యాప్తంగా జరిగిన జేఈఈ మెయిన్ పరీక్షలకు బీసీ గురుకులం నుంచి 248 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 98 మంది అత్యుత్తమ పర్సంటైల్ సాధించారు. ఇందులో 50 మంది బాలికలు, 48 మంది బాలురు ఉన్నారు. బాలికల కేటగిరీలో ఇ.వైష్ణవి (96.78), జి.శ్రీహిత (93.5), బి.వైష్ణవి (93.5), బి.మేఘన (91.5), కె.శిరీష (89.2), ఎ.మేఘన (88.8), ఎన్.కావేరి (86) పర్సంటైల్, మార్కులు సాధించారు. బాలుర కేటగిరీలో కె.శ్రీనివాస్ (97.51), కె.వి.ఎస్.నిహాల్ (95.49), కె.అఖిల్ (94.53), బి.నిఖిల్ (94.42) పర్సంటైల్ సాధించారు. ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులను, సహకరించిన బోధనా సిబ్బందిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య బట్టు ప్రత్యేకంగా అభినందించారు.

'వాలెంటైన్స్ డేను అడ్డుకుంటాం'

సాక్షి, హైదరాబాద్: నకిలీ ప్రేమను ప్రోత్సహించే వాలెంటైన్స్‌డేను అడ్డుకొని తీరుతామని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ప్రకటించాయి. విదేశీ విష సంస్కృతిని విడనాడి భారతీయ విలువలు, సంస్కృతి సంప్రదాయాలు పరిరక్షిద్దామని పిలుపునిచ్చాయి. ఫిబ్రవరి 14న వాలెంటైన్స్‌డేను బహిష్కరించాలని వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు పిలుపునిచ్చారు.





ప్రతిష్ఠాత్మక వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పురస్కారాలను ఇటీవలే ప్రకటించారు. ఇందులో మన దేశానికి చెందిన విష్ణుగోపాల్ అనే ఫొటోగ్రాఫర్‌కు యానిమల్ పోర్ట్రెట్ విభాగంలో మొదటి బహుమతి దక్కింది. ఆ చిత్రం ఇదే.. పందిలా కనిపిస్తున్న దీన్ని టేపర్ అంటారు. విష్ణుగోపాల్ బ్రెజిల్‌లోని వర్షారణ్యాల్లో ఈ ఫొటోను తీశారు.

బీపీ, షుగర్ తగ్గించే మందులంటూ తప్పుడు ప్రకటనలు

గోల్కొండలోని హిక్మా సెహత్ కేర్‌ను సీజ్ చేసిన డ్రగ్ కంట్రోల్ అధికారులు

సాక్షి, హైదరాబాద్: రోగుల అమాయకత్వాన్ని సొమ్ము చేసుకునేందుకు మోసపూరిత ప్రకటనలు ఇస్తున్న కంపెనీలు, క్లినిక్‌లపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. డయాబెటిస్ (షుగర్), బీపీని తగ్గించే పౌడర్ అంటూ సెహత్ కేర్ పౌడర్ డబ్బాల గురించి ప్రకటనలిచ్చిన గోల్కొండ ప్రాంతంలోని హిక్మా సెహత్ కేర్‌లో డీసీఏ అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. సదరు క్లినిక్ నిర్వాహకులు డయాబెటిస్, బ్లడ్ ప్రెజర్ ట్రీట్మెంట్ చేస్తామని పౌడర్ విక్రయిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు గోల్కొండలోని మొహల్లా గంజ్‌లో సోదాలు నిర్వహించినట్లు డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఏ అసిస్టెంట్ డైరెక్టర్ రాజమౌళి నేతృత్వంలో జరిపిన ఈ సోదాల్లో రూ.18 వేల విలువైన 60 డబ్బాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అలాగే చాంద్రాయణగుట్ట ప్రాంతంలో ఎలాంటి ధ్రువీకరణ పత్రం లేకుండానే క్వాక్ ఇమ్రాన్‌ఖాన్ అనే వ్యక్తి ఆర్ఎంపీగా చెలామణి అవుతూ మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అతడి వద్ద నుంచి డీసీఏ అధికారులు రూ.1.02 లక్షల విలువైన 30 రకాల మందులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



ప్రతి పీఎస్‌లో సైబర్ వారియర్!

858 మంది కానిస్టేబుళ్లకు సైబర్‌నేర దర్యాప్తుపై ప్రత్యేక శిక్షణ

సైబర్‌నేరాల కట్టడికి రాష్ట్ర పోలీసుల ప్రత్యేక దళం

సాక్షి, హైదరాబాద్: రోజురోజుకూ పెరుగుతున్న సైబర్‌నేరాల కట్టడికి తెలంగాణ పోలీసులు ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఒక కానిస్టేబుల్‌కు సైబర్ వారియర్‌గా శిక్షణ ఇచ్చారు. తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లకు చెందిన మొత్తం 858 మంది కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా వీరందరికీ నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీ ఆర్‌పీ), 1930 హెల్ప్ లైన్ పనితీరు, అనుమానితులను గుర్తించి వారి వివరాలు విశ్లేషించడం, సోషల్ మీడియాలో జరుగుతున్న నేరాల, ఆర్థిక మోసాలకు సంబంధించిన కేసుల దర్యాప్తు, సైక్యాప్స్ అప్లికేషన్ వినియోగం, సైబర్ నేరస్తులకు సంబంధించి పీటీ వారెంట్లు ఎలా వేయాలి, సైబర్ భద్రత, సైబర్ వారియర్స్ విధులు, బాధ్యతలు.. తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. టీఎస్‌సీఎస్‌బీ, డీ4సీ, పోలీస్‌స్టేషన్ల మధ్య ఈ సైబర్ వారియర్స్ సమన్వయం చేస్తారని టీఎస్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తెలిపారు. ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంచే కార్యక్రమాల నిర్వహణలోనూ వీరు కీలకంగా ఉంటారని పేర్కొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.